
# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, ఆగస్టు, 2016 ₹ 30

ISSN 2454–4329



యమునాతీరంలో..

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada*

**సంపుటి 27 ఆగస్టు సంచిక 8**



ప్రధాన సంపాదకుడు
*చెన్నూరు ఆంజనేయ రెడ్డి*

సంపాదకుడు
*వల్లభనేని అశ్వినీకుమార్*

సహాయ సంపాదకుడు
*కాండ్రేగుల నాగేశ్వరరావు*

సహకార సంపాదకులు
*డా. వోలేటి పార్వతీశం*
*కరుటూరి విజయ్*

సాంకేతిక సహాయకులు
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రముద్దీన్ జీ షాన్,
సారిక నిర్మల, వేముల రాణి, స్వాతి దండోతిక

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
**e-magazine : www.kinige.com/misimi**
**http://facebook.com/misimimaasapathrika**
**https://twitter.com/MISIMIMONTHLY**

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-
విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

LIBRARY OF CONGRESS
LCCN 91-903060

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 5

చివరకు మిగిలిన సగం.. ........ 7
– *డా. వోలేటి పార్వతీశం*

తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాణ విశేషాలు ........ 12
– *డా. ఈమని శివనాగి రెడ్డి*

ఆనంద శాస్త్రం – ఆర్థర్ షోపెన్ హవర్ ........ 19
– *ముక్తవరం పార్థసారథి*

పుణ్యతీర్థములందు నృత్యకళ : ఆంధ్రులు – నాట్యకళ ........ 25
– *నటరాజ రామకృష్ణ*

ధైర్యసాహసాలకు మారుపేరు – హవల్దార్ జగదీష్ చంద్ ........ 28
– *డా. వెన్నా వల్లభరావు*

కమనీయ క్షేత్రాల కదంబం; కర్ణాటక దివ్యప్రదేశం ........ 31
– *డా. భాగవతుల హేమలత*

కృష్ణా ధాన్యాగారం – ప్రకాశం బ్యారేజి ........ 39
– *కె. వెంకటేశ్వర్లు*

ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజం – పరిఢవిల్లిన సాహిత్యం........43
– *కనుపర్తి విజయబక్ష్*

బోనాల పండుగ ........ 52
– *బొజ్జగాని భీమమ్మ*

లింగభేదం – క్రోమోసోమ్ కథనమ్ ........ 54
– *ము.పా.సా.*

హంసలదీవి – గోపాల శతకం ........ 58
– *ఆచార్య కోసూరి దామోదరనాయుడు*

కృష్ణా తీరాన పల్నాడు ........ 60
– *వై. హెచ్.కె. మోహనరావు*

తెలుగు పత్రికా రంగపు *ఏరిన ముత్యం*
పందిరి మల్లికార్జున రావు ........ 65
– *ఎ.బి. సాయి ప్రసాద్*

ఆనందం ఎండమావా? ........ 69
– *సిద్ధయ్య నాయుడు*

వద్దు – రెద్దు ........ 72
– *ముత్తేవి రవీంద్రనాథ్*

పురుష పాత్రలు లేని నాటకాలు ........ 75
– *స్వర్ణరాజ హనుమంతరావు*

కోహినూర్ వజ్రం : పయనించిన దారి ........ 85
– *వేలూరి కృష్ణమూర్తి*

ఎవరు ముందు? ........ 90
– *వి. అశ్వినీకుమార్*

వేదిక ........ 91

విషాద గీతంలా నిష్క్రమించిన సంగీత సామ్రాట్ – శంకర్ ........ 92
– *కాండ్రేగుల నాగేశ్వరరావు*


| | | |
|---|---|---|
| *ముఖచిత్రం : ఫానీ* | | *చిత్రకారుడు :* |
| *రెండవ అట్ట : యమునాతీరంలో..* | | ***1, 2, 4 – ఎడ్విన్ లార్డ్ వీక్స్*** |
| *మూడవ అట్ట : సుల్తాన్ సాకీలు* | | **3 - Giulio Rosati** |
| *నాల్గవ అట్ట : గుడిమెట్లు – ముచ్చట్లు* | | |

*వివరాలు : 50 వ పుటలో..*


అట్టతో కలిపి 100 పుటలు

**తె**లుగు నేర్చుకోవాలంటే, ఇంగ్లీష్ మాధ్యమం వదిలెయ్యాలని అనుకోనవసరం లేదు. ఆంగ్లం అంతర్జాతీయ భాష; వాణిజ్య మాధ్యమ భాష; ఉన్నత విద్యామాధ్యమ భాష. ఒకప్పుడు ఎంతో ప్రాముఖ్యంలో ఉన్న ఫ్రెంచ్, జర్మన్ భాషలను అధిగమించి వర్ధిల్లుతున్న భాష. దీని బారినుండి తెలుగుని ఎలా రక్షించుకోవాలి అని భయపడేకన్నా దానితో సహజీవనం ఎలా చెయ్యాలి అని మనం ఆలోచించుకోవాలి. ఇంగ్లీష్ వస్తేగాని చిన్న ఉద్యోగం కూడా రాని ఈ రోజుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అందరూ కోరుకోవడంలో ఆశ్చర్యం లేదు. మనం ఒక్కసారి గతాన్ని గూడా గమనించాలి. సంస్కృతం నేర్చుకుంటే రాజపోషణ లభించే రోజుల్లో అందరు సంస్కృతాన్నే నేర్చుకున్నారు. ఆ తర్వాత పారశీకం నేర్చుకుంటే సుల్తానుల ఆదరణ లభించే రోజుల్లో అందరు పారసీకమే నేర్చుకున్నారు. అదేవిధంగా ఉర్దూ నేర్చుకోన్నవారికే నిజాంలాంటి నవాబుల దగ్గర కొలువులు దొరికాయి. ఇంగ్లీష్ రాజ్యమేలే రోజుల్లో ఆ భాష తెలిసినవారే ఉన్నత పదవుల్లో రాణించారు. అందువలన మనమెంత చెప్పినా పిల్లలు ఇంగ్లీష్ నేర్చుకోవాలనే ఆత్రుత తల్లితండ్రుల్లో ఉంటుంది.

పూర్వం తెలుగు భాషా వ్యాప్తికి మధ్యేమార్గం ఉండేది. వందేళ్ళనాడు 11 వ క్లాసువరకు సైన్సు సబ్జక్ట్స్ ఇంగ్లీష్‌లోను, మిగతా సబ్జెక్ట్స్– చరిత్ర, సాంఘిక శాస్త్రం – లాంటివి తెలుగు మాధ్యమంలో బోధించేవారు. ఈ పద్ధతినో లేక ఇలాంటి మరో పద్ధతినో ఎంచుకోవాలి. తెలుగు నేర్చుకోవడం కూడా తేలిక చెయ్యాలి. నేర్పే మార్గాలను కూడా మనం మార్చుకోవాలి. ఈ కింది సూచనలు భాషా సంబంధితమైన విషయాలు. ఎంతవరకు ఉపయోగకరమో ఆలోచించండి.

తెలుగు లిపిని నేటి అవసరాలకు మార్పులు చేయాలి. మనం రాస్తున్న "జ్ఞానం" కొన్ని భాషల్లో "గ్యానం"గా రాస్తారు. అందువలన దాని అర్థం మారిపోలేదు. కృత్తికను క్రుత్తికగా రాయవచ్చు. కీబోర్డుకు అవసరమైన మార్పులు చేసి తెలుగు డి.టి.పి. చెయ్యడం సులభతరం చెయ్యాలి. సెల్ ఫోన్ అరిచేతిలో ప్రపంచమని మనకందరికీ తెలుసు, వాటిలో ఉపయోగించకపోతే తెలుగు ప్రజాదరణ కోల్పోతుంది.

తెలుగు పదాలు వున్నచోట సంస్కృతంగాని, ఆంగ్లంగాని వాడవలసిన అవసరం లేదు. సంస్కృత, ఆంగ్ల పదాల్ని వాడటంవల్ల తెలుగు పదాలు మరుగున పడుతున్నాయి. "పొడుగరి" అనే పదాన్ని వదిలి ఆజానుబాహుడని రాయాల్సిన అవసరం లేదు. గొలుసు కథను ధారావాహికంగా మార్చవలసిన అవసరం లేదు. అదేవిధంగా వాడుకలోనున్న ఇతర భాషా పదాలను విస్మరించి, మరిచిపోయిన అచ్చ తెలుగు పదాలను వెదికి తేవలసిన అవసరం లేదు. రైలు, రోడ్డులాంటి పదాలను మార్చగలమా? నాలుగు ఆంగ్ల పదాలో లేక సంస్కృత శ్లోకమో ఉపయోగిస్తేనే పండితులనుకుంటారని పొరపడరాదు. ఏ భాషలోనైన సంస్కారవంతంగా మాట్లాడడం ముఖ్యం. పిల్లలతో సరళమైన తెలుగులో మాట్లాటడం నేటి అవసరం.

తెలుగు పదానికి సంస్కృతం కలిపితే దుష్టసమాసం అనుకోవడం మారాలి. ఇతర దక్షిణాది భాషల్లో ఉన్న మణిప్రవాళ సంప్రదాయాన్ని తెలుగులో కూడా ఉపయోగించుకోవాలి. అవసరమైనచోట తెలుగు, సంస్కృతం కలిపి రాస్తే భాషాభివృద్ధి జరుగుతుంది. మనం ఒప్పుకున్నా లేకున్నా తెప్పోత్సవం, మెట్లోత్సవంలాంటి పదాలను ప్రజలు ఉపయోగిస్తున్నారు. 'డ్రెడ్జర్'ను తవ్వోడ అని 'ఫ్లైఓవర్'ను పైబాట అని అనటంలో జన వాక్యం ఉంది. ప్రజలు మాట్లాడే భాషే పదికాలాలు బ్రతికి ఉంటుంది.

సంస్కృతంలో తత్సమాలని చెప్పబడుతున్న పదాలన్ని ప్రాకృత, ద్రావిడ భాషల నుంచి తీసుకొని సంస్కృతీకరించబడినవని తెలుసుకోవాలి. ఆ కారణంగానే సంస్కృతం విస్తరించింది.

మనం చేస్తున్న మరో తప్పిదం తెలుగు పదాలను ప్రకృతి–వికృతులుగా విడగొట్టడం. ప్రాకృత భాషల్లో నుంచి వచ్చిన పదాలను "వికృతు"లుగా చెప్పడం విడ్డూరం. ప్రాకృతంలో నుంచి వచ్చిన పదాలు ప్రకృతులౌతాయిగాని వికృతులు కావు. వీటిని తెలుగు లేక ప్రాకృత పదాలుగా చెప్పవచ్చు.

కేవలం తెలుగు మాధ్యమాన్నేగాక తెలుగు భాషాబోధన, సరళీకరణను ఒక ఉద్యమంగా చేపట్టాలి.

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

✧ "...'రాణీ చిన్నమాంబ' ఈ ఏకాంకికను నా ప్రియ స్నేహితురాలు కీ.శే. డా. కమలా అనార్కలితో వ్రాయించాను 1986లో. కళాశాల వార్షికోత్సవానికి వేయించాలని కారణాంతరాల వలన వేయలేదు. క్యాసెట్ రూపొందించినా ఆ క్యాసెట్ పోయింది. ఆమె అకస్మాత్తుగా గతించారు. 2013లో కాకినాడలో ఉన్న రాణీ చిన్నమాంబాదేవి రిక్రియేషన్ క్లబ్ శతవార్షికోత్సవానికి వీడియో క్యాసెట్ చేయించి ఇచ్చాము. పిఠాపురం సాహితీవేత్తలతో రాజాగారి కుటుంబంతో పరిచయంగల విదుషీమణి అనార్కలి. ఆమె చేతి రాతతో దొరికిన కొన్ని కాగితాల ఆధారంగా మళ్ళీ కొన్ని చేర్పులతో నాటికను తయారు చేశాను. అలనాటి మహిళల వైదుష్యాన్ని వెలుగులోకి తేవాలని చేసిన ప్రయత్నమే ఈ నాటిక. అంతకు ముందు పిఠాపురం కోటలో రాణీ గారితో పరిచయం మొక్కపాటి వారి ఆడపడుచులు, ఆనాటి విదుషీమణులను తెలిసిన పెద్దవారిచ్చిన సమాచారం నేను సేకరించి ఇవ్వగా డా. కొక్కొండ సత్యవతిగారు పిఠాపురం రాణీ గారి గురించి రేడియో నాటిక వ్రాశారు. కొన్నేళ్ళ క్రితం తన పుస్తకంలో ప్రచురించారు. పానుగంటి నరసింహారావుగారు సాక్షి వ్యాసాలలో, 'పతివ్రత' అన్న వ్యాసం రాణీ చిన్నమాంబగారి గురించి వ్రాసినది రసజ్ఞులైన పాఠకులు చదువదగినది, ఈ పేజీతోపాటు ప్రచురించాలి. కానీ ఎలా తప్పిపోయిందో తెలియదు. దయచేసి ఈ సమాచారాన్ని 'కమ్మతెమ్మెర'లులో ప్రచురించవలసినదిగా కోరుచుకున్నాను. లేనిచో నేను గ్రంథ చౌర్యానికి పాలుపడినట్లవుతుంది. డా. కమలా అనార్కలీకే ఘనత దక్కాలి, ఆమె ఈ లోకంలో లేకపోయినా! రాణీగారిపై నేను తరువాత రెండు వ్యాసాలు వ్రాశాను. ఒకటి ఇంగ్లీషులో, రెండోది తెలుగులో వ్రాసినది 'లహరి' త్రైమాసపత్రికలో ప్రచురించారు రెండేళ్ళ క్రితం....."

**– *ఎమ్.వి. భారతలక్ష్మి,*** *కాకినాడ*

✧ "... మరో 'భారతి' సాహితీ మాసపత్రికను చూస్తున్నాం. లత సాహిత్యం పేరిట మంచి వ్యాసాన్ని ముద్రించారు. 'విద్య' అంటే 'ప్రతిభ' చాలా బాగుంది. ఆచార్య జి. నాగయ్యగారి 'నన్నెచోడుని జానుతెలుగు' అందర్ని ఆకట్టుకొనే విధంగా ఉంది. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికి మూర్తీదేవి పురస్కారం రావడం ఆనందదాయకం. పి. వరలక్ష్మి 'పుష్పాంజలి కథలలో స్త్రీల సమస్యలు' వ్యాసం స్త్రీవాద వ్యాసాలతో సరిపోల్చగల మంచి వ్యాసం...."

**– *కోసూరి దామోదరనాయుడు,*** *తిరుపతి*

✧ "... మీరు చేస్తున్న సాహిత్య సేవ విశిష్టమైనది. వ్యాసాల ఎంపికలో మీరు చూపిస్తున్న శ్రద్ధ, దీక్షా, ఓర్పు ప్రశంసనీయం. ప్రతీ రచనలోనూ ఓ సందేశం, ఓ దృక్పథం, ఓ అనుభవం, చింతన ఉంటూ, గతానికీ – వర్తమానానికీ అవసరమైన రచనలు అందిస్తూ పాఠకులను ఆలోచనాత్మకం చేస్తున్నారు. ***మిసిమి*** ప్రత్యేకత సామాన్యమైనది కాదు. ఈ వృద్ధాప్యంలో నెలలోని మొదటి వారం పదిరోజులు ***మిసిమి***తోనే కాలక్షేపం. ఇంతకన్నా ఏం కావాలి? పిల్లుట్ల హనుమంతరావుగారి 'త్యాగమే ఊపిరిగా...' అనుభవ పరంపరలో రామ్మూర్తి, రత్నమ్మల ప్రస్తావన రావడం, చివరకు రత్నమ్మ సుబ్రహ్మణ్యం గారి సహచరి కావడం సంతోషాన్ని కలిగించింది. చలం గారి రచనల్లో రామ్మూర్తి కనిపిస్తారు. కృష్ణశాస్త్రి – చలం – రామ్మూర్తి – గాడేపల్లి ప్రకాశరావు స్వేచ్ఛా ప్రణయ ఉద్యమానికి దోహదం చేశారు. కానీ, రామ్మూర్తి తన ఉద్యమాన్ని తానే అంతం చేసుకున్న విధానం బాధగానే ఉంది. చలంగారి మ్యూజింగ్సులో రామ్మూర్తి వ్రాసిన ఉత్తరం మనల్ని కదలిస్తుంది. రామ్మూర్తి సోదరులు సుబ్బారాయుడు గారు పిఠాపురం రాజావారి సంస్థానంలో దివాన్‌గా వ్యవహరించారు. వారు దివాన్‌గా వ్యవహరించిన కాలంలో పిఠాపురం మహోన్నత సంస్కృతికి క్షేత్రంగా విలసిల్లింది. పిఠాపురం ఓ వెలుగు వెలిగి, చరిత్ర పుటలలో నిలిచిపోయింది. 'బారిష్టర్ పార్వతీశం' వ్రాసి, తెలుగువారందరినీ కడుపుబ్బ నవ్వించిన మొక్కపాటి నరసింహశాస్త్రి గారు రామ్మూర్తి గారి సోదరులే!... కృష్ణశాస్త్రి గారు తన కావ్యాన్ని రామ్మూర్తికి అంకితం ఇస్తూ 'అమృత భాసమానోన్నత ప్రేమ సామ్రాజ్ఞైక చక్రవర్తి' అని కీర్తిస్తారు. రామ్మూర్తి చాలా మేధావి, ప్రతిభావంతుడు. పిఠాపురం ప్రసక్తి వచ్చింది కనుక రాణీ చిన్నమాంబ గురించి, శ్రీమతి భారతలక్ష్మి గారు ఆనాడు తానున్నట్లుగా ప్రత్యక్ష సాక్షిగా ఒక రూపకం వ్రాశారు. వింజమూరి వెంకటరత్నమ్మ – కొటికలపూడి సీతమ్మ, జూలూరి మలశమ్మ –

వీరందరూ కవయిత్రులు – విదుషీమణులు. నన్ను చాలా కదిలించిందీ రచన.... కవికోకిల హలధర్ నాగ్ నిరాడంబరతకు ప్రతిరూపం. నిజంగా కవికోకిల. వారి వ్యక్తిత్వం – మానవతా – ఈనాటి సాహితీవేత్తలకు ఆదర్శం కావాలి! ...గానసరస్వతి శ్రీమతి బాలసరస్వతి గారు లలిత సంగీతానికి ప్రాణంపోసిన గాయనీమణి. ఆ తల్లిని గుర్తించకపోవడం మన దురదృష్టం. వ్యాసం చదువుతున్నంతసేపు ఆమె గానం నన్ను ప్రభావితం చేస్తూనే ఉన్నది.... తెలుగు నవలా సాహిత్యంలో లత గారి పాత్ర ప్రముఖమైనది. ఆమె రచనల్లో 'మోహనవంశి' అపూర్వమైనది. శ్రీకృష్ణ దర్శనమే అవుతుంది. వారంవారం ఊహాగానంతో చైతన్యస్ఫూర్తి కలిగించింది. ఆమె శశికళ – కిన్నెర – అమృతం – పార్వతి సుమా! ***మిసిమి*** లో ప్రతి రచనా ఆలోచనాత్మకమే, ఆలోచనామృతమే! విజయోస్తు! ***– చెరుకువాడ వెంకట్రామయ్య,*** *విస్సాకోడూరు*

✧ "... జూన్ 2016 ***మిసిమి*** సంచికలో నా వ్యాసం *ఆ మనుషులేరి?* ప్రచురించినందులకు ధన్యవాదాలు. తర్వాత నిన్న వచ్చిన చెక్కు చూసుకుని నా అర్ధాంగి ఆనందంగా అన్న మాట – "ఇంత కాలానికి మీరు రచయితగా ప్రయోజకులు కాగలిగారు!" అని. ఈ వ్యాసం చదివిన రాజమహేంద్రవరపు పండితులు అన్నమాట – " *ఆ మనుషులేరి?* వ్యాసం కేవలం కాల్నాధభట్ల సూర్యనారాయణమూర్తి గారికే పరిమితం కాదు! రాజమహేంద్రవరంలోనే ఇంకా నిస్వార్థ సేవచేసి మానవత్వపు పరిమళాలను మిగిల్చిన మహానుభావులు చాలామంది ఉన్నారు. వారందరినీ కూడా ***మిసిమి*** ద్వారా పరిచయం చేయండి!" అంటూ ఆదేశించారు. ఆ ప్రయత్నంలో డా. ఏ.బి. నాగేశ్వరరావుగారి గురించిన సమాచారాన్ని సేకరిస్తున్నాను. 'వ్యాసం' రూపం దాల్చాక మీకు పంపుకుంటాను. ప్రచురించి, ప్రోత్సహిస్తారని ఆశ. మరోసారి మప్పిదాలతో...."

***– మరా శాస్త్రి,*** *రాజమహేంద్రవరం*

✧ "... జూన్ 2016 ***మిసిమి*** సంచిక మంచి వ్యాసాలతో సర్వాంగ సుందరంగా ఉంది. ఆర్.ఎస్. భరద్వాజగారు వ్రాసిన 'తెలుగు సాహిత్యంలో సంచలనం' –*తెన్నేటి హేమలత* వ్యాసం ఆద్యంతం ఎంతో ఆనందం కలుగజేసింది. ఆమె కలుగ చేసింది సంచలనం కాదు, ప్రభంజనం. సంప్రదాయం ముసుగులో ఉన్న వారి నగ్న స్వరూపం బయటపెట్టింది. భరద్వాజగారు ఆమె నవలలను కొన్నింటిని సంక్షిప్తంగా సమీక్షించారు. తన కర్తవ్యం చక్కగా నిర్వహించారు ఎంతో ఆసక్తిదాయకంగా. మిగిలిన నవలలు 'ఊహాగానం' కూడా సమీక్షిస్తే పాఠకులకు చాలా విషయాలు తెలుస్తాయి. లత గారితో నాకు వ్యక్తిగత పరిచయం ఉంది. ఆమె ఇంటికి ఎన్నోసార్లు వెళ్ళి, సాహిత్య చర్చల్లో పాల్గొన్నాను. ఆమెకు రావలసినంత గుర్తింపు రాలేదని నా అభిప్రాయం. కుటుంబ ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు ఆమె సృజనా శక్తికి ఆటంకాలుగా నిలిచాయి. ఊహాగానం వ్యాసాలు ఈనాటికీ చదవదగినవి. అదే సంచికలో రావినూతల సత్యనారాయణగారు కొలకలూరి ఇనాక్ గారి రచనల గురించి వ్రాసిన వ్యాసం నన్నెంతో ఆకట్టుకొన్నది. పాత సంచికలలో వారు వ్రాసిన వ్యాసాలు అద్భుతం. కోడూరి సోదరులు వ్రాసిన వ్యాసాలు నన్నెంతో ఆకట్టుకొన్నవి...."

***– డి. సత్యనారాయణ,*** *విశ్రాంత జిల్లాజడ్జి – విజయవాడ*

✧ "... నా పేరిట "నాలో నేను" పదకవితలు పోస్ట్ కాగా చేరినవి. మీ అడ్రసు దొరకలేదు. మీరు ***మిసిమి***లో వ్యాసములు వ్రాయుటచేత మీతో పరిచయము చేసికొన ప్రయత్నించితిని వీలు కాలేదు. బైరన్ చరిత్ర నాకు ***మిసిమి*** వారి పంపినను ఈ చిరునామా వ్రాయలేదు. అందువలన ***మిసిమి*** కార్యాలయమునకు మీకుగాను ఉత్తరము వ్రాయుటమైనది. మీ దీర్ఘ కృతజ్ఞతలు (వివిధ సహాయకులకు) మరియు మీ శ్రీమతి రాత్రి వ్రాయునపుడు మందలించిన విషయము నాకు ఆనందమే కలిగించినది. నాకు మీ అంత గొప్పది కాకపోయినను రాత్రి పని రాత్రియే సజావుగా సాగునా – నా శ్రీమతి కూడా నిద్రాభంగమని గోల చేయును. బైరన్ పేరు వినగానే, బి.ఎ. నాటి అనుభవము గుర్తుకు వచ్చినది. గుంటూరు హిందూ కాలేజ్‌ని సి.ఎస్.ఎన్. అనువారు ఇంగ్లీషు చెప్పేవారు. బైరన్ పోయమ్ తాను చెప్పలేనని గైడ్ చదువుకొనుమనగా ప్రిన్సిపల్ వి.వి. సుబ్బారావు చెప్పగా ఎవరికి అర్థము కాలేదు. హిందూ కాలేజి హైస్కూల్‌లో ఒక సెకండరీ టీచర్ అన్నపూర్ణ శాస్త్రి గారు క్లాస్ చేసిరి. చాలా బాగా విశ్లేషించగా నేను నోట్స్ వ్రాసుకుని ఎస్సే వ్రాసుకున్నాను. ఆ ప్రశ్న రాగా ఆ ఎస్సే ఉపకరించెను. బైరన్ కవిత్వము అంత ప్రౌఢము. పండితులు మీకు చెప్పవలయునా? మీరు వ్రాసిన పుస్తకములున్నవి. ధర వ్రాయలేదు. నాకు కావలసినవి తెప్పించుకొనదలచినందున ప్రైస్ లిస్ట్ పంప కోరుతున్నాను. శ్రమ కలిగించలేదుకదా!...." ***– ఎమ్. రామచంద్రం,*** *గుంటూరు*

కొంతమంది గొప్పవాళ్ళకి, గొప్పవాళ్ళైన భార్యలూ లభిస్తుంటారు. ఇది వాళ్ళకి అదనంగా లభించిన అదృష్టం లాంటిది. ఎంచేతనంటే, ఇటువంటివారి ఇళ్ళకి ప్రముఖులైన రచయితలు, కవులు, కళాకారులు ప్రతినిత్యం వచ్చిపోతుంటారు. ఇప్పుడెలా ఉందో గానీ, ఆ రోజుల్లో మాత్రం ఈ సందర్భాలు బహుళంగా ఉండేవి. ఇటువంటి సన్నివేశాలలో ఆ ప్రముఖుల భార్యలు విసుగూ, విరామం లేకుండా, వచ్చిపోయే అతిథులకు మర్యాదలు చెయ్యటం, మన్ననలు పొందటం ఒక గొప్ప విశేషం. ఇలా గొప్ప భార్యలు అందరికీ లభించి ఉంటారని రూఢిగా చెప్పలేంగానీ, కొందరికీ ఈ భాగ్యం తప్పక కలిగి ఉంటుంది. ఆ కోవలో గణనకెక్కిన నలుగురు ప్రముఖుల పేర్లు జ్ఞాపకం చెయ్యాలనుంది. దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి గారి భార్య శ్రీమతి రాజహంస. ఆమె, భర్తకోసం వచ్చే అతిథులకు, విశేష మర్యాదలు చేసేవారు. అలాగే విద్యుత్కవి కందుకూరి రామభద్రరావుగారి భార్య శ్రీమతి రామలక్ష్మిగారు. అతిథి మర్యాదలకు ఆమె రెండో పేరు. విశ్వనాథ సత్యనారాయణ గారంతటి వ్యక్తి చేత 'అన్నపూర్ణ' అనిపించుకొన్న ఘనత ఆమెది. మూడవవారు పాలగుమ్మి పద్మరాజుగారి భార్య శ్రీమతి సత్యానందం. ఈమె పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని, ఆతిథ్యాన్ని నోరారా కీర్తించిన కవులు, రచయితలు, పండితులు, కళాకారులు లెక్కకు అందనంతమంది ఉన్నారు. ఇక నాల్గవవారు శ్రీ బుచ్చిబాబుగారి భార్య శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి. భర్త కీర్తిలో అర్థభాగాన్ని సునాయాసంగా సొంతం చేసుకున్నారు. రేడియోకి వచ్చే కళాకారులైనా, నాటకాలు వేసే కళాకారులైనా, చిత్రకళ, సంగీతం వంటి కళలకు అభిమానులు, కవులు, రచయితలు సరేసరి. ఇలా ఎవరెవరో బుచ్చిబాబు గారింటికి వచ్చేవారు. అటువంటి సమయాల్లో ప్రవరాఖ్యుని భార్యకు సమాంతర ప్రఖ్యాతి సుబ్బలక్ష్మిగారిది. ఇక్కడ మరో అదనపు విశేషాన్ని చెప్పుకోవాలి. ముందు చెప్పిన ముగ్గురు ప్రముఖుల భార్యలు అతిథి మర్యాదలకు పెట్టింది పేరైతే, సుబ్బలక్ష్మిగారు వాటితోపాటు, రచయిత్రి, గాయని, చిత్రకారిణి కూడా కావడంచేత, అర్థగౌరవాన్ని ఆమె సొంతం చేసుకోగలిగారు. 'అదృష్టవంతులైన భార్యాభర్తలు' అనే మాటకి, ఈ దంపతులిద్దరూ చెరోవైపు నుంచీ అద్దమై నిలిచారు.



బుచ్చిబాబు

# చివరకు మిగిలిన సగం

*– వోలేటి పార్వతీశం*

బుచ్చిబాబుగారి అంతరంగమెరిగి, అవసరానికి తగిన సదుపాయాలు సమకూర్చి పెట్టడంలో ఆమె అగ్రగణ్య. బుచ్చిబాబుగారు నిరంతర సౌందర్యాన్వేషి. అంచేత నిత్యం సంసారంలో వాతావరణమంతా ఆహ్లాదంగా దిద్ది తీర్చేవారు. ముఖ్యంగా ఆయన రచయిత కనుక, వ్రాసుకునే తెల్ల కాగితాలను, పెన్నులు వగైరా ఇతర సామగ్రిని అందంగా అమర్చి ఉంచడం ద్వారా ఆయన మనసు రచనకు దూరం కాకుండా చెయ్యడం, సాధారణ సంసారంలో ఆమె సాధించిన ఘన విజయమే.

ఇక వ్యక్తిగతంగానూ ఆమె సాధించిన ఘనత సామాన్యమైనది కాదు. తార్నాకా మహిళా సమాజానికి అధ్యక్షురాలిగా పనిచేసి, స్త్రీ చైతన్యానికి ప్రేరణగా నిలిచారు. ఇక రచయిత్రిగా భర్త ప్రక్కన పీట సుస్థిరంగానే వేసుకున్నారు. 'ఒడ్డుకు చేరిన ఒంటరి కెరటం', 'మగతజీవి చివరి చూపు', 'కావ్యసుందరి కథ' వంటి కథాసంపుటాలు, 'అదృష్టరేఖ', 'నీలం గేటు అయ్యగారు', 'తీర్పు'వంటి నవలలు ఇలా ఎన్నెన్నో రచనలు పాఠకజన రంజనంగా సాహితీ లోకానికి అందించారు. వీరి మొదటి కథాసంపుటి ప్రచురణకు నోచుకున్న శుభసందర్భంలో సుప్రసిద్ధ సాహితీమూర్తి ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఆశీర్వచనం చేశారు.

"ఈ కథలు చదువగా, ప్రారంభకుల ఎగుడు దిగుడులు లేకపోగా, కథారచనలో చెయ్యి తిరిగినవారు వ్రాసినట్లు ఉండడం చూసి నాకు ఆశ్చర్యం, ఆనందం కలిగినవి. సుబ్బలక్ష్మి కథలలోని విశిష్టత ఏమంటే, వీటిలో చాలా భాగం, ఇవి స్త్రీలు మాత్రమే వ్రాయగలరు అనిపించడం. స్త్రీల స్వభావాన్ని, సాటి స్త్రీ వర్ణించినప్పుడు, ఆ వర్ణన అన్యూనాతిరిక్తంగానూ, వాస్తవికతకు సన్నిహితంగానూ ఉండటంలో ఆశ్చర్యం లేదు. బుచ్చిబాబు సహధర్మచారిణి చి॥ సుబ్బలక్ష్మి, ఉత్తరత్ర భర్తకంటె కూడా మంచి కథలు వ్రాయాలని నేను ఆశీర్వదిస్తున్నాను." తదనంతర కాలక్రమంలో లక్ష్మీకాంతంగారి ఆశీస్సులు, సుబ్బలక్ష్మిగారి రచనా ప్రస్థానంలో ఫలవంతమయ్యాయి.

మనుషుల మధ్య చుట్టరికాలు తిరగేస్తూ పోతుంటే, ఎవరెవరివో, ఎక్కడెక్కడో బంధుత్వాలు కలసిపోతుంటాయి. అలాంటి ఒక చుట్టరికం మీకు తెలిసే ఉంటుంది. తెలుగు

జాతి మొత్తం గర్వపడే చిత్రకారుడు బాపూగారికి, సుబ్బలక్ష్మిగారు పిన్ని వరస. అంతేనా! ప్రాథమిక దశలో, బాపూ, గీతలతో పరిచయాన్ని పెంచుకుంటున్న తరుణంలో, రేపటికి విరాణ్మూర్తిగా వెలగనున్న బాపూకి ఆమె గురువన్న విషయం, మిత్రుడు డా. వేదగిరి రాంబాబు ఇటీవల తేటతెల్లం చేశాడు. అలాగే మంచి ప్రాజెక్టు ప్రారంభించే ముందు సీతారాముల బొమ్మలు గీసుకొని పని ప్రారంభించే అలవాటున్న బాపు, ఒకానొక తరుణంలో బుచ్చిబాబు, సుబ్బలక్ష్మిగారల బొమ్మలు వేసి పని ప్రారంభించిన నిగూఢ విషయం కూడా, ఇటీవల రాంబాబు తెరమీదకి తెచ్చాడు. అంటే, ఆ దంపతులు ఆదర్శ దంపతుల గౌరవాన్ని పొందినట్టే.

రచయిత్రిగా, చిత్రకారిణిగా, గాయనిగా, అన్నింటికీ మించి బుచ్చిబాబులాంటి విఖ్యాత రచయితకు అర్ధాంగిగా జీవనం గడుపుతున్న శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి ఇటీవల బుచ్చిబాబు శతజయంతి ఉత్సవాల సమాపన సందర్భం కోసం హైదరాబాద్ వచ్చారు. ఆ తరుణంలోనే ***మిసిమి*** ఆమెను కలిసింది. ఒకింతసేపు ఆమెతో ముచ్చట్లాడింది. ఆ ముచ్చట్లలోని విశేషాలేమిటంటే...



శివరాజు సుబ్బలక్ష్మి - వోలేటి

**మిసిమి :** *ఒక భార్యగా, భర్తను గమనించడం సరే. కానీ ఒక సహచరిగా మీరు బుచ్చిబాబుగారిలో గమనించిన ప్రత్యేకత ఏమిటి?*

సుబ్బలక్ష్మి : ఆయనొక మంచి స్నేహితుడు. ఆయనొక గొప్ప గురువు. నిజానికి ఆయనవల్లే నాకు చదువు మీద ఆసక్తి కలిగింది. తాను చదివిన ప్రతి పుస్తకాన్నీ, నన్నూ చదవమనేవారు. ఒకవేళ నాకు అర్థం కాని విషయాలుంటే, ఆయనే వివరించి చెప్పేవారు. ఇక గొప్ప సాన్నిహిత్యాన్ని నెఱపేవారు. అస్సలు దాపరికం ఉండేది కాదు. ఏ విషయాన్ని ఆయన నా దగ్గర దాచాలని ప్రయత్నించలేదు. ఆయన పేరు తలిస్తే చాలు నాకు ఇప్పటికీ కళ్ళకు నీళ్ళొస్తాయి.

**మిసిమి :** *బుచ్చిబాబు గారితో మీ వైవాహిక జీవితం ఎలా సాగింది?*

సుబ్బలక్ష్మి : నాకు పన్నెండేళ్ల వయసనుకుంటాను. అప్పుడు మా వివాహం జరిగింది. మూడు దశాబ్దాల వైవాహిక జీవితం మాది. ఆ ముప్పై ఏళ్ళలో మేమిద్దరం, ఒకరిని విడిచి ఒకరం ఉన్నది లేదు. ఏ ఊరు వెళ్ళినా నన్ను వెంట తీసుకువెళ్ళేవారు. ఒకసారి విదేశం వెళ్ళే అవకాశం వచ్చింది. 'ఏమయ్యా! ఇంగ్లాండ్ వెళ్ళాలి, సుబ్బి లేకుండా వెళ్తావా?'' అని అడిగారు ఆఫీసులో. "అబ్బెబ్బే, నేను వెళ్ళను" అనేశారు. అలా ఆ అవకాశాన్ని నా కోసం తృణప్రాయంగా వదిలేశారు.

**మిసిమి :** *శ్రవ్య నాటకాల మీద ఆయనకు ప్రత్యేకమైన అభిమానం ఉండేది కదా!*

సుబ్బలక్ష్మి : ఆయనకు చాలా చదివే అలవాటుండేది. కనుక మంచి మంచి ఆలోచనలూ ఎక్కువగా ఉండేవి. నాటకం కోసం, మంచి రచనలు ఎంచుకునేవారు. అంతేకాదు, ఆయా నాటకాల్లో పాత్ర పోషణకు, తగిన పాత్రధారులనే ఎంచుకునేవారు. ఆ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఇక ఆఫీసులో ఆయన పై అధికారులు కూడా, చాలా సహకరించేవారు. ఆయన చేసిన ఏ ప్రతిపాదనైనా, అధికారులు తిరస్కరించిన సందర్భం లేదు.

**మిసిమి :** *చాలామంది ప్రముఖులు ఇంటికి వచ్చేవారేమో కదా?*

సుబ్బలక్ష్మి : అవును. విశ్వనాథ సత్యనారాయణగారికి, ఈయనంటే ఎంతో అభిమానం. వారితో నా పరిచయం తమాషాగా బెజవాడ కాళేశ్వరరావు మార్కెట్‌లో జరిగింది. ఈయన అతిథులతో

భోజనానికి వస్తే ముందే చీటి వ్రాసి పంపేవారు. నేను కాయగూరల కోసం మార్కెట్‌కి వెళ్ళాను. దుకాణాదారు చెప్పిన ధరకే నేను వంకాయలు కొంటూ ఉంటే, విశ్వనాథగారు నాతో ఘర్షణ పడ్డారు. బేరం చెయ్యకుండా, కూరలు కొంటే ఎలా? నేను ఎలా కొనాలి? అన్నారు. చిత్రమేమిటంటే, ఆ రోజు మధ్యాహ్నం మా వారితో భోజనానికి వచ్చింది ఆయనే. "పోన్లే అమ్మా! అక్కడ మార్కెట్‌లో దెబ్బలాడుకున్నా, ఇక్కడ ఇంట్లో మంచి కూర వండి పెట్టావు" అన్నారు. చాలామంది ఆయన్ని కోపిష్టి అంటారుగానీ, చాలా మంచి మనిషి. పింగళి లక్ష్మీకాంతం గారు కూడా ఉండేవారు. వీళ్ళిద్దరి ధోరణులు వేరువేరు. రేడియోలో ప్రసంగాల కోసం వచ్చినప్పుడు, రెండు రచనలతో వచ్చేవారు. "బుచ్చిబాబూ! ఇది నీ కోసం, ఇది వాడికోసం" అనేవారు.

**మిసిమి :** *రేడియో కార్యక్రమాల కోసం వచ్చే చాలామంది కళాకారులు ఇంటికి కూడా వచ్చేవారట కదా!*

సుబ్బలక్ష్మి : రిహార్సల్స్ మా ఇంట్లోనే జరిగేవి. డాన్సులూ వగైరా ఉంటే మా మేడమీదే. సావిత్రి, నిర్మల, వహిదా రెహమాన్. వీళ్ళంతా వస్తుండేవారు. దారినపోయే దానయ్యలో వేసిన పుండరీకాక్షయ్య, అప్పుడప్పుడు బందా కనక లింగేశ్వర రావుగారూ వస్తూండేవారు.

**మిసిమి :** *బుచ్చిబాబుగారు, రేడియో నాటకాల్లో చాలా ప్రయోగాలు చేసేవారని అంటారు.*

సుబ్బలక్ష్మి : అవును. పాశ్చాత్య సాహిత్యం బాగా చదివేవారు. అంచేత కొత్తగా ఏమి వచ్చినా ఆయనకు తెలిసేది. అలాంటి కొత్తవన్నీ ఇందులో ఉంచాలని కోరిక ఉండేది. తప్పులేదుగా. మద్రాసు రేడియోలో ఈ ప్రయోగాలు మొదలుపెట్టారు. "రాయల కరుణ కృత్యం" రేడియోకి చేసినప్పుడు, ప్రముఖ దర్శకుడు, బి.యన్. రెడ్డి గారి చేత దానికి ముందు మాటలు చెప్పించారు. అప్పుడే ఆయనకి దీన్ని సినిమాగా తీయాలనే తలంపు కలిగింది. బుచ్చిబాబుగారినే వ్రాయమన్నారు. వాళ్ళేవో మార్పులడిగారు. ఈయన ఒప్పుకోలేదు.

**మిసిమి :** *నిశ్చితమైన అభిప్రాయాలుండేవేమో?*

సుబ్బలక్ష్మి : నిజమే. విషయం తెలుసుకోకుండా, చదవకుండా, అడ్డదిడ్డంగా విమర్శిస్తే చాలా కోపం వచ్చేది. తన గురించే కాదు ఎవరి గురించైనా అంతే. ఎదుటివాళ్ళను, పరోక్షంలో తక్కువచేసి మాట్లాడటం ఆయనకు అస్సలు ఇష్టం ఉండేది కాదు.

**మిసిమి :** *చివరకు మిగిలేది నవలకు అంతటి ప్రాచుర్యం రావడానికి ఒక రచయిత్రిగా, ఏమిటి కారణం అని మీరు భావిస్తారు?*

సుబ్బలక్ష్మి : తన ఊహలో ఉన్నవన్నీ అందులో పెట్టేశారు. అందుకే ఎప్పుడు చదివినా కొత్తగా స్ఫురిస్తుంది. మావారు వ్రాశారని చెప్పడం కాదుగానీ, చదివినప్పుడల్లా కొత్త భావం కలుగుతుంది. నేను చాలాసార్లు చదివాను. నాకు అలా జరిగింది. వారపత్రికల్లో ధారావాహికంగా వచ్చినన్నాళ్ళు సంచలనమే. అది పూర్తి కాగానే, ఎడిటర్ నీలంరాజు వెంకట శేషయ్యగారు మా ఇద్దరినీ సన్మానించారు.

**మిసిమి :** *చివరకు మిగిలేది నాయకుడు దయానిధికి, బుచ్చిబాబుగారికి మనస్తత్వంలో పోలికలుండేవా?*

సుబ్బలక్ష్మి : అలా అని చెప్పలేం. అయితే, రచయిత లక్షణాలు కొన్ని అతని పాత్రలలో ఉండే అవకాశం సహజమే కదా! ఆయనకు ఏకాంతంగా ఉండటం ఇష్టం. తక్కువ మందితో మాట్లాడేవారు. కానీ బాగా చదువుకున్నవారో, మంచి విమర్శకులో వస్తే మాత్రం, గంటలకొద్దీ మాట్లాడేవారు. అలాంటి వారిలో శేషేంద్ర ఒకరు. మా ఇంటికి తరచూ వస్తూండేవారు. రామాయణంలోని విశేషాలు చాలా లోతుగా చెప్పేవారు. నాకు కూడా చాలా ఆసక్తిగా ఉండేది.

**మిసిమి :** *మీ రచనల్లో మీరెప్పుడైనా బుచ్చిబాబుగారిని ఆదర్శంగా తీసుకున్నారా?*

సుబ్బలక్ష్మి : బుచ్చిబాబుగారి రచనల్లో వర్ణనలు ఎక్కువగా

ఉంటాయి. బావుంటాయి కూడా. అందుకే ముందు నేను వర్ణనలు వ్రాయడం మానేశాను. కథ మాత్రమే వ్రాసేదాన్ని. కొన్నిచోట్ల ఉంటే, ఉండి ఉండొచ్చు. నేను వర్ణనలు వ్రాస్తే కాపీ కొట్టానంటారు. అప్పటికీ కొన్ని వదంతులుండేవి. ఆయన వ్రాసిస్తే నా కథలుగా అచ్చయ్యాయవి. నిజానికి ఆయన నా కథ చదివేవారే కాదు.

**మిసిమి :** *రచయిత్రిగా మీరు ఆయన శైలిని అనుకరించాలనిగానీ, దూరంగా ఉండాలనిగానీ ప్రయత్నించేవారా?*

సుబ్బలక్ష్మి : అనుకరించే ప్రయత్నం చెయ్యలేదు. నా కథల నిండా అంతా సామాన్య స్త్రీలే. కేవలం మధ్యతరగతివాళ్ళు. అందరికీ కోరికలుంటాయి. స్త్రీలకీ ఉంటాయి. ఆ కారణంగా గొడవ పడనక్కరలేదు. వాళ్ళు గొడవలు పెంచుకుని, బయటకు వెళ్ళిపోవలసిన పనే లేదు. ఇంటిలో ఉండే సాధించుకోవచ్చు. ఈ విషయాన్ని నేను గట్టిగా నమ్ముతాను.

**మిసిమి :** *పెద్ద రచయితకు భార్య అయిన రచయిత్రికి పేరు తక్కువగా వస్తుందా?*

సుబ్బలక్ష్మి : మఱ్ఱిచెట్టు క్రింద మొక్కలాగే ఉంటామని తెలుసు. అవి మహావృక్షాలౌతూ ఉంటాయి. ఇవి చిన్న మొక్కలుగానే ఉంటాయి. కానీ, ఆ నీడలో ఉన్న ఆనందం ఒకటుంటుందిగా. అది నాకిష్టం.

**మిసిమి :** *సుబ్బలక్ష్మిగారికి రచయిత్రిగా మంచి గుర్తింపే ఉంది కదా!*

సుబ్బలక్ష్మి : అది బయటివాళ్ళు చెప్పాలి. నేనేం చెప్తాను?

**మిసిమి :** *మీకూ, బుచ్చిబాబుగారికి కూడా చిత్రకళలో మంచి ప్రావీణ్యం ఉంది కదా!*

సుబ్బలక్ష్మి : ఇద్దరం ఎక్కువగానే వేసేవాళ్ళం. ఎక్కడా నేర్చుకోలేదు. ఆయన ఈ కళకు సంబంధించిన చాలా పుస్తకాలు తెప్పించేవారు. మా ఇంట్లో చాలా పెద్ద గ్రంథాలయమే ఉండేది. ఎక్కడెక్కడి పుస్తకాలు కొనేవారు. అవన్నీ బాగా చదివేవారు. కాపీ చేసినవాటికన్నా, ఒరిజినల్ థాట్స్ బాగుంటాయనేవారు. కొందరికి కొన్ని వర్ణాలు నచ్చుతాయి. నాకు పసుపు రంగు బాగా ఇష్టం. ఆయనకు లైట్‌గా ఉండే డార్క్ అంటే ఇష్టం. మొక్కపాటి కృష్ణమూర్తిగారి లాంటివాళ్ళు మా ఇంటికి వచ్చినప్పుడు, మా చిత్రాలు చూసి, బాగా విశ్లేషించేవారు.

**మిసిమి :** *మీకు ఎలా వచ్చిందీ కళ?*

సుబ్బలక్ష్మి : ఈ విద్యలో నాకు గురువంటూ ఎవరూ లేరు. ఆసక్తికొద్దీ వేసినవే. నేను సొంతంగా అలవర్చుకున్నదే. చిన్నతనంలో బొగ్గుతో బొమ్మలు వేసేదాన్ని. భగీరథగారని ఒకాయన కడియం నుంచి వచ్చేవారు. ఆయనకు చూపించేదాన్ని. పాపం, బొగ్గుతో వేస్తోందని, మా నాన్నగారు వాటర్ కలర్స్ కొనిచ్చేవారు. వాటితో వెయ్యటంతో రంగుల బొమ్మలు అలవాటయ్యాయి. భగీరథగారు ఒకసారి ఒక బొమ్మ నాకు బహుమతిగా ఇచ్చారు. ఆయన సూర్యాస్తమయం బాగా వేసేవారు. గోధూళి రేగిన దృశ్యం బావుండేది. ఆ బొమ్మ వెయ్యాలని చాలా ప్రయత్నించేదాన్ని. మొత్తానికి వచ్చింది.

**మిసిమి :** *బుచ్చిబాబుగారు ప్రకృతి ప్రేమికులు కదా! మరి మీ నేపథ్యమేమిటి ఈ చిత్రకళలో?*

సుబ్బలక్ష్మి : ఆయన లాండ్‌స్కేప్స్ ఎక్కువగా వేసేవారు. నేనూ వేసేదాన్ని. కొన్ని వ్యక్తుల బొమ్మలు కూడా వేశాను. గాంధీగారి బొమ్మ వేశాను. ఒకసారి, మద్రాసు వచ్చి నెలరోజులు గాంధీగారు అక్కడున్నారు. బుచ్చిబాబుగారు ఆఫీసుకి వెళ్ళగానే, నేను స్నేహితురాళ్ళతో కలసి ఆయన ఎక్కడుంటే నేను అక్కడికి, బస్సెక్కి వెళ్ళిపోయేదాన్ని. గాంధీ గారిని దగ్గరగా చూశాను, పరిశీలించాను.

**మిసిమి :** *మీకు సంగీతంపట్ల కూడా ఆసక్తి ఎక్కువే కదా!*

సుబ్బలక్ష్మి : ఇంటిదగ్గర, చిన్నప్పుడు గాత్ర సంగీతం చెప్పించేవారు. తరువాత వయొలిన్ కూడా నేర్చుకున్నాను. శాస్త్రీయ సంగీతం చాలా ఇష్టం. లలిత సంగీతం విని ఆనందించడమే తప్ప నేర్చుకోలేదు. బయటగానీ, రేడియోలోగానీ కచ్చేరీలు చేయలేదు. పాలగుమ్మి విశ్వనాథం గారు వీణ నేర్చుకోమనేవారు. నేర్పిస్తాననేవారు. కానీ అది జరగలేదు. నాకు సంస్కృతం అంటే

చాలా ఇష్టం. సంస్కృత కావ్యాలు చదవాలనే కోరికతో నేర్చుకున్నాను. కాంచనపల్లి కాంతమ్మగారని వారు ఇంటికి వచ్చి చెప్పేవారు. సంసారం బాధ్యతల వల్ల బయటకు వెళ్ళి నేర్చుకోవడం కుదిరేది కాదు. ఆమే వచ్చి చెప్పేవారు.

**మిసిమి :** *బుచ్చిబాబుగారి అభిలాష ఎటువంటిది?*

సుబ్బలక్ష్మి : ఆయన హార్మోనియం వాయించేవారు. పద్యాలు చాలా ఇష్టం. పేరు గుర్తురావడం లేదు గానీ, శాస్త్రిగారని ఒకాయన వచ్చేవారు. ఆ ప్రముఖుడితో గంటలకొద్దీ పద్యాలాపన ఉండేది. ఆఖర్లో ఆయన హాస్పిటల్‌కి వెళ్ళేముందు కూడా నాటకానికి వెళ్ళాం. "ఇలా ఉన్నారు; అనారోగ్యంతో ఎలా?" అంటే, ఎవరో సహాయకునితో వెళ్ళిన జ్ఞాపకం. కృష్ణరాయబారం, ఈలపాట రఘురామయ్య కృష్ణుడు వేశారు. ఆయన తరచూ ఇంటికి వస్తుండేవారు. పద్యాలు పాడి వినిపించేవారు.

**మిసిమి :** *బుచ్చిబాబుగారు స్వర్గస్థులైన నాటినుండి, ఈ శతజయంతి వరకు క్రమం తప్పకుండా పుట్టిన రోజులు చేస్తున్నారు కదా!*

సుబ్బలక్ష్మి : అవును. చేస్తున్నాను. ఆయనకు పుట్టిన రోజులంటే చాలా ఇష్టం. చేసుకునేవారు. మనకెవరు చేస్తారు నీకు నేను చేస్తా, నాకు నువ్వు చెయ్యి అనేవారు. ఆఖరి సంవత్సరం బాగా జరిగింది. 'షేక్స్‌పియర్ సాహితీ పరామర్శ' స్థానం నరసింహారావు గారికి అంకితమిచ్చారు. హైదరాబాద్‌లో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి అధ్యక్షంలో జరిగింది. దోమలగూడాలో మా ఇంట్లోనే. ఆ ఆవరణలో వైభవంగా జరిపి, వచ్చిన వాళ్ళకి భోజనాలు పెట్టాం. మా తమ్ముడు ఆంజనేయులు నిర్వహించాడు.

**మిసిమి :** *బుచ్చిబాబు శతజయంతి సందర్భంలో ఆయన రచనలు మొత్తం అందుబాటులోకి తెచ్చే ఆలోచనేమైనా ఉందా?*

సుబ్బలక్ష్మి : ఆయన వేసిన చిత్రాలలో ప్రధానమైన వాటిని ఎంపిక చేసి, ఒక సంపుటిగా తెచ్చాం. అది అందుబాటులో ఉంది. నేను వ్రాసిన జ్ఞాపకాలు పాలపిట్టలో వచ్చాయి. అవి కూడా సంపుటిగా ప్రచురించాం. అందుబాటులో ఉంది. ఇక ఆయన రచనలన్నీ సమగ్రంగా ఒకచోట కలిపి ప్రచురించాలని ఉంది. కోరికైతే ఉందిగానీ, ఖర్చుతో కూడిన పని. అప్పోసొప్పో చేసి, వేసినా అమ్మడం కష్టం. ఆ విద్య తెలిసినవాళ్ళు వెయ్యాలి.

**మిసిమి :** *అతిథులొస్తే బాధపడే రోజులొచ్చాయి. ఆ రోజుల్లో మీ ఇంటికి అతిథుల తాకిడి ఎక్కువగా ఉండేదని వినికిడి. మీకు ఇబ్బందిగా అనిపించేది కదా!*

సుబ్బలక్ష్మి : అస్సలు అనిపించేది కాదు. వాళ్ళు తిని వెళ్తే చాలు అనుకొనేదాన్ని. రాజమండ్రి నుండి ఒకసారి శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారొచ్చారు. "మిట్టమధ్యాహ్నం ప్రయాణం కట్టారు. ఇబ్బంది కదా!" అన్నారట సన్నిహితులు. 'మా కాశీ అన్నపూర్ణ ఉంది నాకేం భయం' అని మధ్యాహ్నంవేళ మా ఇంటికొచ్చారు. అప్పటికప్పుడు ఏదో చేసిపెట్టాను. ముందు కాఫీ ఇమ్మని అడిగి, కలిపించుకుని తాగారు. ఆయనకు కాఫీ అంటే చాలా ఇష్టం. ఎవరొచ్చినా నాకు చేసిపెట్టటం ఇష్టమే. ఇప్పటికీ మనం ఎవరమైనా ఇంట్లోంచి బయటకు వెళ్తుంటే తిని వెళ్తేనే బావుంటుందని అనుకుంటాం కదా! నేనైతే అప్పుడు ఇప్పుడు కూడా అంతే.

బుచ్చిబాబు లాంటి ఒక మహా రచయితకు భార్యగా లోకం ప్రశంసించిన శ్రీమతి సుబ్బలక్ష్మి నవతిని దాటారు. ఇప్పటికీ చిరునవ్వుకు, ఆత్మీయతకు నిజమైన చిరునామాలా జీవనయానం కొనసాగిస్తున్నారు. బుచ్చిబాబు జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, వాటిని ఈ తరానికి పంచిపెడుతూ, భర్త శతజయంతిని నిర్వహించడమే లక్ష్యంగా ఏర్పరచుకోవడమే కారణం కావచ్చు. నిండైన మనిషికి పండంటి జీవితం సంప్రాప్తించింది. ఒకటి రెండైన సగాలలో మొదటి సగానికి శతజయంతి నెఱపిన ఆమె ధన్య. 'భార్య' అనే మాటకు అర్థమై నిలచిన శివరాజు సుబ్బలక్ష్మి చివరకు మిగిలిన సగంగా మహిళా లోకానికి మూర్ధన్య.

డా. వోలేటి పార్వతీశం
హైదరాబాద్. ఫోన్ : 944 003 1213



# తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాణ విశేషాలు

– *ఈమని శివనాగి రెడ్డి*

చోళ చక్రవర్తి మొదటి రాజరాజ చోళుడు క్రీ.శ. 1010లో అత్యంత విశాలంగా, ఉన్నంతగా నిర్మించిన బృహదీశ్వరాలయం వెనుక కొన్ని కథలు, గాథలు దాగి ఉన్నాయి. దేవాలయ నిర్మాణానికి సంబంధించి కరువూరు పురాణం, బృహదీశ్వర మహాత్మ్యం అనే గ్రంథాలు ఎన్నో వివరాలనందిస్తున్నాయి. కరువూరు పురాణం, ఒక గొప్ప సిద్ధుడైన కరువూరు దేవర కథను చెప్పేటప్పుడు, ఆలయ నిర్మాణ, ప్రతిష్ఠా విశేషాలను కూడా ప్రస్తావించింది. అయితే ఆలయ నిర్మాణ క్రమంగానీ, ప్రధాన శిల్పిని గురించి గానీ ఈ గ్రంథంలో వివరాలు లేవు. దేవాలయాన్ని మేరుపర్వతంలోనూ, శిఖరాన్ని హేమకూటంగానూ పోల్చి చెప్పింది. ముందున్న గోపురాన్ని ఎనిమిది దిక్కులునున్న ఎనిమిది కులపర్వతాల చుట్టూ ఉన్న ప్రాకారాన్ని అందులో నిర్మించిన పరివారాలయాలను కలిపి, చక్రవాళలతోనూ పోల్చింది. బంగారు శిఖరంగా పేరున్న ఈ ఆలయాన్ని 'అభయ' అనే రాజు నిర్మించాడని ప్రస్తావించింది.

తన రాజముద్ర అయిన 'పులి'ని మేరుపర్వతం మీద ముద్రించాడనీ మేరుపర్వత రూపంలోనున్న ఆలయాన్ని అతడు నిర్మించాడని పదేపదే పేర్కొంటుంది. ఉమాపతి శివం రాసిన తిరుముర్రై కందపురాణంలోగల 'దేవరం' అనే ప్రార్థనా గీతాలను దేవాలయ నిర్మాత రాజరాజు ప్రచారం చేశాడనీ, రాజరాజుకు రాజరాజ అభయ కులశేఖర అనే బిరుదు కూడా ఉందని ఈ గ్రంథంలో ఉంది. అయితే రాజరాజు తంజావూరులో వేయించిన శాసనంలో ఈ బిరుదు లేకపోవటం, మొదటి కులోత్తుంగ చోళు (క్రీ.శ. 1020–55)నికి ఇదే బిరుదున్నట్లు అతని శాసనాల్లో పేర్కొనబడటం గమనించదగిన విషయం.

తంజావూరు రాజరాజేశ్వర (బృహదీశ్వర) దేవాలయాన్ని 'తిరు ఇసైప్పా' అనే స్తుతిలో కరువూరు దేవర్ ఘనంగా కీర్తించాడు. అందులో ఉన్న 10 గీతాల్లో తంజావూరు గురించి, రాజరాజేశ్వరాలయం గురించిన వివరాలున్నాయి. మొదటి రాజేంద్ర చోళుడు గంగైకొండచోళీశ్వరంలో నిర్మించిన ఆలయాన్ని గురించీ అంతకు ముందు 150 ఏళ్ళ కిందట ఆదిత్యచోళుడు నిర్మించిన ఆదిత్యేశ్వర దేవాలయాలను కూడా దేవరు స్తుతించాడు. ఈ కరువూరు దేవుడు ఎప్పటివాడో ఖచ్చితంగా తెలియదుగానీ కొందరు అతడు రాజరాజ చోళుని గురువనీ, మరికొంతమంది తరువాతివాడనీ చెబుతున్నారు.

తంజావూరు దేవాలయ నిర్మాణానికి సంబంధించిన కథలు బృహదీశ్వరమాహాత్మ్యం, తంజావూరు మహాత్మ్యం అనే గ్రంథాలున్నాయి. వాటి ప్రకారం, కరికాళ చోళుడు చోళ దేశాన్ని తంజావూరు రాజధానిగా, పాలించేవాడు. అతని పట్టపు రాణి పేరు కాంచన. అతనికి హరదత్తుడనే శైవబ్రాహ్మణ గురువుండేవాడు. రాజగురువు ఆజ్ఞల ప్రకారం, కరికాళ చోళుడు శివుని పేరిట అగ్నీశ్వర, దుర్గేశ్వర, మంగలేశ, అమరావనేశ్వర దేవాలయాలను నిర్మించాడు. రాజుకు అనుకోకుండా కుష్టువ్యాధి సోకగా, ఎలాగైనా తగ్గించమని రాజగురువును అభ్యర్థించాడు. అలాగేనన్న రాజ గురువు అగ్నీశ్వర దేవుణ్ణి కొలిచి నయమయేట్లు చేస్తానని అందుకు తనకు 48 రోజుల సమయం కావాలన్నాడు. అనేకమంది శైవ భక్తులను సంప్రదించి, కొన్ని వేలసార్లు పంచాక్షర జపాన్ని ఆచరించాడు. శివునికి అభిషేకాలు చేశాడు. ప్రతిరోజూ 108 మంది వైదీకులతో త్రికాలార్చనతోపాటు, కావేరీ నీటిని నింపిన బంగారు కలశానికి మహాన్యాస, శతరుద్రీయ, రుద్రాభిషేకాలను జరిపించాడు. శివునితోపాటు గౌరి, గణేశ, సుబ్రహ్మణ్యస్వామిని కూడా పూజించాడు. ప్రసన్నుడైన శివుడు, హరదత్తునికి కలలో కనిపించి "రాజు గతజన్మలో కాళహస్తిలో ఒక కిరాతునిగా జన్మించి, శివరాత్రి నాడు శివుణ్ణి, జ్ఞానప్రసూనాంబను పూజించేవాడనీ, అందువల్ల అతడు ఈ

జన్మలో రాజుగా పుట్టాడనీ, కానీ కిరాతుడైన అతడు ఎన్నో జీవాలను చంపటంవల్ల, అతనికి కుష్టువ్యాధి సోకిందని చెబుతాడు.

కలలో కనిపించిన శివుడు, హరదత్తునితో 'రాజు, శివునికి, దేవికీ, స్కంధునికి, గణేశునికి కలిపి ఎత్తైన ఒక పెద్ద ఆలయాన్ని, చుట్టూ విశాలమైన ప్రాకారం, రెండు గోపురాలతో నిర్మించాలని చెప్పాడు. అంతేకాదు దేవాలయ నిర్మాణానికి ఎలాంటి అవాంతరమూ రాకుండా, కరతలేశ్వర దేవాలయానికి ఉత్తరంగా, తుండిల గణపతికి కూడా ఆలయాన్ని నిర్మించాలన్నాడు. రాజు, రాజగురువు కలిసి నర్మదా నదిలోంచి నిర్మించబోయే గణపతి ఆలయ గర్భాలయమంత పరిమాణంలో ఒక బాణలింగాన్ని స్వీకరించాలి. నర్మదా తీరంలోని ఓంకార కూడలిలోంచి సేకరించాల్సిన లింగం, తరువాత పెద్దగా పెరిగి బృహదీశ్వరుడుగా పిలువబడుతుందని, ఆ లింగాన్ని వర్తకులు బళ్ళలో నిత్య పూజలతో తీసుకు రావాలనీ, ఈ లింగాన్ని తరలించే క్రమంలో ఉన్న కష్టనష్టాలనన్నింటినీ శివుడే భరిస్తాడని, శివుడు హరదత్తునికి చెప్పాడు. బ్రహ్మ, విష్ణు, రుద్ర భాగాలతోనున్న శివలింగాన్ని గర్భాలయంలో ప్రతిష్టించి, కుంభాభిషేకాన్ని చేయాలనీ పంచనద క్షేత్రమైన తిరువైయారులోనున్న ఆది శైవ బ్రాహ్మణులు ఆ లింగాన్ని అర్చించి, అభిషేక, ధూప, దీప, నైవేద్యాలను సమర్పించాలనీ కూడా చెప్పాడు. శివలింగం ముందు పెద్ద నందిని, దీనికి నైరుతిలో వర్షాలు కురవటానికి మరో నందినీ, దక్షిణాన రోగాలు రాకుండా జ్వరహరుని పేర అఘోరమూర్తిని ప్రతిష్టించాలన్నాడు.


హరదత్తునితో శివుడు, ఇంకా ఇలా చెప్పాడు– "శిల్పులు రారాజుగా కీర్తింపబడుతున్న విశ్వకర్మ కులానికి చెందిన కంచీపుర నివాసి సోమవర్మను ఈ ఆలయ స్థపతిగా నియమించాలనీ, అతడే కంచిలోని ఏకామ్రేశ్వరుని గోపురాన్ని నిర్మించాడనీ, చేరరాజుచే సన్మానింపబడినాడని, అతన్ని గౌరవ మర్యాదలతో తంజావూరుకు ఆహ్వానించాలని చెప్పాడు. ఇలా శివుని ఆజ్ఞలను విన్న రాజగురువు హరదత్తుడు, రాజధాని నగరమైన పట్టీశ్వరానికి తిరిగి రాగా, అతన్ని రాచమర్యాదలతో పరివారమంతా స్వాగతించారు. అప్పుడు రాజగురువు రాజుతో, 'శివుడు త్వరలో మీ రోగాన్ని నయం చేస్తా'డని చెప్పాడు. శివుని ఆజ్ఞ ప్రకారం రాజు, తంజావూరులో



ప్రవేశ ద్వారం

శివగంగకు దక్షిణాన, కరతలేశ్వరానికి పశ్చిమంగా, తంజాపురీశ్వరునికి దక్షిణంగా ఆలయాన్ని నిర్మించాలని కూడా చెప్పాడు. కావేరీ, వెన్నారు నదులకు దక్షిణంగా, శమీ వనమనే ప్రదేశంలో స్థలాన్ని ఎంపిక చేసే సందర్భంలో, రాజు, ఆనందవల్లితో కూడిన తంజేశుని, కరతలేశ్వరుని, వశిష్టేశుని, కొంకణేశుని, బృహదీశ్వరుని, తుండిల విఘ్నేశుని, కుమారస్వామిని, నీలమేఘుని, నరసింహుని, మారయమ్మను, దుర్గను, విజయాను, ఏకవీరాను రేణుకాను, కాళికాను, మహిషాసురమర్ధినిని కోటిక్కరై దగ్గర పూజించాలని హరదత్తుడు చెప్పాడు. రాజగురువు ఆజ్ఞలను విన్న రాజు, శిల్పికోసం కంచీపురానికి కబురు పంపాడు. గుడి కట్టటానికి అవసరమైన ధనాన్ని సిద్ధం చేయమని మంత్రులను ఆదేశించాడు. మంత్రులు స్వయంగా కంచీపురం వెళ్ళి శిల్పిని తీసుకొచ్చారు. రాజు, తుండిల గణపతిని పూజించి, ఇకముందు ప్రతి సంవత్సరం భాద్రమాసంలో తంజావూరు రాజులందరూ, పూజలు చేస్తారనీ, కట్టబోయే గుడికి ఎలాంటి ఆటంకాలూ కలగకుండా చూడాలని వేడుకొన్నాడు.

రాజు, ప్రధాన శిల్పి సోమవర్మకు నమస్కరించి, శివుని కృపవల్ల ఈ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాననీ, శిల్ప శాస్త్రానుసారం ఈ ఆలయ నిర్మాణ బాధ్యతలు చేపట్టాలని వేడుకొన్నాడు. అందుకు ఎంతైనా పారితోషికాన్నిస్తానన్నాడు. అవసరమైతే ఈ పవిత్ర కార్యక్రమంలో తన ప్రాణాలు అర్పించటానికి కూడా సిద్ధమన్న తన దృఢసంకల్పాన్ని సాకారం చేయమని శిల్పిని ప్రాధేయపడినాడు. రాజు కోరికను తీరుస్తానన్న స్థపతి సోమవర్మ, కార్యక్రమానికి ప్రారంభ



సూచకంగా తమ కులదైవమైన కాళికాదేవికి ఆలయాన్ని నిర్మించాడు. ఆ సందర్భంగా, బృహదీశ్వరాలయ ఉత్సవాలకంటే ముందుగా శిల్ప కుటుంబాలన్నీ కాళికాదేవికీ ఉత్సవాలు జరిపేట్లు ప్రతిజ్ఞ చేశాడు. కాళికాదేవి ప్రత్యక్షమై, బృహదీశ్వరాలయ నిర్మాణం పూర్తయేంత వరకూ తాను శిల్పులకు ఎలాంటి ప్రమాదమూ జరగకుండా, శిల్పుల కుటుంబాలను కాపాడుతుంటానని చెప్పింది. స్థపతి, శిల్పులను ఎంపిక చేసుకుని, నిర్మాణానికి కావలసిన రాళ్ళను సేకరించే పనిలో మునిగిపోయాడు. అందుకు అవసరమైన పెద్ద చిన్న బళ్ళను, లాగటానికి దున్నపోతుల్ని సిద్ధం చేశాడు. నిర్మాణ స్థలంలో శిల్పులకు శిబిరాల్ని, శిల్పశాలల్ని ఏర్పాటు చేశాడు. నిర్మాణ స్థలానికి, రాతి గనులకు మధ్య గల మార్గంలో దుకాణాలు, చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. శిల్పులు గనుల నుంచి కావలసిన రాళ్ళను వేరుచేసి, నిర్మాణ స్థలానికి తరలించటానికి సిద్ధం చేశారు. ఇక దేవాలయ నిర్మాణాన్ని ప్రారంభించమని శిల్పులను ఆదేశించిన రాజగురువు, 64 గురు వ్యాపారస్తులతో శివలింగాన్ని తేవటానికి నర్మదాతీరానికి బయలుదేరాడు. అంతకు కొద్దిగా ముందు వ్యాపారస్తులంతా తుండిల గణపతిని మొక్కారు. అప్పటివరకూ తూర్పు ముఖంగానున్న గణపతి, పశ్చిమానికి తిరిగి, 'మీకు ఎలాంటి ఆటంకం ఉండ'దని వ్యాపారస్తులకు చెప్పాడు. 'అంతేకాదు, లింగాన్ని తీసుకొచ్చే బండిని తాను కూడా లాగుతానని వారిని ప్రోత్సహించాడు. రాజు, రాజగురువు, 64 మంది వ్యాపారస్తులు, నర్మదా తీరం నుంచి భక్తిశ్రద్ధలతో, నిష్ఠ, నియమాలతో లింగాన్ని, నిర్మాణ స్థలానికి తీసుకొచ్చారు.

ఈలోగా, ప్రధాన శిల్పి సోమవర్మ, వేలమంది శిల్పుల సాయంతో ఆలయ నిర్మాణానికి కావలసిన వేలకొద్దీ రాళ్ళను నిర్మాణ స్థలానికి చేర్పించాడు. 12 సంవత్సరాలపాటు నిరాటంకంగా ఆలయ వర్గాలను (కట్టడ భాగాలను), కావలసిన శిల్పాలను చెక్కారు. ప్రధానశిల్పి కంచీపురం నుంచి, తంజావూరు వెళ్ళేటప్పటికి సోమవర్మ భార్య గర్భాన్ని ధరించి ఉంది. తరువాత ఆమెకు ఒక బాలుడు జన్మించాడు. ఈ పన్నెండేళ్ళలో అతడు శిల్పశాస్త్రాలను క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. ఒకరోజు ఉన్నట్లుండి తన తండ్రి ఎక్కడున్నాడు అని తల్లిని అడిగాడు. తన తండ్రి చోళరాజు కోరికపై ఆలయాన్ని నిర్మించటానికి తంజావూరు వెళ్ళాడని తెలుసుకొన్న ఆ శిల్పి కొడుకు, తల్లి అనుమతితో 12 రోజులపాటు ప్రయాణించి, తంజావూరు చేరుకున్నాడు. నిర్మాణంలో ఉన్న దేవాలయాన్ని చూచి, అసంతృప్తికి లోనయ్యాడు. తనతో తెచ్చుకున్న కొలబద్దతో ఆలయ అధిష్టానాన్ని (దేవాలయ పీఠాన్ని) కొలిచాడు. పనులను పర్యవేక్షిస్తున్న మంత్రులతో శిల్పికుమారుడు, ఈ అధిష్టానం కొలతలతో ఆలయాన్ని నిర్మిస్తే, గాలి తాకిడికి ఆలయం కూలిపోతుందనీ, ఈ ఆలయ నిర్మాణ స్థపతికి శిల్ప శాస్త్ర పరిజ్ఞానం లేదని చెప్పాడు. ఈ సంగతి విన్న రాజు, ఆ శిల్పి కుమారుణ్ణి సభకు పిలిపించుకొని, జరిగిన పొరపాటును సరిచేయడమెలా అని అడిగాడు. స్థపతి ఆలయం యొక్క శిఖరాన్ని లోపలి కొలతలతో నిర్మించాల్సి ఉండే బదులు అధిష్టానం బయట కొలతలతో నిర్మించాడనీ, రాజుతో చెప్పాడు యువ శిల్పి.

ఆ నోటా ఈ నోటా ఈ సంగతిని విన్న శిల్పులు, జరిగిందంతా ప్రధాన శిల్పికి తెలియజేశారు. కోపంతో రగిలిపోయిన ప్రధానశిల్పి, ఆ యువకుణ్ణి విషం పెట్టి చంపాలనుకొన్నాడు. రాజదర్బారు నుంచి బయటకు రాగానే అతణ్ణి సోమవర్మ ఆహ్వానించాడు. ఆ యువ శిల్పి ఏమాత్రం తడుముకోకుండా రాజధనాన్ని మీరు వృధా చేశారు. మీరిచ్చిన ఆలయ కొలతల్లో దోషం ఉందనీ, ఏ క్షణంలోనైనా ఆలయం పడిపోయే ప్రమాదముందన్నాడు. ఆగ్రహం కట్టలు తెంచుకొన్న సోమవర్మ 'కొలతల్లో నీకు ఒక అంగుళం కూడా తెలియదు. నీవా నన్ను ప్రశ్నించేది' అని గద్దించి, నీ గురువెవ్వర'ని అడిగాడు. ఆ యువకుడు తన కుటుంబ నేపథ్యాన్ని వివరించినపుడు, అతడు తన కొడుకేనని తెలుసుకొని ప్రధాన

శిల్పి ఎంతో సంతోషించాడు. అప్పుడా యువ శిల్పి 'మీరు అధిష్ఠానం బయట కొలతలకు బదులు, లోపలి కొలతలు లెక్కలోనికి తీసుకొని ఉండాల్సింది. కనీసం ఇప్పటి అధిష్ఠానం పట్టిక కొలతల్లో 20 అంగుళాలు తగ్గించినా బాగుండేది' అని చెప్పాడు. 'అలా చేసి ఉన్నట్లైతే, ఆ ఫలాన్ని రాజు స్వీకరించగలిగేవాడు. రాజు శివుని మెప్పు పొంది, కైలాసం చేరుకొనేవాడు' అన్నాడు.

తన కొడుకు శిల్పశాస్త్రంలో అపారమైన జ్ఞానం సంపాదించాడనీ, శిల్పులందర్నీ పిలిచి అతడు చెప్పినట్లే చేయమని ఆజ్ఞాపించాడు. గణితజ్ఞులను కూడా పిలిచి, అతడు చెప్పినట్లే చేయమన్నాడు. అ గణితజ్ఞిలంతా తాళ్ళు, కొలబద్దలు, రంగులు తీసుకొని రాళ్ళపై కొలతలు ప్రకారం గుర్తులు వేయటానికి సిద్ధమవగా, ఆ యువ శిల్పి తానే రాళ్ళపై గుర్తులు వేశాడు. ఆ రాళ్ళను బిగించటానికి పోరీతకికి వెన్న, బెల్లపు రసం ఇంకా ఇతర చెట్ల రసాలను కలిపి, రాయిరాయికీ వెంట్రుకంత సందులలో (కేశ ప్రమాణ పాషాణ సంధి) గారతో నింపాడు. ఇక వేల కొద్దీ శిల్పులు ఒక్కసారిగా ఉలులతో రాళ్ళపై చెక్కుతుంటే వెలువడే శబ్దం, ఉరుముల్ని తలపించింది. తండ్రి చెప్పినట్లుగా అతడు ఆలయంపై అమర్చాల్సిన శిల్పాల్ని చెక్కాడు. వాళ్ళిద్దరూ తండ్రీ, కొడుకులని తెలుసుకున్న రాజు, వారిద్దరికీ తగిన కానుకలిచ్చి సత్కరించాడు.

గుడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 12 ఏళ్ళుగా శిల్పులకు ఆహారాన్ని, తమలపాకుల్ని సరఫరా చేసిన ఒక ముసలావిడ, ఆ శిల్పుల దగ్గరకొచ్చి 'అయ్యా, మా ఇంట్లో ఎప్పణ్ణించో ఒక పెద్ద రాయి ఉంది. దాన్ని ఆలయ నిర్మాణంలో వాడుకుంటే నాకు కూడా శివ సాయుజ్యం దొరుకుతుంద'ని వేడుకుంటుంది. అంగీకరించిన శిల్పులు, ఆ రాయిని చూచి, 'అది నల్లరాయి, దేవాలయ శిఖరానికి శ్రేష్ఠంగా ఉంటుంది' అన్నారు. దేవాలయ నిర్మాణం పూర్తికావచ్చింది. తంజావూరీశ్వరంలో భద్రపరచిన శివలింగాన్ని, కొత్తగా నిర్మించిన దేవాలయానికి చేర్చమని రాజు వ్యాపారస్తులను ఆదేశించాడు. వేదమంత్రోచ్చారన, మేళతాళాలతో ఒక ఊరేగింపుగా శివలింగాన్ని తీసుకొచ్చి, అత్యంత పెద్దదైన గర్భాలయంలో ప్రతిష్ఠించారు. రాజు గుళ్ళోకి వచ్చి, శివలింగాన్ని అష్టబంధనంతో పీఠంపైన బిగించాడు. ప్రతిష్ఠా క్రమాన్ని పర్యవేక్షిస్తున్న ప్రధాన శిల్పి, తనకందిస్తున్న



కుడ్య శిల్పాలు

తాంబూలాలను ఆస్వాదిస్తున్నాడు. తాంబూలంలోని కర్పూరం, యాలకుల సువాసనకు అచ్చెరువందిన శిల్పి, తనకు అంతటి ప్రశస్తమైన తాంబూలాన్ని అందిస్తున్నదెవరానీ వెనుతిరిగి చూశాడు. ఆశ్చర్యం! అతడెవరో కాదు. సాక్షాత్తూ చోళరాజు. పశ్చాత్తాపపడిన శిల్పి, 'తాంబూలాన్ని మీరందిస్తున్నారని తెలియక, స్వీకరించానని, తన తప్పును మన్నించ'మని వేడుకొన్నాడు. 'పాప పరిహారంగా, సుబ్రహ్మణ్యస్వామికి తానొక ఆలయాన్ని నిర్మించి ఇస్తాన'న్నాడు. ఆ మాటలు విన్న యువ శిల్పి, తండ్రి కోరిక మేరకు విల్లి, దేవసేనలతో కూడిన, సుబ్రహ్మణ్యేశ్వరాలయాన్ని నిర్మించాడు.

పెద్దదైన లింగానికి తగినట్లుగా నంది విగ్రహాన్ని చెక్కిన శిల్పి, తన పనితనాన్ని చూడమని రాజును ఆహ్వానించాడు. ఆ సందర్భంగా శిల్పి కొడుకు, రాజు సమక్షంలోనే ఒక ఉలిని తీసుకొని, ఆ నందిపై కొట్టగా, ఉన్నట్టుండి, ఆ నందిలోంచి ఒక కప్ప బయటికొచ్చి నటరాజాలయానికి పడమరగా ఉన్న ఒక బావిలోకి దూకింది. అప్పట్నించీ ఆ బావిని కప్పబావిగా పిలుస్తున్నారు. అఘోరుని ముందు మరో నందిని చెక్కి ప్రతిష్ఠించాడు ప్రధాన శిల్పి. తరువాత, తను చెక్కిన 25 శివమూర్తుల్ని, సోమాస్కంధ మూర్తిని, శిఖరంపైన 8 నందుల్ని, ప్రాకారం పైనగల వరుస నందుల్ని రాజుకు చూపించాడు.

అద్భుతంగా తీర్చిదిద్దిన ఆలయాన్ని చూచిన రాజు, కైలాసం దిగొచ్చి తంజావూరులో ఉందా అన్నంత సంభ్రమాశ్చర్యాలకు గురై, సంతోషించిన రాజు, ప్రధాన శిల్పికి, కనకాభిషేకం చేశాడు. అంతేకాదు, శిల్పినీ, అతని కుమారుణ్ణీ, ఏనుగుపైకి ఎక్కించి, పురవీధుల్లో తిప్పాడు



గుడి చుట్టూ నివాస ప్రదేశాలు

వాళ్ళిద్దరికీ, బట్టలు, ఆభరణాలు, నగదునిచ్చి సత్కరించాడు. అలాగే పాల్గొన్న శిల్పులందరికీ ఉచిత రీతిన కానుకలిచ్చి గౌరవించాడు. శిల్పుల అంకిత భావానికి గుర్తుగా కావేరీనది ఉత్తర ఒడ్డున వారికొక గ్రామాన్ని నిర్మించి, దానికి చోళపురమని పేరుపెట్టి, భూముల్ని, ధనాన్ని పంచిపెట్టాడు. అక్కడొక గుడికి కట్టించి, దానికి కైలాసనాథాలయమని పేరుపెట్టాడు.

రాజు, తన గురువైన హరదత్తుని పిలిపించి, కుంభాభిషేకానికి తగిన ఏర్పాట్లు చేయమన్నాడు. తిరువైయారు నుంచి లక్షమంది శైవ బ్రాహ్మణుల్ని రప్పించి, మకుటాగమం ప్రకారం కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించాడు. అదేరోజు అమ్మవారికి, సుబ్రహ్మణ, గణేశ, సోమాస్కంథ, నంది, చండికేశ్వరులకు కూడా బృహదీశ్వరునితోపాటు కుంభాభిషేకాలను జరిపించాడు. ఆ సందర్భంగా రాజు, 119 బంగారు, వెండి కలశాలను, 10,000 శంఖాలను, నవధాన్యాలు, పంచ పల్లవాలు, 1000 పంచగవ్యాలు, నవరత్నోదకాన్ని నింపిన రాగి కలశాలు, 1,00,000 మట్టిముంతల్లో ఆవుపాలు, 100 ముంతల నెయ్యి, 100 ముంతలు తేనె, 5 మణుగుల పంచదార, 2,00,000 కొబ్బరికాయలు, 5,00,000 అరటిపళ్ళు, పనసపళ్ళు, 2,00,000 మామిడిపళ్ళు, 1000 ముంతలు చెరుకురసం, 1000 ముంతల చందనాన్ని వినియోగించాడు. లింగం పైకి వెయ్యి పడగలున్న బంగారు నాగాభరణం, బంగారు త్రిపుండ్రం, రత్నాలు, పట్టుపీతాంబరాలను సమర్పించాడు. ఆలయ ప్రాంగణంలో 1,00,000 దీపాలను ఏర్పాటుచేసి, నాలుగు వేదాలు చదివిన శైవాచార్యులను, పరిచారకులను, సేవకులను, కొండలను పోలిన ఆహార రాశుల్ని, వాద్యగాళ్లను, నాట్యకారులను, చత్రచామరాలు షోడశోపచారాలను, ఏర్పాటు చేసి 1,00,000 మంది బ్రాహ్మణులకు బట్టలు, కలశాలు, నగలు, తిండిగింజలనిచ్చి సత్కరించాడు. నర్మదా తీరాన్నుంచి శివలింగాన్ని తీసుకొచ్చిన వ్యాపారస్తులను, కుంభాభిషేకంలో పాల్గొన్న శైవాచార్యులను, యజ్ఞయాగాల్లో పాల్గొన్న రుత్వికులను, వేదపారాయణ దారుల్ని, నగదు, నగలు, భూమి, గోవులు, పట్టుపీతాంబరాలతో సత్కరించాడు. తరువాత, రోజూ కలువలు, తామర పూలతో రోజూ 3సార్లు లక్ష బిల్వార్చనతో మండలాభిషేకానికి తగిన ఏర్పాట్లు చేశాడు.

ఆలయంలో నిత్యార్చనలు, ధూప, దీప, నైవేద్య కైంకర్యాల కోసం శూలమంగళంతో కూడిన 10 గ్రామాలను దానంగా ఇస్తున్నట్లు రాగి రేకు శాసనాలను విడుదల చేశాడు. దేవాలయంలో దేవదాసీల్నీ, నాటక కళాకారుల్ని, సేవకుల్ని నియమించాడు. ప్రతిరోజూ చేసే పంచ గవ్యాభిషేకం కోసం, 1000 గోవుల్ని దానం చేశాడు. ప్రదోష, రుతువులు, పున్నమి దినాల్లో ప్రత్యేక పూజలకోసం, రోజువారీ అర్చన, అభిషేకాలతోపాటు చైత్రమాసంలో బ్రహ్మోత్సవానికీ తగిన ఏర్పాట్లు చేశాడు. ఏకాదశి, ద్వాదశి, తీర్థయాత్ర రోజుల్లో రథోత్సవాన్ని, బ్రహ్మోత్సవ సందర్భంగా, ధ్వజారోహణ దినం నుంచి 18 రోజుల పాటు చైత్రోత్సవాన్ని జరిపాడు. ఉత్సవంలో మొదటి మూడు రోజులు, గణేశుడు, తరువాతి మూడురోజులు సుబ్రహ్మణ్యస్వామి, తరువాత వృషవాహన కళ్యాణ సుందరమూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఎనిమిది కాలాల్లో ఎనిమిది పతాకాలను ఎగరవేశారు. గజ, భూతవాహనాలను కూడా రాజు తయారు చేయించాడు. 8 చక్రాల రథాన్ని బృహహదీశ్వరునికి, 4 చక్రాల రథాన్ని బృహన్నాయకికి సిద్ధంచేసి, వాటిని గంటలు, రంగురంగుల పతాకాలతో అలంకరింపచేశాడు. ద్వాదశినాడు శివగంగ పుష్కరిణిలో తీర్థోత్సవాన్ని జరిపించాడు.


ఈ ఏర్పాట్లన్నీ పూర్తి చేసిన రాజుకు, కుష్టువ్యాధి నయమైంది. తరువాత శివలింగంలో స్నానం చేసిన రాజుకు, గంగ ప్రత్యక్షమై, ఒక శివలింగాన్ని చూపించి, అది కాశీ విశ్వేశ్వరాలయమని చెప్పి, ఒడ్డున ప్రతిష్టించింది. పున్నమి, పాడ్యమి దినాల్లో శివగంగలు స్నానం చేసి, కాశీ విశ్వేశ్వరున్ని,


ముఖ మండపం

బృహదీశ్వరున్ని అర్చించిచన వారికి సకల ఐశ్వర్యాలు కలుగుతాయని చెప్పింది. రాజు ఆ సందర్భంగా బృహదీశ్వరాష్టకాన్ని చదివి లింగాన్ని అర్చించాడు. రాజగురువైన హరదత్తుని, తిరువైయారు శైవాచార్యులను సత్కరించి, మడులు, మాణిక్యాలనిచ్చాడు.

దేవాలయాన్ని నిర్మించిన ఆ చోళ రాజు పేరు కరి కాళచోడుడని ఈ పురాణంలో ఉంది. ఆలయ నిర్మాణ బృహత్కార్యక్రమాన్ని పూర్తి చేసిన రాజు, తన రాణితో శయనాగారానికి వెళ్ళాడనీ, కలలో శివుడు కనిపించి, ఒక ముసలామె బహూకరించిన ఛత్రం (గొడుగు)తోనూ, రాజు సమర్పిస్తున్న నైవేద్యంతోనూ తాను చాలా ఆనందంతోనున్నానని చెప్పినట్లుగా పురాణంలో ఉంది. తరువాత తనకొచ్చిన కలను తన గురువుకు చెప్పి, దాని అర్థాన్ని తెలియజేయమన్నాడు. అప్పుడు రాజగురువు ప్రధాన శిల్పి సోమశర్మని, శిల్పులను రప్పించి, 'రాజు ఇచ్చిన ధనంలోనే ఆలయ నిర్మాణం జరిగింది కదా' అని అడిగాడు. అప్పుడు వారు, 'ముసలామె ఇచ్చిన ఒక రాయి తప్ప, మిగతా రాళ్ళన్నీ రాజు ధనంలోనే సేకరించి, ఆలయాన్ని నిర్మించా'మని చెప్పారు. ఆలయ నిర్మాణంలో మరొకరి సొత్తు కలిసినందున, శివునికి అపచారం జరిగిందనీ, ఆ పాపం నుంచి బయటపడటానికి అగ్నిప్రవేశం చేయటానికి నిర్ణయించుకున్నాడు రాజు. చితిని పేర్చారు. దూకటానికి సిద్ధమైనప్పుడు, శివుడు ప్రత్యక్షమై, 'ఆ ముసలామె ఎంతో భక్తిప్రపత్తులతో ఆ రాయిని సమర్పించింది. అందులో తప్పేమీ లేదు. ఆమెను పిలిచి సత్కరించ'మని చెప్పి, అంతర్ధామైననాడు. రాజు వెంటనే ఆవిడ్ని పిలిపించి, లక్ష మాడలిచ్చి సత్కరించాడు. అప్పుడామె, ఈ ధనం తనకు అక్కర్లేదనీ, దీంతో కుంభకోణానికి నైరుతి దిక్కులో ఐరావతేశ్వరాలయాన్ని నిర్మించమని వేడుకోగా, రాజు ఆలయాన్ని నిర్మించాడు. రాజు మరణించిన తరువాత కైలాసానికి చేరుకున్నాడని కరువూరు పురాణం పేర్కొనటంతో 'కథ' ముగుస్తుంది. పురాణంలో ఉన్న విషయాలు, తరువాత జరిగిన సంఘటనలనుబట్టి కరువూరు పురాణం క్రీ.శ. 17వ శతాబ్ది (క్రీ.శ. 1618)లో రాయబడిందని ఆర్. నాగస్వామి లాంటి చరిత్ర పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. కరువూరు పురాణాలన్ని బాగా పరిశీలిస్తే, స్థల మహాత్మ్యంలా ఓ కథను అల్లినట్లుందే తప్ప ఇందులోని సంఘటనలు, ఆలయాన్ని నిర్మించిన రాజు పేరు, కాలం, వివిధ ఆలయాల నిర్మాణంలాంటి విషయాలు చరిత్రకు అందకపోవటమేకాక కొన్ని విషయాలు కేవలం కల్పితంగా తెలుస్తుంది. కథను లోతుగా చూస్తే, చిదంబర దేవాలయ కథను అనుకరించినట్లుగా ఉంది. 63 నాయనార్ల జీవితాలపై చోళదండ నాయకుడు సెక్కిలార్ తన పెరియ పురాణంలో చిదంబర దేవాలయ నిర్మాణంలో ప్రధాన శిల్పి, అతని కుమారుల వృత్తాంతమే కరువూరు పురాణంలో మళ్ళీ చెప్పబడింది. తంజావూరులోని రాజరాజ చోళుని ఒక శాసనంలో ప్రధాన శిల్పికి 'రాజరాజ పెరుందచ్చన్' అన్న బిరుదునిచ్చి సత్కరించినట్లు పేర్కొన్న సంగతిని ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి. కరువూరు ప్రయాణంలో క్వారీ నుంచి శిల్పులు రాళ్ళు తరలించినప్పుడు దున్నపోతుల్ని వాడారని ఉంది. పాండిచ్చేరి దగ్గరున్న త్రిభువనంలోని క్రీ.శ. 12వ శతాబ్దికి చెందిన కులోత్తుంగ చోళుని శాసనంలో రాళ్ళు లాగటానికి దున్నపోతుల్ని వాడినట్లు చెప్పబడింది. కరువూరు పురాణంలో బృహదీశ్వరాలయ నిర్మాణం చేపట్టటానికి ముందే, తుండిల గణపతికి, కాళికాదేవికి ఆలయాలు నిర్మించటం జరిగిందని చెప్పిన విషయంలో నిజం లేదు. ఎందుకంటే, విజయనగర చక్రవర్తి అచ్యుత దేవరాయల పాలనాకాలం (క్రీ.శ. 1532)లో గణేశ ఆలయం నిర్మించబడిందని అక్కడి శాసనం తెలియజేస్తుంది. కాళికాదేవి దేవాలయం విజయనగర రాజుల చివరి కాలంలో నిర్మించబడింది. క్రీ.శ. 16వ శతాబ్దం తరువాత రాయబడిన బృహదీశ్వర మహాత్మ్యంలో ఈ ఆలయాల ప్రస్తావనుండటం గమనించాల్సిన విషయం. ఇప్పటికీ కాళికాదేవి ఆలయంలో శిల్పులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూనే ఉన్నారు. అలానే నర్మదా తీరాన్నుంచి

బాణలింగాన్ని తరలించటానికి 64 వ్యాపారస్తుల్ని రాజు వినియోగించుకున్న విషయం కూడా ఆలోచించదగ్గదే. రాజరాజు వాస్తవంగా వ్యాపారస్తుల్ని వినియోగించలేదు. కాకపోతే, సరుకుల రవాణాలో వ్యాపారస్తులను అనుభవజ్ఞులుగాబట్టి బహుశ పురాణ రచయిత ఈ విషయాన్ని జొప్పించి ఉండవచ్చు. ఇక, దేవాలయ నిర్మాణంలో తన ధనం కాక ఇతరుల ప్రేమయం కూడా ఉందని తెలుసుకున్న రాజు అగ్నిప్రవేశం కావటానికి సిద్ధమైన సంఘటన కూడా అంతకు ముందు జరిగిన అలాంటి సంఘటనల నేపథ్యంలో రాసిందే. పల్లవ రాజైన రాజసింహుడు, కంచిలోని కైలాసనాథాలయ ప్రతిష్ఠ ముహూర్తం నిర్ణయించగా, ఆ సమయానికి శివుడు అక్కడకి రాడనీ, ఎందుకంటే, అదే సమయానికి, తనకు ప్రీతిపాత్రమైన మరో శివభక్తుడు నిర్మించిన ఆలయ ప్రతిష్ఠ కూడా అదే ముహూర్తానికి ఉందన్న ఆకాశవాణి వినిపిస్తుంది. అప్పుడు రాజు, ఆ ఆలయం ఎక్కడుందో తెలుసుకొందామని చేసిన ప్రయత్నంలో, అసలు ఆ భక్తుడు శివుని ఆలయాన్నే నిర్మించలేదనీ, శివభక్తుడైన ఒక బ్రాహ్మణుడు, శివునికి ఆలయం నిర్మించాలనుకున్నా, అతనికివద్ద ధనం లేనందువల్ల అతని మనసునే ఒక ఆలయంగా చేసుకొని శివుణ్ణి ప్రతిష్ఠించాలనుకొన్నాడనీ, అదే ముహూర్తానికీ శివుడు అక్కడికెళ్ళాలి అనుకొన్నాడని ఆకాశవాణి చెప్పిన సంగతిని తెలుసుకొన్న రాజు, అచంచలమైన శివభక్తికి ధనరాశులు సరితూగవనుకొంటాడు.



ఆలయ శిఖరం

అలాగే, ముసలామె కోరికపై రాజు, ఐరావతేశ్వరాలయాన్ని నిర్మించాడని పురాణంలో ఉంది. నిజానికి తంజావూరు సమీపంలోని ఐరావతేశ్వరం, బృహదేశ్వరాలయ నిర్మాణం తరువాత 150 సంవత్సరాలకు నిర్మింపబడినట్లు ఆ దేవాలయ శాసనాలు తెలియజేస్తున్నాయి. కరువూరు పురాణంలోని తంజావూరు బృహదీశ్వరాలయ నిర్మాణ గాథలో ఐదు ప్రధానాంశాలున్నాయి. అవి 1. ఆలయ నిర్మాణం, 2. ప్రతిష్ఠ, 3. ఆలయంలో నిత్యపూజలకు కావలసిన సంభారాల ఏర్పాటు, 4. వార్షికోత్సవ నిర్వహణ, 5. ఆలయ నిర్మాణ ఫలం. ఈ ఐదు అంశాలు, బృహదీశ్వరాలయంలో జరిగిన, జరుగుతున్న కార్యక్రమాల గురించిన వివరాల చుట్టూ ముడిపడి ఉన్నాయి. కుంభాభిషేకం సందర్భంగా కథలో ప్రస్తావించిన దానాల వివరాలు అతిశయోక్తిగా ఉన్నా, ఆ సంప్రదాయం మాత్రం ఇంకా కొనసాగుతున్నట్లు 1997లో బృహదీశ్వరాలయానికి వెయ్యేళ్ళ కుంభాభిషేకం సందర్భంగా జరిగిన తీరు రుజువు చేస్తుంది. ఆలయం కుంభాభిషేకం సందర్భంగా రాజరాజ చోళుడు ఇచ్చిన దానాలన్నీ శాసనాల్లో నిక్షిప్తమై ఉండగా, 800 సంవత్సరాల తర్వాత రాసిన కరువూరు పురాణంలోని కథలో చాలావరకు అతిశయోక్తులు చోటుచేసుకున్నాయి. ఆలయంలోనున్న నటరాజ విగ్రహానికి జరిగే నటరాజోత్సవం గురించి పురాణంలో సమాచారమేమీ లేదు. బృహదీశ్వర మహాత్మ్యం రాసినట్లు అక్కడున్న నటరాజ విగ్రహం భిన్నమైపోగా పూజార్హం కాదని పక్కన పెట్టారు. 19వ శతాబ్దం చివరిలో కామాక్షీ బీబీబాయి అనే భక్తురాలు ఆ విగ్రహానికి మరమ్మత్తులు చేయింటంతో మళ్ళీ పూజలందుకొంటున్న నటరాజ స్వామికి ఉత్సవాలు కూడా పునరుద్ధరించబడినాయి. ఆలయ నిర్మాణం, అర్చనలు, నైవేద్యాలు, ఉత్సవాల విషయంలో కొన్ని సారూప్యతలు, కొన్ని అతిశయోక్తుల మేలుకలయికగానున్న కరువూరు పురాణంలో బృహదీశ్వరాలయ నిర్మాణ విశేషాలు, ప్రధాన శిల్పి, ఆయన కొడుకుకు సంబంధించిన విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. 17 వ శతాబ్దికి చెందిన ఈ పురాణం చారిత్రకంగా కాకపోయినా, సంప్రదాయానుసారం, రాయబడిందని చెప్పొచ్చు.



డా. ఈమని శివనాగి రెడ్డి - స్థపతి
ది కల్చరల్ సెంటర్, విజయవాడ.
ఫోన్ : 984 859 8446.

# ఆనంద శాస్త్రం

## ఆర్థర్ షోపెన్ హావర్

*– ముక్తవరం పార్థసారథి*

జీవితమంతా ఆనందంగా గడపటమెలా? ఈ విషయం గురించే ఇప్పుడు చెప్పదలచుకున్నాను. ఈ ఆనందశాస్త్రాన్ని Endaemonoagy అంటారు. మనం చెయ్యవలసిన పని : చావలేక బతకటం కాదు. ఉన్నంతకాలం తృప్తిగా, ఆనందంగా గడపటం. "చిరకాలం ఈ జీవితం ఇలాగే కొనసాగితే ఎంత బాగుంటుంది" అనుకోగలగాలి...

అయితే, ఇలాంటి ప్రశ్నలు వేసుకున్నప్పుడు, ఇలా బతకటం అసాధ్యమనే సమాధానం వస్తుంది. కాని, సాధ్యమేనంటుంది శాస్త్రం. అందువల్ల నా మాటల్ని యథాతథంగా కాక, సాపేక్షికంగా అర్థంచేసుకోవాలి విజ్ఞులైన పాఠకులు. అసలు, 'Endaemonoagy' అనే మాటే (నిరంతరం దుఃఖంలో గడుపుతున్న మనల్ని ఓదార్చటానికి కనిపెట్టినట్టుంది. ఈ ప్రస్తుత చర్చకు పరిమిత ప్రయోజనం మాత్రమే ఉంది.



ఈ సందర్భంగా, కార్డాన్ సూక్తులు మనకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. తన Rhetoricలో అరిస్టాటిల్ కూడా ఆనందశాస్త్రం గురించి ప్రస్తావించాడు... అయితే, ఇక్కడ అందరి అభిప్రాయాలనూ ఉదహరిస్తూ కూర్చోవడం నా పనికాదు. వాళ్ళ గురించి మాట్లాడుతూ కూర్చుంటే స్వంత అభిప్రాయాలు మరుగున పడిపోతాయి. కాని, ఇలాంటి విషయాల గురించిన చర్చలో, ఎవరేమన్నారన్నదానికన్నా, స్వంత ఆలోచనలకే ఎక్కువ విలువ ఉంటుంది. మహానుభావులందరూ మంచిమాటలే చెప్పారు. మూర్ఖులు కూడా జ్ఞానుల్లాగ ప్రవచిస్తూనే ఉన్నారు. ఇదింతే, ఇలాగే కొనసాగక తప్పదు. "ఈ లోకం మనం పుట్టినప్పుడు ఎంత మూర్ఖంగా, దుర్మార్గంగా ఉందో, మనం వీడ్కోలు తీసుకొంటున్నప్పుడూ అలాగే ఉంటుంది" –వోల్టేర్.

**1**

జీవితానందం మూడు రకాలు అంటాడు అరిస్టాటిల్ : ప్రాపంచిక సౌఖ్యాలు, ఆత్మానందం; శారీరక సౌఖ్యం.

అయితే ఈ విభజనను పట్టించుకోకుండా నేను మరో మూడు రకాల విభజిస్తాను.

1. మనిషంటే ఎవరు? ఆరోగ్యం, వ్యక్తిత్వం, నలుగుర్నీ ఆకర్షించేతనం, స్వభావం కలగలసిన చతురత, విద్య వగైరా కలగలసిన వ్యక్తి అన్నమాట.

2. అతడికున్న అన్ని రకాల ఆస్తిపాస్తులూ.

3. ఇతరులు అతడి గురించి ఏమనుకుంటున్నారు?

ఇందులో మొదటిరకం, ప్రకృతి ప్రసాదించినవి. ఈ విషయంలో మనిషికీ మనిషికీ మధ్య తేడాలుండటం కూడా సహజమే. సుఖదుఃఖాలకు కూడా హేతువులివి. డబ్బుకు సంబంధించని ఈ లక్షణాలతో రాజూ, పేదా అని తేడా లేకుండా ఎవరైనా ఆనందంగా గడపవచ్చు. "ఎట్టి పరిస్థితుల్లోనైనా సంతోషంగా ఉండటం అలవర్చుకోవాలిగాని, దాని కోసం పరిస్థితుల మీద ఆధారపడకూడదు" అన్నాడు (తత్త్వవేత్త ఎపిక్యూరస్ శిష్యుడైన మెట్రోడోరస్). పరిస్థితులను తట్టుకుని ముందుకు సాగటమే నిజమైన వ్యక్తిత్వం. "ఒకే పరిస్థితిలో లేదా ఒకే సమస్యకు ఇద్దరు వ్యక్తులు భిన్నంగా స్పందిస్తారు" అనడంలో అర్థమిదే. అందరం ఒకే లోకంలో బతుకుతున్నా ఎవరి లోకంలో వాళ్ళం బతుకుతాం. అసలు

లోకాన్ని మనం ఎలా చూస్తున్నామన్న దాన్నిబట్టి మన ప్రవర్తన నిర్ణయించబడుతుంది. "ఒక మనిషి జీవితం సుఖంగా గడిచింది" అని విన్నప్పుడు "ఆహా, ఎంత అదృష్టవంతుడు" అని అసూయ చెందుతారుగాని, "అతడు తన జీవితంలోని సమస్యల్ని తనకనుకూలంగా మలచుకోవటంవల్లనే దుఃఖాన్ని జయించి, ఆనందంగా ఉండగలిగాడు" అని గ్రహించరు. అతడి మనోనిబ్బరం, ఆత్మస్థైర్యం గురించి ఒకసారి ఆలోచించండి. గోతె లేదా బైరన్‌ల గీతాలు చదివి వాళ్ళు ఆనంద లోకాలను కవిత్వీకరించారు అనుకుంటాంగాని, నిజానికి వాళ్ళు దుఃఖాన్ని, కష్టాల్ని అధిగమించగలిగిన ధీరపురుషుల మేధోపరిణతిని గురించి గానం చేశారు. కవిత్వంలో ఆనంద లోకాలు దర్శనమిస్తాయి. కాని వెనక దాగిన లోహ కర్కశమైన వాస్తవికతను చూడగలగాలి. ఆ మహాకవులు అద్భుత లోకాలను సృష్టించలేదు. తమ చుట్టూ ఉన్న రౌరవ నరకంలో కూడా ఆనంద ధామాలను నిర్మించుకున్నారు.

లోకాన్ని చూసే పద్ధతి మార్చుకోనంతవరకూ, ప్రతిదానికీ మనం అతిగా స్పందిస్తూనే ఉంటాం. రంగస్థలం మీద ఒకడు రాజుగా, మరొకరు మంత్రిగా, మరొకరు సేవకుడిగా వేషం వేస్తారు. కాని, లోలోపల, ముగ్గురూ తమ నటనను చూసి ప్రేక్షకులు ఏమంటారోనని భ్రమపడుతూనే ఉంటారు. డబ్బూ, హోదా, ఈ లోకంలో ఒక వ్యక్తి పోషించవలసిన పాత్రను నిర్ణయిస్తాయి. కాని అతడు సంతోషంగా ఉండటానికి వీటితో సంబంధం లేదు. బాహిరమైన పరిస్థితులు మానసికానందాన్ని నిర్ణయించలేవు. లోపల నిక్షిప్తమైన ఆనందాన్ని, లోకంలో వెదుక్కోవాలనుకోవటం వ్యర్థ ప్రయాస. చెరసాలలో మగ్గుతూ, దుర్భర పరిస్థితులలో సెర్వాంటెస్, డాన్‌కియోటీ (Don Quixote) అనబడే ఊహాలోకంలో విహరించలేదా? మన భౌతిక పరిస్థితుల్ని ఈ లోకం నిర్ణయిస్తుందనటంలో సందేహం లేదు. కాని మానసికంగా మనలో తేడాలుండక్కర్లేదు. అక్కడ ఎక్కువ తక్కువలుండవు.

బాహిర పరిస్థితులు ఎలా ఉన్నా, మనుషులందరి వ్యక్తిత్వాలూ ఒకటే. అందరూ తమతమ స్వభావాలకు అనుగుణంగానే నడుచుకుంటారు. పెంపుడు జంతువులు ఎక్కడ ఉంటే, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అవి తమ ప్రవర్తనను మార్చుకుంటాయి. మనిషీ అంతే. మారలేనివాడు ఎంత సంపద ఉన్నా, ఎంతమంది మిత్రులున్నా సంతోషంగా ఉండలేడు. మన మానసిక స్థితి మాత్రమే మన సుఖదుఃఖాలను నిర్ణయిస్తుంది. మారిన పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మార్చుకోలేని వాడు ఉన్నత విద్యావంతుడైనా, కుటుంబ జీవితం ఎంత సుఖంగా ఉన్నా సంతోషంగా ఉండలేడు. ఆనందం మానసికం. డబ్బు, హోదా కోరుకుంటాం. కాని అవి సంతోషాన్నివ్వలేవు.

మనం కోరుకోగలిగిన అన్ని హోదాల్లోకీ అతి ముఖ్యమైనది ఆరోగ్యం. రోగాలతో మంచానపడ్డ రాజుకన్న ఆరోగ్యంగా ఉన్న ముష్టివాడైనా ఆనందంగానే ఉంటాడుగద! నవ్వుతూ ఉండగలగటం, చక్కని ఆరోగ్యం, కుశాగ్రబుద్ధి, కల్మషం లేని మనస్తత్వం – ఇంతకన్నా మనిషికి మరేంకావాలి? ఇవి ఉంటే, ఇతరులు ఇవ్వలేనివన్నీ తనదగ్గర ఉన్నట్టేగద. వీటినెవరూ దొంగిలించలేరు. ఒకరు అడుక్కుంటే మరొకరు ఇచ్చేవీ కావివి. ఆత్మానందాన్ని మించిన ఆనందం ఈ లోకంలో ఎక్కడైనా లభిస్తుందా? కుళ్ళుమోతు వ్యక్తులు తమ ఆలోచనలతో తమని తాము హింసించుకుంటారు. తనకై తాను ఆనందంగా ఉండలేని వ్యక్తి ఈ లోకంలోని సుఖాలన్నీ లభించినా, ఆనందంగా ఉండలేడు. ఒకసారి, బజారులో అమ్మకానికి పెట్టిన విలాస వస్తువులను చూసి, "నాకు అక్కర్లేని వస్తువులు ఇన్ని ఉన్నాయా లోకంలో?" అన్నాడట సోక్రటీస్.

మన వ్యక్తిత్వం, మన స్వభావం మనం ఆనందంగా ఉండగలమో లేదో నిర్ణయిస్తుంది. బాహిర పరిస్థితులతో దీనికి సంబంధం లేదు. కాలక్రమంలో ఐశ్వర్యం, హోదా కొందర్ని వరిస్తాయి. కాని వ్యక్తిత్వం, స్వభావం అంటే మనమే. అది ఒకరిస్తే తీసుకునేవి కావు.

పుట్టుకతోనే మనకు కొన్ని లక్షణాలు అలవడుతాయి. వాటికి అనుగుణంగానే మనం లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. ఉదాహరణకు, ఒక మహాబలుడిని కాలూ, చేతులూ కదపనక్కర్లేని పనిచేయమన్నామనుకోండి. లేదా మేధోజీవితం అతడెంచుకొన్నాడనుకొండి. ప్రకృతి అతడికి ప్రసాదించిన శారీరక దారుఢ్యమంతా వృథా అయినట్టేగద. అంతేకాదు. తను చెయ్యగలిగిన పనులు చెయ్యలేనందుకు అతడూ సంతోషంగా ఉండడు. లేదా ఒక గొప్ప మేధావి కాయకష్టం చేసి జీవితం గడపవలసి వచ్చినా, అతడి ప్రతిభ అడవిగాచిన వెన్నెలే అవుతుంది. అయితే, మన లక్షణాలేమిటని నిర్ణయించుకునే విషయంలో తొందరపడకూడదు. యౌవన

ప్రాభవంలోనే మనకు లేని ప్రతిభను మనకు ఆపాదించుకుని ఎండమావులవైపు పరుగెత్తకూడదు.

సంపాదించుకోవడం గురించి తరువాత ఆలోచించవచ్చు గాని మొదట ఉన్న వాటిని పదిలపరచుకుందాం. ఆరోగ్యం, ఆశావహ దృక్పథముంటే, ఆస్తులు కూడబెట్టాలన్న తాపత్రయమేల? అయితే, కనీసావసరాలను కూడా సమకూర్చుకోగూడదని దీనర్థం కాదు. నిజానికి మన అవసరాలకు మించిన సంపద ఒక ప్రతిబంధకం కాదా! దాన్ని కాపాడుకునే క్రమంలో సంతోషం కాదుగదా ఆందోళన పెరుగుతుంది. కోటీశ్వరులు చాలామంది తమకు ఉత్తమ అభిరుచులు లేనందుకు బాధపడతారు తెలుసా? పాపం, వాళ్ళకు మేధోజీవితమే ఉండదు. అవసరానికి మించిన సంపద ఆనందహేతువు కాదనటానికి లోక దృష్టాంతాలున్నాయి. అయినా, అందరూ డబ్బు సంపాదనలోనే గడుపుతున్నారు. వీళ్ళంతా చీమలదండులాగ రాత్రింబవళ్ళు, నిర్విరామంగా రూకలవేటకే తమ జీవితాలు అంకితం చేశారు. బంగారు మాయ జలతారు చేసిన కనికట్టు వీళ్ళను కట్టిపడేసింది. డబ్బు లేకపోతే వీళ్ళకు జీవితం ఒక ఎడారిలా కనిపిస్తుంది. నిజానికి, వీళ్ళలో మానసిక జీవితం శూన్యం. కళలు, సాహిత్యం, శాస్త్రజ్ఞానం ఏదీ ఆ బుర్రలోకెక్కదు. అందువల్లే, వీళ్ళు క్షణికానందాల్ని ఆశ్రయిస్తారు. అయితే, ఈ బంగారు వేటలో కొద్దిమంది మాత్రమే విజయం సాధిస్తారు. అప్పటికే జీవితం చివరి దశకు చేరుకుంటుంది. ఆస్తినంతా పిల్లలపేర రాసి, టపా కట్టేస్తారు. ఎంత సంపాదించినా ఈ మూర్ఖులు కేతిగాడికన్న ఎక్కువ అని ఎలా చెప్పగలం?

మానసిక జీవితాన్ని ఆనందించలేనివాళ్ళకు "టైంపాస్ చెయ్యటం ఎలా?" అన్నదే పెద్ద సమస్యగా మారుతుంది. మరి వీళ్ళు, సహజంగానే, తమలాంటివాళ్ళ సాహచర్యంలో గడుపుతారు. శారీరక ఫలాలు, వ్యసనాలు తప్ప మరో ధ్యాస ఉండదు. సంపన్న యువకులు ఇలాగే ఆస్తుల్ని కరిగించేస్తారు. బుర్ర ఖాళీగా ఉన్న వాడికి ప్రతి క్షణం భారంగా మారుతుంది. తనను తాను మరచిపోవటానికే అతడి ప్రయత్నమంతా అంతర్లోకాలలో ఉన్న దారిద్ర్యాన్ని వారసత్వంగా వచ్చిన డబ్బుమూటలతో తొలగించుకోవాలనుకుంటాడు. కాని, ఎంత ప్రయత్నించినా, లోపల ఖాళీగా ఉన్నవాడికి లోకం కూడా ఖాళీగా కనిపించటం ఖాయం.

## రెండవ అధ్యాయం

**వ్యక్తిత్వం :**

వ్యక్తిత్వమే ఆనందానికి ప్రధాన హేతువు అని మనం ఇప్పటికే చెప్పుకున్నాం. ఇది ఒకరిచ్చేది కాదు. ప్రయత్నపూర్వకంగా సంపాదించుకునేదీ కాదు. ఇష్టపడినా పడకపోయినా, మన అనుభవాలన్నింటినీ ప్రభావితం చేస్తుంది. వ్యక్తిత్వం అంటే అనుభవం తొడుక్కునే చొక్కా. మన ఆనందానికి అర్థం కల్పిస్తుందిది. అంటే, మన వ్యక్తిత్వాలను బట్టే మన సంతోషాన్ని వెదుక్కుంటాం. "చివరిదాకా మన వెన్నంటి ఉండేది మన వ్యక్తిత్వమే. ఆస్తి కాదు" అంటాడు అరిస్టాటిల్. ఆరోగ్యంగా, దృఢచిత్తంతో ఉన్నవాళ్ళు ఎన్ని కష్టాలనైనా సంతోషంగా ఎదుర్కొంటారు. కాని రోగగ్రస్తులమై, మానసికంగా కూడా బలహీనపడినప్పుడు ప్రతి చిన్న అసౌకర్యమూ మనల్ని కుంగదీస్తుంది.

ఆరోగ్యం కేవలం శారీరకమే కాదు. ఆశావాహ దృక్పథం, సరదాగా ఉండగలగటం చాలా ముఖ్యం. ఆనందానికి తగిన బహుమతి ఆనందమే తప్ప మరేమీ కాదు. సంతోషంగా ఉన్నవాడు తన చుట్టూవున్న వాళ్ళను సంతోషంగా ఉంచగలదు. సంతోషంగా వున్నవాడి ముందు మనశ్శాంతి కోల్పోయిన కోటీశ్వరుడేపాటి? ధనికుడా, పేదవాడా, అందగాడా, కురూపా, యువకుడా, వృద్ధుడా అన్నది ముఖ్యం కాదు. సంతోషంగా ఉన్నాడో లేదో చూడండి. లోకంలోని సిరిసంపదలన్నీ కలసినా చిన్న మొత్తం సంతోషానికి సరితూగవు. నా బాల్యంలో ఒక పుస్తకంలో నేనీ వాక్యాలు చదివాను : "ఎప్పుడూ నవ్వుతున్నావంటే నువ్వు సంతోషంగా ఉన్నట్టు; ఎప్పుడూ ఏడుస్తున్నావంటే దుఃఖంలో ఉన్నట్టు". ఇది అందరికీ తెలిసిన అతి సామాన్యమైన విషయమే. కాని ఎంత గొప్ప సత్యం! సంతోషాన్ని మనం ప్రతి క్షణం ఆహ్వానించాలి. ఎందుకు సంతోషంగా ఉన్నామన్నది కాదు. సంతోషంగా ఉండగలగటమే ముఖ్యం. కాని, తరచూ మనం సంతోషానికి కారణాలు తెలుసుకోవాలనుకుంటాం. ఆ ప్రయత్నంలో మనం దానికి తలుపులు మూసేస్తాం. ఆనందం బంగారు నాణెంవంటిది. కారణాలు చెక్కులవంటివి. వాటిని బ్యాంకులో జమచేస్తే తప్ప మనం డబ్బు తీసుకోలేం. తక్షణానందాన్ని తరువాతి ఆనందం కోసం తాకట్టుపెట్టరాదు!

డబ్బు మనకు ఆనందాన్నివ్వలేదని ఇప్పటికి స్పష్టమైంది. నగరాల్లోని ధనికులకన్న పల్లెటూళ్ళల్లోని పేదలు, కార్మికులు, కర్షకులు ఎక్కువ సంతోషంగా గడుపుతారు. కలోగంజో తాగి ఉన్నదాంతో ఎంత తృప్తిగా బతుకుతారు వాళ్ళు! నగరాల్లోని సంపన్నులు ఎప్పుడూ మొహాలు ముటముటలాడిస్తూ కనిపించరూ? ఆరోగ్యంగా లేకపోతే ఆనందంగా ఉండలేమని కూడా మనకు తెలుసు. *అతి సర్వత్ర వర్జయేత్.* తీవ్రమైన ఉద్రేకాలను, ఉద్వేగాలను దరిచేరనివ్వకూడదు. స్వచ్ఛమైన గాలి పీల్చాలి. చన్నీళ్ళలో స్నానం చెయ్యాలి. శారీరక వ్యాయామం అనివార్యం. శరీరమనే యంత్రం సమర్థవంతంగా పనిచేస్తేనేగద ఆరోగ్యం సాధ్యం! "జీవితమంటేనే చలనం" అంటాడు అరిస్టాటిల్. అవును. చలనమే జీవిత సూత్రం. జీవలక్షణం. గుండెకాయ నిరంతరం కొట్టుకుని, రక్తాన్ని అన్ని రంగాలకూ ప్రసరణ చేసినప్పుడే ఈ శరీరం సజీవంగా ఉంటుంది. పేగులు కదులుతూనే ఉంటాయి. మంచం దిగని మహానుభావులు ఊహల్లో ప్రపంచమంతా చుట్టి వస్తారు గాని కాలు కదల్చరు. వేలు విదల్చరు. వృక్షాలు కూడా గాలికి కదులుతాయి. ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటే, సహజంగానే సంతోషంగా ఉంటాం. సంతోషమే, సగం బలం. దురాలోచనలు దుఃఖహేతువు. అంటే, అనారోగ్యానికి దగ్గిర దారి. బాహిర ప్రపంచంలోని వస్తువుల గుణగణాలను గురించి మనం ఇక్కడ ప్రస్తావించటంలేదు. వాటిపట్ల మన దృక్కోణం గురించి మాత్రమే మాట్లాడుతున్నాం. మన ప్రాపంచిక దృష్టి మనకు ఆనందం కలిగించేదిగా ఉండాలి. "బాహిర ప్రపంచంలోని విషయాలు మనుషుల్ని ప్రభావితం చెయ్యవు. వాటి గురించిన వాళ్ళ ఆలోచనలు వాళ్ళను ప్రభావితం చేస్తాయి." అంటాడు ఎపిక్టెటస్. ఇంచుమించు మన ఆనందమంతా ఆరోగ్యం మీదే ఆధారపడి ఉంటుందనటంలో సందేహం లేదు. ఆరోగ్యవంతులకు లోకం అందంగా, ఆనందమయంగా కనిపిస్తుంది. ఆరోగ్యంగా లేకపోతే గొప్ప జీనియస్ కూడా దుఃఖమయమైన జీవితమే గడపక తప్పదు. ఏ ఇద్దరు మిత్రులు తారసపడ్డా మొదట పరస్పర ఆరోగ్యాల గురించి పరామర్శించుకోవటానికిదే కారణం. అంటే, ఎంత గొప్ప ఆనందంకోసమైనా సరే. ఆరోగ్యాన్ని పాడుచేసుకోవటం అత్యంత మూర్ఖమైన పని అని స్పష్టమవుతుంది. కేవలం శారీరక సుఖాల కోసమే కాదు, కీర్తి కోసం కూడా ఆరోగ్యాన్ని పణంగా పెట్టకూడదు.

బాధ, ఏమీ తోచకపోవటం (Boredom) మన అసంతోషానికి ప్రధానమైన కారణాలు. నిజానికి జీవితం ఈ రెంటిమధ్యనే పెండ్యులంలా కొట్టుకుంటుంది. పేదరికం, తీరని కనీసవసరాలవల్ల బాధ పెరుగుతుంది. అన్నీ సమకూరినా, కడుపు నిండినవాడు, గోళ్ళు గిల్లుకుంటూ బోర్‌డంతో గడుపుతాడు. అంటే, పేదలు, నిత్య సంఘర్షణతో బాధతో గడిపితే, సంపన్నులు 'టైంపాస్ చెయ్యటం' ఎలా అంటూ సంధ్యాసమస్యల్తో నిమిషాలు లెక్కిస్తారు. చురుకైన మనసు లేనివాళ్ళు మన్నుదిన్న పాముల్లా గడపక తప్పదు. స్పందించే చైతన్యం వీళ్ళకు తక్కువగా ఉంటుంది. కుశాగ్రబుద్ధి లేనివాళ్ళకు ఆత్మలోకంలో దివాళా. Boredom అంటే ఇదే. 'టైంపాస్' కోసం వాళ్ళు ఎంచుకునే కార్యక్రమాలనుబట్టి వాళ్ళెంత దిగజారిపోయారో తెలిసిపోతుంది. కొందరు ఊసుపోక కబుర్లలో గడుపుతారు. ఆ సంభాషణలకు అర్థంపర్థం ఉండదు. ముఖ్యంగా స్కాండల్స్ వినటం, ప్రచారం చెయ్యటం వాళ్ళకిష్టం. అదే వాళ్ళ వినోదం. స్వంత మేథోజీవితాన్ని అలవర్చుకోవటం తప్ప దీనికి మరో విరుగుడు లేదు. మెదడును శరీరం మీద ఆధారపడి బతుకుతున్న పరాన్నభిక్షుగా పరిగణించవచ్చు. బుద్ధికి పని చెప్పలేనివాళ్ళు 'టైంపాస్' చెయ్యటం ఎలా? అని ఆలోచించటానికి కారణం వాళ్ళ మేధస్సు క్రియాశీలకంగా పనిచెయ్యలేకపోవటమే. బాహిరమైన విషయాలేవైనా వాళ్ళను ములుగర్రలా పొడిస్తే తప్ప వాళ్ళలో చలనం రాదు. అప్పుడుగాని ఆలోచనా దీపం వెలగదు. అర్థవంతమైన మేథోజీవితానికి బదులు పేకాట, జూదం వాళ్ళను ఉత్తేజపరుస్తాయి. ఈ కారణంవల్లనే, ఇంచుమించు అన్ని దేశాలలోనూ ఈ నిష్క్రియాపరుల ఏకైక వినోదం చతుర్ముఖ పారాయణమే. తమ బుర్రలు ఎప్పుడో దివాలా తీశాయి గనక, ఆటలో పక్కవాడి డబ్బు గెలవాలనుకుంటారు. ఇడియట్స్! మూర్ఖులు! అయితే మనం వాళ్ళను అంతగా తీసిపారెయ్యనక్కర్లేదు. పేకాటలో నేర్చుకోవలసింది ఎంతో కొంత లేకపోలేదు. తనకు వచ్చిన పేకముక్కల్తో అర్థవంతంగా ఆడటమెలాగో నేర్చుకొంటారు. గెలిస్తే సరే, లేదా తక్కువ నష్టంతో ఓడిపోవటానికి ప్రయత్నిస్తారు. పేకాటలో నేర్చుకొన్న ఈ ట్రిక్కులన్నీ నిత్యజీవితంలోనూ ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగపడకపోవచ్చు.

అసలు, ఎవరైనా మరొకరి నుండి ఏదైనా ఆశించటమే మూర్ఖం. ఎందుకంటే, చివరి పరీక్షలో అందరూ ఎవరికి

వారే. అందరూ దాహార్తులే అయినప్పుడు, ఎవరికి వారే నీటి చెలమ కూడా కాక తప్పదు. ఆనందంగా ఉండటమంటే ఎవరికి వారు స్వయం పరిపూర్ణంగా ఉండటమే. అయితే, వృద్ధాప్యంలో ఇది సాధ్యం కాదు. జీవనది ఎండిపోతుంది. ప్రేమించినవారు దూరమవుతారు. బంధుమిత్రులు పలకరించటం మానేస్తారు. జీవితం మీద పట్టు సడలుతుంది. మృత్యు నీడ అంతటా పరచుకుంటుంది. అప్పుడే అవసరమవుతుంది ఆత్మస్థైర్యం. సుదీర్ఘమైన ఒంటి ప్రయాణానికి సిద్ధం కావాలి. నీలో నీవే ఆనందాన్ని వెదుక్కోవాలి. ఇక లోకంవైపు చూడటం వృధా. లోకంలో దొరికే ఆనందం కాదది. విధి వంచితుడు కాని మనిషి లేడు. అసలు మానవ జాతిని చూసి జాలిపడాలి. నలుదెసలా వ్యాపించిన ఈ నిబిడాంధకారంలో ఆనందంగా ఉన్న ఒక్క మనిషి దీపావళినాటి ప్రమిదలా వెలుగులు విరజిమ్ముతాడు.

సంతోషం ఒక దీపం అనుకుంటే, ఆ దీపం, వెలుపల కాదు, లోపలే వెలుగుతుంటుందని చెప్పటం నా ఉద్దేశం. కాని సంతోషం నైరూప్యం కాదు. అవి మనం చేసే ఏదో ఒక పనికి సంబంధించినదై మాత్రమే ఉంటుంది. అంటే "మనం అనుకున్న ఇష్టమైన పని చెయ్యగలగటమే నిజమైన ఆనందం" అంటాడు అరిస్టాటిల్. ఏదో ఒక విషయంలో నైపుణ్యం సాధించాలి. పని చెయ్యటమంటే ప్రకృతి కల్పించిన పరిమితుల్ని అధిగమించటం. ఈ సంఘర్షణ లేనప్పుడు మన పనిచెయ్యగలిగిన సామర్థ్యమే మనకు భారంగా పరిణమిస్తుంది. అప్పుడే Boredom ప్రవేశిస్తుంది. ఈ Boredom బాధితుల్లో అత్యధికులు సంపన్నులే. శారీరకంగా బలవంతులే అయివుంటారు. కాని సంఘర్షణ ఉండదు. కోరికలు తీర్చుకోవటం కోసం వ్యసనాలను ఆశ్రయిస్తారు. కాని అక్కడా ఆనందం దొరకదు. అసంతృప్తితోపాటు వ్యసనాలూ పెరుగుతాయి.

సహజంగానే వీళ్ళు మొదట శారీరక సుఖాల కోసం వెంపర్లాడతారు. అంటే భోజనం, మద్యం. ఆ తర్వాత కొందరు క్రీడలతో వినోదించాలనుకొంటారు. కాని, మనం మరొకసారి గుర్తు చేసుకోవాలి, ఆనందం బాహిర ప్రపంచంలో లభించదు. ఆనందంగా ఉండటమంటే మన సంతోష క్షణాలను పొడిగించటం. ఇక్కడే జంతువులకూ, మనిషికీ తేడా ఉంది. జంతువులు కూడా అప్పుడప్పుడూ ఆనందాన్ని అనుభవిస్తాయి. కాని మనిషి దాన్ని ప్రయత్న పూర్వకంగా పొడిగించుకోవాలనుకుంటాడు. అయితే, మేధోపరంగా మాత్రమే ఇది సాధ్యం.

సంచలన విషయాలు మాత్రమే సామాన్యులను ఆకర్షిస్తాయి. అవి కూడా అతడి వ్యక్తిగత ప్రయోజనాలను నెరవేర్చేవిగా ఉండాలి. కాని నిరంతరం ఉద్విగ్న స్థితిలో గడపటం ఎవరికైనా అసాధ్యమే. అందువలననే ప్రపంచమంతటా మర్యాదస్తులు పేకాటను ఆశ్రయిస్తారు. దీనివల్ల బాధా కలగదు, సంతోషమూ కలగదు. ప్రతిసారీ, ఓడినా, గెలిచినా చక్కిలిగింతలు పెట్టినట్లుంటుంది. మొత్తంమీద (మేధోపరమైనది కాని) చవకబారు కాలక్షేపం వీళ్ళకిష్టం. మెదడుకు పనిచెప్పకూడదు.

కాని మేధావి ఎప్పుడూ జ్ఞానమార్గమే ఎంచుకుంటాడు. అతడు సమాచారాన్ని సేకరిస్తాడు. విశ్లేషిస్తాడు. ఆ రకమైన చిక్కుముడులు విప్పటమే అతడికి వినోదం. ఆ స్థాయిలో బాధా, సుఖమూ ఉండదు. అదొక అపూర్వ అనుభూతి.

ఒకసారి ఈ రెండు దృశ్యాలనూ పోల్చిచూడండి. ఒకరు కేవలం రోజువారీ అవసరాలు తీర్చుకోవటమే పరమావధిగా బతుకుతారు. మరొకరు, మేధోలోక విహారం కోరుకుంటారు. ఈ క్రమంలో మేధావులు మరో అవసరం కూడా తీర్చుకోక తప్పదు. అదే నిరంతర పఠనం. చదవాలి. అధ్యయనం చేయాలి. అంతరార్థం తెలుసుకోవాలి. "స్వాభావికమైన అవసరాలు తీరినప్పుడే స్వాభావికమైన ఆనందం లభిస్తుంది.." అంటాడు వోల్టేర్. కళాసాహిత్య లోకాల లోతులు మధించటం కొందరికి మాత్రమే సాధ్యం. ఈ మేధోమథనాన్ని ఎంచుకున్నవాళ్ళు రెండు జీవితాలు బతుకుతారు. ఒకటి అందరిలా వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవటానికీ, మరొకటి ఆలోచనా శిఖరాలు అధిరోహించటానికీ. శారీరక అవసరాలు అతడికీ ఉంటాయి. కాని అవి అతడి మేధోజీవితాన్ని కొనసాగింటానికే పరిమితం. కాని ఇతర్లకు శారీరక అవసరాలు తీరటమే పరమావధి. మేధస్సును పనిచెయ్య తప్పని విశ్రాంతి తుచ్ఛమైనది. ''ఇలాంటి విశ్రాంతి మృత్యువుతో సమానం. వీళ్ళు సజీవ సమాధులలో గడుపుతారు'' అంటాడు సెనెకా. విసుగు రాకుండా ఉండాలంటే ప్రతి క్షణం ఆసక్తికరంగా గడపాలంటే మేధోలోకంలో గడపడం తప్ప మరో మార్గం లేదు. నా తాత్విక కృషి వల్ల నేను పైసా కూడా సంపాదించలేదు. కాని అది నా ఇతర ఖర్చుల్ని తగ్గించింది. ఆస్తి, హోదా, భార్యా, పిల్లలు,

మిత్రులు, వగైరా బాహిర సంబంధాలలో ఆనందం వెతుక్కుంటాడు సామాన్య మానవుడు. ఇక్కడ ఆశాభంగం కలిగినప్పుడు తను ఊహించుకున్న కోరికల సౌధం కూలిపోయిందని ఖిన్నుడవుతాడు. అతడి గరిమనాభి తనలో కాకుండా తన వెలుపల ఉంది మరి. సంపన్నుడైతే ఒక ఇంటికి బదులు మరో ఇల్లు కొనుక్కుంటాడు. రేసుగుర్రాలు సేకరిస్తాడు. కొత్త విషయాల్ని సమకూర్చుకుంటాడు. కాని ఏమి చేసినా బాహిర విషయాలలోనే ఆనందం వెతుక్కుంటాడు. జీవశక్తి కోల్పోయిన వ్యక్తి లేహ్యాలు, స్వర్ణభస్మాలు సేవించి, బలవంతుడు కావాలనుకున్నట్టుగా.

గరిమనాభి తనలోనే ఉన్న మేధావి ఈ లోకంలో అత్యంత అదృష్టవంతుడనటంలో సందేహం లేదు. అతడి ఆనందాన్ని ఏ బాహిర శక్తులూ భగ్నం చేయలేవు. మేధోసంపన్నుడి ముందు కోటీశ్వరుడేపాటి! కనీసావసరాలు తప్ప అతడు మరేమీ ఆశించడు.

"ప్రతిభావంతుడికి దాన్ని ఉపయోగించటంలోనే ఆనందం లభిస్తుంది" అంటాడు గోతె.

ఈ ఆనందానికి విశ్రాంతి అవసరం. కాని, విశ్రాంతి లభించినంతమాత్రం అందరూ మేధోలోకంలో బతకటం సాధ్యమా? అందువలననే జనసామాన్యానికి కొన్ని సూత్రాలు నిర్దేశించారు.

"విశ్రాంతిగా ఉంటే మనసు ఒకచోట ఉండదు. ఏదో ఒక పని ముందేసుకుని చేస్తూపో". ఇతరులకన్నా ఎక్కువ తెలివితేటలుండటం అభిలషణీయం కాదు. ఇలాంటివాళ్ళు ఇతర్లలా పనులు చేసుకోక విశ్రాంతి కోరుకుంటారు. అయితే, ఊహలలో గడపాలనుకునే ఈ మేధావుల గురించి మరోమాట కూడా చెప్పుకోవాలి వీళ్ళు. సున్నిత స్వభావులు. అల్ప సంతోషులు. ప్రతిదానికీ తెగ బాధపడిపోతారు. ఇతరులు అతి సామాన్యమనుకున్న వియాలకు కూడా వీళ్ళు అతి తీవ్రంగా స్పందిస్తారు. కానీ ఈ లోకంలో సంతోషం కలిగించే సందర్భాలకన్నా బాధ కలిగించే సందర్భాలెక్కువని మనకు తెలుసు. పైగా ఈ మేధావులు అందరిలో కలిసినట్టుగా ఉండక, ఏకాకులుగా మిగిలిపోతారు.

ఇక ఈ విషయాల గురించి నేను వ్యాఖ్యానించటం ఆపి, పాఠకులు స్వయంగా ఆలోచించి, ఈ రెండు రకాల వ్యక్తుల గురించీ స్వంతంగా నిర్ణయం చేసుకోవాలని కోరుతున్నాను. ఎందుకంటే సోఫోక్లీస్ ఒకచోట, "జ్ఞానమే ఆనందమంటాడు''. మరొకచోట ''పామరుడే కదా సంతోషంగా ఉండగలడు" అంటాడు. బైబిల్‌లో ఒకచోట "అజ్ఞానం మృత్యువుతో సమానమనీ" మరొకచోట "జ్ఞానం దుఃఖహేతువనీ" చెప్పారు.



ముక్తవరం పార్థసారథి
హైదరాబాద్.
ఫోన్ : 917 761 8708

## షోపెన్ హోవర్ - మంచిమాటలు

- రచయితలందరూ గమనించవలసిన విషయమొకటుంది. రాసినట్లుగా మాట్లాడినా, మాట్లాడినట్లుగా రాసినా అర్థంచేసుకోవటం కష్టం.
- ప్రతి వీడ్కోలూ మృత్యువును తలపిస్తుంది. ప్రతి పునస్సమాగమమూ పునర్జన్మ అంటే ఇదే అనిపిస్తుంది.
- సంపద సమకూర్చుకోవటమంటే ఉప్పునీరు తాగటంలాంటిదే. తాగినకొద్దీ దాహం పెరుగుతుంది.
- డేగలు, ఎవరూ చేరుకోలేనంత ఎత్తులో తమ గూళ్ళు కట్టుకుంటాయి. మహానుభావులూ డేగలలాంటివారే.
- మరణించిన తర్వాత నీకేమవుతుంది? పుట్టుక ముందు ఉన్నదశకే తిరిగి చేరుకుంటాం.
- ప్రతిరోజూ ఒక జీవితకాలమే. మెలకువ రావటమంటే పుట్టుక. ఉదయం నవయవ్వనం. విశ్రాంతీ, నిద్రా మరణమేగదా!
- ఎంతటి బాధకైనా ఓ గంటపాటు పుస్తకం చదివితే ఉపశమనం లభిస్తుంది.
- నైతిక భావనకు మూలం కరుణ.
- రచయితలకు ఉచిత సలహా - మూర్ఖులకోసం రాస్తానంటే, పాఠకులకేమీ కొదవ ఉండదు.
- నవలా రచయిత పని గొప్ప విషయాల గురించి రాయటం కాదు. సాధారణ విషయాలను కూడా ఆసక్తికరంగా చెప్పగలగాలతడు.

## పుణ్యతీర్థములందు నృత్యకళ :

# ఆంధ్రులు - నాట్యకళ

– నటరాజ రామకృష్ణ

శ్రీశైలము : శైవసంప్రదాయము – ఈ స్వామిపై రచింపబడిన అనేక కవుతములను నర్తకులు ఆడుచున్నారు. భామాకలాపములు, గొల్లకలాపములు శ్రీశైల భ్రమరాంబపై రచింపబడిన అంబష్ఠవముతో ప్రారంభింపబడుచున్నవి.

ప్రాచీన కాలమందు ఇచ్చట 'శృంగనాట్యము' సప్తలాస్యములు ప్రదర్శింపబడినట్లు ఆలయ శిల్పమునుబట్టి చెప్పగలము.

శ్రీకాళహస్తి : శైవ సంప్రదాయము.

ఆలయ ఆరాధన సాంప్రదాయములు. కేళిక విద్య అభివృద్ధి జెందినది. ఇచ్చట భాగవత విద్య అంతగ లేదు.

తిరుపతి : వెంకటేశ్వరునిపై తాళ్ళపాకవారు అనేక రచనలు గావించిననూ ఒక ప్రత్యేక నృత్య విధానముండినట్లు ఆధారములు గాన్పించుటలేదు.

మన్నారు పోలూరు : వైష్ణవ సంప్రదాయము.

ఆలయ ఆరాధన విద్య, కేళికానాట్యము దేవదాసీలచే ఆరాధించబడినది.

చెయ్యూరు : శైవ సంప్రదాయము – సుందరేశ్వర స్వామిపై అనేక ప్రత్యేక రచనలున్నవి. సర్వవాద్య ఆరాధన ఇచ్చటి విశేషము. ఇచ్చట న పలాస్య ఆరాధన, కేళిక, యక్షగాన సంప్రదాయము ఈ మూడు పద్ధతులు అభివృద్ధి చెందినవి.

జొన్నవాడ : అంబ ఆలయము. శైవసంప్రదాయము ననుసరించి నాట్యకళా ప్రదర్శనము.

శింగరాయకొండ : వైష్ణవ సంప్రదాయము.

బాపట్ల : భావనారాయణస్వామి – వైష్ణవ సంప్రదాయములు ఇచ్చట సిద్ధాబత్తునివారు శాస్త్రీయ విద్యను ప్రచారముజేసిరి.

మార్కాపురం : వైష్ణవ సంప్రదాయ, ఆరాధన విద్య. కేళిక పద్ధతి.

మాచర్ల : చెన్నకేశ్వర, వీరభద్రస్వాములవారి ఆలయములందు వైష్ణవ, శైవ, సంప్రదాయ నృత్యారాధన. కేళిక పద్ధతి.

ధర్మపురి : వైష్ణవ సంప్రదాయ ఆరాధనకళ, కేళికపద్ధతి.

అల్వాల : వెంకటేశ్వరస్వామి ఆలయము, ఆరాధనకళ – బలిహరణ విద్య – వైష్ణవ సంప్రదాయము – కేళిక, కర్ణాటక ఉత్తరాది సంప్రదాయములు.

శ్రీకాకుళము : ఆంధ్ర విష్ణు ఆలయము. వైష్ణవ పద్ధతి ఆరాధనకళ. కేళిక.

పిఠాపురము : కుంతి మాధవుని ఆలయము – వైష్ణవ పద్ధతి ఆరాధన, కేళిక, భామాకలాపము, గొల్లకలాపములు.

కుక్కుటేశ్వరస్వామి ఆలయము – శైవము.

శ్రీకూర్మము : వైష్ణవ సంప్రదాయము, కేళిక. చైతన్యుల పాదములు ప్రతిష్ఠ జరిగిన ప్రదేశము వంగదేశ భజన సంప్రదాయ నృత్యము.

ఇంకనూ ఎన్నియో పుణ్యతీర్థములున్నవి. శైవ వైష్ణవ సంప్రదాయ విద్యలోని భేదాలు–

బలిహరణ నాట్యములు, కేళిక ఇంచుమించు ఒకే రీతిగానుండును. మూలవిరాట్టు సాన్నిధ్యంలో ప్రదర్శింపబడే ఆరాధన నృత్యములు. సప్తలాస్యములు, కవుతములు, మార్పు ఉండును. ఇవన్నియూ, దేవదాసీలచే చేయబడే నృత్యములు.

నృత్యము వారి ఇంటి విద్య సంస్కృతము. తెనుగు పండితుల వద్ద ప్రత్యేకముగా అభ్యసింతురు.

ఆలయములందు ఆగమశాస్త్ర ప్రకారము వీరు నృత్యకళతో దేవతలనారాధింతురు.

**ఆంధ్రలో జిల్లాలవారిగా కళాభివృద్ధి**

గంజాము–

పాలించు ప్రభువులు ఓఢ్రులు. కాని వారి మంత్రులు తెలుగువారు. గనుకనే గంజామునందలి అనేక జమీందారులిందు తెనుగు సంప్రదాయ నృత్యము అభివృద్ధి చెందినది. ఒడిస్సీ నృత్యము తిలకించిన గానము ఉత్తరదేశ బాణీలో ఉన్నప్పటికీ జతి కట్టుబాట్లు, గతి విన్యాసము అభినయ క్రమము, తెనుగు దేశపు భరత విద్యను పోలి ఉండును.

గంజామందలి ఒక జమీందారు ప్రతాపరుద్ర దేవ వెయ్యిమంది దేవదాసీలను స్వామిసేవ నిమిత్తము ఊరి ఆలయానికి సమర్పించిరి. వారచ్చట నాట్యకళతో స్వామి నారాధించిరి. ఆ కళకు ఆంధ్ర కళకు చాలా దగ్గర పోలికలున్నవి. ఆంధ్రలో ప్రాచీన ఆలయమున్నచోటులందు, సంస్థానములు వెలసిన ప్రదేశములందు నృత్యకళ విరివిగా అభివృద్ధి గాంచినది.

**శ్రీకాకుళము, విశాకపట్నము జిల్లాలు–**

శ్రీకూర్మము, ఆరిసివిల్లి (పుణ్యతీర్థములు), బొబ్బిలి (సంస్థానము), కోమటిపల్లి, విజయనగరము (సంస్థానము), జయపురము (సంస్థానము), మాడుగుల (మత్స్య వంశీయులేలిన ప్రదేశము), చోడవరము, జామి, నిమ్మలవలస, నరసన్నపేట, రాజాము, నరసిపట్నం, దొడ్డిగల్లు. ఈ ప్రదేశాల్లో దేవదాసీ భరతనాట్యము, భాగవతుల భామాకలాపము గొల్లకలాపము, ఎక్కువగా వృద్ధిజెందినది.

ఈ ప్రాంతాల్లో ఉన్నన్ని భామాకలాప, గొల్లకలాప నాట్యమేళములు ఆంధ్రలో మరెచ్చటనూ గాంచము.

ఈ రెండు జిల్లాలలో స్త్రీలు (భాగవత) కలాపములాడుట అరుదు. ఈ కలాపములవారు –

సిద్ధేంద్రులవారి కలాపముగాక, వంకాయలవారి కలాపము, చింతలపాటివారి కలాపము, కసింకోటవారి కలాపములను చేర్చి ఆడుచున్నారు. వీరి భాగవత విద్యకు కూచిపూడి విద్యకు సంబంధము లేదు.

దేవదాసీల విద్యమాత్రము శ్రీ కూర్మము మొదలుకొని తంజావూరు వరకూ ఇంచుమించు ఒకేవిధముగా నభివృద్ధి చెందినది.

**తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలు :**

తుని (జమీందారి), పిఠాపురము (జమీందారి), పెద్దాపురం (జమీందారి ప్రాంతము), కాకినాడ, అమలాపురము, ముమ్మిడివరము, పేరూరు, మానేపల్లి, మండపేట, మురమండ, రాజమండ్రి, ధవళేశ్వరము, పసలపూడి, తాటిపాక, రాజోలు, వాడపల్లి, ద్రాక్షారామము, ఉండి, మారంపల్లి, నరసాపురం, ఆచంట, అంత్రవేది, ఏలూరు. ఈ ప్రదేశాల్లో నాట్యకళ విరివిగా నభివృద్ధి గాంచినది. ఇచ్చట భాగవతములాడే పురుష నర్తకులు తక్కువ. స్త్రీలే కచ్చేరి నాట్యము, కలాపములు నాడుదురు.

ఈ ప్రాంతాలలో నాట్యంజేయు స్త్రీలు రెండు తెగలుగా ఉన్నారు. భోగమువారు, సానులు, భోగమువారు కచేరి నాట్యము, సానులు భాగవతముల నాడుదురు. వీరి ఆటకు కూచిపూడివారి ఆటకు సంబంధము లేదు. వీరిలో సంస్కృతము, తెనుగు భాషల చక్కగానెరిగి శాస్త్ర సంప్రదాయముల తెలిసి నర్తనమాడు నర్తకీమణులనేకులున్నారు.

**కృష్ణా, గుంటూరు జిల్లాలు :**

కూచిపూడి, మొవ్వ నంగిగడ్డ, రేపల్లె, తెనాలి, గుంటూరు, బాపట్ల, గుడివాడ, శ్రీకాకుళము, పొన్నూరు, ఒంగోలు. కూచిపూడి భాగవత మేళములకు ప్రసిద్ధి.

భామాకలాపము, గొల్లకలాపము, వివిధ యక్షగానములు వీధి నాటకము లాడుటలో ఈ నర్తకులు సుప్రసిద్ధులు. ఈ ప్రాంతాల్లో కొందరు దేవదాసీలు గూడ కూచిపూడి సంప్రదాయ భాగవత విద్య నభ్యసించినవారు. అట్టివారు నంగిగడ్డ రేపల్లె ప్రాంతంలో యున్నారు. మొవ్వ క్షేత్రయ్య పుట్టినయూరు.

**నెల్లూరు, చిత్తూరు జిల్లాలు :**

టంగుటూరు, కావలి, సింగరాయకొండ, జొన్నవాడ, నెల్లూరు, కలువాయ, బుచ్చిరెడ్డిపాలెం, వెంకటగిరి, మన్నారు, పోలూరు, నాయుడుపేట, కాళహస్తి, కార్వేటి నగరం, తిరుర్తని, చెయ్యూరు, మధురాంతకం, జంగాలపల్లి మొదలైన ప్రదేశాలలో దేవదాసీల 'కేళికా' విద్య విరివిగా ప్రచారమందున్నది.

కూచిపూడివలె, జంగాలపల్లెయందు విశేషముగా నాట్యమేళములవారున్నారు. కూచిపూడివారు బ్రాహ్మణ భాగవతులు. జంగాలపల్లెవారు జంగం భాగవతులు. వీరుగూడ యక్షగానములు, వీధినాటకముల నాడుదురు. తిరుత్తని, చెయ్యూరు, మధురాంతకం, ప్రస్తుతం తమిళనాడులోనున్నవి.

**దత్త మండలములు :**

కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు :

కోటకొండ, బనగానపల్లె, ప్రొద్దుటూరు, హిందూపురం,

తాళ్ళపాక, పుల్లంపేట, బుక్కాయపాలెం, కోటకొండ భాగవతులు, కూచిపూడి సంప్రదాయమునకు చెందినవారు. వీరిని బనగానపల్లె నవాబుగారు, ఆ ప్రాంతములకు ఆహ్వానించి కోటకొండలో వారికి భూములనిచ్చి నివాసమునేర్పాటు చేసిరి. వీరి ద్వారా భాగవత కళ దత్తమండలములందు ప్రచారము జరిగినది.

దేవదాసీలు కేళికా విద్యనారాధించిరి.

**తెలంగాణ ప్రాంతములో నృత్యకళ :**

ధర్మపురి, పెద్దపల్లి, నాసపూరు, గద్వాల, వనపర్తి, జటప్రోలు, ఆత్మకూరు, హైదరాబాద్‌లందు–

హైదరాబాద్‌లో ముస్లిం ప్రభావముగల కళ అభివృద్ధి చెందినది. మిగిలిన ప్రాంతములలో కేళిక విద్య అభివృద్ధి గాంచినది.

గత నాలుగైదు దశాబ్దములలో ఆంధ్రలో కళనారాధించిన ప్రఖ్యాత కళావేత్తలు–

శ్రీమతులు నాయుడుపేట రాజామణి, చెయ్యూరు శారద, మధురాంతకం రాధ, ఆండాళ్ళు, పుల్లంపేట మహాలక్ష్మి, అన్నమ్మ, నీలవేణి, నాగమణి, శుభరత్నం, సుఖమంజరి.

బ్రహ్మశ్రీ చింతా వేంకట నారాయణ, వేదాంత లక్ష్మీనారాయణ శాస్త్రి, కోటకొండ చల్లా భరత శాస్త్రం లక్ష్మీనారాయణగారు, భాగవతుల విస్సయ్యగారు, ఏలూరు పువ్వుల పాపాచలం, నగరాజతనయ, సామ్రాజ్యం, చాటపర్రు బాలా త్రిపుర సుందరి, చిత్తజల్లు చిన వెంకట రత్నం, పెద్ద వెంకటరత్నం, వైదేహి, ఇందువదన, పేరూరు పారిజాత పుష్పావతి, పెండ్యాల సత్యభామ, కోనేటి చిట్టిరాజు, దువ్వా సూర్యకాంతం, అమ్మణి, అన్నాబత్తుల బుల్లి వెంకటరత్నం, దుగ్గిరాల మాణిక్యం, కొల్లూరి కామయ్య, మద్దెల రాముడు, మద్దెల అప్పలనరసమ్మ, గంధం లక్ష్మీకాంతం, శ్రీ విరాజితం, యండమూరి రామం, యండమూరి అమ్మాణి, మద్దెల బాలా త్రిపురసుందరి, కృష్ణవేణి, నాయుడు సత్యం, అమలాపురం మణ్యం, దూడల శంకరయ్య, కోమటిపల్లి జగన్నాథం, భాస్కరభట్ల, అప్పల నరసింహం, జీవరత్నమ్మ, ఇత్యాదులు.

ఇందు కొందరు భరతనాట్యము నాడువారు, మరికొందరు భాగవత కళనారాధించువారు.

కొందరు కీర్తిశేషులైరి – మరికొందరు జీవించి యున్నారు. పైన జెప్పిన కొందరు సంప్రదాయ భరతవిద్య యందు ప్రావీణ్యులేగాక సంస్కృతాంధ్రములందు మంచి పాండిత్యముగలవారు.

సుమారు ఏబది సంవత్సరముల క్రిందటనే దేశంలో కళాభివృద్ధి ఆగిపోయినది. నాటినుండి నూతన రచనలు జరుగలేదు. రోజురోజుకు శాస్త్రీయ కళలు క్షీణించిపోవు పరిస్థితి ఏర్పడినది. నేటికాలములో శాస్త్రము, సంప్రదాయముల రెంటినీ చక్కగా తెలిసికొని, నూతన కళాసృష్టిని చేయగల సమర్థులైన నాట్యాచార్యులు, కవి పండిత గాయకులు అట్టివారిని ఆదేశించి, పోషించు కళాపోషకులు అరుదైరి. గనుకనే తరతరాలుగా కళనారాధించినవారు అనేకులు నాట్యవృత్తిని వదలివేసిరి. వారితో ఆ అపూర్వ సంప్రదాయములు అదృశ్యమగుచున్నవి. అందువల్లనే ఆంధ్రలోని ప్రాచీన శాస్త్రీయ సంప్రదాయములగూర్చి తెలిసికొనే అవకాశములు సన్నగిల్లుచున్నవి.

శాస్త్రము తెలిసిన వారికి సంప్రదాయము, సంప్రదాయ విద్య తెలిసిన శాస్త్రము తెలియకపోవుటవల్ల అట్టి కళారాధకులవల్ల కళకు చాలా అపకారము జరుగును. దేశములో ఈ పరిస్థితి తొలగిన కళాభివృద్ధి జరుగును. భరతనాట్యములో నృత్తనృత్యాభినయములందుపయోగపడునట్టి సంగీత రచనలు–

నృత్తము : స్వరపల్లవులు, శబ్దపల్లవులు, సాహిత్య పల్లవులు, జతిస్వరములు, తిల్లానలు, గీతప్రబంధములు మొదలైనవి.

నృత్యము : తరంగములు, ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, శబ్దములు, సలాముజతులు, జక్కిణి దరువులు, పదదరువులు, స్వరజతులు, తానవర్ణములు, పదవర్ణములు, పెద్దవర్ణములు, దరువులు, అష్టపదులు, కైవార ప్రబంధములు, శివతాండవ గీతములు మొదలైన రచనలు.

అభినయము : శ్లోకములు (కృష్ణకర్ణామృతము పుష్పబాణ విలాసము, రసమంజరి, మొదలైనవి) – క్షేత్రయ్య, అన్నమాచార్య, పురందరదాసు, సభాపతయ్య, సారంగపాణి, ఘనంసీనయ్య మొదలైనవారి పదములు, జావళీలు, గీతములు మొదలైనవి భరత నాట్యములో అతి ముఖ్యమైన రచనలు :

"పదములు" : అందు త్రిపుట తాళమందున్న రచనలు విశేష ప్రాముఖ్యత వహించును.



హవల్దార్ జగదీష్ చంద్

## ధైర్యసాహసాలకు మారుపేరు

# హవల్దార్ జగదీష్ చంద్

- వెన్నా వల్లభరావు

భారత వైమానిక స్థావరాల్లో పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌కు చాలా ప్రాధాన్యత ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలను అణిచివెయ్యటంలో ఇది ఎంతో కాలంగా కీలకమైన పాత్ర పోషిస్తోంది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు పంజాబ్‌లోని వివిధ ప్రదేశాలపై గడచిన దశాబ్దంన్నర కాలంలో 7 పర్యాయాలు పంజా విసిరాయి. ఇటీవల 2016, జనవరి 2వ తేదీ అర్ధరాత్రి పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై ఉగ్రవాదులు జరిపిన దాడి మన దేశాన్ని తీవ్రంగా కలవరపరచింది. ఏడాదికంటే తక్కువ వ్యవధిలో పంజాబ్‌లో జరిగిన రెండో అతి పెద్ద ఉగ్రవాద ఘటన ఇది. ఈ దాడి జరిగినప్పుడు హవల్దార్ జగదీష్ చంద్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఆ సమయంలో తాను నిరాయుధుడై ఉండి కూడా, ప్రాణాలకు తెగించి ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడిన ధైర్యశాలి, సైనికోత్తముడు, వీరశ్రేష్ఠుడు జగదీష్‌చంద్.

జగదీష్‌చంద్ మిలటరీలో హవల్దార్. సైనికుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వ్యక్తి. అతని తండ్రి భారతీయ సైన్యంలో పనిచేశారు. అన్నగారు బుద్ధిసింగ్ సూబేదారు. అతని సన్నిహిత బంధువుల కూడా సైన్యంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో బాసా అనే గ్రామం జగదీష్‌చంద్ పుట్టి పెరిగిన ఊరు. తాత - ముత్తాతల కాలం నుంచి అదే వారి స్వగ్రామం. జగదీష్ తన 19వ ఏట 1985లో భారతీయ సైన్యంలో జవానుగా చేరాడు. డోగ్రా రెజిమెంట్‌లో 25 సంవత్సరాలు ఎంతో క్రమశిక్షణ, అంకిత భావంతో దేశ సేవ చేశాడు. హవల్దారుగా 2009లో పదీ విరమణ చేశాడు.

సాధారణంగా పదవీ విరమణ చేసిన జవాన్లు, సైనికోద్యోగులు తమ సర్వీసు ఆధారంగా ఏదైనా సివిల్ ఉద్యోగం చేసుకుంటూ హాయిగా కాలక్షేపం చేస్తారు. కానీ జగదీష్‌చందకు మాత్రం అలాంటి జీవితం గడపాలనిపించలేదు. రెండున్నర దశాబ్దాల పాటు దేశానికి చేసిన సేవతో అతను తృప్తి చెందలేదు. కొద్ది నెలలు భార్యాపిల్లలతో స్వగ్రామంలో విశ్రాంత జీవితం గడిపిన పిమ్మట హవల్దార్ జగదీష్‌చంద్ 2010లో డిఫెన్స్ సెక్యూరిటీ కార్ప్స్‌లో చేరాడు. తనకు అవకాశం ఉన్నంత వరకు దేశ సేవ చేస్తూనే బ్రతకాలనేది జగదీష్ ఆశయం. సర్వీసులో మంచి రికార్డ్ కలిగిన మాజీ సైనికుల సేవల్ని వినియోగించుకునే డిఫెన్స్ సెక్యూరిటీ కార్ప్స్ (డి.యస్.సి.) భారత వైమానిక దళ స్థావరాల రక్షణ బాధ్యతలు నిర్వహిస్తుంది. డి.యస్.సి.లో 3 సంవత్సరాలు నాగపూర్‌లోను, 2 సంవత్సరాలు జమ్మూ-కాశ్మీర్‌లోని లేహ్‌లోను పనిచేశాడు.

జగదీష్‌చంద్‌ను 2015 డిసెంబర్‌లో లేహ్ నుండి పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. పఠాన్‌కోట్ వెళ్ళి డ్యూటీలో చేరే ముందు జగదీష్‌చంద్ 10 రోజులు శెలవు తీసుకుని, స్వగ్రామం వెళ్ళి భార్యా-పిల్లలతో ఆనందంగా గడిపాడు. పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై ఉగ్రవాద దాడి జరగటానికి ఒక్క రోజు ముందే, జనవరి 1వ తేదీన ఆ వైమానిక స్థావరంలో బాధ్యతలు చేపట్టాడు.

పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ భారత వైమానిక స్థావరాలన్నిటికీ తలమానికంవంటిది. పాకిస్తాన్ సరిహద్దుకు కేవలం 35 కి.మీ. దూరంలో ఉన్న ఆ వైమానిక స్థావరం భారత్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైనది. అది ఆసియాలోనే చాలా పెద్ద ఎయిర్‌బేస్. సుమారు 2,000 ఎకరాల్లో, 24 కి.మీ. చుట్టుకొలత కలిగిన అత్యంత ఆధునికమైన ఫార్వర్డ్

బేస్ అది. ఆ స్థావరంలో 8 కి.మీ. పైగా పొడవున్న 'రన్‌వే' పై మన యుద్ధవిమానం ఏదైనా ల్యాండ్ కాగలదు, టేకాఫ్ తీసుకోగలదు. ఆ ఎయిర్‌బేస్ నుంచే పాక్ సరిహద్దు వెంబడి ఎయిర్ పెట్రోలింగ్ నిర్వహించబడుతుంది. పాక్ చొరబాటుదార్లను నిలువరించటంలో ఎయిర్ పెట్రోలింగ్‌దే కీలక పాత్ర. ఒకవేళ పాక్ సరిహద్దులో ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే, పఠాన్‌కోట్ వైమానిక స్థావరం నుంచి బయలుదేరిన మెయిన్ బాంబర్ కేవలం ఒక నిమిషంలోనే సరిహద్దు ప్రాంతానికి చేరుకోగలిగింది.

పఠాన్‌కోట్ వైమానిక స్థావరం అత్యంత కీలకమైన సాంకేతిక సామగ్రి ఉంచే ప్రదేశం కూడా. అందులో మిగ్ 21 జెట్ ఫైటర్స్, ఎం.ఐ-35 యుద్ధ హెలికాప్టర్లు, బాంబర్లు, యుద్ధసంబంధమైన ఆధునిక సాంకేతిక పరికరాలు ఉంటాయి. అంతే కాకుండా అదే ప్రాంగణంలో 3,000 క్వార్టర్లలో సైనికుల కుటుంబాలు కూడా నివసిస్తూ ఉంటాయి. భారత వైమానిక దళంలోని కీలకమైన బాధ్యతలు నిర్వహించే అధికారులు ఆ ప్రాంగణంలోనే ఉంటారు.

పఠాన్‌కోట్ వైమానిక స్థావరంలో తీవ్రమైన విధ్వంసం సృష్టించి, రక్షణపరంగా మన దేశాన్ని చావు దెబ్బ తియ్యాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా జరిపిన భయంకరమైన ఉగ్రవాద దాడి ఇది. గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా జరుపుకోవటానికి భారత్‌లో భయోత్పాతాన్ని సృష్టించాలనే కుయుక్తి దీనికి తోడైంది. నూతన సంవత్సరారంభాన్ని ఈ దాడికి ముహూర్తంగా నిర్ణయించింది. ఫలితంగా సుశిక్షితులైన ఆరుగురు గ్రవాదులు చాకచక్యంగా పాక్ సరిహద్దును దాటుకుని, ఎ.కె.47 తుపాకులు, మోర్టార్లు, గ్రెనేడ్ లాంచర్లు మొదలైన అత్యాధునిక ఆయుధాలు; గ్లోబల్ పొజిషన్ సిస్టమ్‌లాంటి సాంకేతిక పరికరాలతో జనవరి 2వ తేదీ రాత్రి పఠాన్‌కోట్ వైమానిక స్థావరంలోకి చొరబడ్డారు. మన మిగ్-21 యుద్ధ విమానాల్ని ధ్వంసం చెయ్యటానికి పెద్ద ఎత్తున ఆర్డియక్స్ కూడా మోసుకొచ్చారు. వాళ్ళు ఆత్మాహుతి దాడులకు సిద్ధపడి వచ్చారు.

ఈ దాడి జరిగినప్పుడు హవల్దార్ జగదీష్‌చంద్ ఉగ్రవాదులతో హోరాహోరీగా పోరాడిన తీరు వింటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. జనవరి 1 వ తేదీన పఠాన్‌కోట్‌లో డ్యూటీకి రిపోర్ట్ చేశాడు హవల్దార్ జగదీష్‌చంద్. 3వ తేదీ తెల్లవారుఝామున ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అల్పాహారం సిద్ధం చేయించే పనిలో నిమగ్నమై ఉన్నాడు. సుమారు 3.30 గం॥ల సమయంలో అకస్మాత్తుగా భోజనశాల బయట తుపాకీ పేలుళ్ళు వినిపించాయి. కిటికీలోంచి తొంగిచూస్తే మసక చీకట్లో మన సైనిక దుస్తుల్లో ఎ.కె. 47లు చేతపట్టుకొని, లైట్లు వెలుగుతున్న మెస్‌వైపు గుళ్ళవర్షం కురిపిస్తున్న వ్యక్తి జగదీష్ కంటపడ్డాడు. అతడు పేలుస్తున్న రైఫిల్లో నుంచి గుళ్ళు మెస్‌వైపు దూసుకు వస్తున్నాయి. 'వైమానిక స్థావరంపై ఉగ్రవాద దాడి జరిగే ప్రమాదం పొంచి ఉంది' అని నిఘావర్గాలు చేసిన హెచ్చరికలు జగదీష్‌కు జ్ఞాపకమొచ్చాయి. అనుమానం లేదు. వాడు తీవ్రవాదేనని గ్రహించాడు. ఆ సమయంలో ఆయనవద్ద ఏ ఆయుధమూ లేదు. దొరికే అవకాశమూ లేదు. ఆయుధం కోసం ఆలోచించే వ్యవధిలో ఆ తీవ్రవాది ఏ వినాశానికైనా ఒడికట్టవచ్చు. ఆ ముష్కరుణ్ణి యుద్ధవిమానాలు, హెలికాప్టర్లు ఉండేవైపు వెళ్ళనిచ్చినా, సైనికుల క్వార్టర్లవైపు పోనిచ్చినా పెనుప్రమాదం తప్పదు. అప్పుడు జగదీష్ చంద్ సాహసమే ఆయుధంగా, దేశభక్తే చోదకశక్తిగా సాయుధుడైన ఆ శత్రువును నిరోధించటానికి పూనుకున్నాడు. నిజానికి వీరుడికి ఆయుధంకంటే గుండె ధైర్యమే ప్రధానం.

క్షణం ఆలస్యం చెయ్యకుండా, జగదీష్ మెస్ వెనకగుండా వెళ్ళి, నిప్పులు కురిపిస్తున్న తీవ్రవాదివైపు చప్పుడు కాకుండా శరవేగంగా దూసుకు వెళ్ళాడు. రెప్పపాటు కాలంలో వెనుకవైపుగా వెళ్ళి, ఆ ముష్కరుణ్ణి ఎంతో చాకచక్యంగా ఒడిసి పట్టుకున్నాడు. అతనితో కలియబడ్డాడు. జగదీష్ చేసిన మెరుపు దాడికి ఆగంతకుడు ఖంగు తిన్నాడు. యువకుడు, సుశిక్షితుడు అయిన ముష్కరుడితో పోరాటమంటే మామూలు సైనికుడికైతే మృత్యువుతో చెలగాటమే. ఇద్దరి మధ్య చాలాసేపు పెనుగులాట జరిగింది. విడిపించుకోవటానికి వాడు శతవిధాలా ప్రయత్నించాడు. కాని, జగదీష్ చంద్ ఉక్కు పిడికిలి నుంచి వాడు తప్పించుకోలేకపోయాడు. వాడు తన చేతిలో ఉన్న ఎ.కె. 47 జగదీష్‌వైపు గురిపెట్టే ప్రయత్నం చేశాడు. వాడికి ఆ అవకాశం ఇవ్వకుండా, తనను తాను రక్షించుకుంటూనే జగదీష్ శత్రువును మట్టుపెట్టే ఎత్తుగడ వేశాడు. చేతికి చిక్కిన శత్రువుని తప్పించుకోనివ్వకుండా, అతనితో పెనుగులాడుతూనే, ఎంతో లాఘవంగా అతని చేతిలోని రైఫిల్ లాక్కుని దానితోనే వాణ్ణి కాల్చిపారేశాడు. మొదటి ఉగ్రవాది వెనుకే వచ్చిన అతని




ఇద్దరు సహచరులు జగదీష్ చంద్ ధైర్యానికి నివ్వెరపోయారు. పెనుగులాట జరుగుతున్నప్పుడు విరోధికి తుపాకి గురిపెడితే, ఆ గుండు తనవాడినే బలితీసుకోవచ్చని, ఏమీ చెయ్యలేక వాళ్ళు అశక్తులై చూస్తూ ఉండిపోయారు. తమ దోస్తు చనిపోయాడని తెలియగానే జగదీష్ పైవాళ్ళు సవాలు విసిరారు. శత్రువుపైనే లక్ష్యం పెట్టిన జగదీష్ అప్పటివరకు వాళ్ళని గమనించలేదు. గమనించాక క్షణం ఊరుకోలేదు. శత్రువు ఒక్కడు కాదు. ఇంకా ఉన్నారని అతనికి అర్థమైంది. వాళ్ళ చేతుల్లో ఏ ఆయుధాలున్నాయి అని ఇక తాను ఆలోచించలేదు. ఆ దుర్మార్గుల అంతు చూడటం కోసం వాళ్ళని వెంబడించాడు. మొదటి తీవ్రవాదితో పోరాడి పోరాడి ఉన్న జగదీష్‌పై వాళ్ళు కసిగా గుళ్ళ వర్షం కురిపించారు. ఆ గుళ్ళు ధీశాలి జగదీష్ చంద్ శరీరాన్ని ఛిద్రం చేశాయి. 'భారత్‌మాతాకీ జై' అనే నినాదం చేస్తూ ఆ మహావీరుడు నేలకొరిగిపోయాడు. వీర మరణం పొందాడు.

పోరాడుతూ మరణించటంకంటే ఏ వీరునికైనా గౌరవం ఇంకేముంటుంది? తాను చనిపోయే ముందు ఒక్క శత్రువునైనా మట్టుపెట్టాలన్న సైనిక స్ఫూర్తిని అమలుపరచి అమరుడయ్యాడు. జీవితంలోని చివరి క్షణం వరకు శత్రువులతో పోరాడుతూనే ఉన్న వీరవరేణ్యుడు జగదీష్ చంద్. భరతమాతకు ఎనలేని కీర్తిని చేకూర్చిపెట్టి తాను వీరస్వర్గాన్ని అలంకరించాడు. జగదీష్ చంద్ వీరులకే ఆదర్శం. ధైర్యసాహసాలకు ప్రతిరూపం. దేశ సేవకు నిలువెత్తు నిదర్శనం.

జగదీష్ చంద్ కనపరిచిన సాహసం, చేసిన సేవ, చూపిన చొరవ అద్వితీయం, అనన్య సామాన్యం. తాను నిరాయుధుడై ఉండి కూడా, ఉగ్రవాదులతో తలపడి వీరోచితంగా పోరాడి, మొదటి చొరబాటుదారుణ్ణి వాడి, తుపాకీతోనే హతమార్చిన ధైర్యశాలి, సైనికోత్తముడు, వీరశ్రేష్ఠుడు. దాడి చేసిన ఆరుగురు ఉగ్రవాదుల్లో మొదటివాణ్ణి మట్టుపెట్టిన జగదీష్ చంద్, మిగతా అయిదుగురిని అంతం చేసే ఆపరేషన్ విజయానికి నాంది పలికాడు.

ఆ తర్వాత అప్రమత్తమైన వైమానిక దళానికి చెందిన గరుడ సిబ్బంది, ఎన్.ఎస్.జి. కమేండోలు, జవాన్లు సమన్వయంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి, దుండగుల్ని స్థావరంలో కీలకమైన ప్రదేశంవైపు వెళ్లనీయకుండా చేసి, పెనుప్రమాదాన్ని తప్పించగలిగారు. అయిదుగురు ఉగ్రవాదుల్ని మట్టుపెట్టే ఆపరేషన్ అయిదు రోజులపాటు కొనసాగింది. ఈ ఆపరేషన్‌లో సుమారు మూడు వందల మంది పాల్గొన్నారు. ముష్కరుల దాడిలో హవల్దార్ జగదీష్ చంద్‌తో సహా ఏడుగురు కమెండోలు వీరమరణం పొందారు. పదిహేడు మంది గాయపడ్డారు. కానీ, ఈ ఆపరేషన్ భారతదేశ శక్తిసామర్థ్యాలను, జవాన్ల దేశభక్తిని, యుద్ధనైపుణ్యాన్ని, కర్తవ్య పరాయణతని లోకానికి చాటిచెప్పింది. 'హవల్దార్ జగదీష్ చంద్ దేశ రక్షణకు సంబంధించిన రక్షణ వ్యవస్థని, ఆస్తిని కాపాడటానికి తన ప్రాణాలకు తెగించి, వీరోచితంగా పోరాడి, వీరస్వర్గాన్ని అలంకరించా'డని సైనికాధికారులు, దేశ నాయకులు వేనోళ్ళ ప్రశంసించారు. జగదీష్ చంద్ వంటి ఆదర్శ వీరుణ్ణి దేశానికి అందించిన అతని గ్రామం, జిల్లా అతనికి కన్నీటి వీడ్కోలు పలికాయి. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రజలు జగదీష్ చంద్ కారణంగా తమ రాష్ట్రమే గౌరవాన్వితమైందని భావించారు.

భారత ప్రభుత్వం 2016, జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమర వీరుడు హవల్దార్ జగదీష్ చంద్‌కు 'కీర్తి చక్ర' బిరుదు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. 2016 మార్చి 22వ తేదీన ఢిల్లీలో రాష్ట్రపతిభవన్‌లో ప్రణబ్‌ముఖర్జీ గారి చేతుల మీదుగా అమర వీరుడు జగదీష్ చంద్ పక్షాన ఆయన భార్య శ్రీమతి స్నేహలత ఆ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.




డా. వెన్నా వల్లభరావు
ఫోన్ : 949 033 7978

# కమనీయ క్షేత్రాల కదంబం; కర్ణాటక దివ్యప్రదేశం

– భాగవతుల హేమలత

గత కొద్ది కాలం క్రితం అదృష్టవశాత్తు పుస్తక ప్రదర్శనలో లభించిన అల్లసాని పెద్దన గారి దివ్య ప్రబంధం 'స్వారోచిషమనుసంభవం' (మను చరిత్ర)లోని పుటలు తిరగ వేస్తున్న నేపథ్యంలో వారు చేసిన ప్రకృతి వర్ణనలు ప్రత్యేకించి హిమ శైలం, ఋతువు మరియు రజనీ సౌందర్యపు వర్ణనలు ఉల్లము ఉప్పొంగే రసానుభూతికి లోను చేయగా, అదే సందర్భంలో నా అజ్ఞాన హృదయంలో పెద్దనగారు ఒకింత అతిశయ వర్ణనలు చేశారేమోనన్న భావమూ జనించకపోలేదు. రాత్రిని స్త్రీగా, నీడలని దూతీకగా, సెలయేటి ప్రవాహం మృదంగ ధ్వనులను పోలగా ఆ ధ్వనికి నెమళ్ళు పరవశించి నాట్యమాడటం, వసంత ఋతువు శత్రువులపై దండెత్తే రాజులా గోచరించటం వాస్తవ దూరాలేమో అని కించిత్తు సందేహించి, ఐనా కావ్యాన్ని రసవత్తరంగా మలచే నిమిత్తం కవులకు ఇది సహజమే కదా అని సమాధానపరచుకున్నాను. నా ఈ మనోగతం పెద్దనగారి ఆత్మను చేరి, వారు తన వర్ణనలోని సత్యాన్ని అవగతపరచి, నా అల్పజ్ఞతను రూపుమాపలనుకున్నారో ఏమో, నాకీ భావం ఉదయించిన పక్షం రోజులైనా గడవక మునుపే, తలవని తలంపుగా, నా జీవిత భాగస్వామి శ్రీ మూర్తి గారి క్షేత్ర పర్యటనా అభిరుచిని పురస్కరించుకుని మే – 26, 2016 న కర్ణాటక ప్రదేశాన్ని చేరుకోవటం సంభవించింది. అచ్చుటి ప్రకృతి సౌజన్యం తిలకించినవారెవరైనా, పెద్దన గారిలాంటి మహాకవుల ప్రకృతి వర్ణనలు నూటికి నూరు శాతం వాస్తవమని గ్రహించక మానరు. ముఖ్యంగా కర్ణాటకలోని బేలూరులాంటి ప్రదేశాల శిల్పకళా సౌందర్యం, కుద్రేముఖ్ అడవుల హరిత కాంతులు, తలకావేరి లాంటి హిమపాత ప్రదేశాల వెండి వెలుగుల సోయగాలూ కాంచిన తరుణంలో నాకు, రమణీయ దృశ్య సందర్శనా సంజనితమైన ఆనందాతిరేక రసజ్ఞ హృదయపు స్పందనలే సాహిత్యంలో వర్ణనలుగా రూపుదిద్దుకుంటాయన్న భావన ఉదయించింది. ఆ ఎల్లలు లేని కన్నడ దేశ ప్రకృతి సొగసులు నాలో కలుగచేసిన సౌందర్యానుభూతికి ఫలితమే నా ఈ కర్ణాటక యాత్రా వృత్తాంతం. 26 ఉదయం 10 గంటలకు బెంగూళూర్ నుంచి ప్రారంభమయ్యి ఎనిమిది రోజుల పాటు సాగిన ఈ యాత్రలో మొదటి మజిలీ కర్ణాటకలోని హసన్ జిల్లాలో నెలకొని వున్న 'హళిబేడు' (బెంగుళూరు నగరానికి 230 కిలోమీటర్ల దూరంలో)లోని హోయసలేశ్వర దేవాలయము. 12 వ శతాబ్దికి చెందిన ఈ దేవాలయము శిల్ప కళా ప్రాభవానికి తలమానికమై భాసిస్తోంది. సువిశాలవైన ప్రాంగణంలోని పచ్చికపై నడుస్తుంటే భూమాతపై పరచిన మెత్తని పచ్చరంగు పట్టు తివాచీపై నడయాడుతున్న అనుభూతి కలుగుతుంది. చారిత్రక ఆధారాల ప్రకారం రాజా విష్ణువర్ధనుడు ఈ మందిరాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. ఆలయంలోని నంది మంటపం, శివపార్వతులు, సజీవత ఉట్టిపడే ఐరావతములు, అశ్వములు, మత్స్యములు, మదనికలతో కూడుకున్న శిల్పాలతో చెక్కిన స్తంభములు, గోడలు చూపరులకు కలంకారీ హస్త కళని జ్ఞప్తికి తెస్తూ, హృదయాన్ని ఆనంద లోకంలో విహరింప చేస్తాయి. ఇంతటి శిల్పకళా సమృద్ధం కావటం చేతనే 14వ శతాబ్దంలో ఉత్తరాదికి చెందిన మహమ్మదీయులు ఈ మందిరాన్ని కొల్లగొట్టినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా జనరల్ మలిక్ కాఫూర్ దేవాలయములోని స్వర్ణము, రజతము (వెండి) మరియు అమూల్యమైన వజ్రాభరణాలను ఒంటెల మీద తమ ఆస్థానానికి తరలించుకున్నట్లు చారిత్రక కథనం. సహజ



మదుర మీనాక్షి గోపురం

సౌందర్య రాశి అయిన ముగ్ధ కాంత ధరించిన ఆభరణాలు తొలగించినంత మాత్రాన ఆమె సోయగానికి ఏ విధంగా కించిత్తు ఐనా భంగం వాటిల్లదో, అదే రీతిగా మందిర సంపదలు దోచుకోబడినప్పటికీ, అందులోని అద్భుత సౌందర్యం మాత్రం దర్శకులను ఆనంద జలధిలో ఓలలాడిస్తుంది. ఇక మా రెండవ మజిలీ హళేబీడుకు 16 కిలోమీటర్ల దూరంలో వున్న బేలూరులోని చెన్నకేశవ ఆలయం. 'యాగాచి' నదీతీరంలో భవ్యమైన ప్రకృతి ఒడిలో దర్పంతో నిలబడినట్లున్న ఈ దేవళం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. హోయసాల రాజు విష్ణువర్ధనుడు తను జైన ధర్మాన్ని వదిలి వైష్ణవ ధర్మాన్ని స్వీకరించినందుకు గుర్తుగా ఈ మందిర నిర్మాణం కావించినట్లు జన వాక్యం. కొన్ని చారిత్రక ఆధారాల దృష్ట్యా తలక్కాడ్ మహాయుద్ధంలో చేల రాజుల పైన హోయసల సాధించిన ఘన విజయానికి గుర్తుగా రాజా విష్ణువర్ధనుడు ఈ మందిర నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, అతని పౌత్రుడు 'వీర భల్లాల' దీనిని పూర్తిచేసినట్లు తెలుస్తుంది. పుష్పాకృతిలో అతి మనోహరంగా ఉన్నతమైన మంటపం (అరుగు)పై నిర్మించబడ్డ ఈ మందిరంలో శంఖ, చక్ర, గదా, పుష్పధారి అయి దర్శనమిచ్చే చెన్నకేశవుడు సార్ధక నామధేయుడు. సజీవమూర్తి మన కన్నుల ముందర నిలబడి వున్నట్లుగా స్వామి ప్రతిమ గోచరిస్తుంది. మందిరంలో చెక్కబడిన శిల్పాల ద్వారా 12వ శతాబ్దికి చెందిన సంపూర్ణ నాగరికత, సంస్కృతులు తేటతెల్లం అవుతాయి. అమర శిల్పి జక్కనాచార్యుడు కొన్ని శిల్పాలను ప్రత్యేకించి కప్పే చెన్నకేశవుని మూర్తిని చెక్కినట్లు జన శృతి. మందిరానికి మూడు ద్వారాల పైన, గోడలపైనా, కప్పుపైన అతి నాజూకుగా చెక్కబడిన ఈ శిల్పాలలోని అవయువ సౌష్టవం నఖశిఖ పర్యంతమూ సుస్పష్టముగా మలచబడినది. దర్పణములో తన చెలువాన్ని చూసుకుని మురిసిపోయే ముగ్ధ కాంత, తన పెంపుడు చిలుకతో తన ప్రియుని గూర్చి ముచ్చటగా ప్రియ సంభాషణ చేస్తున్న రమణి, తన కోమల కరాలలో లేత తమలపాకులు తీసుకుని నిలబడిన పడతి, తన ప్రియునికి ప్రేమలేఖ వ్రాస్తున్న తరుణి, ఒక వంక వీణావాదన చేస్తున్న ముగ్ధ కాంత, మరోవంక వాయులీనాన్ని వాయిస్తున్న జవ్వని, తనను తాను మైమరచి గంధర్వ నృత్యం అభినయిస్తున్న నర్తకి, విభిన్న అస్త్రాలు తీసుకుని యుద్ధానికి సన్నద్ధమైన వీరాంగన, ఇలా నలు దిశలా చెక్కబడిన సజీవ శిల్పాలు ప్రకృతి రూపిణి అయిన స్త్రీలో ఇమిడివున్న సంపూర్ణ రూపాలను ఆవిష్కరిస్తున్నాయి. ఇవేకాక అసంఖ్యాకమైన వివిధ శిల్పాల మధ్యన కొలువైన చెన్నకేశవుని చూస్తుంటే, యావత్ సృష్టిలో ఇమిడివున్న సారమంతా ఈ ప్రాంగణంలోనే వున్నది అర్థం చేసుకోండి అని మనకు సూచిస్తున్నట్టు గోచరిస్తాడు. ఈ సొగసుల శిల్పాలను తన్మయత్వంతో పరికిస్తున్నంతలో ఒక సందర్శనాబృందం యొక్క సంభాషణ మమ్మల్ని ఈ లోకంలోకి తీసుకువచ్చి వినోదాన్ని కలుగచేసింది. వారు తమలో తాము చెన్నకేశవ అనగా అర్థం ఏమై వుంటుంది అని ఒకరినొకరు ప్రశ్నించుకుని, 'చన్న' అనగా మద్రాసు నగరమని, 'కేశవ' అనగా విష్ణువు అని నిర్ణయానికి వచ్చి, చెన్నకేశవుడనగా మద్రాసు విష్ణువు అని సమాధానపరచుకున్నారు. నిజానికి 'చన్నుడు' అనగా అందమైనవాడు అని అర్థం.


కేశవుడు సుందరాకారుడుగా విరజిల్లటంచేత చెన్నకేశవుడుగా పిలువబడుతున్నాడు. ఐతే ఆ బృందానికి ఈ విషయం వివరించాలని అనిపించినా, వారు నాకు క్రొత్తవారు కావటంతో మనసుని నిరోధించుకున్నాను. సౌందర్యానుభూతితోపాటుగా ఈ రూపేణా కొంత వినోదము కూడా తోడు తీసుకుని తర్వాతి మజిలీకి తిరుగు ప్రయాణమయ్యాము. తర్వాత మేము దర్శించ తల్చుకున్న ప్రదేశం హోర్నాడు అన్నపూర్ణేశ్వరి దివ్యక్షేత్రం. అతి నయనానంద కరమైన పచ్చటి అడవుల మీదుగా ఈ ప్రయాణం సాగుతున్నంతలో అనూహ్యంగా చిన్న అపశృతి చోటుచేసుకుంది. ఎదురుగా వస్తున్న వాహన చాలకుడు మధువుని సేవించి, అనియంత్రిత వేగంతో వాహనాన్ని నడపటంచేత అతని



పద్దెనిమిది అంతస్తుల గాలి గోపురం
(మహాబలేశ్వరాలయం)

వాహనం వరుసగా రెండు వాహనాలను ఢీకొన్నది. అదృష్టవశాత్తు ఏ ప్రమాదం సంభవించలేదు. ఐతే ఒక ఐదు నిమషాలపాటు ఒక వింత అనుభవం. ఆ క్షణంలో మరేదీ స్మృతిపథంలోకి రాలేదు, వేగంగా ఎదురుగా వున్న సీట్‌కి ముఖం గుద్దుకోవటంతో, ఏదో జరిగిందని గమనించటానికి కొన్ని నిమషాలు పట్టింది. ఈ సంఘటన జరిగిన ప్రదేశం అటవీ ప్రాంతం కావటంతో బొత్తిగా జనసంచారం కూడా కనుచూపుమేరలో కానరాలేదు. యాత్ర ఎట్టి స్థితిలోనూ సుసంపన్నం చేసుకోవాలన్న సంకల్పం గుండె నిండుగా వుండటంతో అతి కష్టం మీద మరొక వాహనం మాట్లాడుకుని గమ్య స్థానానికై పయనమయ్యాము. 'మఢిగెరే' మీదుగా ముందుకు సాగుతుంటే అలసిన మా శరీరాలను అక్కున చేర్చుకుని సేద తీర్చటానికై వింజామర వీస్తున్నట్లు సహ్యాద్రి పర్వతాలలోని వనదేవతలు ఊగుతూ వుంటే, ఆ ఊగిసలాటకు, చల్లని మలయమారుతం తనువుని తాకుతూ హాయిని కలిగిస్తుంటే, మరోపక్క మెలికలు తిరిగిన ఆదిశేషుని పోలిన బాటల్లో వాహనం ఒక్కొక్క మలుపూ తిరుగుతుంటే మనసు నిండా ఏదో తెలియని ఉల్లాసం నిండిపోయింది. ఈ రెండు అనుభూతులకూ అనుపానంగా వాహన చాలకుడు షాహిద్ అలీఖాన్ మాటల సందడి కలసి సాయంత్రం జరిగిన ప్రమాద సంఘటన తాలూకు గాభరా, గందరగోళం మనసు నుండి మటుమాయమయ్యి, నూతన ఉత్తేజం చోటు చేసుకుంది.

అలా ముందుకు సాగుతూ, గమ్యస్థానమైన హోర్నాడు చేరుసరికి రాత్రి 11 గంటల సమయం అవగా, అప్పుడు గుర్తుకు వచ్చింది ఆకలి సంగతి, అంత రాత్రివేళ ఆహారం దొరకటం అసాధ్యం అనుకుంటున్న తరుణంలో ఒక స్త్రీ తరగని ఉత్సాహంతో చిరునవ్వులు చిందిస్తూ రొట్టెలు తయారుచేసి సాక్షాత్తు అన్నపూర్ణై యాత్రికుల ఆకలి తీరుస్తోంది. స్థల ప్రభావం అంటే ఇదేనేమో అనిపించింది. మరునాడు ఉదయం వడివడిగా కార్యక్రమాలు ముగించుకుని అమ్మ దర్శనార్థమై మందిరానికి చేరుకున్నాము. స్వర్ణ కవచాలంకృత అయి, శంఖుచక్రాలను ధరించి నగుమోముతో దర్శనమిచ్చే ఆ అమ్మ రూపాన్ని వీక్షిస్తే ఎలాంటివారికైనా అలౌకిక ఆనందం కలిగి తీరవలసినదే. విశేషించి సజీవత ఉట్టిపడే అమ్మవారి నేత్రాలు మాలో అంతర్లీనంగా నిక్షిప్తమైవున్న భక్తిభావ చైతన్యాన్ని మేల్కొల్పి, ఎంత సమయమైనా, ఆమె సమక్షంలోనే వుండాలన్న కాంక్షను కలుగ చేసినప్పటికీ పర్యటనా ప్రణాళికాబద్ధులమై ఆమె నుంచి సెలవు తీసుకుని, ఈ క్షేత్రానికి అతి చేరువలో వున్న కలశలో వేంచేసి వున్న కలశేశ్వరస్వామి, సర్వాంగసుందరి అమ్మవారిని దర్శించుకుని 'శృంగేరి' క్షేత్రానికి పయనమయ్యాము. కర్ణాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమల చెంతన గలగల పారే తుంగానదీ తీరంలో నెలకొని వున్న ఈ శృంగేరి క్షేత్రం రామాయణ కాలానికి పూర్వమే వున్నట్లు పౌరాణిక ఆధారాల ద్వారా తెలుస్తున్నది. త్రేతాయుగానికి చెందిన విభాండక మహర్షికి ఋష్యశృంగ మహర్షి శిశు రూపంలో లభించిన ప్రదేశం ఇదేనని దివ్యదృష్టి కలిగిన ఋషుల అభిమతము. మందిర ఆవరణలోనికి ప్రవేశించిన వెంటనే హృత్ హర్మ్యమైన కళాసంపద కనువిందు చేసింది. *1338 వ సంవత్సరంలో హరిహర రాయులు, బుక్కరాయులు కలసి తమ గురువుగారైన శ్రీ విద్యాశంకర తీర్థ స్వామి వారికి ఈ మందిరాన్ని గురు సమర్పణగా నిర్మించినారట. ఆలయంలో అడుగడుగునా ఇమిడివున్న సునిశితమైన కళాఖండాలు విజయనగర రాజుల కళాభిమానాన్ని తేటతెల్లం చేస్తూ, మమ్ములను నిశ్చేష్టులను కావించినాయి.* పంచమహా గణపతులలోని విద్యా గణపతి ఆలయంలో స్వామికి సమర్పించిన గరికను ఆయన యొక్క తోరపుబొజ్జపైన కూర్చుని రెండు మూషికాలు భుజిస్తున్న దృశ్యం ఎంతో ఆహ్లాదకరంగా తోచింది. ఆ మూషిక ద్వయం అల్లరి నుంచి కన్ను మరల్చుకోవటం కష్టమే అయ్యింది. అటుపిమ్మట స్వర్ణ శారదాంబ దర్శనంతో వడలెల్ల పులకించి రోమాలు నిక్కపొడుచుకున్నాయి.



మీనాక్షి ఆలయ గోపురం


సువర్ణకాంతులతో ధగధగలాడుతున్న శారదాదేవి మేనిపై, రజితవర్ణ పట్టువస్త్రానికి ముదురు కుంకుమ వన్నె అంచుతో నేయబడిన పట్టుచీనాంబర శోభలో ఆ దివ్య జననిని దర్శిస్తుంటే వెండి కొండపై భాసిస్తున్న కాంచన కుముదంలా గోచరించింది. మందిరం లోపల నుంచి వినవస్తున్న అర్చకుల వేదోచ్చారణ ఆమె వీణలోనించి జనిస్తున్న శ్రుతి శుభగమైన నాదంలా తోచింది. *సువర్ణమూర్తిగా వెలుగొందే ఈ మాతను 1200 సంవత్సరాల క్రితం శ్రీ ఆది శంకరాచార్యులవారు ఆవాహన చేసి చందనమూర్తిగా ప్రతిష్ఠించినారు.* వారు ఆ కార్యానికి ఈ స్థలాన్ని ఎంచుకోవటానికిగల పరమార్థం సమాచార కేంద్రంలోని వేద విద్వాంసుల ద్వారా అవగతమయ్యింది. ఒకానొక సమయంలో శంకర భాగవత్పాదుల వారు తుంగానదీ తీరంలో సంచరిస్తున్నప్పుడు వారిని ఒక దృశ్యం అబ్బురపరచిందిట, ఒక మండూకం (కప్ప) సూర్య తాపానికి తాళలేక అలమటిస్తుండగా, ఒక సర్పం దానికి తన పడగ విప్పి గొడుగు పట్టి ఉపశమనాన్ని కలిగించిందిట. పరస్పర శత్రువులైన ఆ రెంటి అనుబంధం కాంచిన శంకరాచార్యుల వారికి ఆ స్థల మాహాత్మ్యం బోధపడింది. తత్ఫలితంగా వారు దేశం నలుమూలలోనూ ఏర్పరచదల్చిన ఆమ్నాయ పీఠాలలో దక్షిణామ్నాయ పీఠం ఏర్పరచేందుకు ఈ క్షేత్రాన్ని ఎంచుకుని, యజుర్వేదాన్ని ప్రధాన వేదంగా నిర్ణయించారు.



సూర్యభగవానుడు

తదనంతరం శ్రీచక్ర స్థాపన కావించి, చందన సరస్వతీ దేవిని ఆవాహన చేసి ప్రతిష్ఠించి ఆమెకు శారద అని నామకరణం చేశారట. 11 తరముల పీఠాధిపతుల ద్వారా పూజాలందుకున్న అనంతరం ఆ దేవి స్థానంలో 12 వ జగద్గురువైన శ్రీ విద్యారణ్య స్వామివారు ప్రస్తుత స్వర్ణ శారదాంబను ప్రతిష్ఠించినారు. నాటినుంచీ ఆమె తరతరాలుగా పూజాలందుకుంటూ నేటికీ 35 వ పీఠాధిపతైన భారతీ తీర్థ స్వామివారి ఆరాధనలో ధగధగ్గాయమానంగా దీపిస్తున్నది. వ్యాస వాల్మీకాది తపోధనులకు వాగ్దాయిని అయిన ఆ వేదగర్భని ఎంత చూచినా తనివితీరదు, కానీ ఆమె దర్శన భాగ్యాన్ని వేలాది భక్తులతో కలసి పంచుకోవలసి వుండటంతో ఆమె సన్నిధి నుంచి వైదొలగి, తోరణ గణపతి, మలయాళస్వామి, కోదండరామస్వామి, శ్రీ శంకరాచార్యులు ఇత్యాదిగాగల మందిరాలను దర్శించిన పిమ్మట, అక్కడికి 10 కిలోమీటర్ల దూరంలో వున్న ఋష్యశృంగేశ్వర స్వామి మందిరం గూర్చి పండితుల ద్వారా తెలియవచ్చినది. ఋష్యశృంగ మహాముని ప్రాపంచిక విషయాలపై విముఖత చెంది, తన శేష జీవితమంతా ఈ క్షేత్రంలోని పరమేశ్వరుని సేవించి వారిలోనే లీనమైపోయారు. తత్ఫలితంగానే ఆ ఈశ్వరుని లింగంపై శృంగం నేటికీ దర్శనమిస్తుంది. నాటినుంచీ వారు ఋష్యశృంగేశ్వర స్వామిగా భక్తజనుల పూజలు గైకొంటున్నారు. ప్రస్తుత పీఠాధిపతి అయిన భారతీ తీర్థ స్వామి వారిచే నిత్యాభిషేకం చేయించుకుంటున్న చంద్రమౌళేశ్వర స్వామి స్ఫటిక లింగం 1200 సంవత్సరాల క్రితం శంకర భాగవత్పాదులవారికి సాక్షాత్తు ఈశ్వర ప్రదత్తంగా లభించినదని ప్రతీతి. ఈ ప్రదేశంలో సంచరిస్తున్నంతసేపూ, శంకర భాగవత్పాదులు నడయాడిన దివ్య భూమిలో అడుగిడే భాగ్యం ఏనాటి సుకృతమోనని తనువులోని రోమ రోమం పరవశమందింది. ఆ ఆనందనుభూతిని వెంట తీసుకుని, మూగాంబికను దర్శించటానికి కొల్లూరుకి పయనమయ్యాము. కుజటాద్రి పర్వత శ్రేణుల నడుమన సుస్నిగ్ధ ప్రకృతి ప్రాంగణంలో చింతామణి గృహమనిపించే దేవళంలో సుకోమలాకృతిలో కొలువైయున్నది మూగాంబికాదేవి. ఆ క్షణంవరకూ ఆమె నామాన్ని వినటమేకానీ, ఎన్నడూ కనలేదు. ప్రశాంత వదనంతో శంఖుచక్రాలను ధరించి, అభయ ముద్రను చూపుతూ పద్మాసనాసీన ఐన ఈ దేవి మూగాసురుడ్ని సంహరించి మూగాంబికగా భక్త జనోద్ధరణ కావిస్తోంది. స్థల పురాణాన్ని అనుసరించి 'కోల మహాముని' ఈ క్షేత్రంలో తపమాచరించి త్రిమూర్తులను ప్రత్యక్షం కావించుకున్నారు. ఆ ముని కోరికమేరకు త్రిమూర్తులు ఆ క్షేత్రంలో నివసిస్తామనీ, అనతి కాలంలోనే ఆదిపరాశక్తి కూడా ఇక్కడ కొలువై వుండగలదని వరమొసగారు. అనంతర కాలంలో కంహాసురుడనే లోక కంటకుడైన రాక్షసుడు చిరంజీవిత్వాన్ని పొందే అసమంజస కాంక్షతో ఈ ప్రదేశంలోనే శంకరుని గూర్చి కఠోర తపస్సు

ఆచరించాడు. శంకరుడు అతనికి ఆవరమొసగినట్లైతే, జగత్తుకు ఉపద్రవం వాటిల్లుతుంది. ఈ సత్యాన్ని ఎరిగిన పర శక్తి మునుల, దేవతల అభ్యర్థనమేరకు లోకరక్షణార్థమై, ఆ దానవుడు పరమ శివుని వరమడిగే సమయాకి అతనిలోని వాక్‌శక్తిని హరించి మూగవానిగా చేస్తుంది. తత్ కారణంగానే కంహాసురునికి 'మూగాసురుడన్న' నామమేర్పడింది. మూగవాడైనప్పటికీ అతని అకృత్యాలకు అంతులేకపోవటంతో ఆది శక్తి అతనిని సంహరించి లోకాన్నికాపాడి మూగాంబికగా పిలువబడింది. అనంతర కాలంలో సహితం ఉగ్రరూపిణిగానే ఆమె ఆక్షేత్రాన్ని రక్షిస్తూ ఒకానొక సమయంలో శంకర భాగవత్పాదుల వారికి సౌమ్య రూపంతో దర్శనమిచ్చింది. ఆ సౌమ్యమూర్తినే శంకర భాగవత్పాదులు ఆ క్షేత్రంలోని స్వర్ణ రేఖాలింగం దగ్గర ప్రతిష్టించారు. 'శ్రీమద్వాగ్భవకూటైక' అన్న లలితా సహస్ర నామ స్తోత్రంలోని పరాశక్తి నామానికి అర్థం ఈ దేవిని దర్శించిన పిదప అవగతమయ్యింది. ఆమె అనుగ్రహ దృష్టికి సాధ్యాసాధ్యాలు వుండవు. వాగ్భవ కూటమిలో శక్తి రూపంలో నివసించే ఆ దేవి కృప సన్నగిల్లితే ఎంతటి శక్తిశాలికైనా మాటసహితం పెగలదని ఈ స్థలపురాణం బోధపరుస్తోంది.



శివుని సేవలో

అప్పటి వరకూ, నదులూ, కొండలూ, అడవుల మధ్య సాగిన మా ప్రయాణం సముద్రాన్ని చేరుకునే తరుణం రానే వచ్చింది. తత్ కారణంగా మా వాహనం గోకర్ణ క్షేత్రంవైపుకు సాగిపోయింది. గోకర్ణ క్షేత్రంలో కాంశ్య గౌరీదేవి సమేతంగా కొలువైయున్న పరమేశ్వరుడు భూలింగంగా వెలుగొందుతూ నిరంతర అభిషేకాలతో, ఎడతెరిపి లేని భక్తజన సందోహంతో వారి కష్టాలను తీర్చి అభీష్టాలను నెరవేర్చే పనిలో తీరిక లేకుండా తలమునకలై వున్నారు. ఐనప్పటికీ, కొద్దిగా సందు చేసుకుని మేము కూడా ఆయనని దర్శించి, స్పృశించి అభిష్టాన్ని ఆయనకు నివేదించి, అదే క్షేత్రానికి సమీపంలో వేంచేసి ఉన్న మహాబలేశ్వరుడ్ని దర్శించటానికి మురుడేశ్వర క్షేత్రం చేరుకున్నాము. అప్పటివరకూ దర్శించిన క్షేత్రాలకు భిన్నంగా వున్నది ఈ క్షేత్రం. శీతలమైన వాతావరణం, మందిరానికి ప్రహరీ గోడలవలే నిల్చున్న పర్వతరాజాలు, నిరంతరం అలల వేగంతో ఎగసి పడుతున్న అరేబియా మహాసముద్రం నుంచి వెలువడుతున్న ధ్వనులు ముక్కంటి త్రిశూలంలో అమరిన ధమరుక నాదంలా చెవులను తాకుతుంటే, ఆ వాతావరణంతో కలిగిన తాదాత్మ్యత అందరకూ అనుభవైక యోగ్యం అనుపించింది. వాస్తవానికి ఈ మందిరాన్ని లోకానికి అందించిన ఘనత రావణాసురునిదే అని పౌరాణిక కథనం. రావణాసురుని తల్లి కైకసి ఈ సముద్ర తీరంలో శివుని సైకత లింగాన్ని తయారు చేసుకుని అనునిత్యం పూజించేదిట. ఒకనాడు అలల తాకిడికి లింగం చెదిరిపోయి సముద్రంలో కలసిపోగా, కైకసి తీవ్రంగా రోదించిందిట. ఆమె దుఃఖాన్ని చూడలేని రావణబ్రహ్మ శివుని గూర్చి కఠోర తపమాచరించి తన తల్లి పూజకై శివుని ఆత్మ లింగాన్ని వరంగా పొందుతాడు. గణపతి గోవుల కాపరి వేషం ధరించి లోక కళ్యాణం నిమిత్తం ఆ పరమ పావనమైన లింగాన్ని అరేబియా సముద్ర తీరంలో స్థాపింపించినట్లు పురాణ కథనం. అసమాన భుజబలశాలి ఐన దశకంతుడు ఎంత ప్రయత్నించినా ఆ లింగాన్ని పెకలించలేక పోవటంతో ఆ స్వామి మహాబలేశ్వరునిగా ఆ క్షేత్రంలో స్థిరపడి నేటికీ భక్త జనుల పాలిట కల్పవృక్షమై ముక్తి ప్రదాత అయి వెలుగొందుతున్నాడు. స్వామి మందిర ప్రవేశ గోపుర ద్వారం 18 అంతస్తులతో నిర్మితమయినది. లిఫ్ట్ సహాయము తోగోపురములోని చివరి అంతస్తుని చేరుకుని అక్కడ నుంచి సుందరమైన మందిర పరిసరాలను వీక్షించటం స్మరణీయ అనుభవం. దేవాలయం లోపల స్వామివారితోపాటు వేంచేసివున్న పార్వతీ మాత, ఆంజనేయ స్వామివారు, దత్తాత్రేయ స్వామివార్ల సన్నిధుల మధ్య నుంచి అంబరాన్నంటుతూ కొండపై కొలువై వున్న పరమ శివుని దర్శిస్తూ, అర్చక సమూహం చేస్తున్న ధమరు ధ్వానాలు వింటుంటే ఆ క్షేత్రం నిజంగా భూకైలాసమేనన్న భావన కలిగింది. రెండు రోజులలోనే ఆ స్థలంతో ఏర్పడ్డ అనుబంధం తాలూకు మోహపాశం పట్టి లాగినా, ముందుకు సాగటం అనివార్యం కనుక, తదుపరి గమ్య స్థానమైన 'ఉడిపి' దిశగా మా వాహనం అడుగులు వేసింది. 'ఉడు' అనగా నక్షత్రాలు 'పి' అనగా అధిపతి. అనగా నక్షత్రాలకు అధిపతి అయిన చంద్రుని పేరుమీద ఈ దివ్య ధామం

వెలుగొందుతోంది. ఐదువందల గజాల వరకూ బారులు తీరిన భక్త జనాల మధ్యన ఆ పంక్తిలో ముందు వెనుకల్లో, ప్రక్కల్లో మనతోపాటు సాగుతున్న వారి దేహాల నుంచి వెలువడుతున్న స్వేదము తాలూకు చెమ్మ ఉండి ఉండి మన శరీరాలను తాకుతుంటే ముందుకు సాగటం, భరింప శక్యం కాని కఠిన పరీక్షగా అనుపిస్తున్న తరుణంలో, ఆ కష్టం నుండి ఊరడించటానికా అన్నట్లు కనుపించింది కోవెలలోని కోనేరు. నిత్యం స్వామికి సంబంధించిన పూజాదికాల నిర్వహణకి త్రేతాయుగం నాటిదిగా చెప్పబడుతున్న ఈ పుష్కరిణిలోని జలాన్నే వినియోగిస్తారట. కోనేటి కమనీయతను తిలకిస్తూ ముందుకు సాగగా కృష్ణయ్య దివ్య ధామం రానే వచ్చింది. మనసు దోచే మంగళాకారుడుగా కానవస్తున్న ఆ దివ్యమూర్తిని చిరు దివ్వెల వెలుగులో చిన్న కిటికీ గుండా దర్శించుకోవటం మాకు కొంత అసంతృప్తిని కలిగించింది. అయితే అందుకుగల కారణం తెలుసుకున్న అనంతరం ఆ దర్శనం మహదానందకరంగా అనుపించింది.

అక్కడి స్థలపురాణం ఆధారంగా మందిరంలో కొలువైన కృష్ణ ప్రతిమను స్వయంగా కృష్ణుడే తన ప్రియ పత్ని రుక్మిణీదేవి కోరికమేరకు ఆమె ఆరాధనా నిమిత్తం తయారు చేయించి ఆమెకి బహూకరించాడు. రుక్మిణీదేవి నిరంతరం ప్రేమపారవశ్యంతో సేవించిన ఆ మూర్తిని శ్రీ కృష్ణ అవతార లీలా పరిసమాప్తి అనంతరం అర్జునుడు రుక్మిణీదేవి వనంలో ప్రతిష్టించాడు. కాలాంతరంలో ఒకనాటి ఉప్పెనలో కొట్టుకువచ్చి, ఆ ఉప్పెనలో చిక్కిన ఒక జాలరికి లభించింది. తన దివ్య దృష్టి ద్వారా ఈ విషయాన్ని అవగత పరచుకున్న మధ్వాచార్యుల వారు ఆ జాలరిని ఉప్పెన నుంచి రక్షించి, ఆ విగ్రహాన్ని ఉడిపిలో ప్రతిష్టించారు. అనంతరం మందిర నిర్మాణం జరుగుతున్న సందర్భంలో, కట్టడ నిర్మాణంలో ప్రధాన పాత్ర వహించిన పరమ కృష్ణ భక్తుడైన 'కనకదాసు' అనే మేస్త్రి ఈ కిటికీని నిర్మించుకున్నాడట. నిమ్న జాతివాడైన కనకదాసు మందిర నిర్మాణానంతరం తనకి ఆలయ ప్రవేశం వుంటుందో వుండదోనన్న అనుమానంతోనే కృష్ణయ్యని దర్శించుకునేందుకు ఆ కిటికీని ఏర్పాటు చేసుకున్నాడు. అతని ప్రేమకు పరవశుడైన కృష్ణయ్య కిటికీ వైపుకే తిరిగాడు. నాటి నుంచీ అది కనకదాసు కిటికీగా ప్రసిద్ధి చెందింది. అంతటి నిష్కళంక నిర్మల భక్తుని పవిత్ర ప్రేమకు జ్ఞాపికగా నిలచిన ఆ మార్గం గుండా స్వామిని దర్శించుకున్న విషయం స్ఫురణకు రాగానే తనువు రోమాంచితమైనది. ఈ మధుర స్మృతిని నెమరువేసుకుంటూ, మంగుళూరులో వేంచేసియున్న మంగళాదేవి, కదిరి మంజునాథస్వామిని దర్శించుకుని 'ధర్మస్థల'కి చేరుకున్నాము. అక్కడి జన సందోహాన్ని చూస్తుంటే భారతదేశంలో అర్ధభాగం జనులు తమ సమస్యలని విన్నవించటానికి అక్కడికే చేరుకున్నారని అనిపించింది. ఒక వంక జోరున వర్షం, మరో వంక జన సందోహం ఆ రోజుకు స్వామిని దర్శించటానికి శక్తిహీనంగా అనుపించింది. రెండు గంటలపాటు విశ్రాంతి తీసుకుని శక్తి కూడదీసుకుని మందిరంలోనికి అడుగు పెట్టాము. అతి కష్టంమీద ఒక్క నిమషం పాటు స్వామిని దర్శించగలిగాము. అప్పటి వరకూ దర్శించిన దేవాలయాలలోని శివలింగాల అలంకరణ ఆంధ్రప్రదేశంలోని శివాలయాలకు భిన్నంగా చేయబడింది. ప్రతిచోటా లింగానికి సువర్ణముతో చేయబడిన ముఖము తొడుగుగా అలంకరించబడింది. ధర్మస్థలలో వేంచేసిన మంజునాథస్వామి అలంకరణ అక్కడి ఈశ్వరాలయాలకు కూడా భిన్నంగా వున్నది. అమరావతిలోని అమర లింగేశ్వరస్వామి మాదిరిగా కొంత ఎత్తైన లింగానికి బంగారు తొడుగు తొడగబడి వున్నది. నూనెదీపాల వెలుగులో ఉదయ భానునిలా ప్రకాశిస్తున్న స్వామి ప్రకాశం ఆహ్లాద కారకం. అన్నపూర్ణమ్మ ఆశీస్సులు కూడా పొంది బయిటకు చేరుకున్నాము. రాత్రి సమయం కావటంతో క్షేత్రవైశిష్ట్యం తెలుసుకునే అవకాశం లభించలేదు. ఆ రాత్రికి విశ్రాంతి తీసుకుని తెల్లవారు ఝామునే కుక్కే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనార్థం బయలుదేరాము.

సహ్యాద్రి పర్వతాల నడుమన కుమార ధారా నదీతీరంలో కుదురైన మూర్తిగా వాసుకిని ఆసనంగా చేసుకుని, ఆదిశేషుని నీడలో వెలుగొందుతున్నాడు సుబ్రహ్మణ్యేశ్వరుడు. నాగదోషాలు, కాలసర్ప దోషాలులాంటి బలవత్తరమైన దోషాల నివారణార్థం నిత్యం వేలాదిగా భక్తులు స్వామిని దర్శిస్తారు. పూర్వం లోకాలను పీడించిన తారకాసురుని వధించిన అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామితన శక్తి ఆయుధాన్ని ఈ క్షేత్రంలోని కుమార తీర్థంలో వుంచి, పరమ శివుని ఆజ్ఞమేరకు ఈ క్షేత్రంలో వెలసినట్లు ఐతిహ్యం. కుమార తీర్థంలో స్నానము ఆచరించిన భక్తుల సమస్త రోగాలూ ఉపశమిస్తాయిని భక్తుల విశ్వాసం. స్వామిని దర్శించే ముందర ఆది సుబ్రహ్మణ్య స్వామిని దర్శించటం సాంప్రదాయం. గులాము రంగు

కుంకుమతో తీర్చిన అడ్డరేఖలు నుదిటిపై మెరుస్తూ వుండగా, సకల వేదాలూ అధ్యయనం చేసిన బ్రహ్మణుని చందంగా మెడలో పట్టు కండువా ధరించి, సుబ్రహ్మణ్యుని ప్రతినిధిలా నిలబడి నిరంతరం వచ్చేపోయే భక్త జనులను తనతుండముతో వెన్ను తట్టి ఆశీర్వదిస్తూ వుంటాడు మందిర ఆవరణలో ఒక గజరాజు. స్వామిని ఊరేగించటానికి ఉపయోగించే ఉన్నతమైన రథము రాచరిక సంస్కృతిని జ్ఞప్తికి తెస్తుంది. ఆరు అంచెల మందిర రాజద్వార శిఖరం శరీరంలోని షట్చక్రాలకి ప్రతీకగా నిలుస్తుంది. జీవులలోని అజ్ఞానాన్ని రూపుమాపి జ్ఞాన శక్తిని వికశింపచేసే ఆ సుబ్రహ్మణ్యస్వామి సన్నిధినుంచి మా యాత్ర మడిగేరే వైపుకు సాగింది. దారి పొడవునా ఇరువైపులా దట్టంగా పెరిగిన వృక్షాలు ఆ ప్రాంతాన్ని కాపలా కాచే సిపాయిల మాదిరిగా కనుపిస్తుంటే, వాటి మధ్యల్లో దుబ్బుగా పెరిగిన కాఫీ వృక్షాల నుంచి వ్యాపిస్తున్న కాఫీ సువాసనల ఘుమఘుమలు అలవాటు లేనివారికైనా వెంటనే కాఫీని సేవించాలనే జిహ్వా చపల్యాన్ని కలుగ చేస్తాయి. పోతన గారు తన భాగవతంలో మొసలి చేత చిక్కి దీనుడుగా వున్న గజేంద్రునితో ఇలా అనిపిస్తారు–'కలదూ కలదన్నవాడు కలడో లేడో' అని. నిజానికి ఈ సందేహం గజరాజుకే కాదు ప్రతి మనిషి జీవితంలోనూ ఏదో ఒక సందర్భంలో ఉత్పన్నమయ్యే అనుమానమే. ఈ 'కుద్రే ముఖ్' అడవులలోని వనస్పతుల అమరికని చూస్తుంటే ఆ కలడనే దేవుడు లేడనే సందేహమే కలుగదు. ఏదో ఒక అలౌకిక శక్తి అజ్ఞాతంగా వుండి ఈ సృష్టి చేయకపోతే, మానవ మనుగడకి అవసరమయ్యే మహోన్నతమైన బల వృక్షాల నుంచీ, చేతి వేళ్లలో ఇముడ్చుకునేటంతటి లఘు ఆకృతి కలిగిన మిరియాలను సహితం ఉత్పత్తి చేసే నాజూకైన తీగల వరకూ అక్కడ ఎవరు అమర్చి వుంటారు, నిస్సంశయంగా కుండ అనేది వున్నదంటే కుమ్మరివాడు వుండక మానడు కదా! ఈ అద్భుత విచిత్ర వన సృష్టిని చేసిన ఏదో చైతన్యం తప్పక వుండే వుంటుంది. ఆ చైతన్యమే భగవంతుడని భావం కలుగుతుంది. వనాల సౌందర్యాన్ని, ఆ వనాలు ప్రసాదించే స్వచ్ఛమైన వాయువులనూ ఆస్వాదిస్తూ మడికేరికి చేరుకున్నాము. దీనికి ఆంగ్లేయులు పెట్టిన పేరు 'కూర్గ్'. సమ శీతోష్ణ స్థితి కలిగిన ఈ ప్రదేశం మనోజ్ఞమైన వేసవి విడిది.

ఇక్కడ సర్వ ప్రథమంగా మేము దర్శించిన ప్రదేశం 'తల కావేరి'. గిరులను తరులను దాటుతూ హృదయాన్ని కలవరపాటుకు గురిచేసే ప్రవాహ గమనంతో సాగే 'కావేరీ' నది జన్మ స్థానం ఈ ప్రదేశం. ఇక్కడే ఎత్తైన కొండ పైన, అతి ప్రశాంతమైన ప్రదేశంలో తపోదీక్షలో మునిగినవాడిలా దర్శనమిస్తాడు ఆగస్త్యేశ్వర స్వామి. మందిరానికి నలుదిశలా వ్యాపించిన వృక్ష సంపదను చూస్తుంటే ఒక వంక తాండవ మాడుతున్న ప్రమద గణాలు, మరోవంక ఒంటికాలిపై హఠ యోగ ముద్రలలో తపమాచరిస్తున్న ఋషీశ్వరులూ, మూడోప్రక్క మంగళ హారతులతో నాట్యమాడుతున్న అప్సరాంగనలు, మరోవంక భృంగి నంది వంటి నిశ్చేష్ట భక్తుల సమూహాలు కలసి ఆ వనదేవిలా కానవస్తున్నారనిపిస్తుంది. ఆలయం చుట్టూతా అలముకున్న మంచు తెరలను చూస్తుంటే కోవెలలో కొలువై వున్న ఆ స్వామికి తగిలిన దృష్టి దోషాన్ని నివారించటానికి వేసిన సహస్ర ధూపాల పొగ అలా వ్యాపించిందేమోనన్న భ్రమ కలుగుతుంది. తలకావేరికి అతి సమీపంలో వున్న భాగమండలేశ్వరుని ఆలయం సువిశాలమైన ఆవరణలో నిర్మించబడినది. కిటకిటలాడే భక్తుల రద్దీతో ప్రతి క్షేత్రంలోనూ వారి సమస్యలు, సంకటాలు, విన్నపాలు, కోర్కెలు, స్తోత్రాలు ఆకర్షించి అలసిపోయిన ఆ పరమేశ్వరుడు ప్రశాంతతకు


మహాబలేశ్వరాలయం

పర్యాయమైన ఆ భాగేశ్వరాలయంలో సేద తీరుతున్నాడేమోనని అనిపించకమానదు. అంతరించిపోతున్నాయనుకుంటున్న మన దేశ పక్షి జాతులలో అతి ముచ్చటైన పిచ్చుకలు ఆ కోవెలలోనే హాయిగా విహరిస్తూ సేదతీరుతున్నాయి. కూర్గ్‌లోని తర్వాతి మనోహర ప్రదేశం అభి జలపాతం. అత్యున్నత శిఖరాల మీద నుంచి తెల్లని జలధారలు క్రిందకు పడుతుంటే కొండల మీద నుంచి ఎవరో వజ్రాల మూటలు విప్పి గుట్టలుగా కుమ్మరిస్తుంటే అవి జలజలా క్రిందకు పడుతున్నప్పుడు పుట్టే రస ధ్వనిలా వీనులకు విందుగా వున్నది ఆ జలపాత రవళి, నీటి ప్రవాహ వేగానికి ఏర్పడుతున్న తెల్లని నురగల శ్వేత దీప్తి మధ్యల్లో నీలిరంగు ఛాయలు, కనీ కనపడనట్లు దోబూచులాడుతుంటే, చంద్రకాంతమణులూ, మంచి ముత్యాలలో ఇంద్ర నీల మణులు కలసి గిరుల మీద నుంచి క్రిందకు తలంబ్రాలుగా జారి పడుతున్నాయా అనిపించింది. జలపాతం దరిదాపుల్లోని ఆ అడవుల్లో ఎక్కడపడితే అక్కడ ఆంధ్రప్రదేశంలో తాటిచెట్లు దర్శనమిచ్చే చందంగా పనసపళ్ల వృక్షాలు నిండు గర్భిణులలా పండ్లతో నిండి ముచ్చట గొలుపుతుంటే ఆ దృశ్యాలు ఛాయా చిత్ర పేటకలో భద్రపరుస్తూ, పురాతన రాజమహలులోని విశేషాలు తెలుసుకోవటానికి అక్కడికి చేరుకున్నాము. ఆ కోటను చూస్తుంటే అది ఒక సామంత రాజుదేమోనన్న భావం కలిగింది. అతి పురాతనమైన ఈ కట్టడం ఆకర్షణీయంగా లేకపోయినప్పటికీ, ఇందులో అంతర్భాగమైన పురావస్తు ప్రదర్శనశాల 11 వ శతాబ్ది నాటి నుంచీ, నేటి వరకూ జరిగిన మానవుని యొక్క దైహిక పరిణామానికి, నాగరికత సంస్కృతీ సభ్యతల పరివర్తనలకి అద్దంపడుతుంది. 11వ శతాబ్దికి చెందిన రాతిశిల్పాలను చూస్తుంటే అప్పటి మానవులు నేటి మానవులకంటే బృహత్‌కాయులని అర్థమవుతుంది. వారి వస్త్రధారణ, అలంకరణ వారు ఉపయోగించే ఉపకరణాలు, వారు పూజించే దైవప్రతిమలూ అన్నిటిలోనూ నేటితో పోలిస్తే ఒకింత మొరటుతనం గోచరించింది. శతాబ్ది శతాబ్దికీ చోటు చేసుకున్న పరివర్తనలు సుస్పష్టంగా ఆ శిలాఖండాలలో దృష్టి గోచరమవుతాయి. దీనికి సమీపంలోని మరియమ్మ దేవి దేవస్థానం కూర్గ్ ప్రదేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిజానికి ఆలయం అతి తక్కువ ప్రదేశంలో నిర్మించబడి వున్నది. కానీ అక్కడి అర్చకులు కోవెలకూ, అందు కొలువై వున్న దేవేరికీ చేసిన పుష్పాలంకరణ సురమ్యంగా, నవ్యాతి నవ్యంగా తోచింది. లోకంలో చాలామంది స్త్రీలు తమ గృహాలు విశాలంగా లేవని అసంతృప్తికి లోనవుతూ వుంటారు. అసలు ప్రదేశం చిన్నదిగా వున్నప్పటికీ దానిని అలంకరించే పొందికలోనే అందం ఇమిడి వుంటుందన్న సత్యాన్ని తెలియచేస్తుంది మరియమ్మ దేవి ఆలయం. మా తదుపరి సందర్శనా స్థలం ఎలిఫెంట్ పార్క్. అక్కడి గజరాజుల సందడికి స్పందించి సంతోషించనివారు వుండరేమో. తల్లి ఏనుగుతో కలసి పిల్ల ఏనుగు ముందుకు నడవటం, నడకలో కొంచెంగా వెనుక పడిన తరుణంలో తల్లిని చేరుకోవటానికి గెంతులు వేస్తూ ముందుకు రావటం, తల్లి ఏనుగు పిల్లని తన తొండంతో నిమరటం చూస్తుంటే మాతృత్వంలోని మాధుర్యాన్ని ఆస్వాదించటానికి ఏర్పడిన భాష ప్రేమ అని, ఆ ప్రేమను వెలిబుచ్చటానికి ఏర్పడిన సాంకేతిక భాషకు పదాలతో పని లేదు, జాతి భేదం లేదు అనిపిస్తుంది. ఆ మూగజీవుల ఆత్మీయతని అల్లరినీ, అమాయకత్వాన్ని మనసారా ఆస్వాదించి, నిస్సర్గ్ ధాం మీదుగా బౌద్ధ దేవాలయానికి బయలుదేరాము. దారి పొడుగునా వయ్యారంగా నిలబడి వున్న వనస్పతులను చూస్తుంటే వాటిలో నుంచి కొన్ని గుబురులు మణిపురీ నృత్యాంగనలలా దర్శనమిస్తే, ఎత్తుగా చలనం లేకుండా నిలబడిన వృక్షాలు ఏదో మహత్వా కాంక్షతో కఠోర తపమాచరిస్తున్న అసుర తపస్వులను బోలినట్లున్నాయి. తరువులు, గుబురులు, గుల్మాలు, లతలు అన్నీ కలసిన అమరికగా ఊగుతుంటే దంగీ నృత్యం చేసే నర్తకులు తమ ప్రదర్శలో కనపరచే వివిధ ఆకృతులలా ప్రకృతి హృద్రమ్యంగా కానవస్తుంది. ఈ సుమనోహర ప్రకృతి సొగసులు మరలా ఆస్వాదించే భాగ్యం ఇంకెన్నాళ్లికోనన్న విచారం ఒక ప్రక్క నుంచి ముంచుకు వస్తుంటే మరో ప్రక్క ఎనిమిది రోజుల పాటు అనుభవించిన ఆనందానుభూతులని సంచులలోకి ఎత్తుకుని విచిత్ర మానసిక స్థితిలో మైసూరు మీదుగా తిరుగు ప్రయాణార్థం బెంగుళూరు విమానాశ్రయానికి చేరుకున్నాము.

డా. భాగవతుల హేమలత
విజయవాడ.
ఫోన్ : 949 243 7606



# కృష్ణా ధాన్యాగారం
# ప్రకాశం బ్యారేజి


*- కె. వెంకటేశ్వర్లు*

*చెట్టు కొట్టి మెట్ట తవ్వి / కంప పొదల నరికి కాల్చి*
*పుడమి దున్ని పండించిన / మొదటివాడు తెలుగువాడు*
*-కాళోజీ*

ప్రపంచంలోని ఏ దేశపు నాగరికత అయినా అది నది తీరాల వెంటె ప్రారంభమై వికసించి విస్తరించింది. మానవుడు నిర్మించిన ప్రతి నాగరికత వెనక నీరే ప్రాణాధారం అయింది. నైలునది, గంగ, సింధు, యూస్రిట్రస్ – టైగ్రిస్, హెకుంగ్ హో ఇలా వివిధ ఖండాలలో నదులచుట్టే నాగరికత విలసిల్లింది. ఈ విధంగానే భారతదేశంలో గంగ, యమున, సరస్వతి 12 జనపదుల చుట్టే మన జనపదుల జీవన యానం పరిభ్రమించింది. ఆధునిక జీవన యానానికి అడుగులు వేసింది. కృష్ణానది తీర భారతంలో అతి పెద్ద నదులలో రెండవది. భారతదేశంలో గంగ, గోదావరి తర్వాత మూడోది కృష్ణమ్మ. కృషా బేసిన్ త్రిభుజాకారంలో గలది. ప్రవాహ దిశలను మారుస్తుంది. బేసిన్ విస్తీర్ణం 2,58,946 చ.కి.మీ. భారతదేశ విస్తీర్ణంలో ఎనిమిదవ వంతు ఉంటుంది. మహదేవ పర్వత శ్రేణుల 4385 అడుగుల ఎత్తు నుండి 1400 కి.మీ. ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలిసే సంగమ స్థానం హంసలదీవి వద్ద 50 అడుగులకు పడిపోతుంది. కృష్ణానది 29 ఉపనదుల కూటమి, 12 బేసిన్‌లు కలిగిన జీవన వాహిని.

ప్రజలను కరవు కాటకాల నుండి కాపాడుతూ, వ్యవసాయం, పారిశ్రామిక ప్రగతికి ఈ నదీమతల్లి దోహదపడుతుంది. అంతులేని కష్టాలను చూసిన తెలంగాణ, కోస్తా సీమ ప్రాంతాలకు వరప్రదాయినిగా పసిడి క్షేత్రాలలో పచ్చని పంటలకు దోహదకారిగా మారింది. బీడుభూముల గొంతులను తడుపుతూ ఉరుకులు పరుగుల నడకలను సాగిస్తున్నది. 1830–40 దశకంలో 19వ శతాబ్దంలో వచ్చిన కరువు కాటకాలకు లక్షలాది ప్రజలు ఆకలి చావుల బారిన పడ్డారు. ఆనాడు బ్రిటిష్ పాలకులు కృష్ణానదిపై ఆనకట్ట కట్టాలనే తలంపుకు బీజం పడింది. అందుకు ఆద్యుడు ప్రఖ్యాత ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్. భావి తరాలు కూడా కాటన్ మహనీయుని పేరును సదా స్మరిస్తూనే ఉంటాయి. కావేరి, గోదావరి, కృష్ణా నదులపై ఆనకట్టలు కట్టాలన్నది ఆయన తలపుల నుండి వచ్చినదే. "తుంగభద్ర ప్రజలకు ప్రాణభద్రంగా" మారింది. కాటన్ పథకం కావేరీ డెల్టా పథకం, గోదావరి, కృష్ణా జలాలు సిరుల పంటలకు తోడ్పాడలనే సాగించిన ప్రయత్నాల ఫలితంగా ఈనాటి ప్రకాశం బ్యారేజి, ధవళేశ్వరం, ఆనకట్టల ద్వారా లక్షలాది ఎకరాలకు నీరందిస్తూ తెలుగు మాగాణులలో సిరుల పంటలు పండిస్తున్నది. తెలుగు ప్రజల జీవన స్రవంతిలో కృష్ణా, గోదావరులు తరతరాలుగా విడదీయరాని అనుబంధం ఏర్పడింది. కృష్ణమ్మ తెలుగు ప్రజల సంస్కృతిలో ఒక భాగమైంది. మానవ నాగరిక చరిత్రలో ఒక విశిష్ట స్థానం పొందింది. జలసిరులతో ధాన్యగారపు రాశులను పండిస్తున్నది.

**బెజవాడ వైభవ ప్రభావాలు :** తెలుగు రాష్ట్రాలలో 46 నదులు ప్రవహిస్తున్నాయి. 19వ శతాబ్దం జల కేటాయింపులు, వివాదాలు లేని కాలమది. కృష్ణానదిపై విజయవాడ వద్ద నిర్మించిన తొలి ఆనకట్ట ప్రకాశం బ్యారేజి. అంతకన్నా ముందు విజయవాడ నగరం క్రీ.శ. 10వ శతాబ్దంలో పశ్చిమ చాళుక్య ప్రభువు త్రిభువన మల్లు 2వ కాలంలో దుర్గ మల్లేశ్వరి ఆలయాన్ని ఇంద్రకీలాద్రిపై నిర్మించాడు. 16వ శతాబ్దంలో గోల్కొండ రాజ్యాన్ని 1687లో ఔరంగజేబు జయించాడు. గోల్కొండ బందరులకు మధ్యగల దండు బాటలో దోపిడి దొంగలను అరికట్టడానికి బెజవాడ కోటలో విడిదిగా కొంత సైన్యాన్ని నిలిపాడు. ఆ ప్రాంతమే నేటి మొఘల్రాజపురంగా పిలవబడుతున్నది. కృష్ణానదిపై రవాణా సౌకర్యం, వర్తక వాణిజ్యాలు నాడు ఓడలపై సాగేవి. కృష్ణానదికి మిగతా నదులకన్నా ప్రత్యేకత కలిగినది. కృష్ణా ఉపనదులన్నీ 2/3 వంతుల ప్రవహించక ముందే ప్రధాన నదిలో కలిసిపోతాయి. గోదావరికిగల ఉపనదులలో చివరి మూడవ వంతు భాగంలో కలుస్తాయి. బెజవాడ మరో ప్రత్యేకత 1879 తొలి రైల్వే లైను ఏర్పడింది. 1893లో రైల్వే స్టేషను నిర్మించారు.



దుర్గమ్మ పాదాల చెంత కృష్ణమ్మ

1893-94 సబ్‌కలెక్టర్ బంగళా, 1942 విమానాశ్రయం, 1948 ఆకాశవాణి ఏర్పడ్డాయి. రాయల్ ఇంజనీర్స్ కావేరి నదిపై గ్రాండ్ ఆనకట్ట నిర్మించారు. తదుపరి కాలంలో ధవళేశ్వరంపై చాలా పొడవైన ఆనకట్ట సర్ ఆర్థర్ కాటన్ రూపకల్పన చేసి, ఆయన స్వయ పర్యవేక్షణలో నిర్మించాడు. కాటన్ ఆలోచనల మేరకు బ్రిటీష్ రాయల్ ఇంజనీర్ చార్లెస్ అలెగ్జాండర్ ఓర్ పర్యవేక్షణలో 1852-55లో విజయవాడవద్ద ఆనకట్టను ప్రారంభించి 1855 మే 9న నిర్మాణం పూర్తి చేశారు. ఒక కోటి నాలుగు లక్షల రూపాయలు అందుకు ఖర్చు చేశారు. 4.2 లక్షల ఎకరాలకు తొలిదశలో ఈ ఆనకట్ట ద్వారా పంటపొలాలకు నీటిని విడుదల చేశారు. ఆ సందర్భంగా -

*కదలి రావే కృష్ణవేణీ! / కదల రావే నిత్యకల్యాణీ! / కదలి రా కదలి రా కడుపు చల్లని తల్లి / జలజల పొంగుతూ కిలకిల నవ్వుతూ...!*

కవి హృదయం కృష్ణ తరంగాలను చూసి ఉప్పొంగిన భావ తరంగమది.

**కరవు కాటకాలే ఆనకట్ట ఆలోచనలకు మూలం :** ఒక వంక ఉప్పొంగే నదీజలాలు ఉప్పు సముద్రం పాలు. మరోవైపు కరువు కాటకాలు విలయతాండవాలు. నదుల జీవజలాలతో కరవును నివారించాలనే ఆలోచనల నుంచి పుట్టుకు వచ్చింది. కరవు కాలంలో ప్రజలు శిస్తులు చెల్లించని దీనస్థులు. మరోవంక ఆకస్మికంగా పొంగే నదుల వరద ఆస్తులకు, ప్రాణాలకు విపరీత నష్టం వాటిల్లుతున్నది. అంతకు పూర్వం గోదావరి నదిపై కాటన్‌చే నిర్మించిన ఆనకట్ట వలన ప్రజల కరవు తీరడంతో పాటు ప్రభుత్వానికి రాబడి పెరిగింది. దీంతో కృష్ణానదిపై ఆనకట్ట కట్టాలనే నిర్ణయానికి బ్రిటీష్ పాలకులు వచ్చారు.

1830-35లలో వచ్చిన కరవు కృష్ణా తీర ప్రాంతాల ప్రజలను కబళించింది. కృష్ణాతీరం పొడవున వ్యాపించిన కరవు వల్ల నదిపై ఆనకట్ట కట్టాలనే నిర్ణయం తీసుకున్నారు. ఆనకట్ట నిర్మాణం పనులను రాయల్ మిలట్రీ ఇంజనీర్స్‌కు అప్పగించారు. తక్కువ ఖర్చు, ఎక్కువ ప్రయోజనం కలగాలన్నదే బ్రిటీష్ పాలకుల ఆలోచన. ఆనాటికే రాయల్ ఇంజనీర్స్ భారతదేశంలో వివిధ రైల్వే లైన్‌లతోపాటు ఆనకట్టలను నిర్మించిన అనుభవం ఉంది. చివరకు రెండు దశాబ్దాల అనంతరం 1852లో కనకదుర్గమ్మ వారధిగా రెండు కొండల నడుమ ఆనకట్ట నిర్మాణం జరిగింది. ఈ వారధి కృష్ణా, గుంటూరు జిల్లాలను కలిపింది. విజయవాడ జలరాశిగా రూపాంతరం చెందింది. మూడు జిల్లాల భూములను ధాన్యరాశులుగా మార్చింది. బంగారు పంటల ధాన్యాగారంగా మారాయి. ఈ ఆనకట్ట వద్ద ఆర్.ఎస్. బచావత్ వరద ప్రవాహాన్ని లెక్కగట్టి 2060 శతకోటి ఘనపుటడుగుల నికర జలాలను తేల్చారు. అంతకు పూర్వం 1903లో బ్రిటీష్ ఇంజనీర్లు కూడా నాటి ప్రవాహాన్ని ఇక్కడే లెక్కించారు. 9 లక్షల 32 వేల క్యూసెక్కుల అత్యధిక ప్రవాహంగా తేల్చారు. కృష్ణానదిని పరివాహక (ప్రాంతాన్ని) 12 భాగాలుగా చేసి, నాడు విభజన చేశారు.

**బ్రిటీష్ రాయల్ ఇంజనీర్స్ దార్శనికత :** సర్ ఆర్థర్ కాటన్ సారథ్యంలో బ్రిటీష్ రాయల్ ఇంజనీర్ ఛార్లెస్ అలెగ్జాండర్ ఓర్ పర్యవేక్షణలో ఆనకట్ట నిర్మాణం పనులు 1852లో ప్రారంభించారు. ఆనకట్ట నిర్మాణ వ్యయం 90 లక్షలుగా అంచనా వేశారు. 1854 మే నాటికి పూర్తి చేశారు. వేలాదిమంది కూలీలు పాల్గొన్నారు. కోటి నాలుగు లక్షల రూపాయలు ఇందుకు ఖర్చు చేశారు. దాదాపు 4 వేల అడుగుల పొడవునా ఆనకట్ట నిర్మాణం జరిగింది. నీటి అవసరాల కోసం బ్యారేజి ఎగువన నీటి నిల్వల కోసం ఆనకట్ట పై 3 అడుగుల ఎత్తున షట్టర్స్‌ను బిగించారు. 1898లో వాటి స్థానంలో 3 అడుగుల ఆటోమెటిక్ షట్టర్స్‌ను ఏర్పాటు చేశారు. చివరిగా 1923-25 మధ్య కాలంలో 6 అడుగుల షట్టర్స్‌ను ఏర్పాటు చేశారు. షట్టర్స్ ఎత్తు పెంచినకొలదీ సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. మెదటి దశలో 4 లక్షల 7 వేల ఎకరాలు సాగులోకి రాగా 1925 నాటికి 11.5 లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. ప్రస్తుతం డెల్టా క్రింద 12 లక్షల 75 వేల ఎకరాలు సాగవుతోంది. 1855 నుండి 1925 వరకు 4.7 లక్షల ఎకరాల నుండి 11.25 లక్షల ఎకరాలకు చేరింది.

1957లో 12.5 లక్షల ఎకరాలకు చేరింది. 1957లో 12.5 లక్షల ఎకరాలు సాగయింది. 1952లో ఆగస్టులో వచ్చిన భారీ వరదల కారణంగా ఆనకట్టకు 100 అడుగుల పొడవునా భారీ గండి పడింది. కేవలం ఇసుక, సున్నం, రాయితో నిర్మించిన ఆనకట్ట వంద సంవత్సరాలలో ఎన్నో భారీ వరదలను తట్టుకొని నిలిచింది. 1855లో ఆనకట్ట పూర్తి కాగానే 100 సంవత్సరాలు ఖచ్చితంగా నిలుస్తుందని సర్ కాటన్ మహాశయుడు చెప్పాడంటారు. అలాంటి ముందుచూపు కలిగిన దార్శనికుడు. మన దేశంలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీ నవాజ్ జంగ్, డాక్టర్

కె.ఎల్. రావు లాంటి ఇంజనీర్లు ఆ కోవలోకే వస్తారు. **వందేళ్ళ తర్వాత ఆనకట్టకు భారీ గండి :** 1952 ఆగస్టు చివరలో కృష్ణానదికి భారీ వరదలు సంభవించాయి. తుంగభద్రపై 1866లో సుంకేశులవద్ద బ్యారేజీని నిర్మించారు. కడప, కర్నూలు కాలువలను త్రవ్వారు. కర్నూలు జిల్లా సుంకేశుల వద్ద వరద కట్టలు తెంచుకుంది. మధ్యలో ఎక్కడా ఆనకట్టలు లేవు. ఈ వార్త విజయవాడ చేరేసరికే చాల ఆలస్యమైంది. ఏకంగా భారీ వరద వచ్చి, ఆనకట్టపై విరుచుకుపడింది. ఆనకట్ట మధ్యలో 100 అడుగుల మేర లోతైన గండి పడింది. అప్పటికే లక్షల ఎకరాలలో నాట్లుపడ్డాయి. పంట భూములకు చేరాల్సిన జలాలు సముద్రంపాలవడం చూస్తుండగానే జరిగిపోయింది.

ఆనాడు కృష్ణా డెల్టా ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెంట్ ఇంజనీర్ వేపా కృష్ణమూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణకు అంకితమైన వేపా గారు యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చి, పంటలను కాపాడాలనే పట్టుదలతో ఉన్నారు. అందుకు ఇంజనీర్లను, సిబ్బందిని సమాయత్తం చేశారు. గండి పూడ్చడానికి తగిన ప్రణాళికకు వ్యూహరచన చేశారు. ఈ కార్యక్రమంలో తోటి అధికారులకు, సిబ్బందికి, కార్మికులకు మనోధైర్యం కల్పించడానికి స్వయంగా కార్యరంగంలో దిగారు. గండి పూడ్చివేతలో భాగంగా పంట్లతో ఇసుక బస్తాలను నింపి గండి వద్ద ముంచివేయాలన్నది ఆ పథకం. సెప్టెంబరు 9న పనులు ప్రారంభించారు. రాత్రింబవళ్ళు సిబ్బంది పనిలో నిమగ్నమయ్యారు. ఇంజనీర్ వేపా కృష్ణమూర్తి మరికొందరు ఇంజనీర్లు మరొక లాంచి పంటు మీద నిలుచున్నారు. సీతానగరం వైపు నుండి ఇసుక బస్తాలతో వస్తున్న లాంచి ఒకటి వరద ఉధృతికి ఆదుపుతప్పి ఆయన నిలుచున్న పంటును ఢీకొనడంతో పంటుకు కట్టిన తాడు తెగిపోయింది. అందరూ చూస్తుండగానే వరద ఉధృతికి పంటు గండిలోకి జారిపోవడం దానిమీద ఉన్నవారందరూ కన్ను మూసి తెరిచేలోగా వరదలో కొట్టుకుపోవడం క్షణాలలో జరిగిపోయింది. చుట్టు పంట్లు మీద ఉన్న సిబ్బంది అంతా నిస్సహాయంగా చూడటం మినహా మరేమీ చేయలని పరిస్థితి. వేపాతోపాటు ఒక ప్రైవేటు సంస్థలో ఇంజనీర్గా పనిచేస్తున్న వారి బావమరిది, మరో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆనకట్ట సూపరింటెంట్, ఫోర్మెన్, లస్కర్లు కృష్ణమ్మ వడిలో కలిసిపోయారు. గజ ఈతగాళ్ళతో గాలింపులు జరపగా రెండు రోజుల తర్వాత మృదేహాలు లభించాయి. 1952 నాటి కృష్ణమ్మ వరదలు విషాదాన్ని నింపాయి. వేపా కృష్ణమూర్తి విధి నిర్వహణలో చేసిన సాహసం, తెగింపు నేటికీ కథలు కథలుగా ప్రజలు చెప్పుకుంటారు. అంకిత భావంతో విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించినవారు సదా ప్రజల, రైతుల హృదయాలలో చిరస్మరణీయులే.

**ప్రకాశం బ్యారేజీ నిర్మాణం 1954-57 :** ఆనకట్టకు గండిపడి పూర్తిగా దెబ్బతినడంతో డెల్టా రైతుల ప్రయోజనం కోసం మరో ఆనకట్టను ఎగువన చేపట్టవలసి వచ్చింది.

1953 అక్టోబర్ 1 న కర్నూలు రాజధానిగా ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి కావటం రాజకీయ పరిణామాల మధ్య చకచకా జరిగిపోయాయి. ఇదే సందర్భంలో కృష్ణా ప్రాంతంలో తీవ్ర కరవు ఏర్పడింది. ఆనకట్ట నిర్మాణం కోసం ప్రజా రైతాంగ ఉద్యమాలు ఉధృతమయ్యాయి. 1954 మార్చి 1న దాని పాత ఆనకట్టకు ఎగువన నూతన బ్యారేజికి ఆయన శంకుస్థాపన చేశారు. 1957 డిసెంబర్ 24న నిర్మాణం పూర్తి చేసుకున్నది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ప్రకాశం బ్యారేజీగా నామకరణం చేసి, ప్రారంభోత్సవం జరిపారు. వేలాదిమంది కూలీలు, కార్మికులు, సాంకేతిక సిబ్బంది, ఇంజనీర్లు మహా నిర్మాణంలో భాగస్వాములయ్యారు. బ్యారేజీ నిర్మాణానికి యాభైవేల టన్నుల సిమెంట్ అయిదు వేల టక్కుల ఉక్కును ఉపయోగించారు. బ్యారేజీ ఎగువన నీటి జలాశయములో 3.5 టి.ఎం.సి.లు నీటి నిల్వ సామర్థ్యానికి అణుగుణంగా 12 అడుగుల ఎత్తును 17 టన్నుల బరువుగల 70 గేట్లను అమర్చారు. వరద ఉధృతిని తట్టుకునే విధంగా సీతానగరం సి.డబ్ల్యు.డి. వర్క్‌షాపులో గేట్లను తయారు చేశారు. గేట్లను అమర్చే సందర్భంలో ప్రమాదవశాత్తు ఇద్దరూ వర్క్ చార్జ్‌డ్ కార్మికులు షేక్ మహబూబ్ పిట్టర్, డి. సీతారామారావు ఎలక్ట్రీషియన్ మరణించారు. బ్యారేజీ నిర్మాణంలో ప్రమాదాలు తక్కువ శాతమే జరిగాయని చెప్పవచ్చు.

**విస్తారించిన కాలువలు :** విజయవాడను ఇంద్రకీలాద్రిపై నుండి వీక్షిస్తే ఒక పారిస్ నగరాన్ని తలపిస్తుంది. విస్తారమైన కృష్ణానది పరివాహకం అనుబంధ కాలువలు, కొండల మధ్య నగరం చూడముచ్చటగొలుపుతుంది. కృష్ణా డెల్టా కింద తూర్పు డెల్టా కొల్లేరు వరకు విస్తరించి ఏలూరు వద్ద కృష్ణా, గోదావరి కాలువలు కలుస్తాయి. పశ్చిమ డెల్టా ప్రకాశం జిల్లా పెద్ద గంజాం వరకు విస్తరించి ఉంది. కొమ్మమూరు కాలువ బకింగ్ హమ్ కాలువలో కలుస్తుంది. బందరు కాలువ చరిత్రలో

ప్రజల శ్రమదానం ఒక ఉజ్జ్వల ఘట్టం. పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నేతలు వేలాదిమంది ప్రజలను కార్యోన్ముఖులను చేసి స్వచ్ఛందంగా కాలువ పూడికలను శ్రమదానంతో తొలగించిన ఘట్టం నేటికీ మరవలేనిది.

*కల్లోల గౌతమి వెల్లువల కృష్ణమ్మ / తుంగభద్ర తల్లి పొంగి పొరిన చాలు / ధాన్యరాసులే పండుతాయి / కూడు గుడ్డకు కొదవలేదోయి...*

**బ్యారేజీ నిర్వహణ పట్ల అశ్రద్ధ తగదు :** ఏటా వేలకోట్ల విలువ చేసే వరి, చెరకు, వివిధ వాణిజ్య పంటల జల మాగాణులకు కృష్ణా డెల్టా వరప్రదాయినిగా మారింది. విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రానికి జలాలనందిస్తున్నది. కనకదుర్గమ్మ వారధిగా బహుళ ప్రయోజనాలకు నెలవైనది. 1989లో బ్యారేజీకి మరమ్మత్తులు జరిపారు. థర్మల్ కేంద్రం కోసం 3.5 టి.ఎమ్.సి.ల నీటిని నిరంతరం నిల్వ ఉంచడం వల్ల గేట్లు నిర్వహణకు మరమ్మత్తులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. 1987లో ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనుభవం కలిగిన జె. రాజారావు ఇంజనీర్ ఆధ్వర్యంలో ఒక కమిషన్‌ను నియమించింది. బ్యారేజి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, నిర్వహణకు గైకొనవలసిన చర్యలు, సూచనలను కమిటి ప్రభుత్వానికి నివేదికను అందించింది. బ్యారేజి పైనుండి భారీ వాహనాల రాకపోకలను నిషేధించింది. బ్యారేజి భద్రత నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తత అవసరమని, అందుకు తగిన సిబ్బందిని, తీసుకోవలసిన జాగ్రత్తలను కమిటీ వివరించింది.


వేలకోట్ల పంటలు పండించే బ్యారేజికి తగిన సాంకేతిక సిబ్బంది కరువయ్యారు. ఆపరేటర్లు, ఫిట్టర్లు, ఫోర్‌మెన్‌లు, మెకానిక్, హెల్పర్లు కావలసి ఉంది. నిర్వహణ పట్ల అలక్ష్యం వహిస్తే బ్యారేజీ మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2009 సెప్టెంబర్‌లో వచ్చిన పది లక్షల 94 వేలకు పైగా వచ్చిన వరదలను తట్టుకొని బ్యారేజీ నిలబడింది. వాస్తవంగా 10 లక్షల వేల క్యూసెక్కుల వరదను గరిష్టంగా విడుదల చేయడానికి బ్యారేజి డిజైన్ చేయబడింది. అందుకు భిన్నంగా పటిష్టమైన నిర్మాణమే అందుకు తారాణం.

**అరుదైన ప్రాచీన నగరం :** విజయవాడ అరుదైన నగరం. ప్రాచీన కాలం నుండి కోస్తా జిల్లాలకు కేంద్రబిందువు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కళలకు, వికాసానికి కేంద్రంగా విరాజిల్లిన నగరం. కృష్ణానదికి ఉత్తర దిక్కుగా ఉన్న విజయవాడ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కూడలిగా పూర్వ వైభవం సంతరించుకుంటున్నది. క్రీస్తుపూర్వం నుండి వర్తక, వాణిజ్యాలకు కేంద్రంగా భాసిల్లింది. నౌకాయానానికి ప్రసిద్ధి చెందింది. తూర్పు సముద్రాన్ని కలుపుతూ కృష్ణానదిలో పడవలలో వర్తకులు తమ సరకులను రవాణా చేస్తుండేవారు. పోతర్లంక ఆనాడు గొప్ప రేవు పట్టణం. 'పోత' అనగా సముద్రపు ఓడ వివిధ ప్రదేశాల నుండి నౌకాయానం సాగేది.

అర్జునుడు తపస్సు చేసిన ఇంద్రకీలాద్రి, పర్వతంపై వెలసిన దుర్గ మల్లేశ్వరి నిత్య యాత్రికులకు, భక్తులకు ఇలవేల్పుగా కొలువైనది. అక్కన్న మాదన్న గుహలు, మొగల్రాజపురం గుహలో మొఘలాయిల పాలనకు చిహ్నంగా ఉన్నాయి. ఉండవల్లి గుహలు ప్రసిద్ధిగాంచాయి. సర్ కట్టమంచి రామలింగారెడ్డి విజయవాడను బ్లెజ్‌వాడగా అభివర్ణించాడు. డా. కె.ఎల్. రావు గాంధీ కొండపై ఉద్యానవనాలను సృష్టించి, తన ఇంజనీరింగ్ ప్రతిభతో విజయవాడ ఉష్ణోగ్రతలను తగ్గించగలిగారు. గాంధీ కొండపై గాంధీ విగ్రహాన్ని, మ్యూజియంను నెలకొల్పి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. గత దశాబ్ది కాలంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా కృష్ణానది మధ్యలో ఉన్న దీవిని టూరిజం కార్పోరేషన్ వారు అభివృద్ధి పరిచారు. కొండపల్లి కోట పర్యాటకులను ఆకర్షిస్తున్నది. విజయవాడ నగరం వర్తక, వాణిజ్యాలకే కాకుండా ఆధ్యాత్మికత, పర్యాటక కేంద్రంగా బహుముఖంగా విస్తరిస్తున్నది. సాంస్కృతిక కళలకు, సాహిత్య కేంద్రంగా విరాజిల్లుతుంది. విజయవాడ రైల్వేజంక్షన్ ప్రధాన రైళ్ళ రాకపోకలకు ఆయువుపట్టు. నగరం ఇంతగా భాసిల్లడానికి సర్ ఆర్థర్ కాటన్ ఆలోచనలతో నిర్మించిన ఆనకట్ట జలరాశి అని చెప్పక తప్పదు.

**చిరస్మరణీయుడు కెప్టెన్ ఓర్ :** అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పడిన నేటి విజయవాడ నగరం దశ దిశలు వేగంగా అభివృద్ధివైపు పురోగమిస్తున్నది. కృష్ణానది ఆనకట్ట నిర్మాత, జలప్రదాత కెప్టెన్ అలెగ్జాండర్ ఓర్ చిరస్మరణీయుడు. ఆయన సృష్టించిన జలరాశి ధాన్యాగారపు జలరాశితో బహుముఖ ప్రగతికి దోహదపడుతుంది.

కె. వెంకటేశ్వర్లు
ఎం.ఎ., ఎం.సి.జె.,
నాగార్జునసాగర్
ఫోన్ : 944 085 4149





బ్రహ్మసమాజం - కాకినాడ

# ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజం – పరిఢవిల్లిన సాహిత్యం

*– కనుపర్తి విజయబక్ష్*

19వ శతాబ్దంలో భారతదేశంలో ఎన్నో మత సాంఘిక సంస్కరణోద్యమాలు ఆవిర్భవించాయి. వాటిలో బ్రహ్మసమాజము, ఆర్యసమాజము ముఖ్యమైనవి. పాశ్చాత్య సంస్కృతి, క్రైస్తవ మతంతో ఏర్పడిన సంబంధం దీనికి కొంత కారణమైంది. క్రైస్తవ మత విజృంభణతో భారతీయ చరిత్ర, సంస్కృతులలోకి ఔన్నత్యం గురించి ప్రత్యేక శ్రద్ధతో పరిశోధన ప్రారంభమైంది. భారత జాతికి వైజ్ఞానికంగా పునరుజ్జీవింప చేయాలనే ఆరాటమూ ఇందులో ఉంది. అటువంటి దృక్పథంతోనే 1828లో రాజా రామ్మోహనరాయ్ వంగ దేశంలో 'బ్రహ్మసమాజాన్ని' స్థాపించాడు. మధ్యయుగం నాటి భక్తి ఉద్యమ కారులవలె ఈయన కూడా మతంలోకి మూఢవిశ్వాసాలను ఖండించాడు. విగ్రహారాధనను ఖండిస్తూ సతీసహగమనం వంటి సాంఘిక దురాచారాల మీద ధ్వజమెత్తుతూ మత సంస్కరణ పరిధిని దాటి, సామాజిక సంస్థలకు, సంబంధాలకు పునర్వ్యవస్థీకరించడానికి 'బ్రహ్మసమాజం' ఒక సాధనమైంది.

రామ్మోహనరాయ్ బహుభాషా కోవిదుడు, మేధావి. పారశీ, ఉర్దూ, అరబ్బీ, ఆంగ్ల, సంస్కృత, బెంగాలీ భాషల్లో దిట్ట. అంతేకాదు. గ్రీకు, హీబ్రూ, లాటిన్, ఫ్రెంచి భాషల్లోను ప్రావీణ్యం సంపాదించాడు. ఐక్యమతాలను గూర్చి అధ్యయనం చేసి, శోధించి, తన పరిశీలనా జ్ఞానంతో అన్ని మతాలు ఒకే సత్యాన్ని బోధిస్తున్నాయనే నిర్ధారణకొచ్చాడు. వివిధ మతావలంబికులైన హిందువులలో మైత్రి కూర్చటానికి, మహమ్మదీయ, క్రైస్తవులలో సద్భావన కలిగించాలంటే ఒకే ఉపాయమని, అదే ఏకేశ్వరోపాసన అనే నిర్ణయానికి వచ్చాడు. హిందువులు విశ్వసించు గీతోపనిషత్తులు, ఏసుక్రీస్తు బోధలు, మహ్మద్ ప్రవక్త ఉపదేశాలు తన సిద్ధాంతాలలో ఏకీభవిస్తున్నాయని ఆయన సప్రమాణంగా ఋజువు చేశాడు. అందువల్ల అన్ని మతాలనవలంబించేవారు ఒకచోట చేరి పరమేశ్వరునికి ప్రార్థించవచ్చని అభిప్రాయపడ్డాడు. అందుకు నిమిత్తమై 1830లో కలకత్తాలో ప్రార్థనా మందిరాన్ని నిర్మించాడు. ఇందు జాతి, మత, కుల వివక్ష లేక అందరూ కలిసి భగవంతుని ప్రార్థించవచ్చని ప్రకటించాడు.

ఈ భావాలకు అనతి కాలంలోనే చదువుకొన్న పట్టణవాసులు ఆకర్షితులయ్యారు. 1864 ప్రాంతాల్లో కేశవచంద్రసేన్ తన ప్రచార యాత్రలో మద్రాసు రావటంతో తెలుగువారికి బ్రహ్మసమాజ భావాలతో పరిచయం ఏర్పడింది. (ఆంధ్రదేశం కూడా ఆనాటి మద్రాసు రాష్ట్రంలో భాగమేకదా!). 1869 నాటికి కలకత్తా వెళ్ళి చెంబేటి శ్రీధరలు నాయుడు బ్రహ్మసమాజికుడుగ తర్ఫీదు పొంది, మద్రాసుకు తిరిగి వచ్చాక దక్షిణ భారత బ్రహ్మసమాజాన్ని నెలకొల్పి, తెలుగు, తమిళ భాషల్లో ఆ ధర్మానికి సంబంధించిన పుస్తకాలను రాశాడు. దేవేంద్రనాథ్ ఠాకూర్ రచించిన 'బ్రహ్మధర్మం' గ్రంథాన్ని తెలుగులోకి అనువదించాడు. ఇదే తెలుగులో మొదటి బ్రహ్మసమాజపు గ్రంథం. ఆ తర్వాత మన్నవ బుచ్చయ్య పంతులు ఇదే గ్రంథాన్ని 1886లో 'Express of Indian Press' పేరు పునఃశోధించి అచ్చువేయించాడు. అప్పటికే ఆయన 'హిందూ రిఫార్మర్' పత్రికకు సంపాదకుడుగా ఉండేవాడు.

కేశవచంద్రసేన్ మద్రాసులో పర్యటించగా పండిత శివనాథశాస్త్రి ఆంధ్రలోకి కాకినాడ, రాజమండ్రిల్లో పర్యటించాడు.

ఇక్కడ మనమొక విషయాన్ని తెలుసుకోవలసి ఉన్నది. కలకత్తాలోని బ్రహ్మసమాజం రాజారామ్మోహనరాయులు

స్థాపించినప్పటివలెగాక క్రమంగా మూడు శాఖలుగా చీలిపోయింది. మహర్షి దేవేంద్రనాథ్ ఠాకూర్ (రవీంద్ర కవీంద్రుని తండ్రి) ఆధ్వర్యంలోని బ్రహ్మసమాజం 'ఆ బ్రహ్మసమాజ'మని కేశవచంద్ర లేక్‌చే స్థాపించబడినదాన్ని 'భారత వర్షీయ బ్రహ్మసమాజం' అని; దీని నుండి విడివడి ఆనంద్‌మోహన్ బోస్‌చే స్థాపించబడినదాన్ని 'సాధారణ బ్రహ్మసమాజమ'ని పిలిచేవారు.

అయితే ఆంధ్రదేశంలోకి బ్రహ్మసమాజ అనుయాయులు ఆ చీలికలకు, విభేదాలను గూర్చి పట్టించుకోక బ్రహ్మసమాజం - ప్రార్థనా సమాజం అనే పేర్లతో బ్రహ్మధర్మాన్ని అనుసరించారు. ఆంధ్రదేశంలో 1878లో రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం ప్రార్థనా సమాజం (మొట్టమొదటిది) స్థాపించటంతో 'బ్రహ్మసమాజం' కాలూనింది.

క్రమక్రమంగా కలకత్తా నుండి ఆంధ్రదేశానికి బ్రహ్మమత ప్రచారకులుగా వచ్చిన పండిత శివనాథ శాస్త్రి, హేమచంద్ర సర్కార్ మొదలైనవారి ఉపన్యాసాలు యువకుల్ని ఉత్తేజితులను చేశాయి. 1888లో కాకినాడలో దుగ్గిరాల సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో 'ప్రార్థనా సమాజం' పేరుతో స్థాపించబడింది. కలకత్తా అఖిల భారత బ్రహ్మసమాజాలకు కేంద్రం కాగా కాకినాడ ఆంధ్రదేశంలోని సమాజాలకన్నింటికి కలకత్తా వంటిది అయింది. అందుకు కారణం బ్రహ్మధర్మ ఆచరణ శీలి, సేవాపరాయణుడు, దయార్ద్రహృదయుడు, ప్రముఖ విద్యావేత్త, త్యాగశీలి అయిన రఘుపతి వెంకటరత్నం నాయుడు. ఆయన కాకినాడలో నెలకొల్పబడిన పిఠాపురం రాజా కళాశాలకి ప్రిన్సిపాల్‌గా ఎందరెందరో యువకుల హృదయాలలో బ్రహ్మరథ బీజాలు నాటారు. పిఠాపురం రాజా వారి అండదండలతో కాకినాడలో వెంకటరత్నం నాయుడు ఆస్తిక పుస్తక భాండాగారము, ఉచిత పఠకాలయము, యువజన సంఘం ఏర్పరిచాడు. ఆంధ్రదేశంలో మొట్టమొదటి అనాథ శరణాలయం రాజావారి ఆర్థిక సాయంతో స్థాపించబడింది. హరిజనులకు పాఠశాల, కళాశాలల్లో ప్రవేశం, యువతులకు ఉచిత విద్య పరపబడ్డాయి. కాకినాడలో 1927లో రాజావారి ఆర్థిక సాయంతో, నాయుడుగారి ఆధ్వర్యంలో సువిశాల బ్రహ్మమందిరం స్థాపించబడింది. అన్ని మత చిహ్నాలతో మత సామరస్యానికి ప్రతీకగ, గత వైభవ చిహ్నంగ ఈ నాటికి కాకినాడలో మహోన్నతంగ, ఠీవిగ, ప్రత్యేకంగ కనబడుతోంది. రాజమండ్రిలో కందుకూరి, కాకినాడలో నాయుడు సంఘ సంస్కరణ కార్యకలాపాలకు సారథులై నడిపారు.

ఈ రెండు పట్టణాలతో బ్రహ్మధర్మోద్యమంతో పోటీపడుతూ బాపట్ల - చీరాల - ఈపురుపాలెం - మచిలీపట్నం - గుంటూరు - ఏలూరు - గుడివాడ - విజయవాడ - మదనపల్లి - మున్నగు పట్టణాల్లో ప్రార్థనా సమాజాలు స్థాపించబడ్డాయి. ఎంతోమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆస్తిక్య భావాలు, సంస్కరణ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. దేశిరాజు పెద బాపయ్య అనే విద్యావేత్త వీరేశలింగం కంటే ముందుగానే యజ్ఞపవితాన్ని విసర్జించి, తల్లి ఆబ్దికాన్ని నిర్వహించాడు. శ్రీయుతులు తారకం, తల్లాప్రగడ ప్రకాశరాయుడు, కోకా సుబ్బారావు, కామరాజు హనుమంతరావు, పాలపర్తి నరసింహం, వేమూరి రామకృష్ణారావు, నాభి జగన్నాథం, అయ్యదేవర కాళేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు, పెద్దాడ రామస్వామి, పిళ్ళారిశెట్టి సీతారామయ్య, అక్కల కోటయ్య (M.L.C.), వారణాసి రామబ్రహ్మం, ఉన్నవ లక్ష్మీనారాయణ, తెలికచెర్ల వెంకటరత్నం, కవికొండల సాంబశివరావు, దుగ్గిరాల రామ్మూర్తి, మల్లాది హనుమంతశాస్త్రి, ఇంకా ఎందరెందరో మహామహులు సాంఘిక స్వచ్ఛతా ఉద్యమంలో, వింతుద్యాహుల్లో, సంస్కరణ కార్యాల్లో ఎనలేని సేవలందించారు.

**సాహిత్య వికాసం :**

ఏ ఉద్యమమైనా ప్రజలదాకా వెళ్ళాలంటే ప్రచారం అవసరం. ఆ ప్రచారం ఉద్యమ లక్షణాన్ననుసరించి కొంతవరకు ఆధారపడి ఉంటుంది. బ్రహ్మసమాజం మత - సంఘ సంస్కరణోద్యమం. ఆంధ్రదేశంలో ఈ ఉద్యమం బలపడేనాటికే బెంగాల్‌లో బ్రహ్మధర్మానికి సంబంధించిన ఎన్నో గ్రంథాలు ప్రచారంలోకి వచ్చాయి. అవి చాలామటుకు బెంగాలీ భాషలో ఉన్నాయి. కొన్ని ఆంగ్లంలోనూ ఉన్నాయి. మత ప్రచారంతో పాటు ఆయా పుస్తకాలు తెలుగులోకి అనువదింపబడ్డాయి. బ్రహ్మసమాజాన్ని గురించిన అనేక మౌలికాంశాలు, ఆ మత లక్ష్యాలు ఆంధ్రదేశంలోని బ్రాహ్మలకు ఈ అనువాద గ్రంథాల ద్వారానే పరిచయం చేయబడ్డాయి. కొంత సృజనాత్మక సాహిత్యము వెలువడింది. వ్యాసాలు, కవితలు ప్రార్థనా గీతాలు ముఖ్యమైనవి.

ఈ విషయాన్నే ప్రముఖ చరిత్రకారులు వి. రామకృష్ణ

తమ పరిశోధన గ్రంథం 'ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణోద్యమాలు'లో పేర్కొంటు "తెలుగులో బ్రహ్మసమాజ సాహిత్యం సృష్టి కావడం ఉద్యమ లక్షణాల్లో ఒకటి. ఆ సాహిత్యంలో కొంత బెంగాలీ రచనలకు అనువాదం. తక్కినది స్వాతంత్ర్య సాహితంగా వర్ణింపబడినప్పటికీ అది కూడా బెంగాలీ రచనలకు అంతో ఇంతో అనుసరణే" అంటారు.

ఆంధ్ర బ్రహ్మసమాజానికి చెందిన ఎందరో ప్రముఖులు కలకత్తా వెళ్ళి బెంగాలీ భాష నేర్చుకోవడం ఒక విశేషం. అంతేకాదు, అక్కడ సాధనాశ్రమంలో శిక్షణ కూడా పొందారు.

దేవేంద్రనాథ్ ఠాకూర్ చేత రచింపబడ్డ "బ్రహ్మధర్మము" బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను విశదీకరించే ప్రమాణ గ్రంథంగా బ్రాహ్మల చేత అంగీకరింపబడింది. ఈ గ్రంథం అనేక భారతీయ భాషల్లోకి అనువదింపబడింది. ఇందులో రెండు ఖండాలున్నాయి. మొదటి ఖండం ఆధ్యాత్మిక విషయాలను తెలుపుతుంటే రెండవది బ్రహ్మధర్మావలంబకులైన గృహస్థులు నిర్వర్తింపవలసిన దైనిక కృత్యాలు, నైతిక ధర్మాలను తెలుపుతుంది. మొదటి అనువాదం శ్రీధరుల నాయుడిది కాగా, తిరిగి 70 సంవత్సరాల తర్వాత పాలపర్తి నరసింహం, పాలవజ్ఝల లక్ష్మీనారాయణ అనువదించారు. ఇదేకాక, బ్రహ్మసమాస్థులకై జీవనవేదం, సాధన, బ్రహ్మోపాసన, బ్రహ్మధర్మ దీక్ష, బ్రహ్మధర్మ వ్యాఖ్యానం, శాస్త్రీయ బ్రహ్మవాదం, బ్రహ్మధర్మ సంగ్రహం, బ్రహ్మ మతోద్దేశము, భక్తాంజలి, బ్రహ్మసమాజ చరిత్ర మొదలైన మత సంబంధ సిద్ధాంత గ్రంథాలు అనువదింపబడ్డాయి. ఇవేకాక రామ్మోహన్‌రాయ్, దేవేంద్రనాథ్, కేశవచంద్రసేన్, శివనాథ్‌శాస్త్రి, రవీంద్రనాథ్ ఠాకూర్ జీవిత చరిత్రలు అనువదింపబడ్డాయి. బ్రహ్మ ధర్మ సుధ, బ్రహ్మ సమాజ చరిత్ర అనే ఉద్గ్రంథాలు స్వతంత్ర రచనలుగా వెలువడ్డాయి.

సీతానాథ తత్త్వ భూషణుడు ఆంగ్లంలో రచించిన 'A manual of Brahmo ritual and devotions'కి అనువాదం పాలపర్తి నరసింహం 'బ్రహ్మధర్మ అనుష్టాన పద్ధతి' అనే పేరుతో చేశాడు. బ్రహ్మధర్మ అనుష్టానానికి సంబంధించిన సమాచారం యొక్క అవసరం ఈ గ్రంథం తీర్చిదిద్దింది.

బ్రహ్మధర్మాన్ని గూర్చి, బ్రాహ్మల జీవిత నియమనిష్ఠలకు, తాత్త్విక, ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక విషయాలను గూర్చి విపులంగా, విశదంగా తెలుగులో స్వతంత్ర గ్రంథంగా తల్లాప్రగడ ప్రకాశరాయుడు 'బ్రహ్మధర్మ సుధ' అనే గ్రంథం రాశాడు. ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజానికి విశేష ప్రాముఖ్యాన్ని కల్పించినవాడు కందుకూరి వీరేశలింగం. ఆయన గొప్ప రచయిత కూడ అవటం వల్ల తన ఆశయాలకు, భావాలకు రచనల ద్వారా ప్రచారం కల్పించటమేకాక కార్యవాది, కర్మాచరణకు పూనుకున్నాడు.

విగ్రహారాధిక, ఏకేశ్వరోపాసక, ప్రార్థన ఇట్లా ఎన్నో వ్యాసాల్లో బ్రహ్మమత భావాలకు వెల్లడించాడు. ఆయన వ్యాసాలన్నీ ఉపవ్యాసాలుగా ప్రార్థనా మందిరంలో చేసినవే. ప్రతి ఉపన్యాసం యుక్తియుక్తంగా, సప్రమాణంగా ఉండేది. విపులంగా, స్పష్టంగా ఉండేవి. ఉపన్యాసం చివర ఈశ్వరునికి తనకు సత్కర్యాల్లో తోడ్పడే విధంగా తన తోటి వారికి పరోపకారం కలుగజేసే విధంగా, ధైర్యస్థైర్యాలను ఇవ్వవలసిందిగా ప్రార్థించటం ఉంది.

ఇక ఆయన నాటకం రాసినా ప్రవాసనం రాసినా, నవల, స్వీయ చరిత్ర అన్నింట్లో ఆయనకు ప్రీతిపాత్రమైన సంఘసంస్కరణ, ఆస్తిక్య మతాభిమానం ఉండవలసిందే. ఆయనే స్వీయచరిత్రలో ఆ విషయాన్ని చెప్పాడు. "సంఘసంస్కరణ సమాజ కార్యములయందును, బ్రహ్మసమాజ ధర్మ వ్యాపనమునందును నాకు విశేషాభిమానము. ఈ విషయములో సహితము నాకు విశేషాభిమానము. ఈ విషయములో సహితము నాకు కార్యశూరత ప్రియము, క్రియాశూన్యమైన కేవల వాక్యులత నాకు అప్రియము."

బ్రహ్మసమాజ మత నాయకులైన కేశవచంద్ర సేన్ మొదలైనవారివలెనే తాను 'స్వీయచరిత్ర' రాశాడు. పురమందిరాన్ని (Town Hall) నిర్మించి 1897లో ధర్మకర్తలకు అప్పగిస్తూ విక్షేప పత్రాన్ని (Trust Deed) వ్రాశాడు. అది కలకత్తాలోని బ్రహ్మసమాజ మందిరాన్ని అప్పగిస్తూ రామ్మోహన్‌రాయ్ రాసిన Trust Deedను పోలి ఉంటుంది.

'వివేక వర్ధని' పత్రికను స్థాపించి, కందుకూరి తెలుగు జర్నలిజంలో నూత్న ఒరవడిని దిద్దాడు. ఆ పత్రిక ముఖ్యోద్దేశం లోను మతమంటే బాహ్య చిహ్నాల ప్రదర్శన కాదని, సత్ప్రవర్తన అనీ, ఆ విశ్వాసం ప్రజల్లో నెలకొల్పటానికే పత్రిక స్థాపించినట్లు చెప్పుకున్నాడు. తాను అప్పటికే బహుదేవతారాధనను విడిచి ఏకేశ్వరోపాసనకు చేస్తున్నట్లు చెప్పాడు.

నాయుడుగారి శిష్యుడుగా పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని సంతరించుకున్నవారిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒకరు. ఆ శిష్యరికపు సువాసనల కవితా పమాలను ఆంధ్రదేశమంతా

వెదజల్లాడు దేవులపల్లి. గురువుగారి గురించి "నా యెడలో త్వదీయ చరణమ్ముల చిహ్నము లెన్నడేవియున్ మాయవు యేవిశోధపు తమపులు మాసిన గాలి" అంటాడు.

రవీంద్ర కవీంద్రునిలోకి విశ్వమానవ ప్రేమ, భగవద్భక్తి ఆయన్ని విశేషంగ ప్రేరేపించాయి.

*ద్వేషమున్నచోట దేవుండు వెలయడు*
*మతులు గతులు తప్పు మతము లేదు.*

మనుషులను వేరు చేసి మానవత్వాన్ని చంపే మతం వద్దనే వద్దు అన్నాడు.

*'మతమన్నది నా కంటికి మసకైతే*
*మతమన్నది నా మనసుకు మచ్చైతే*
*మతం వద్దు గితం వద్దు మాయామర్మం వద్దు'*
*ద్వేషాలు రోషాలు తెచ్చేది మతమైతే*
*కలహాలు కక్షలు కలిగించేదే మతమైతే*
*మతం వద్దు గతం వద్దు మారణహోమం వద్దు'*

రామ్మోహనరాయ హేతువాద దృక్పథం, స్వేచ్ఛాపిపాస కలవాడు. ఆయన దృష్టిలో మానవుడే మహోన్నతుడు. ఆ భావాన్నే కృష్ణశాస్త్రి వికసించే విధానమున మకుట ధారి మానవుడే అంటాడు. గుడి ఎక్కడో లేదన్నాడు. 'మానవా! మానవా! నీవు నిలచిన నెలవే కోవెల' అన్నాడు. 'ప్రతి కోవెలకు పరుగిడకు, ప్రతి బొమ్మకు కైమోడ్చకు' అంటూ ఆలయాల్లో మాత్రమే దేవుడు లేడు. దేవుడు లేనిచోటు అసలే లేదు అంటూ

*'శిథిలాలయమ్ములో శివుడు లేడోయి*
*వాడవాడల వాడె వాడలన్నిటవాడె*
*ఇంటి ముంగిట వాడె ఇంటింటిలోనవాడె*
*శిథిలాలయమ్ములో శిలలనుసందిటబట్టి*
*పూజారిదానికైపొంచి ఉన్నాడోయి'*

వర్ణ భేద నిరసనం రామ్మోహనుడు ప్రతిపాదించినదే. దాన్ననుసరించి సహపంక్తి భోజనాలు, హరిజనులతో కలసి చేయటం ఒకటి. సంఘ సంస్కరణకు పూనుకున్నవారిని కులం నుండి వెలివేయటమూ జరిగేది. కృష్ణశాస్త్రి కూడ అటువంటి బాధితుడే. అందుకే గుణం లేని కులం అనవసరమంటాడు.

*తెగ దెంచదయ్యా ఏ*
*ద్వేషపు సంకెళ్ళేకి*
*తెగనివి కావయ్యా యుగ*
*యుగములైనా కానీ!*
*ఏ కౌటిల్యము వీని*
*ఏర్పరచిందో కాని*
*చీకటి గదులున్నేజుగ*
*దీశ్వరాలయములోనే*
*గుణములేని వానిదే*
*కులమైతేనేమి*
*తృణమైతేనేమి శ్రీ*
*చరణమంటనేని*
*మాలలమేమో పనికి*
*మాలిన వారము ఏమో!*
*శ్రీలలితేశ్వర గళసవ*
*మాలాకుసుమాలమేమో!*

ఇవేకాక రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆంగ్లంలో చేసిన గంభీరోపన్యాసాలు, సూక్తులను కృష్ణశాస్త్రి పద్యాల రూపంలో "ఋగ్వేధి" అనే పేరుతో అనువదించాడు. నాయుడు యొక్క అపారమైన జ్ఞానసంపత్తి అస్తిక్యతా భావాలు, నీతిని గురించిన సూక్తులు వీటికన్నింటికీ పద్యరూపాన్నిచ్చాడు.

*తుదిమొదలు సర్వమతని కన్నెదుట నిలుచు*
*అతని ఏర్పాటులో నెన్నడైన నెటనొ*
*మంచిగా చెడ్డ మధువుగా మంచుకాదు*
*మారి తీరు నటంచు బ్రహ్మర్షి మాట*
*ప్రార్థనము లౌకికారణ్య పదములందు*
*పథములం చేర్చుదీపము; బ్రతుకులోకి*
*విడని వ్యూహమ్ము విప్పి తప్పించు మంత్ర*
*మనుచు రతనాల వేట బ్రహ్మర్షి మాట*

ఈ ఉద్యమ భావాల ప్రభావంతో వడ్డాది పబ్బరాయ కవి (వపరాయ కవి) రచించిన 'భక్తి చింతామణి శతకం'లో పద్యాలు బ్రహ్మసమాజికుల ప్రార్థనల్లోను చోటుచేసుకున్నాయి. 'ఏకమేవా ద్వితీయం బ్రహ్మ' అనే ఈశ్వరుడొక్కడే అనే బ్రహ్మధర్మ సూత్రాల కనుగుణంగా ఆయన పద్యాలుండేవి.

*వెలుగొక్కండ వఖండమీవెయభవా, వే వెల్గు, రే వెల్గు, జు*
*క్కలు గ్రొక్కారు మెఱుంగు, లర్చులు వెలదల్గా వెల్గులెన్నెన్నినీ*
*కళలే యేకమునందు దోచెడు వవేకంబులు భవన్మయనీ*
*తెలివివ్ సర్వము నిన్నె కాదలతల బుద్ధిన్, భక్త చింతామణీ!*

భగవంతుని సేవించరాక్క జపతపాలు, బాహ్య వేషధారణలవసరం లేదనీ, నిశ్చల భక్తి ఒక్కటే చాలనీ, భగవంతుని దర్శించటానికి కాశీయాత్రలు చేయనక్కర్లేదనీ, అంతటా భగవంతుని దర్శించవచ్చనీ నిశ్చల ధ్యానం ఉంటే

చాలు, గుళ్ళు గోపురాలు, విగ్రహాల పూజ అవసరం అంటాడు.

సుమధుర, మంజుల కవిత్వాన్ని బ్రహ్మసమాజ తాత్త్వికత భూమికగ చెప్పినవారిలో వేంకట పార్వతీశ జంటకవులు ప్రముఖులు. వారి 'ఏకాంత సేవ' రవీంద్రుని గీతాంజలి వంటిదని ప్రసిద్ధి పొందింది. వారి 'భావసంకీర్తనము', మరికొన్ని ఇతర రచనల్లోను ఏకేశ్వరోపాసనా సంబంధమైన, సంస్కరణాత్మకమైన భావాలు కనబడతాయి. వీరిపైన వెంకటరత్నం నాయుడు ప్రభావం కనబడుతుంది. నాయుడు షష్ట్యబ్ది సందర్భంలో వీరు సమర్పించిన "రత్నహారము"లో అరువది పద్యాల్లో ఆయన గొప్పతనాన్ని కీర్తించారు.

'కావ్యకుసుమావళి' గ్రంథంలో 'దేవుడు' అనే ఖండికలో ఎవరు ఏ పేరుతో ఏయే రూపంలో దేవుని పూజించినా ఆయనకు ప్రియమైనవి 'భక్తి' తప్ప మరొకటి కాదని, ఒకరి పద్ధతులను మరొకరు గేలిచేయటం తగదని హితబోధ చేశారు.

*నెలరేక గుఱుతుంచి కిలిచి 'అల్లా'యన్న*
*మరమేకు గని 'యేసుదొర'యటన్న*
*వెలిబూది మెయిబూసి విశ్వేశ్వరాయన్న*
*తిరునామముల వెట్టి హరియటన్న*
*నెవ్వరెట్లు నిలిచి యెవరెట్లు పిలిచిన*
*నెవ్వరెట్లు కొలిచి యెంచుకొన్న*
*దేర్చి తీర్పునట్టి దేవుడొక్కడె కాడె*
*ప్రాజ్ఞులైన పరమ భక్తులారా!*

'పంచమాభినందనము' ప్రబోధము అనే ఖండికలు అస్పృశ్యులను గూర్చి రాసినవి. పంచములకు తక్కువగ చూడవద్దనీ, 'పంచమ'మనే పేరు చాలా గొప్పదని అంటాడు. 'విశ్వమానవ సంపూర్ణ విగ్రహంలో అంత్యజుడు కూడ ఒక అవయవమే సుమా' అని అంటారు.

*'పంచమ నామ వేదమయి*
*భారత ముత్తమమై పొసంగా*
*బంచమ కుస్వరంబది ప్ర*
*పంచమనోహరమై యొసంగగా*
*బంచమ నామ మూర్తి యతి*
*పావన దేవతయై పెలంగగా*
*బంచముడే నికృష్టుడని*
*పల్కుట వంచనగాదె చూడగాక'*

ఇక్కడ 'పంచమ' శబ్దాన్ని ఉత్తమమైన వాటితో పోల్చిన తీరు ఎంతో సమంజసగ, ఉచిత రీతిగ ఉంది.

అంతేకాదు, మాల 'మాల' కాదకీ, అస్పృశ్యుడంటే ఎటువంటివాడో చెప్పారు.

*అన్నెమును బున్నెమెఱుగనియట్టి మాల*
*మాలయే? దేవుయెడబూల మాలగాక*
*తోడి జీవుల బ్రేమజూడని యాదయా*
*హీనుడేకదా యంటరానివాడు*

ఈ రచన అంతాను వెంకట పార్వతీశ్వర కవుల మానవత్వం, అస్పృశ్యతా నివారణా కాంక్ష, సంఘ సంస్కరణాభిలాష అనేక రకాలుగా స్పష్టమవుతుంది.

'గౌతమి కోకిల'గ ప్రసిద్ధి పొందిన వేదుల సత్యనారాయణ శాస్త్రి రచనల్లోను ఈ భావాల ప్రభావం కనబడుతోంది. ఈయన రచించిన 'ముక్తఝరి' కావ్యంపై రవీంద్రుని 'నిర్ఝరేస్వప్న భంగ' ప్రభావం కొంత ఉందని చెప్పొచ్చు.... 'బ్రహ్మసమాజమిచ్చిన చైతన్య బలంతో మూఢవిశ్వాస శృంఖలముల విదిల్చి తన జీవితానికి శరదుత్రవం చేపకున్న సంస్కర్త వేదుల' అని కీర్తింపబడ్డాడు.

*ఏ జాతీయో, దేశమేదియో ఏ వర్ణ*
*మో, మతం బేదియో పోనిమ్ము మనకేల*
*మనము మానవుల మీ మహికి కామందులము*
*విశ్వ పౌరుల యొక్క వృక్షమ్ము చివురలము*

అంటూ మనకు 'మనిషి' మాత్రమే ముఖ్యమనే ఉదాత్త భావాల్ని వెలిబుచ్చాడు.

'గుంటూరు కందుకూరి వీరేశలింగం'గా కొనియాడబడ్డ ఉన్నవ లక్ష్మీనారాయణ సంఘ సంస్కరణోద్యమంలోనేకాక కాంగ్రెసు ఉద్యమంలోను చురుకుగా పాల్గొన్నాడు. జాతీయోద్యమంలో అస్పృశ్యతా నివారణోద్యమం ఓ కీలకమైన భాగం. అంతకంటే ముందే బ్రహ్మసమాజం ఈ అస్పృశ్యతా నివారణోద్యమాన్ని చేపట్టటం, హరిజన పాఠశాలలు స్థాపించటం, వారి కోసమై శరణాలయాలు స్థాపించటం, వారి చదువు నిమిత్తమై కాకినాడ, పిఠాపురంలో గొప్ప ప్రయత్నం చేయటం ఆశ్చర్యంగొలుపుతుంది.

బృహత్ నవలగ నిషేధింపబడిన నవలగ, హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగ ఎన్నుకొన్న నవలగ, పేరుగాంచిన 'మాలపల్లి' రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ తన నవల ప్రారంభంలో 'ఓం బ్రహ్మకృపాహి కేవలం' అంటూ ప్రారంభించాడు. నవల్లోను ఎడనెడ చర్చలు, వర్ణవ్యవస్థను, విగ్రహారాధన్ను గూర్చి అభిప్రాయాలు ఉంటాయి.

ఇంకా ఎందరో రచయితుల వ్యాసాల రూపంలోను, పాటలు, గీతాలు కూడ రచించారు. బ్రహ్మోపాసకులకు ప్రార్థన (ఉపాసక) చాలా ప్రధానమైంది. అది వ్యక్తిగత – కుటుంబ – సామాజిక ప్రార్థన రూపంలో ఉండేది.

కలకత్తాలో బ్రహ్మసమాజం స్థాపించబడినప్పుడు ప్రతి శనివారం సాయంత్రం ఈశ్వరోపాసన జరుగుతుండేది. అప్పుడు ప్రార్థనాంగాలుగ వేదంలోకి ఏకేశ్వరోపాసన మంత్రాలు పఠించటం, తర్వాత ఉపనిషద్వాక్య పఠనం. ఆ తర్వాత ఆచార్యుని మతబోధ, తదనంతరం ప్రార్థనా శ్లోకాలను చదవడం ఉండేది. రాజా రామ్మోహనరాయ ఈ ప్రార్థనాధికంలో భక్తి కీర్తనలను చేర్చాడు. స్వయంగా ఎన్నో భక్తి కీర్తనలను గొప్ప సంస్కరణ అంటాడు పండిత శివనాథశాస్త్రి.

కేశవచంద్ర సేన్ ప్రార్థనాదికంలో సంగీతాన్ని చేర్చటమేకాక గీతాలు పాడేటప్పుడు వ్యాదవిశేషాలను వాడటం కూడా గమనించవచ్చు.

చెన్నపట్టణంలోని దక్షిణ ఇండియా బ్రహ్మసమాజం వారు మొట్టమొదటిగా అక్కడ ప్రార్థనా గీతాలను ప్రచురించే పని చేపట్టారు. వాటినే ఆంధ్రదేశంలోను పాడేవారు. కాని, నాయుడుగారి కృషివల్ల 'ఆంధ్ర బ్రహ్మ గీతాంజలి' అనే భక్తిగీతాల సంకలనం వెలువడింది. బాపట్ల సమాజం వారు 'గీతావళి' అనే చిన్న పుస్తకాన్నీ ప్రచురించారు. కృష్ణశాస్త్రి రచించిన 'మహతి' 'కన్నీరు' ఈ గీతాల్లో ఎన్నదగినవి. ఎంతోమంది రచయితలు రాసిన గీతాలన్నింటిని ఏర్చి కూర్చి తిరిగి 1947లో ఆంధ్ర బ్రహ్మధర్మ ప్రచార నిధి, కాకినాడ తరఫున ప్రకటించారు.

మొదటిరోజుల్లో 'ఉపాసక' అంటే కాకినాడ, రాజమహేంద్రవుల్లో ఇంకా తక్కిన మందిరాల్లో వీరేశలింగం రచించిన విశిష్ట వచనం పఠించటంగా ఉండేది.

చిలకమర్తి లక్ష్మీనరసింహం (సుప్రసిద్ధ కవి – రచయిత – వీరేశలింగం అనుయాయి) తన స్వీయ చరిత్రలో తాము (బ్రహ్మసమాజికులమంతా) నగర సంకీర్తన కావిస్తూ భక్తిగీతాలు పాడేవారమని' చెప్పుకున్నాడు. బ్రహ్మమందిరం గొప్పతనాన్ని చాటిచెప్పే గీతం ఉంది.

*'ఈ పధర్మ భవనములో*
*లేవు కుటిల శృంఖములు*
*లేవు కఠిన కుడ్యములు*
*చెరలు లేవు ఇరులు లేవు*
*కరుణాలయమిందు*
*అమృత కౌముదీమధుమిః*
*తానందమో, యౌనందమో'*

ప్రఖ్యాత వివాదాస్పద రచయితగా పెరుగొన్న 'చలం' వెంకటరత్నం నాయుడు శిష్యుడు. బ్రహ్మసమాజంలో చలం గొప్ప ఉత్సాహంతో పనిచేశాడు. 'చలం ఈ మతంలో ప్రవేసించిన తర్వాత ఇందులో మంచి యాక్టివిటీ వచ్చింది. ఎప్పుడు ఏదో ఒక కార్యక్రమమే! స్త్రీ పురుషులు కలిసి భోజనాలు ఉత్సవాలు, నగర సంకీర్తనలు, గాంధీజీ యుగంలో వచ్చిన చైతన్యం ఆనాడు వచ్చిందంటే అతిశయోక్తి కాదు. యువజన వర్గం మితిమీరిన ఉత్సాహంతో పనిచేసింది' అంటాడు చలం 'జీవితం–సాహిత్యం' రచయిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య.

చలం రచించిన పాటలు మచ్చుకి ఒకటి, రెండు :

*మోహన రాగం – చాపు తాళం*
*ఆశతో హృదయము అల్లాడునట్టుల*
*వేసవి ఈ గాలి విరహము పురికొల్పి*
*దివికి రంగులు దిద్ది తేజః స్ఫురణమెరయ*
*రావకీవకి, ప్రియుడు బ్రతిమాలినను బిలువ*
*అలల వెంబడి నీట ఆలింగనములిచ్చి*
*ఆలసింపగ వలదు ప్రియుడ వచ్చితివనగ*
*ఎటుల విలువ నేరుతుయెడ బాసిన నా ప్రభుకి*

అంటూ మధురభక్తి భావారాధన కనబడుతోంది. ఇంకా తత్త్వోపదేశాలు, మంగళ కీర్తలను, మాతృభావనతో రాసినవి ఉన్నాయి.

వీరేశలింగం సతీమణి కందుకూరి రాజ్యలక్ష్మమ్మ కూడా కొన్ని ప్రార్థనా గీతాలు రచించింది. అవి ఈ పుస్తకంలో చేర్చబడలేదు. కాని ప్రత్యేకం పుస్తక రూపంలో వచ్చాయి. స్త్రీల కోసం ప్రత్యేక ప్రార్థనా సమాజం రాజమండ్రిలో స్థాపించబడి, రాజ్యలక్ష్మమ్మ ఆధ్వర్యంలో స్త్రీలు కొందరు చేరి ప్రార్థనలు చేస్తుండేవారు. ఆమె రచించిన పాటలు సాహిత్య గౌరవాన్ని అందుకోవలసినంతవి కాకున్నా బ్రహ్మ సమాజస్థులయిన స్త్రీలలో ఆవిడ రచించినవే మొదటివి.

*ప్రార్థన సమాజము పెంపు జెందించి*
*పార్థమున మా జన్మ సాఫల్యమొనటమే;*

అంటూ ప్రార్థన సమాజాభివృద్ధికి కోరింది.

*అతివలారవినుడీ మను ఆది దేవుడొక్కడే మడీ*

*.........*

అని ఏకేశ్వర భావాన్ని చెలాయించటమేగాక, వీరేశలింగం స్త్రీవిద్యాభివృద్ధికి పాటుపడుతుంటే, ఆమె శరణాలయంలోకి స్త్రీలకు విద్యాబోధన చేస్తుండేది. అందుకే అంటుంది–

*విద్యవలన లాభమును వేగమె గ్రహింపుడి*
*విద్యావిహీనులకు విద్యాదానమొసగుడీ*
*విద్యాభివృద్ధికై వెలదులు ప్రార్థింపుడీ*
*ఆద్యంతరహితుని ఆత్మలో దలంపుడీ*

పాటలేకాక సీసపద్యాలు మూడింటిని రాసింది. విగ్రహారాధనను, నోములు, వ్రతాలను ఆమె మానేసింది.

*నోములు వ్రతములు మానితి*
*నా మానసమున వసించి నా కెల్లపుడున్*
*నీ మీద నచల భక్తికి*
*స్వామి దయ చేయుమయ్య సత్కృపతోడన్*

రామ్మోహన్‌రాయ్, తదితర బ్రహ్మసమాజస్థులు బెంగాల్ దేశంలో పత్రికలు నడిపినట్లు ఆంధ్రదేశంలోను తెలుగులో పత్రికలు నడిపారు. తత్త్వబోధికి, వివేకవర్ధిని, సత్యసంవర్థిని, ఈశ్వరవాది, సత్యవాదికి ధర్మజ్యోతి, ధర్మసాధన, మానవసేవ పత్రికలు బ్రహ్మసమాజం తరఫున నడవబడ్డాయి. ధర్మజ్యోతి, ధర్మసాధని పత్రికలు కాకినాడ బ్రహ్మసమాజం తరఫున నడపబడ్డాయి. బ్రహ్మసమాజాంశాలు, సంస్కరణ కార్యకలాపాది విషయాలు ప్రవక్తమయ్యేవి. ధర్మజ్యోతిని ఇప్పటికీ చాలా చిన్నదిగ 8 పేజీలలో కాకినాడ నుండి నడుపుతున్నారు.

బ్రహ్మధర్మ ప్రచారంలో తక్కిన సాహిత్యంతో పాటు ఈ పత్రికలు కూడ తమవంతు పాత్ర నిర్వహించాయనేది స్పష్టమవుతోంది.


బ్రహ్మసమాజానికి పూర్వం మతపరమైన సంస్కరణలు కొన్ని జరిగాయి. శైవం, వైష్ణవం సైతం అభ్యుదయాత్మకమైన ఆలోచనలు చేసినట్టివే. ఆంధ్రదేశంలో అందునా కోస్తా ప్రాంతాల్లో బ్రహ్మసమాజం వేళ్ళూనటానికి కారణం ఆ ప్రాంతవాసుల్లో తలెత్తిన చైతన్యం... తదుపరి రఘుపతి వెంకటరత్నం నాయుడు కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎందరెందరో యువకులను ప్రభావితం చెయ్యటం, ఆయను ఆసరాగా పిఠాపురం రాజా వారి ఆర్థిక సాయం, అంతేకాక ఆనాటి సంఘసంస్కర్తల్లో అగ్రగణ్యుడైన వీరేశలింగం ఈ పరిశుద్ధ ఆస్తిక్యంవైపు మళ్ళటం, ఆయనలోకి నిజాయితీ, పట్టుదల, కార్యాచరణాభినివేశం ఎందరినో ఆకర్షించాయి.

20వ శతాబ్ది కాలంలో దేశం మొత్తాన్ని చైతన్యవంతం చేసింది జాతీయోద్యమం. అంతకంటే ముందే నిద్రాణమైన సమాజంలో 'కదలిక'ను తెచ్చి ఎందరినో సంస్కరణోన్ముఖులుగా తీర్చిదిద్దింది బ్రహ్మసమాజం. జాతీయోద్యమంలోకి స్వేచ్ఛాపిపాస, సంస్కరణలు దేశం అంతటినీ కుదిపివేయటంతో బ్రహ్మసమాజ ఉద్యమమూ దానిలో ఇమిడిపోక తప్పలేదు.

సాహిత్యానికి సంబంధించినంతవరకు ప్రచార సాహిత్యాన్ని, సృజనాత్మక సాహిత్యాన్ని బ్రహ్మసమాజం సృష్టించుకొంది. వ్యాస విస్తరణ భీతివల్ల విపులంగా ఆయా విషయాలను కొంతవరకు మాత్రమే చెప్పటం జరిగింది. ఆ రోజుల్లో బ్రహ్మసమాజస్థులంటే చాలామందికి కసిగ ఉండేది. అందుకే వరవిక్రయం నాటకంలో 'బ్రహ్మసమాజి గుడికి' అని నిందించిన అంశం కూడా కనబడుతోంది. ఆ రోజుల్లో ఛాందకులకు వారి పట్ల ఏవగింపు ఉండేది.

అయితే, ఎందరో తొలితరం హరిజన నాయకులు ఈ సమాజానికి చెందినవారున్నారు. ఉదారమైన సంస్కరణ భావాలు తెలయించిన ఎందరో ప్రముఖులు బ్రహ్మ సమాజస్థులో, సానుభూతిపరులో అని చెప్పక తప్పదు 'రామమోహనరాయ్ నుండి ఎమ్.ఎన్. రాయ్‌వరకు' అనే గ్రంథంలో ప్రముఖ జర్నలిస్టు ఎన్. ఇన్నయ బ్రహ్మసమాజ సభ్యులు హిందువులతొ పోల్చి చూస్తే నిస్సందేహంగా అభ్యుదయవాదులే' అంటూ కాకి నేడు బ్రహ్మసమాజ్ స్థానం అచ్చులో ౹౩౹ స్థానమే అంటాడు. నిజమే కావచ్చు! అయితే అచ్చుల్లో ౹౩౹ కనబడకపోయిన పలుకుల్లో వినబడటాన్ని మనం కాదనలేనట్లు, బ్రహ్మసమాజము ఒకప్పుడు చీకట్లల్లో చిరుదివ్వెను వెలిగించిందన్న సత్యాన్ని చరిత్ర ఎప్పటికీ చెరిపివేయలేదుకదా!!

విజయ బక్ష్
మండపేట.
ఫోన్ : 944 138 2303



# అట్టమీది బొమ్మలు

అమెరికాలోని సంయుక్త రాష్ట్రాలలో మసాచుసెటీ రాష్ట్రం ఒకటి. దానికి ముఖ్య పట్టణమైన బోస్టన్ నగరానికి సమీపంలోనున్న ఊరు న్యూటన్. ఎడ్విన్ వీక్స్ 1849 సంవత్సరంలో సంపన్న కుటుంబంలో జన్మించాడు. తండ్రిది తూర్పు ఆసియా దేశాల నుంచి సుగంధ ద్రవ్యాలు, తేయాకు దిగుమతి చేసుకునే వ్యాపారం. ఆర్థికంగా బలపడిన కుటుంబం కావటంతో ఎడ్విన్ తాను చిత్రకారుడు కావాలనే కోర్కెను వెల్లిబుచ్చినపుడు అభ్యంతరం చెప్పకుండా ప్రోత్సహించాడు. ప్రాథమికంగా ఫ్లోరిడా కీస్ అనే వ్యక్తివద్ద చిత్రకళను అభ్యసించాడు. 18 సంవత్సరాల వయసు నాటికే అతని మొదటి చిత్రకళా ప్రదర్శన న్యూటన్‌లో జరిగింది. స్టూడియోలోకంటే ప్రకృతి, మనుష్యులు, సంఘటనలను చిత్రించటంపై మనసు పెట్టేవాడు. దానితో అమెరికా వదలి సూర్యకాంతి పుష్కలంగా లభించే దక్షిణ అమెరికాకు ప్రయాణమయ్యాడు. సూర్యకాంతి ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ప్రజలు గాఢమైన రంగులను ఉపయోగించడానికి ఇష్టపడతారు (ఉదాహరణకు రాజస్థాన్). తేలికగా కనిపించే రంగులు అటువంటి ప్రదేశాలలో వెలవెలబోతాయి. అందువల్ల భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతాలలోని యూరోపియన్ చిత్రకారులు ఎక్సోటిక్ లొకేషన్స్‌గా పిలుస్తారు.



ఎడ్విన్ లార్డ్ వీక్స్
(1849-1903)

యాత్రలకు చదువుకు అయ్యే ఖర్చంతా కుటుంబం భరించింది. 21 వ సంవత్సరాల వయస్సులో తన స్వస్థలమైన న్యూటన్ పట్టణంలో స్టూడియోను ఏర్పరచారు. A.C. Clore అనే మిత్రునితో కలసి Egypt, సిరియా, జెరూస్‌లేం, డమోస్కర్‌వరకూ ప్రయాణం చేశారు. అతని Sketch book ఎన్నో దేశాలలోని దృశ్యాలతో నిండిపోయింది. 1869 వ సంవత్సరంలో దక్షిణ అమెరికాను చుట్టివచ్చాడు. సహజమైన సూర్యకాంతిని రంగుల సాంద్రతతో చిత్రించాడని పలువురు మెచ్చారు. ఆ మరుసటి సంవత్సరం (1871) పారిస్ వెళ్ళి అక్కడ వియాన్ బొన్నెట్, జెరోమ్ అనే ప్రసిద్ధిగాంచిన ఇద్దరు చిత్రకారుల నుంచి మరిన్ని మెళకువలు నేర్చాడు. ఇదే సమయంలో గ్రీస్, టర్కీ దేశపు అందాలను, అక్కడి మానవ సంబంధాలను తన రచనలలో బహిర్గత పరిచాడు లార్డ్ బైరన్. అతని ఆలోచనలతో ఎందరో ఔత్సాహిక చిత్రకారులు 18వ శతాబ్దంలో ప్రభావితులై ఇటలీ దేశం నుంచి తూర్పు, దక్షిణ దిశలుగా ప్రయాణం చేసి, గ్రీస్, టర్కీలను చేరుకుని చిత్రాలు వేసేవారు. వీరిని ఓరియంటల్ చిత్రకారులుగా, దీనిని ఓరియలంటలిజంగా పేర్కొంటారు. ఈ ఓరియంటల్ అన్న పదం ఫ్రెంచి భాష నుంచి తీసుకొనబడింది. ఎడ్విన్ అతి త్వరలోనే ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన ఓరియంటల్ చిత్రకారులలో ఒకనిగా గుర్తింపబడ్డారు. 1870 నుంచి 78 వరకు ఈజిప్ట్, ఆఫ్రికాలోని మొరాకో దేశాలలో విస్తృతంగా ప్రయాణించాడు. 1882లో భారతదేశం చేరుకుని, ఒకటిన్నర సంవత్సరం ఇక్కడ గడిపాడు, అనేక రాజస్థానాలు దర్శించాడు. వారి అభిమానాన్ని చూరగొన్నాడు. రాజులు, నవాబులు అతని ప్రయాణాలకు అన్ని సదుపాయాలు చేకూర్చారు. 1884లో పారిస్ నగరంలో అతని చిత్రకళా ప్రదర్శన మొదటిసారిగా జరిగినపుడు మెడల్ ఆఫ్ ఆనర్ లభించింది. 1889లో బంగారు పతకం బహూకరించబడింది. 1896లో ఫ్రెంచి దేశం తమ అత్యున్నత పురస్కారమైన లీజియన్ ఆఫ్ ఆనర్ తో సత్కరించింది. స్వదేశంలోనే కాదు విదేశాల నుంచి అనేక గౌరవ పురస్కారాలు పొందాడు. జర్మనీ దేశం ఆర్డర్ ఆఫ్ సెయింట్ మైఖేల్ అవార్డ్‌ను ప్రధానం చేయటమేగాక తమ మ్యూజిక్ సెషన్‌లో అతనికి శాశ్వత సభ్యత్వాన్నిచ్చింది.


1897 – 1895లో తన ప్రయాణ అనుభవాలను "నల్లసముద్రం నుంచి పర్షియా చివరిగా ఇండియా" అనే పేరుతో చిత్రాలతో కూడిన పుస్తకాన్ని ప్రచురించాడు. రెండు సంవత్సరాలు తరువాత పర్వతారోహణలో సాహసకృత్యాలు అనే పేరుతో పుస్తకం వ్రాశారు. నవంబరు 1903 వ సంవత్సరంలో పారిస్‌లో ఉండగానే అంతిమశ్వాస విడిచారు. చనిపోయేనాటికి అతని వయసు 54 సంవత్సరాలు. ఎడ్విన్ మంచి ఫోటోగ్రాఫర్. ఇప్పటిలా అప్పుడు నెగిటివ్ రోల్ ఫిలిం మార్కెట్‌లో లభించటమన్నది మొదలు కాలేదు. ఎవరికి వారే సిల్వర్ నైట్రేట్‌తో కూడిన ద్రావకాన్ని సన్నని పొరగా కోటింగ్ ఇస్తూ నెగిటివ్‌ను తయారు చేసుకునేవారు. ఎడ్విన్ కూడా అలానే తయారుచేసుకునేవాడు. ఫోటోలలో బంధించబడిన లిప్తకాలపు కాలప్రవాహాన్ని తన పెయింటింగ్స్‌లో యాక్షన్‌కుగాను వాడుకునేవాడు.

**ముఖచిత్రం :** ఫానీ. ఈమె తన సహచిత్రకారుడైన Frances Hale Weeks సతీమణి. అత్యంత జాగ్రత్తతో ఇప్పటికీ freshగా మింట్ కండిషన్‌లో ఈ చిత్రం ఉంది.

**రెండవ అట్ట :** యమునాతీరంలో..

**మూడవ అట్ట :** సుల్తాన్ సాకీలు. Giulio Rosati అనే పేరుగల ఇటాలియన్ చిత్రకారుని చిత్రమిది. ఇతని కాలం 1858–1917.

**చివరి అట్ట :** గుడిమెట్లు... ముచ్చట్లు. ఎడ్విన్ ఈ చిత్రాన్ని 1885లో చిత్రించారు.




మాస్క్ నుంచి తిరిగి వస్తున్న మొగల్ చక్రవర్తి (ఢిల్లీ)




మధురలో గోకులాలయం

మధుర శ్రీకృష్ణుడు నడయాడిన స్థలం ఇప్పటికీ అనేక ప్రాచీన కట్టడాలు నిండిన ప్రదేశం. ఆనాడు ప్రజాబాహుళ్యం తక్కువగా ఉండేదనే అంశం ఈ చిత్రం చూపిస్తుంది.



ముత్రాలో పాత కోట



ఢిల్లీ చక్రవర్తి

లార్డ్ ఎడ్విన్ ఢిల్లీలో చిత్రాలు వేసే సమయానికి మొగలాయ్ పాలన ముగిసింది. భారతదేశం ఇంగ్లండు ప్రభుత్వ పాలనలోకి వచ్చింది. కొడిగడుతున్న ఆనాటి మొగలాయ్ దర్పాలకు ఈ చిత్రం ఒక నిదర్శనం. ఇస్లాం మత విధిలో భాగంగా ప్రార్థన చేయడానికి మందీ మార్బలంతో మసీదుకు బయలుదేరిన సుల్తాన్ ఒకప్రక్క మరొక ప్రక్క (చిత్రంలో ఎడమ ప్రక్క) సుల్తాన్‌కు సాగిలపడిన సామాన్యుడిని గుర్తించండి.

# బోనాల పండుగ

– బొజ్జగాని భీమమ్మ

తెలంగాణ ప్రాంతంలో బోనాలు పండుగకు ప్రత్యేక స్థానం వుంది. సాధారణ పర్వదినాలకు అతీతంగా బోనాల ఉత్సవాల్ని జరుపుకుంటారు. సామూహిక భక్తి చైతన్యంతో సమైక్యతను పాటిస్తారు. హైందవాచారంలో జరిగే బోనాలోత్సవం ప్రకృతి పండుగ అని చెప్పవచ్చు. బోనం అంటే భోజనం అని అర్థం. అమ్మోరికి బోనం సమర్పించుకోవడం అంటే ఆ దేవత కరుణాకటాక్షాలను ఆశించడమే! భక్తిశ్రద్ధలతో శుచి శుభ్రతతో కొండంత నమ్మకంతో అమ్మోరి తల్లికి బోనం సమర్పించకునే ప్రజలు, ఆ అమ్మోరితల్లిని వివిధ రూపాలలో ఆరాధించడాన్ని కూడా గమనించవచ్చు. జానపదుల విశ్వాసంలో అమ్మవారే అమ్మోరు! ఎల్లమ్మ, పోశమ్మ, మైసమ్మ, గజ్జెలమ్మ, మహంకాళమ్మ, బాలమ్మ, గౌరమ్మ, అంటూ వివిధ రూపాల్లో అమ్మోరిని దర్శించుకునే గ్రామీణులు 'బోనం' ఎత్తడాన్ని తమకు దక్కిన గొప్ప అదృష్టంగా భావిస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, తమ పిల్లా పాపలు ఆయుఃరారోగ్యాలతో వర్థిల్లాలని తమ పాడి, పంట, సమృద్ధిగా వెలుగొలందాలని, బోనాన్ని సమర్పించుకోవడంలో అమ్మవారిని ప్రసన్నం చేసుకోవడం ఒక్కటే కాదు, తమని ఎల్లవేళలా కాపాడుతూ వున్నందుకు కృతజ్ఞతల్ని తెలుపుకోవడం కూడా అని చెప్పవచ్చు. ఈ క్రమంలో "అమ్మా మమ్మల్ని ఆయుఃరారోగ్యాలతో కాపాడు తల్లీ" అనే భక్తుల మొరనే కాదు, "మమ్మల్ని కాపాడినందుకు దండాలు తల్లీ" అనే భక్తుల నివేదనను కూడా గమనించవచ్చు.

**ఆషాడ బోనాలు :** "ఆషాడ మాసం – ఆడపిల్ల" అనేది పెద్దల కాలం నుండి వస్తున్న నానుడి. ఈ ప్రకారం ఆషాడ మాసం ఆడపిల్లలకు ప్రత్యేకమైనదిగా చెప్పుకోవచ్చు. ఈ ప్రత్యేకతను ఆషాడ మాసం పుట్టింటికి వచ్చే కొత్తగా పెళ్ళయిన ఆడపిల్లల్లో తప్పనిసరిగా గోరంటాకు పెట్టుకునే ఆడపిల్లల్లో గమనించవచ్చు. ఇది ఏమైనప్పటికీ ఈ ఆషాడమాసంలో వర్షాకాలం ఆరంభం కాబట్టి జల్లులు కురుస్తూ ప్రకృతి పరవశిస్తుంటుంది. సాక్షాత్తూ ప్రకృతి రూపమైన అమ్మోరికి ఈ చిరుజల్లు సాక్షిగా బోనాలు సమర్పించుకోవడం జరుగుతుంది. ఆషాడ మాసం మొత్తంగా బోనాల కోలాహలం నెలకొని వుంటుంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కవారం అమ్మగారిని ఆరాధించడం కొనసాగుతుంది.

**జంటనగరాల్లో బోనాలు :** జంటనగరాల బోనాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన గుర్తింపు వుంది. ఈ బోనాల వేడుకలలో భాగంగా తొలిసారిగా గోల్కొండ బోనాలు ఆరంభమౌతాయి. గోల్కొండపై వెలసిన జగాలను ఏలే జగదాంబిక తల్లిని కొన్ని వందల సంవత్సరాల నుండి బోనంతో ఆరాధించడం జరుగుతున్నది. పదవ శతాబ్దంలో తమ రాజ్యాన్ని విస్తరింపజేసుకున్న కాకతీయులు గోల్కొండ బోనాలను ఆరంభించారని చరిత్ర చెబుతోంది. కాకతీయుల తర్వాత గోల్కొండ కోట కుతుబ్‌షాహీల వశమయ్యింది. అయినప్పటికీ అమ్మోరికి బోనాలు సమర్పించుకోవడం మాత్రం ఆగలేదు. ముఖ్యంగా ముస్లిం మతస్థులైన కుతుబ్‌షా, తానీషా, అమ్మవారిని పూజించినట్లుగా... అమ్మవారి ఆలయాన్ని పునరుద్దరించినట్లుగా... వారిని అమ్మవారు చల్లగా కాపాడినట్లుగా చెబుతున్న చారిత్రక సత్యాలు, మత సమైక్యతను సూచిస్తున్నాయి. అయితే అమ్మవారికి బోనం సమర్పించుకోవడం అనేది నవాబు కాలంలో ఆగిపోయింది. ఈ విరామం అమ్మవారికి కోపాన్ని తెప్పించిందని, కాబట్టే 19వ శతాబ్దాంలో జంటనగరాల్లో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెందిందని, భక్తజనాలు నేటికినీ కథలు కథలుగా చెప్పుకుంటారు. అమ్మవారిని తిరగి బోనాలతో పూజించిన తర్వాతే ప్లేగు వ్యాధి తగ్గిపోయిందనేది కూడా చరిత్ర మరువని వాస్తవం. కాబట్టే భక్త జనులు అమ్మవారికి ఆగ్రహం తెప్పించకుండా ఏటా బోనాన్ని విరామం లేకుండా సమర్పించుకుంటూ వస్తున్నారు. ఆషాడమాసంలో గోల్కొండలో ఆరంభమయ్యే ఈ బోనాలు తిరిగి ఆషాడ మాసాంతంలో గోల్కొండలోనే ముగుస్తాయి. ఇది మొదటి నుండి ఆనవాయితిగా ఆచారంగా కొనసాగుతు వస్తున్న ఒక నమ్మకం, ఒక పద్ధతి. గోల్కొండ తర్వాత లష్కర్, బల్కంపేట, ఉజ్జయినీ మహాంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించుకుంటారు. ఆ తర్వాత చిన్న చిన్న గుడుల్లో బోనాలు సమర్పణ వుంటుంది. ముఖ్యంగా ఎక్కడ బోనాల పండు జరిగినా మహిళలే బోనాలు ఎత్తుతారు.

**బోనాల్లో రంగం :** బోనాల పండుగలో "రంగం" విశిష్టత అత్యంత ప్రాధాన్యమైనది. "రంగం" అంటే జరిగింది, జరగబోయేది, జరగాల్సింది, వివరించే కాలజ్ఞానం. భక్తులు

ఎలా వుండాలి? ఏం చేయాలి? రాబోవు కాలం వుంటుంది? వంటి ముఖ్యమైన విషయాలు రంగంలో చర్చించబడుతాయి. రంగంలో భవిష్యవాణిని వినిపించే శివసత్తి పూర్తిగా అమ్మవారి ఆధీనంలోకి వెళ్ళిపోతుంది. భక్తులు శివసత్తి చెప్పే భవిష్యవాణిని ఆసక్తితో తిలకిస్తారు. ఇటీవలీ కాలంలో భవిష్యవాణి లైవ్ టెలికాస్ట్ అవుతూ ప్రపంచ వ్యాప్తంగా అలరింపబడుతుంది.

**ఫలహారబండ్ల – ఊరేగింపు :** బోనాల పండుగలో భాగంగా "ఫలహారబండ్ల" ఊరేగింపు కూడా ప్రధానమైనది. ఈ వేడుకలను ఘటోత్సవంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే పిల్లలులేని వాళ్ళు, పిల్లలు కలిగినవాళ్ళు, పెళ్ళి కావాల్సిన వాళ్ళు, పెళ్ళిళ్ళు కావలసిన వాళ్ళు, ఘటాల్ని అమ్మవారికి సమర్పించుకుంటారు.

**పోతరాజుల విన్యాసం :** గ్రామ దేవతలు మొత్తం ఏడుగురు అక్కా చెల్లెళ్ళుగా చెప్పుకుంటారు. వారి పేర్లను ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా చెప్పుకున్నప్పటికీ ప్రసిద్ధంగా వినిపించే పేర్లని పరిశీలిస్తే, ఎల్లమ్మ, గౌరమ్మ, గజ్జెలమ్మ, పోశమ్మ, మంకాలమ్మ, బాలమ్మగా చెప్పుకోవచ్చు. వీరి సోదరుడే పోతరాజుగా గ్రామీణుల కథనం. బోనాల ఉత్సవం రోజుల్లో తన సోదరీమణుల కోసం పోతరాజు ఆగమనం వుంటుందనేది ఆచరణలో కనిపిస్తున్న నమ్మకం.

**పూనకాలు :** బోనాల పండుగలో భాగంగా జానపదుల్లో కనబడే "పూనకం" అనే శారీరక ప్రక్రియ ప్రత్యేమైనది. అమ్మవారు తమను ఆవహించారనే నమ్మకంతో లోకాన్ని మరచి పూనకంతో ఊగిపోతుంటారు. పూనకంతో ఊగిపోయే వాళ్ళలో మహిళలే ఎక్కువగా వుంటారు. గ్రామాల్లో వీళ్ళను సిగసత్తులు అంటారు. పూనకాన్ని 'సిగం' అంటారు. వేప మండలు ధరించి సింగంతో ఊగిపోయే మహిళల్ని భక్తులంతా భక్తి పారవశ్యంతో గమనిస్తూ అనుసరిస్తుంటారు.

**నమ్మకాలు :** అమ్మవారికి భోజనంతో పాటుగా పసుపు, కుంకులు, వేప మండలు, ప్రత్యేకంగా సమర్పించుకుంటారు. భోజనం సమర్పించుకోవడంలో "తమని కలకాలం చల్లగా కడుపులో పెట్టుకు కాపాడు తల్లీ" అనే నివేదన వున్నది, పసుపు సమర్పించుకోవడంలో వేప మండలు సమర్పించుకోవడంలో శాస్త్రీయంగా క్రిమి కీటకాలకు విరుగుడు వున్నప్పటికీ భక్తుల పరిభాషలో పసుపు సౌభాగ్యాన్ని, కుంకుమ ఆశీర్వచనాన్ని, వేప మండలు ప్రకృతిని ఆరాధనను తెలియజేస్తున్నాయి. కొందరు భక్తులు కొత్త బట్టలు కూడా అమ్మవారికి సమర్పించుకుంటారు. ముఖ్యంగా అమ్మవారికి మట్టికుండతో భోజనం ఎత్తడం అనేది పురాతన నమ్మకం, కాని కాలక్రమంలో ఇత్తడి, వెండి, బంగారు, రాగి, పాత్రలలో బోనాలు ఎత్తడం ఆరంభించారు. అమ్మోరు ప్రకృతి మాత. మట్టి ప్రకృతిలో భాగం, కాబట్టి మట్టికుండ శ్రేష్ఠమైనదనే నమ్మకాన్ని ఎవ్వరూ కాదనలేరు.

**శ్రావణ మాస బోనాలు :** ఆషాఢ మాసంలో అమ్మవారు ఆడపిల్లగా పుట్టింటికి వస్తుందనే నమ్మకం భక్తుల్లో ఎంత గాఢంగా నెలకొని వుందో, శ్రావణ మాసంలో అమ్మవారు కోడలు పిల్లగా ఇంటిని అలరిస్తుందనే నమ్మకం కూడా అంతే గాఢంగా అలుముకుని వుంది. ఈ నమ్మకాలు సైద్ధాంతికమైనవి. కాకపోయినా జానపదుల్లో అతి ప్రాచీనమైనదిగా అలరిస్తూ వస్తున్నాయి. ఆడపిల్లయినా, కోడలు పిల్లయినా, అక్కడ ఆడజన్మ ప్రధానంగా వుంది. ఇది ఏమైనప్పటికీ అమ్మవారి పూజ అందరికీ రక్ష అనేది మాత్రం వాస్తవం. జంటనగరాల్లో ఆషాఢ మాస బోనాలు ముగిసిన తర్వాత ఇతర ప్రాంతాల్లో శ్రావణ మాస బోనాలు ఆరంభమౌతాయి. తెలంగాణ వివిధ ప్రాంతాల్లో శ్రావణ మాసంలో జరిగే బోనాల పండుగకు ఒక ప్రత్యేకత వుంది. శ్రావణ మాసంలో చాలామంది మాంసాహారం భుజించరు. కాగా, శ్రావణ మాస బోనాల్లో అమ్మవారికి బోనంతోపాటుగా కోడి, మేక, బలి ఇవ్వడం వుంటుంది. కల్లు సమర్పించుకోవడం వుంటుంది. గ్రామాల్లో కులాల పట్టింపు ఎక్కువగా వుంటుంది. ఈ క్రమంలో శ్రావణ మాసం మొత్తంగా ఒక్కోసోమవారం ఒక్కో కులస్థుల అమ్మవారికి బోనం సమర్పించుకుంటారు. ఎవ్వరు ఎక్కడ బోనాలు సమర్పించుకున్నా అమ్మోరు తల్లి మాత్రం అందరికీ ఒక్కటే అనేది అందరు గమించాల్సిన విషయం.

కొన్ని కులాలు అమ్మవారికి ఇంటి నుండి బోనం తీసుకెళ్ళిన తర్వాత, తిరిగి అమ్మవారి సమక్షంలో భోజనాలు తయారు చేసుకుని ఇంటిల్లిపాది ఆరగిస్తారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో అమ్మవారి పూజకు అయ్యవారు వుండరు. భక్తులే పూజారులుగా కొనసాగుతుంటారు.

బొజ్జగాని భీమమ్మ
హైదరాబాద్.
ఫోన్ : 846 406 7373



# లింగభేదం

క్రోమోసోమ్ కథనమ్

– ము.పా.సా.

## క్రోమోసోమ్ కథనమ్ – 14

*ఆడపిల్లలందరూ ఎదిగి, తమ తల్లుల్లాగే తయారవుతారు. అది వాళ్ళ ఖర్మ. కుర్రాళ్ళకలా జరగదు. అది వీళ్ళ ఖర్మ.*

*– ఆస్కార్ వైల్డ్*

కొందరు పిల్లలు పుట్టినప్పుడు పాలిపోయినట్టుగా, బలహీనంగా ఉంటారు. పాలు కూడా తాగటానికిష్టపడరు. కాని, తరువాత, ఎంత తిండిపోతులుగా తయారవుతారంటే, పొట్ట పగిలిపోతుందేమోనన్నంతగా ఏదో ఒకటి మెక్కుతూనే ఉంటారు. ఇదో జబ్బు. దీన్ని ప్రేడర్ – విలి సిండ్రోమ్ అంటారు. 1956లో స్విస్ వైద్యులు దీన్నో ప్రధాన ఆరోగ్య సమ్యసగా గుర్తించారు. "రోగాలకు జన్యువులు కారణం కాదు!" అని మనం చెప్పుకున్నప్పటికే దీనికి జన్యుపరమైన కారణాలున్నాయనటంలో సందేహం లేదు. ఈ జబ్బు వచ్చిన వాళ్ళకు చేతులూ, కాళ్ళూ చిన్నవిగా ఉంటాయి. జననాంగాలు పూర్తిగా ఎదగవు. బుద్ధిహీనత (mental retardation) కూడా ఉంటుంది. అడిగినప్పుడు భోజనం లభించకపోతే చాలా గోల చేస్తారు. కాని, Jigsaw - Puzzles సాక్వ చేయటంలో గొప్ప నేర్పుంటుంది" అన్నాడో డాక్టర్ ప్రేడర్ – విలి సిండ్రోమ్‌కు కారణమైన జన్యువు, దీనికి పూర్తి విరుద్ధమైన మరో వ్యాధి – ఏంజిల్ మాన్ సిండ్రోమ్‌ని కూడా ప్రేరేపిస్తుందని 1980లలో తెలుసుకొన్నారు. ఈ వ్యాధి సోకిన పిల్లలు తీగలాగ సన్నగా ఉంటారు. ఓ పట్టాన నిద్రపోరు. హైపర్–యాక్టివ్. మొహం కోలగా ఉంటుంది, (కుక్కల్లాగ) నాలిక బైటికి పెడుతుంటారు. మరబొమ్మల్లాగ నడుస్తారు. సంతోషంగా, నవ్వుతూ కనిపిస్తారు. కాని వాళ్ళకు నవ్వాగదు. మాటలు రావు. మందబుద్ధులు. ఈ వ్యాధి అరుదుగా వస్తుంది.

మనం తెలుసుకోవలసిన విషయమేమిటంటే, ఈ రెండు జబ్బులకూ మూలం క్రోమోసోమ్–15. అంటే, ఇది లేనివాళ్ళే వీటి బారినపడతారు. ప్రెడర్–విలిలో తండ్రివైపునుండీ, ఏంజిల్‌మాన్‌లో తల్లివైపునుండీ ఇది సంతానినికి చేరదు. ఒక జబ్బుకు తండ్రిదీ, మరొకదానికి తల్లిదీ బాధ్యత.

తరువాతి రోజుల్లో దీని గురించి జరిగిన పరిశోధనల్లో కొన్ని సంచలనాత్మక విషయాలు తెలిసాయి. గ్రెగర్ మెండల్ తర్వాత, జెనెటిక్స్ శాస్త్రమే పునరావిష్కృతమైనట్టనిపించింది. జన్యుభాష స్పష్టంగా లేదా? అది డిజిటల్‌గా లభించి లేదా? జన్యువుల్లో ఇప్పటిదాకా మనకు తెలియని రహస్య చరిత్ర ఏదో నిక్షిప్తమై ఉంది. తను తల్లి లేదా తండ్రి నుంచి వచ్చినదాన్నన్న విషయం జన్యువులు గుర్తుపెట్టుకుంటాయి. దీనికి సంబంధించిన ఒక ముద్ర దాని మీద ఉంటుంది. ఇదెలా జరుగుతుందో ఇప్పటికీ స్పష్టంగా తెలియదు. పరిణామ సిద్ధాంతంలోని కీలకమైన అంశం ఇదే.

1980లలో ఒకే పేరెంట్ (తల్లి లేదా తండ్రి)తో ఎలుకలలో సంతానోత్పత్తి చెయ్యటానికి ప్రయత్నించారు శాస్త్రజ్ఞులు. అప్పటికి క్లోనింగ్ గురించి ఎవరికీ తెలియదు. ఇద్దరు తల్లులతో చేసిన ప్రయోగంలో పిండం ఏర్పడిందిగాని చుట్టూ 'మాయ' (placenta) తయారు కాలేదు. ఇద్దరు తండ్రుల విషయంలో, 'మాయ' ఏర్పడిందిగాని పిండం పూర్తిగా రూపుదిద్దుకోలేదు. అయితే ఈ ప్రయోగాలవల్ల ఒక విషయం మాత్రం స్పష్టంగా తెలిసింది. తండ్రుల జన్యువులు 'మాయ'కూ, తల్లుల జన్యువులు పిండానికీ కర్తలు.

సాధారణంగా, ప్రయోగాలు ఎక్కువగా ఎలుకలతో చేస్తారు. కాని, ఎలుకలన్నీ ఒకే రకం అనుకుంటే పొరబాటే. Peromycus maniculatus జాతి ఎలుకలకు "నీతి నియమాలు" అస్సలు లేవు. ఆడ ఎలుకలు, అనేక పురుష ఎలుకలతో సంగమించి పిల్లల్ని కంటాయి. అంటే, ఎందరో తండ్రులు! కాని మరో జాతి Peromyscus Polionatus ఎలుకలు "పతివ్రతలు". వాటి సంతానానికి ఒకడే తండ్రి.

మరి ఈ రెండు జాతుల ఎలుకలనూ కలిపితే ఏమవుతుంది? మళ్ళీ ఇక్కడ, ఏది తండ్రి, ఏది తల్లి అన్న దానిమీద ఫలితాలు ఆధారపడి ఉంటాయి. తిరుగుబోతు తండ్రి అయితే పిల్లల సైజు పెద్దగా ఉంటుంది. ఏకపత్నీవ్రతుడైతే చిన్న సైజు పిల్లలు పుడతాయి. తల్లుల

విషయంలోనూ ఇంతే. ఈ ప్రయోగాలు మరెంతకాలం కొనసాగేవోగాని, 1997లో డాలి (గొర్రె)ను క్లోనింగ్ ద్వారా సృష్టించారు. జన్యువుల ఇంప్రింటింగ్ ద్వారా పునరుత్పత్తి జరుగుతుంది. కాని డాలీ విషయంలో ఇంప్రంటింగ్ ఎందుకు జరగలేదో ఇప్పటికీ స్పష్టంగా తెలియదు.

క్రోమోసోమ్ – 15లోని ఇంప్రింట్ అయిన ప్రాంతంలో సుమారు ఎనిమిది జన్యువులుంటాయి. ఇందులోని ఒక జన్యువు ఏంజిల్‌మాన్ సింట్రోమ్‌కు కారణం. $UBE_3A$ అనబడే మరో జన్యువు ప్రేడర్ – విలిని ప్రేరేపిస్తుంది.

అయితే, జన్యు విభజన వల్ల ఈ వ్యాధులు రావు. తల్లి గర్భంలో అండం ఏర్పడినప్పుడు, అది రెండు (తల్లిదండ్రిని) క్రోమోసోమ్‌ల ప్రతులను స్వీకరిస్తుంది. కాని, అదనంగా ఒక జత విడిపోకపోవటం కూడా జరుగుతుంది. అప్పుడు అండంలో మూడు ప్రతుల క్రోమోసోమ్‌లు చేరతాయి. రెండు తల్లివీ, ఒకటి తండ్రిది. లేటు వయసులో గర్భం దాల్చిన మహిళల్లో ఇది ఎక్కువగా జరుగుతుంది. అండానికి దీనివల్ల కొన్ని సమస్యలు వచ్చే అవకాశం లేకపోలేదు.

మాతు (placenta)ను తయారు చెయ్యడానికి తండ్రి జన్యువులు, తల్లి జన్యువులను నమ్మవనుకుంటే, సెరెబ్రల్ కర్టెక్స్‌ను తయారు చేయటానికి తల్లి జన్యువులు, తండ్రి జన్యువులను నమ్మవు.

1998లో ఎలుకల్లోని మరో 'ఇంప్రింటెడ్ జన్యువు' గురించి తెలిసింది. 'తల్లి స్వభావం' అనేది ఒకటుందనుకుంటే దాన్ని నిర్దేశిస్తుంది. పిల్లల్ని సాకటం దీని సహజ లక్షణం. ఈ జన్యువు లేని ఆ ఎలుకలు గర్భం దాల్చవని కాదుగాని, అవి 'కనికరించని తల్లు'లే పిల్లల్ని పట్టించుకోవు. సహజంగానే, ఇలాంటి తల్లుల సంతానంలో శిశుమరణాలెక్కువ. తల్లికీ, తండ్రికీ తేడా లేకపోతే పిల్లల జీవితాలెంత నరకప్రాయమవుతాయో!

ఒక జజనీస్ బయాలజిస్ట్ యో ఇవాసా ప్రకారం, తండ్రి క్రోమోసోమ్‌లే సంతానం సెక్స్‌ను నిర్ణయిస్తాయి గనుక, తల్లి స్వభావం కూడా తండ్రి క్రోమోసోమ్‌లలో ఇంప్రింట్ అయి ఉంటుంది. లండన్‌లోని Institute of Child Health కు చెందిన డేవిడ్ స్క్యూస్, ఈ తల్లి తండ్రి క్రోమోసోమ్‌ల గురించి మరికొన్ని కొత్త విషయాలు వెల్లడించాడు. పిల్లలలోని ఆటిజం, డిస్లెక్సియా, మాటలు పలకలేకపోవటం వంటి సమస్యలు ఆడపిల్లలకన్న మగపిల్లల్లో ఎక్కువగా చూస్తుంటాం. మగపిల్లవాడు, తల్లి నుండి ఒక X క్రోమోసోమ్ గ్రహిస్తాడు. అంటే, దానిమీద తల్లి ఇంప్రింట్ మాత్రమే ఉంటుంది.

'గత శతాబ్దమంతా' స్త్రీ పురుష ప్రవర్తనల్లో తేడా ఎందుకుంటుంది అన్న దాని గురించి చర్చ జరిగింది. కొందరు ఇవి పుట్టుకతోనే ఉన్నాయన్నారు. మరికొందరు, పిల్లలు పెరిగే క్రమంలో, సామాజిక కారణాలవల్ల ఏర్పడ్డాయన్నారు. అసలు విషయమేమిటంటే, సామాజిక కారణాలుండవని ఇంతవరకెవరూ చెప్పలేదు. ప్రాకృతిక కారణాలకు గురించే మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉంది. ఏడాది పాపల్ని ఆడబొమ్మలెందుకు ఆకర్షిస్తాయి? అదే వయసున్న మగపిల్లల్ని రైళ్ళు, బస్సులు ఎందుకాకర్షిస్తాయి? ఈ విషయంలో సామాజిక కారణాలకన్న, స్వభావాలే ప్రధానం అనిపించటంలేదూ! ఆడ, మగ పిల్లల ప్రవర్తనల్లో మొదటి నుండే తేడాలుంటాయి. మనుషుల్లోనే కాదు అన్ని జీవజాతుల్లోనే అంతే. శరీరానికున్నట్టే, మెదడుకూ లింగభేదం ఉంటుంది. జీనోమ్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తుంది. ఇంప్రింటెడ్ జన్యువులకూ, లైంగిక ప్రవర్తనకూ సంబంధముంది.

**క్రోమోసోమ్ – 15 – జ్ఞాపకశక్తి**

హ్యూమన్ జీనోమ్ ఒక పుస్తకం. దీన్ని పూర్తిగా చదివి, అర్థం చేసుకొని, పరస్పర విరుద్ధంగా కనిపించే విషయాలను అవగాహన చేసుకోగలిగిన సమర్థవంతుడైన టెక్నీషియన్స్, మరో మానవ శరీరాన్ని పునర్నిర్మించగలడు. పునఃసృష్టి చెయ్యగలిగిననాడు, మేరీ షెల్లీ సృష్టించిన ఫ్రాంకెన్‌స్టైన్ కన్న తక్కువేమీ కాదు. అయితే ఏమిటి? శరీరాన్ని సృష్టించి, ప్రాణం కూడా పోశాడనుకోండి. కాని బతకటమంటే మరబొమ్మలాగ కదలటం కాదు గద. ఆ కొత్త శరీరం పరిసరాలకు స్పందించాలి. అవసరాన్నిబట్టి తను మారాలి, మార్చాలి, సర్దుకుపోవాలి. స్వతంత్ర జీవిగా బతకటమంటే అదే. ముఖ్యంగా, తనను సృష్టించిన ఫ్రాంకెన్‌స్టైన్ ఆజ్ఞల ప్రకారం కాకుండా స్వంతంగా బతకగలగాలి. ఒక్కమాటలో చెప్పాలంటే జన్యువులు స్వంత నిర్ణయాలు తీసుకోవాలి. గుండె ఎలా కొట్టుకోవాలి, ఎన్నిసార్లు కొట్టుకోవాలో జీనోమ్ నిర్ణయించదు. కళ్ళు వాటంతటవే మూసుకుంటాయి, తెరుచుకుంటాయి. మెదడు దానికదే ఆలోచిస్తుంది. జన్యువులు వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తాయని అంగీకరించినా, వివిధ శరీర ధర్మాలకు అధికార వికేంద్రీకరణ జరిగిందని మాత్రం చెప్పవచ్చు.

క్రోమోసోమ్-16 మీద ఉంటాయి, అధికార వికేంద్రీకరణను అనుమతించే జన్యువులు. జ్ఞానం, జ్ఞాపక శక్తికి సంబంధించినది. మనమేమిటి? ఎలా ఉంటాం? ఎలా స్పందిస్తాం? అనే విషయాలను మన జన్యువులు నిర్ణయిస్తాయి. అయితే ఇదంతా ప్రాథమిక సమాచారంవరకే. జీవిత కాలంలో మనం నేర్చుకున్న విషయాలు, మన అనుభవాలు కూడా మన ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి.

జీనోమ్‌ను ఒక Information processing computerతో పోల్చవచ్చు. తనకు చేరిన సమాచారంలో అవసరమైన విషయాలను జన్యువుల్లో భద్రపరుస్తుందిది. ఈ సమాచారాన్ని ప్రాసెస్ చేసే ప్రక్రియ, పరిణామ క్రమంలో చాలా మందకొడిగా సాగుతుంది. సమాచారం ఆధారంగా ఒక చిన్న మార్పు జరగాలన్నా కొన్ని తరాలు పడుతుంది. అయితే, జీనోమ్ ఇందుకు ప్రత్యామ్నాయంగా, సమాచారాన్ని కొన్ని సెకండ్లలోనే ప్రాసెస్ చేసి, దాచుకునే ఏర్పాటు చేసుకుంది. అదే మన మెదడు. నరాల ద్వారా చేతి స్పర్శ తెలుస్తుంది. ఆ స్పర్శకు ఎలా స్పందించాలో మెదడు నిర్ణయిస్తుంది.

జ్ఞానార్జన, నేర్చుకోవటం అనే విషయం న్యూరోసైన్సెస్ మరియు సైకాలజీకి సంబంధించింది. స్వభావానికి (instinct) భిన్నమైనదిది. జన్యుపరంగా ఏర్పడిన ప్రవర్తనను స్వభావం అంటాం. అనుభవంతో అందులో మార్పు వచ్చినప్పుడు అదే జ్ఞానమవుతుంది. కాని కొన్ని ఎందుకు స్వభావ సిద్ధంగా చేస్తాం? కొన్ని ఎందుకు నేర్చుకుంటాం? భాష స్వభావసిద్ధమైనది. యాస, పదాల మీద పట్టు సాధించటం నేర్చుకోవటంలో భాగం. ఇప్పుడు మనం ఒక అజ్ఞాత జీనియస్ గురించి మాట్లాడుకుందాం. అమెరికన్ పరిణామ శాస్త్రజ్ఞుడు జేమ్స్ మార్క్ బాల్డ్విన్ 1896లో ఒక వ్యాసం ప్రచురించాడు. అప్పటి నుండి ఇప్పటి దాకా దాని గురించి ఎవరూ పట్టించుకోలేదు. కాని, 1980లలో కొందరు కంప్యూటర్ సైంటిస్ట్‌లకు (కంప్యూటర్‌లలో) సమాచారం ప్రాసెస్ చెయ్యటంలో ఆ వ్యాసం కీలకమనిపించింది.

ఆ రోజుల్లోనే బాల్డ్విన్ ఒక మౌలిక ప్రశ్న లేవనెత్తాడు. మనుషులు కేవలం స్వభావానికనుగుణంగా మాత్రమే బతకక ఎందుకు కొత్త విషయాలు నేర్చుకుంటారు? నేర్చుకోవటం మంచిదీ, స్వభావం చెడ్డదీ అనుకుంటారు కొందరు. జ్ఞానం ఉన్నతమైనది, ఉదాత్తమైనది. స్వభావం ప్రాకృతికం. మనిషై పుట్టినవాడు స్వభావం నుండి ఎదిగి, జ్ఞానార్జన చెయ్యాలి. అప్పుడే జీవితం సార్థకమవుతుంది. కేవలం స్వభావరీత్యా మాత్రమే బతికితే మనిషికీ, పశువుకూ తేడా ఏముంది? ఈ రకాల వాదనలతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (A.I.) పరిశోధకులు జ్ఞానానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. కంప్యూటర్ శాస్త్రజ్ఞులు గనక వాళ్ళ లక్ష్యం సమాచారాన్ని సేకరించి, ప్రాసెస్ చెయ్యగలిగే ఒక అత్యుత్తమ యంత్రాన్ని రూపకల్పన చెయ్యటం మాత్రమే. అయితే, ఇదే వాళ్ళు చేసిన పొరపాటు. స్వభావరీత్యా నేర్చుకోగలిగినంత వరకూ జంతువులకూ, మనుషులకూ తేడా లేదు. నడుస్తాం, పాకుతాం, ఏడుస్తాం, కళ్ళు మూసుకుంటాం, తెరుస్తాం. ఈ విషయాల్లో మనకూ ఓ కోడిపల్లకూ ఏమీ తేడా లేదు. స్వభావానికి అదనంగా మనం సేకరించే విషయాల్లో మాత్రమే జ్ఞానం అవసరమవుతుంది. ఉదాహరణకు చదవటం, కారు డ్రైవ్ చేయటం, వస్తువులు కొనటం, అమ్మటం వగైరా. "ప్రకృతి ప్రసాదించిన దానికి అదనంగా నేర్చుకోవటమే జ్ఞానం" అన్నాడు బాల్డ్విన్.

అయితే, ఈ నేర్చుకునే క్రమంలో, సమస్యలకు స్వభావ సిద్ధమైన పరిష్కారాల నుండి పక్కకు తొలగుతున్నాం. ఉదాహరణకు పాడి పరిశ్రమ వచ్చిన తర్వాత జనానికి పాలు అరగని స్థితి ఏర్పడింది. (Indigestibility of Lactose) వెన్న తీయటం, ప్రారంభమైన తర్వాత ఈ సమస్య మరింత పెరిగింది. జన్యు సమాచారం ఆధారంగా కాక, నేర్చుకోవటం ద్వారా మన ప్రవర్తన ప్రభావితమైందంటే, నాలుగు బిలియన్ సంవత్సరాలయినా సేకరించిన జ్ఞానం ప్రాధాన్యత తగ్గిందన్నమాట. నేర్చుకునేదంతా సంస్కృతిలో భాగం.

స్వభావానికీ, సంస్కృతికీ, మధ్య సమతుల్యత పాటించాడు బాల్డ్విన్. ఇవి పరస్పర విరుద్ధమైనవి కాదు. రెండూ అవసరమే. మన ఆలోచించగలిగిన శక్తి, మన బుద్ధికి కూడా స్వభావమే ప్రభావితం చేస్తుందన్న విషయం మనం విస్మరిస్తున్నాం. అలాగే, స్వభావ సిద్ధంగా బలపడే పక్షులకు, జంతువులకు నేర్చుకునే శక్తి ఉంటుందని మనం గుర్తించాలి. తేనెటీగలు, ఏ పువ్వులో ఎంత తేనె ఉంటుందో అనుభవంతో తెలుసుకుంటాయి. కొన్ని జలచరాల్లో కూడా నేర్చుకునే స్వభావం ఉంది. కొంతకాలం క్రితం, నేర్చుకోవడమంటే ఏమిటి? కొత్త విషయాలను నేర్చుకునే క్రమంలో మెదడు కణాల్లో ఏ మార్పులొస్తాయి? అని అధ్యయనం చేశారు ఎరిక్ కాండెల్. సెంట్రల్ నెర్వస్ సిస్టమ్‌లో నరాల కణాలుంటాయి.

వీటి గుండా ఎలక్ట్రికల్ సిగ్నల్స్ ప్రయాణిస్తాయి. నరాల కణాల మధ్యన ఉన్న సినాప్సెస్‌ను చేరినప్పుడు ఎలక్ట్రికల్ సిగ్నల్, కెమికల్ సిగ్నల్‌గా మారుతుంది (సినాప్స్ దాటిన తర్వాత అది తిరిగి ఎలక్ట్రికల్ సిగ్నల్‌గా మారుతుంది). కాండెల్ పరిశోధన ఈ దిశగానే కొనసాగింది.

మన మెదడు, జీనోమ్ కన్నా ఎక్కువ సమర్థవంతంగా పనిచేస్తుంది. ఇందులో బిలియన్‌లకొద్దీ bases బదులు ట్రిలియన్స్ కొద్దీ సినాప్సెస్ ఉంటాయి. మైక్రోగ్రాముల్లో కాకుండా కిలోగ్రాముల్లో ఉంటుంది దీని బరువు. మూడు పరిమాణాల్లో, నిరంతర మార్పు చెందుతూ ఉంటుంది. దీనివల్ల వేడి పుడుతుంది. ఆవిరి యంత్రంలాగ పనిచేస్తుంది. DNAలోని నాలుగు న్యూక్లియోటైడ్స్ బదులు వేలాది ప్రొటీన్లు, న్యూరోట్రాన్స్ మిటర్స్, ఇతర రసాయనాలుంటాయిందులో. జీనోమ్‌లో ఓ పట్టాన మార్పు రాదు. కానీ సినాప్సెస్ మారని క్షణముండదు. మెదడుది స్వేచ్ఛాజీవితం. జీనోమ్‌లాగ జన్యు నిర్ధారితం కాదు. అయినప్పటికీ మన వాదనలో అంతర్లీనంగా ఉన్న వైరుధ్యాన్ని అంగీకరించక తప్పదు. జన్యువులే మెదడునూ తయారు చేస్తాయి. అంటే, వాటి సామర్థ్యం మీదే ఆధారపడి ఉంటుందిది. మెదడు నిరంతరం మారుతూ ఉండాలని నిర్ణయించింది జన్యువులే. ఈ ప్రక్రియ ఎలా జరిగిందన్నది ఇప్పటికీ ఒక మిస్టరీగానే మిగిలింది. జన్యువుల సామర్థ్యానికి ఒక అద్భుత తార్కాణం మెదడు. శరీర ధర్మాల వికేంద్రీకరణను శాసించింది జీనోమ్.

ఇక జ్ఞాపకశక్తి గురించి మనం మరొక్క విషయం తెలుసుకోవాలి. Volado జన్యువు ఒక ప్రొటీన్‌ను తయారు చేస్తుంది. ఈ ప్రొటీన్‌కన్న కణాలను బంధించి ఉంచే లక్షణమే 'జ్ఞాపకశక్తి' కావచ్చు. న్యూరాన్‌లను టైట్‌గా దగ్గిరకు చేర్చుతుందిది. ఏదైనా కొత్త విషయం నేర్చుకున్నప్పుడు మెదడులోని న్యూరాన్ నెట్‌వర్క్‌లో మార్పువస్తుంది.

(Matt Ridley రచన ఆధారంగా)

తెలుగు : ము.పా.సా. హైదరాబాదు.
ఫోన్ : 917 767 8708



వైద్యులు శవపరీక్ష చేసేముందు – దీర్ఘనిద్రలో వున్న బైరన్ అద్భుతమైన సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

అప్పుడే నెరుస్తున్న ఉంగరాల జుత్తు, మరగకాసిన పాలలాంటి అతని మోముచాయను మరింతగా మెరిపిస్తున్నవి....

ఆ గది గవాక్షం నుంచి వీస్తున్న తుఫాను గాలులు ఆ ఉంగరాల ముంగురులను చిందరవందర చేస్తూ అతను ఇంకా ప్రాణంతో ఉన్నాడనే భ్రమ కలిగిస్తున్నాయి....

ఎందరో సుందరీమణులను అతని పాదాక్రాంతం చేసిన అతని పొడవాటి కనురెప్పలు నీలిబూడిద కళ్ళను అరమోడ్పుగా కప్పి ఉంచాయి, ఇంకా ఈ ప్రపంచపు దుర్మార్గాన్ని చూడాలేమోనని అనుమానంతో...

ప్రేమికుల, సున్నితమైన ఎన్నోఎన్నో అరచేతులు నిమిరిన అతని బుగ్గలు కందిపోయినట్లున్నాయి....

విల్లులాంటి అతని పైమోవి సంధించిన మన్మథబాణాలు ఒక్కటీ వృథాపోలేదని ఒక కొంటె అరనవ్వులా పెదవి చివరలు వంపు తిరిగి వున్నాయి – ప్రపంచాన్ని ఎగతాళి చేస్తూ...

మగువుల మోవి తేనెల త్రాగిన మత్తులో – మధువును పెదవి చివరే వుంచిన – ఎర్రని మెరుపు మెరుస్తూనే ఉంది...

'ప్రపంచానికి ప్రియమైనదేదో వదిలి వెళ్తున్నా'నన్న తృప్తి వదనంలోని ప్రశాంతత కనపడుతోంది....

పుట్టుక నుంచీ అతనిని వెన్నాడుతూ చిన్నబుచ్చిన అవిటికాలు వక్రంగా వెక్కిరిస్తోంది!

తన ఆలోచనలను, అంతస్సంఘర్షణలను – అనుభూతుల సుఖదుఃఖాలను, స్వేచ్ఛాప్రియత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన అసాధారణ కవితా ధారను రాసిరాసి అలసిపోయి అతని పొడవాటి కుడిచేతి అంగుళీయాలు – విశ్రాంత హృదయంమీద సేదతీరుతున్నాయి.

"కాలానికి కష్టానికి తట్టుకుని – 'నా శ్వాస' ఆడుతూనే వుంటుంద"ని అతని బలమైన నమ్మకం – మరణాన్ని వమ్ము చేసినట్లు అక్కడి వాతావరణం వెలుగుతోంది....

*బైరన్ గ్రంథ వివరాలు చివరి పుటలో చూడండి.....*

# హంసలదీవి
## గోపాల శతకం

*– కోసూరి దామోదరనాయుడు*

హైందవ సంస్కృతిలో ఆలయాలకు విశిష్ట స్థానముంది. భగవంతుడు సర్వాంతర్యామి అనడానికోసం పూర్వీకులు అడవులమధ్య, కొండలమీద, నదీతీరాలలో, మైదాన ప్రాంతాలలో, గుహలలో, జలప్రదేశాలలో, ద్వీపాలలో ఆలయాలు కట్టారు. వీటిలో 'ద్వీప ఆలయాలు' కొన్నే. వైష్ణవులకు ఆరాధ్యమయిన 'శ్రీరంగం' ఉభయకావేరుల మధ్య ఉన్న ద్వీపం. ఆలాగే కృష్ణాజిల్లాలోని వేణుగోపాలస్వామి ఆలయాలలో ఒకటయిన 'గోపాలదేవ' ఆలయం హంసలదీవిలోనిదే. కృష్ణానది సాగరసంగమం చేసే చోట 'హంసలదీవి'లో నెలకొన్న స్వామిపై కాసుల పురుషోత్తమ కవి ఒక మంచి శతకం వ్రాశాడు. ఆ శతకంలోని అందచందాలను 'కృష్ణాపుష్కరాల' సందర్భంలో స్మరించుకొందాం.

భగవంతునికి భక్తునికి వున్న సంబంధం చాల చిత్రమయింది. మరి ఆ భక్తులలో 'కవి' ఒకడయితే చెప్పపనిలేదు. భక్తిసామ్రాజ్యంలో కాళ్ళుపట్టుకోవడాలు, కోపంతో ఆడిపోసుకోవడాలు, బతిమాలుకోవడాలు, ఆవంతదాన్ని గుమ్మడంతగా పొగడుకోవడాలు, అవసరమయితే దైవలీలల్ని గడ్డిపోచలుగా తిప్పికొట్టడాలు సహజం. ఇవన్నీ హంసలదీవిగోపాలశతకంలో కనిపిస్తాయి.

తెలుగుకవులు నన్నయనుండి అనువాదసాహిత్యానికి అలవాటుపడ్డవారు కనుక తమ భావాలను నిర్భయంగా చాటుమాటు లేకుండా కావ్యాలలో చెప్పడానికి లేదు కనుక శతకాలలో తమ ఆవేదనల్ని, అంతరంగాల్ని ఆవిష్కరించకొన్నారనడం సబబు.

కట్టుకొన్నమగడు కాళ్ళీడ్చుకొంటూ ఎక్కడెక్కడో తిరిగి ఇంటికివస్తే మగనిరాకకు ఎదురుచూసే మగువ మొగుణ్ణి ఆదరించి 'కాళ్ళునొప్పా' నేను కాళ్ళొత్తుతాను అంటూ సపరిచర్యలు చేస్తుంది. కాళింగుని మీద నాట్య మాడడం వల్ల కన్నయ్య కాళ్ళు వాచాయట. కుంటికుంటిగా నడుస్తుంటే యశోదచూచి రమ్మని లాలించి కాళ్ళు పట్టిందట. అంతెందుకు లక్ష్మి పాలకడలివాసునికి 'పాదసంవాహనం' చేయడం తన ధర్మంగానే భావించింది. లౌకికమయిన వాటిని భగవంతునికి కూడా సమన్వయించి అందంగా చెప్పడం కవితాకళ. ఈ కళలో ఆరితేరిన వారు కాసుల పురుషోత్తమకవి.

*'కఠినాత్ము బండి రక్కసు చకాచకాలుగాఁ*
*బడఁదన్నుచో నొప్పిపట్టె నేమొ*
*తటభూజమెక్కి చిత్రముగ కాళిందిలో*
*నవలీల దుముకుచో నవసె నేమొ*
*కాళీయఫణి ఫణాగ్రములపై నర్తించు*
*నత్తఱి పదగ రాలొత్తె నేమొ*
*ఫల్గుని నరదంబు పైనుండి భీష్ముపై*
*నలుక లంఘించిన నలిగె నేమొ*

చరణపద్మంబు లొత్తెద సామి రమ్ము' అంటూ మూడుపాదాల మకుటంతో త్రివిక్రమాకృతి కలవాడని భంగ్యంతరంగా సువ్యక్తం చేస్తూ

*'భావజ విలాస! హంసలదీవి వాస!*
*లలిత కృష్ణాబ్ధి సంగమస్థలవిహార!*
*పరమకరుణాస్వభావ! గోపాలదేవ!*

అని పద్యాన్ని ముగించాడు. తన్నేవేళ, దుముకేవేళ, కఠినమయిన ప్రదేశాలమీద చిందులు త్రొక్కేవేళ, ఒక్కసారిగా లంఘించేవేళ ఎవరికయినా కాళ్ళు నొప్పులు తప్పవు. మానవాకృతి దాల్చిన కన్నయ్యకు తప్పవు. ఇంతటితో ఆగితే పద్యంలో అందం లేదు. 'నీ చరణపద్మంబు లొత్తెద' అనడంలోనే కవి ఆర్తి కనిపిస్తుంది. ఉక్తిచాతుర్యానికి జోహారులర్పిం చాలనిపిస్తుంది.

భారతదేశవాసుల గురించి పరిశోధన చేసిన ఒక విద్యావేత్త "భారతదేశప్రభుత్వానికి తలనొప్పి సమస్య యాచక సమస్య – భిక్షకుల సమస్య" అన్నాడు. ఇది నిజమే. హైందవదేవతలలో 'హరిహరులిద్దరు' అడుక్కోవడంలో

పోటీపడ్డవారే అని చమత్కరించాడు ఒక ప్రాచీనకవి. ఒక కవి అయితే శివుణ్ణిచూచి 'నిన్ను మా దేవుడుగా చెప్పుకొనేందుకు సిగ్గవుతుందయ్యా! కష్టపడు. ఎవరు నాకు సాయం చేస్తారంటావా? నేను చెబుతా! విను. హరి బలిచక్రవర్తిదగ్గర చివరగా 'భూమి' కొట్టేశాడు. అతణ్ణి కాసంత భూమి అడుగు. నాగలికోసం బలరామన్నను అడుగు. అతడు భోళామనిషిలే. ఇస్తాడు. నీ స్నేహితుడు విత్తనాలిస్తాడు. యముడు తన దున్ననిస్తాడు దున్నుకోవ డానికి. వ్యవసాయం చేయ్. కష్టపడు' అని చమత్కారంగా చెప్పాడు. హరునిపట్ల 'యాచన' గురించి చమత్కారంగా చెప్పినట్లే కాసుల పురుషోత్తమకవి 'గోపాలదేవుని' యాచకుల్ని ఏకరువు పెట్టాడు ఏకంగా.

*అత్యున్నతాకారివయ్యు బలీంద్రుని*
*యాచించనో గుజ్జువైతి వీవు*
*అనఘ సద్గుణశాలివయ్యు సత్రాజిత్తు*
*వజ్రమిమ్మని నిందబడితి వీవు*
*అఖిల పూజార్హుఁడవయ్యు విప్రుల నన్న*
*మడిగి యగౌరంబంది తీవు*
*అసమాయశూరుఁడవయ్యు దైవత వీటి*
*పారిజాతముగొంచు పాఱితీవు*

*ఘనులకైనను యాచ్నలాఘవమే సుమ్ము'* అని కవి నిర్ణయం. ప్రాచీనకవులు పద్యరాశిలో యాచించడంలోని దైన్యంగురించి ఒక మంచి పద్యముంది.

*మానిసి కేదు జానల ప్రమాణము దేహము, యాచనార్థమై*
*పూనిన ఆఱుజానలగు, పోయి ధనాఢ్యుని యిల్లు చేరగా*
*జానలు నాలుగౌ నతని చల్లగ 'దేహి' యటన్న రెండగున్*
*పైని నతండు నాస్తి యనినన్ వినినంతన శూన్యమయ్యెడిన్*

మనిషిదేహం 7 జానల పొడవు. యాచించడానికి సిద్ధపడితే 6 జానలు. ధనవంతుని ఇల్లు చేరితే 4 జానలు. 'దేహి' అని అర్థిస్తే 2 జానలు. డబ్బున్నవాడు నాస్తి (లేదంటే) శూన్యం అని పై పద్యభావం. ఈ భావాన్ని కాసుల వారి పద్యంతో అన్వయించుకోవచ్చు. విష్ణువు 'విశ్వాకారుడు' అయితేనేం బలిదగ్గర వెళ్ళేవేళ 'గుజ్జు'. లోకంలో ఇచ్చేవానికి అడిగేవాడు చులకన. కృష్ణుడు తనకు 'శమంతకమణి' కావాలని సత్రాజిత్తును అడగడమే పొరబాటు. అడిగాడు పో, ఇవ్వలేదు. ఇవ్వలేదు పో చివరకు సత్రాజిత్తు తమ్ముడు ఆ మణితో వెళ్ళితే చంపబడ్డాడు. కృష్ణుడే దొంగలించాడని అపప్రథం. లోకంలో తనకంటె తక్కువవారిని అడిగితే నైచ్యం. అయినా బ్రాహ్మణుల్ని అడిగావు. కృష్ణావతారంలో అడవిలో ఆవులు మేపుకొనేవేళ గొల్లలకు ఆకలి వేసింది. కృష్ణుని అడిగారు. కృష్ణుడు ఆలోచించి దగ్గరలో బ్రాహ్మణాగ్ర హారం ఉంది. అక్కడ యాగాలు సాగుతున్నాయి. నేను చెప్పానని వారిని యాచించండి అన్నాడు. యాదవులు ఆలాగే చేశారు. విప్రులు ఇవ్వలేదు సరికదా తూలనాడారు. దేవేంద్రుని పారిజాతం అడిగితే ఇచ్చేవాడేమో? అడగలేదు సరికదా నందనవనం చూసేలాగున వెళ్ళి పారిజాతం పెకలించుకొని వచ్చావు ఇది తగదు. అయినా ఈ 'యాచన'లన్నిటిలోనూ 'లాఘవం' మాకు తెలుసులే' అని కవి పద్యం ముగించాడు.

లోకంలోని వ్యక్తులు రెండురకాలవారు. కలవారు, లేనివారు. కలవారు తమ గొప్పతనం గురించి గోరంతయినా కొండంతగా చెప్పుకొంటారు. వినేవాళ్ళుంటే ఇక చెప్పపనిలేదు. ఈ నేపథ్యంలో స్వామి నుద్దేశించి 'స్వామీ! కామధేనువు, కల్పతరువు, చింతామణి, నవవిధానాలు అన్నీ నీ దయవల్ల పాలసంద్రంలో పుట్టినవే. అయినా వాటిని దేవేంద్రుడు తనవిగా చేసుకున్నాడు. స్వర్గంలో వేరెవరికి దక్కకుండా చేశాడు. మరి ఆ కథ లెందుకు మాకు?

*లేమిఁజెందిన వారి కేమి బిడికె / దారిద్ర్యునకు నేమి తాను బిడికె*
*పేదలయిండ్ల నింపెనె ధనంబు / రిక్తులకేమి కోరిక లొసంగె*
*త్రిభువనేశునికి త్రాత అయ్యావు? దాత అయ్యావు?*
*భూలోకానికి, భూలోకవాసులకు ఒరిగిందేమిటి?*

అని ప్రశ్నించడం ఆలోచించదగ్గదే. హంసలదీవిని చూడకున్నా కవి పద్యనేత్రాలతో దర్శిద్దాం.

*ఎచ్చోట పూర్వవాహినిగ కృష్ణానది*
*సరసవీచీ పరంపరలఁ బొలుచు*
*ఎచ్చోటు లవణాబ్ధి హితతరంగములచే*
*దక్షిణదిశను సందడులు సేయ*
*ఎచ్చోట కంకణహేలాగతుల వేణి*
*పశ్చిమతటమునఁ బాయకుండు*
*ఎచ్చోట భోగవతీ గంగ బుధ్యదా*
*కృతుల నుత్తరదిశ నెగయుచుండు*

*అచ్చట వినోద గోపురం బమరె నీకు – భావజవిలాస! హంసలదీవివాస!*

ఆచార్య కోసూరి దామోదరనాయుడు
తిరుపతి-517502. ఫోన్ : 944 164 5601

# కృష్ణా తీరాన పల్నాడు

*- వై. హెచ్.కె. మోహనరావు*

*నాజూకు కృష్ణమ్మ నడుము వడ్డాణమై*
*నడిచింది పల్నాడు కొంగు బంగారమై*

కృష్ణానది పశ్చిమోత్తర సరిహద్దులుగా పరిఢవిల్లింది పలనాడు. కృష్ణమ్మ నడకలతో ఈ నేల పవిత్రమైంది. పాడి పంటల పైడి తేరైంది పలనాడు, ఆ పదం వింటేనే చరిత్ర పులకించిపోతుంది. ప్రతి హృదయం కిలికించతమౌతుంది. పలనాడును తలచుకుంటేనే తెలుగునేల రోమాంచిమౌతుంది. తెలుగుదనం పౌరుషంతో ఉప్పొంగుతుంది. ప్రతి ఒక్కరి రుధిరం పరవళ్ళు తొక్కుతుంది. ఇందుకు పూర్వరంగం పలనాటిచరిత్రలో నిండుకున్న ప్రాశిస్త్యం. పౌరుషాలకు పురిటిగడ్డ కావడం. పలనాటిచరిత్ర బహుశా తెలుగులో తొలి వీరగాథ. పలనాడు గురించి చెప్పుకోవాలంటే బౌద్ధమత వ్యాప్తి, హైహయరాజుల పాలన, నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడు కాలాలను వివరించడమే అవుతుంది. బౌద్ధమతంలో మహాయానశాఖకు పలనాడు పుట్టిల్లు. ప్రాచీన మధ్యయుగాలలో పలనాడుకు విశిష్టత ఉంది. ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక పలనాటి ప్రాభవాన్ని సంక్షిప్త పరచి అందించడమే ఈ వ్యాస సంకల్పం.

**పలనాడు నామ నిర్దేశము :** పలనాడు అనే పదాన్ని అనేక శాసనాలు, కావ్యాలు పలు విధాలుగా వ్యక్తం చేశాయి. ఆంధ్రదేశంలో 'నాడు' అనే పదం ప్రాచీన రాచరిక విభాగాల్లో ప్రసిద్ధమూ, బహువ్యాప్తి గాంచిన దేశవాచకం. 'నాడు' అనేది మండలాన అంతర్భాగం. సామ్రాజ్య కాలంలో రాజ్యంలో అంతర్భాగంగా చెప్పేవారు. క్రీ.శ. 669లోని పూర్వ చాళుక్య ప్రభువైన రెండవ విష్ణువర్ధనుని కొనెకి శాసనంలోనూ, క్రీ.శ. 1111లోని మాచెర్ల ఆదిత్యేశ్వరాలయంలోని చాగి బేతరాజు శాసనంలోనూ, క్రీ.శ. 1118లోని భృగుబంద శాసనములోనూ, క్రీ.శ. 1147లోని కులొత్తుంగ చోడ గొంకరాజు వేయించిన కొదమగూడ(కొదమగుండ్ల) శాసనములోనూ, ద్రోణాది కేశవదేవుల క్రీ.శ.1269లోని దుర్గి శాసనంలోనూ, క్రీ.శ. 1259లోని త్రిపురాంతక శాసనంలోనూ, క్రీ.శ. 1269లోని కాకతి రుద్రమదేవి వేయించిన దుర్గి శాసనంలోనూ పల్లినాడు, పలినాడు అనే పదాలు కనిపిస్తాయి. శ్రీనాథుని చాటువుల్లోనూ, పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నంలోనూ, వినుకొండ వల్లభరాయుని క్రీడాభిరామంలోనూ ఈ నేలను పలనాడు, పల్నాడు అని ఉచ్చరించడం చూస్తాము. ప్రస్తుతం వినవస్తున్న పల్నాడుకు పర్యాయాలుగా పలనాడు, పల్లనాడు, పల్లవబొగ్గ, పల్లవభాగ, పల్లినాడు, పల్లునాడు అనే పదాలు వ్యాప్తిలోకి వచ్చాయి. ఈ పదాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని కొందరు పరిశోధకులు వారి వారి భావాలకనుగుణంగా సిద్ధాంతీకరించారు. 'పల్లి' అనే శబ్దాన్ని బౌద్ధ, జైన నివాస స్థావరాలకు భావంగా చెపుతున్నప్పటికీ, బౌద్ధ నివాసమనే అర్థాన్నే ఎక్కువమంది పరిశోధకులు స్వీకరించారు. పల్నాడులో బౌద్ధం, జైనం విస్తృతంగా వ్యాప్తి చేందాయి. బౌద్ధం ఇక్కడ ఎంత బలపడిందంటే 2వ శతాబ్ధంలో పల్లిదేశం నుండి 14,60,000 మంది బౌద్ధ భిక్షువులు సింహళ దేశానికి ప్రచారం నిమిత్తం తరలి వెళ్ళినట్లు చారిత్రకాధారాలున్నాయి. నాగార్జునకొండ ముఖ్య కేంద్రంగా మహాయాన బౌద్ధం ప్రచారం జరిగింది. బౌద్ధమత ప్రచార స్థావరంగా వున్నందున ఈ ప్రాంతాన్ని' పల్లి' దేశంగా పిలిచారు. తరువాత కాలంలో ఉచ్చారణా పరిణామంలో పల్లిదేశం పల్లినాడుగా, పలనాడుగా రూపాంతరం చెందింది. ఇది ఇలావుంటే 2వ శతాబ్ధి నాటికి ఈ ప్రాంతానికి పల్లవబొగ్గ, పల్లిదేశ అనే రెండు పద ప్రయోగాలు వినికిడిలో వున్నాయి. నీటి బొగ్గ లుండే ప్రాంతాన్ని బొగ్గ లేదా బుగ్గ అంటారు. కృష్ణానదికి దక్షిణాపథాన వుండే పల్నాడు ప్రాంతమంతా పల్లంగా వుండి నీటి బుగ్గలు విస్తారంగా వున్నందున ఈ పిలుపులు అన్వయమయ్యాయి.


**నాగార్జునుడు - మహాయానం - విశ్వవిద్యాలయం :** బౌద్ధ మతంలో మహాయానశాఖ స్థాపకుడు నాగార్జునుడు. మహయనశాఖకు జన్మస్థలి పల్నాడు అనే విషయాన్ని చారిత్రక

సాక్ష్యాలు నిర్ధిష్టంగా తెలుపుతున్నాయి. క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన ఆచార్య.నాగార్జునుడి జన్మస్థలం విదర్భ అని, కాదు పెందోట అని వాదాలున్నప్పటికీ, అయన వికాసమంతా పల్నాడు శిరొభాగానికి చెందివున్నది. నాగార్జునుడు బాల్యంలోనే సన్యసించి హిందూశాస్త్ర శోధకుడిగా జీవన యానాన్ని ప్రారంభించాడు. తదుపరి బౌద్ధమతాన్ని స్వీకరించి మహాయానశాఖకు ఆదిమూలమై, ఒక నూతన సైద్ధాంత వివేచనతో ఆశాఖామతవృద్ధికి జీవితాన్ని అర్పించాడు. కొంతకాలం నలందా విద్యాపీఠంలో అద్యాపకుడిగా పనిచేసి ఆ తరువాత పల్నాడు పశ్చిమాన నెలవైవున్న శ్రీపర్వతాన్ని కేంద్రంగా జేసుకుని జీవించాడు. ఆనాటి శ్రీపర్వతమే నేటి నాగార్జునకొండ. నాగార్జునుడు యజ్ఞశ్రీశాతకర్ణి సమకాలీకుడు. యజ్ఞశ్రీ శాతకర్ణి నాగార్జునుడి కోసం నాగార్జునకొండపై చాలా పెద్ద పారవత విహారాన్ని నిర్మించాడని ప్రతీతి. క్రీ.శ.5వ శతాబ్దిలో భారతదేశంలో పర్యటించిన చరిత్రకారుడు పాహియాన్ ఆ విహారాన్ని దర్శించి ముగ్ధుడైనట్లు వర్ణించాడు. మొత్తం నిర్మాణం 5 అంతస్తులుగా, క్రింది అంతస్తులో 500ల గదులు, రెండవ అంతస్తులో 400ల గదులు, మూడవ అంతస్తులో 300ల గదులు, నాలగవ అంతస్తులో 200ల గదులు, అయిదవ అంతస్తులో 100 గదులతో అలరారినట్లు నమోదు చేశాడు. క్రింది అంతస్తు ఏనుగు ఆకారంలోనూ, రెండవ అంతస్తు సింహం రూపంలోనూ, మూడవ అంతస్తు అశ్వరూపంలోనూ, నాల్గవ అంతస్తు వృషభాకారంలోనూ, అయిదవ అంతస్తు కపోత రూపంలోనూ బహురమణీయంగా నిర్మాణం జరిగినట్లు పేర్కొన్నాడు. ఇక్కడే ఆచార్య నాగార్జునుడు బౌద్ధ అధ్యయన పీఠాన్ని స్థాపించాడు. ఈ మహా నిర్మాణమే విశ్వవిద్యాలయంగా విలసిల్లింది. ఇక్కడ తత్వ, వైద్య, రసాయన, గణిత శాస్త్రాలను బోధించేవారు. నాగార్జునుడు బౌద్ధతత్వ శాస్త్రంలో మాధ్యమిక వాదమనే నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించి బోధించారు. భారతీయ విద్యార్థులే గాక, చైనా, సింహళ, జావా, టిబెట్ దేశాలనుండి కూడా విద్యార్ధులు ఇక్కడకు వచ్చి విద్యనభ్యసించేవారని పాహియాన్ తెలిపాడు. ఆనాటి నాగుర్జునుడి విశ్వవిద్యాలయు అవశేషాలు నేడు నాగార్జునసాగర్ జలాశయం మధ్యలోని నాగార్జున కొండపైకి తరలించి ప్రదర్శనశాలలో భద్రపరిచారు. అట్లాగే అశోక చక్రవర్తి వివిధ ప్రాంతాల్లో నాటించిన 84,000 బౌద్ధ దాతువుల్లో ఒకటి నాగార్జునకొండలో వుంది. ఇక్కడి ధాతువును బుద్ధుని దంతంగా గుర్తించారు. ఈ ధాతువును భద్రపరచిన పేటికనూ, దానిని వుంచిన కుండనూ నాగార్జునకొండ ప్రదర్శనశాలలో పదిల పరిచారు. నాగార్జున కొండ, నాగార్జున సాగర్ ఆధునిక కాలంలో ఆచార్యనాగార్జును స్మృతి చిహ్నంగా ఏర్పడినవే.

**మధ్యయుగ పల్నాడు :** 12వ శతాబ్ధికి చెందిన పల్నాటి చరిత్ర తెలుగు వాఙ్మయంలో తొలివీరగాథ. తెలుగు నేలపై అనేక యుద్ధాలు సంభవించినా పల్నాటి యుద్ధం మళ్ళీ మళ్ళీ జ్ఞప్తికి వచ్చే కథనం. మహాభారత ఇతిహాసంతో అనేక పోలికలున్న సందర్భంగా దీనిని మరో భారతంగాపేర్కొన్నారు. దాయాదుల మధ్య రాజ్యస్పర్ధతే ఈ యుద్ధానికి హేతువు. 12వ శతాబ్దినాటికి హైహయుల పాలనాకాలంలో ఏకపల్నాడు ద్విపక్షాలుగా, రెండు రాజ్యాలుగా విభజన జరిగి రాజులకంటే మంత్రులైన నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడు కనుసన్నల్లో పాలన నడిచింది. రాజులను మించి మంత్రులకు విశేష ప్రాధాన్యమేర్పడింది. ఈ కాలంలో 100 కి.మీ పొడవునా పల్నాడుకు పశ్చిమోత్తర దిశల్లో కృష్ణానది పరవళ్ళు తొక్కింది. పల్నాటిలోని పల్లెలన్నింటికీ అది ఒక్కటే పెద్దయేరు కావడం మూలంగా దానిని పల్లేరు అనికూడా వాడుకలో చెప్పుకున్నారు. అప్పకవి తెలిపిన వివరాల ప్రకారం నాటి పల్నాటిలో 194 గ్రామాలున్నట్లు కావ్యప్రమాణం. పల్లెనాటను నూట తొంబదియునాల్గు / గ్రామముల నీడు గానక కాకునూరి / వెంగనార్యుడు వేద వేదాంగములను / ప్రస్తుతికి నెక్కి మాఱట బ్రహ్మయనగ – అప్పకవి. అదే అప్పకవి పల్నాటిలో బెల్లంకొండ, నాగార్జున కొండ, తంగేడు అనేవి అంతఃసీమలుగా వున్నట్లు చెప్పుకొచ్చాడు. తంగెడ సీమను నిర్జర / గంగా సమ నాగ నిమ్నగా పూర్వమునం / బింగళి పుర దక్షిణమున రంగుగ నెలకొన్న గోపరత్నంబునకున్ – అప్పకవి. ఈ అంతఃసీమలను 15వ శతాబ్దిలో శ్రీకృష్ణదేవరాయులు జయించినట్లు చారిత్రక ప్రమాణాలున్నాయి. పల్నాటి యుద్ధం క్రీ.శ. 1176–1182 సం॥ల మధ్య కాలంలో జరిగినట్లు పరిశోధకుల నిర్ణయం. పల్నాటి వీరుల అనంతరం పల్నాటి సీమను కాకతీయులు, కొండవీటిరెడ్డి రాజులు, విజయనగరరాజులు, గోల్కొండ నవాబు, ఆర్కాటు నవాబు, ఆ తరువాత ఈస్టిండియా కంపెనీ వారు పాలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత

పల్నాడు తాలూకా ఏర్పడి అనంతరం గురజాల, మాచెర్ల తాలూకాలుగా విభజించబడి, ఇప్పుడు తొమ్మిది మండలాలుగా వుంది.

**మహాకవులు – వాఙ్మయము :** 15వ శతాబ్దిలో శ్రీనాథ మహాకవి పల్నాటి రణక్షేత్రమైన కారంపూడి (కార్యమపూడి) చెన్నకేశవాలయంలో పలనాటి వీరచరిత్ర ద్విపద కావ్యానికి శ్రీకారంచుట్టి ముగించినట్లు ప్రభల ఆధారాలున్నాయి. భట్టువారి పల్లెకు చెందిన భట్టుమూర్తి, పిన్నెల్లి గ్రామ నివాసి పింగళి సూరన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానదిగ్గజాలు. భట్టుమూర్తి భట్టువారిపల్లె గ్రామస్థులు. ఆయన ప్రఖ్యాత కావ్యం వసుచరిత్ర. పింగళిది పిన్నెల్లి గ్రామం. ఈయన గొప్ప కావ్యం కళాపూర్ణోదయం. తంగెడ గ్రామానికి చెందిన అప్పకవి అప్పకవీయం పేరిట ప్రసిద్ధులు. ఆధునిక కాలంలో గద్వాల సంస్థాన ఆస్థానకవిగా పేరుగాంచిన బోదిలవీడు గ్రామ కవి, పండితులు కాశీపతి అవధాని. వీరు అష్టావధాన, శతావధానాలలో 40 సువర్ణ పతాకాలు, 40 బిరుదులు పొందారు. 60 కావ్యాలను రచించారు. రామాయణ ,మహభారత గాథలను ఒకే కావ్యంలో ఆవిష్కరించారు. ఒక్కొపద్యంలో 30భావాలు ప్రస్ఫుటించే విధంగా లఘుకావ్యాన్ని రచించారు. తిరుపతి వేంకటకవులు ఈ ప్రాంతాన్ని పర్యటించినపుడు ప్రత్యేకించి బోదిలవీడు విచ్చేసి కాశిపతి అవధానిని పరామర్శించి అభినందించారు. అదే విధంగా తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన పల్నాటి సోదరకవుల పేరిట ప్రఖ్యాతి వహించిన చినలింగాచార్యులు, ప్రభులింగాచార్యులు, వీరభద్రాచార్యులు అవధాన ప్రతిభలో లబ్ధప్రతిష్టులు. వీరు ముగ్గురూ విడివిడిగా పదుల సంఖ్యలో ప్రజాదరణ పొందిన



బ్రహ్మనాయుని కనుసన్నలలో కృష్ణమ్మ


కావ్యాలు రచించారు. రెంటాల గ్రామవాసి రెంటాల గోపాలకృష్ణ పత్రికా సంపాదకుడుగా, రచయితగా ప్రసిద్ధులు.

**పల్నాడులో మతాలు – కులాలు :** ప్రాచీన యుగంలో బౌద్ధ, జైన మతాలు పల్నాడులో ఉచ్ఛస్థితికి చేరుకున్నాయి. ఈ ప్రాంతం నుండి బౌద్ధ ఆధ్యయనంతో బౌద్ధ భిక్షువులుగా మారిన 14,60,000ల మంది సింహళదేశానికి బౌద్ధ మత ప్రచారానికి తరలి వెళ్ళారని ఇదివరలో మనం తెలుసుకున్నాము. బౌద్ధం ఏ స్థాయిలో, ఎంత బలంగా వేళ్లూనుకుందో ఈ పరిణామాన్ని బట్టి అర్థం చేసుకుంటాము. అయితే తదనంతరం జన సామాన్యంలో జైనం, శైవం సమాన స్థాయిలకు చేరుకున్నాయి. వైష్ణవం మధ్య యుగం వరకూ చాలా స్వల్పదశలో వుండి వుంది. జైనుల్లో స్వర్ణకారులు, వృత్తికార్మికులు, గోసంగులు ఎక్కువ. ఇక శైవుల్లో వ్యవసాయదారులు, కొన్ని సంచార జాతులు, బ్రాహ్మణవర్గంలో కొంత భాగం వుండేవారు. శైవుల విజృంభణను ఎదుర్కోలేని జైనం ఇతరత్రా మరే ఆదరణ లేని కారణంగా క్రమేపి క్షీణించింది. శైవుల ఆధిపత్యాన్ని తట్టుకోలేకనే జైన మతస్థుడైన కాకతి ప్రోలరాజు శైవమతాన్ని విధిగా స్వీకరించాడు. ఉప్పెనలా మారిన శైవమతోద్యమంలో సామన్య జనులంతా భాగస్వాములయ్యారు. అట్లా జడలు విప్పిన శైవమతానికి సమాంతరంగా పల్నాడులో వైష్ణవమతం కూడా విజృంభించింది. రెండు మతాల మధ్య జైనం పూర్తిగా చతికిలబడి అంతరించింది. జైనులంతా వారి వారి అనుకూలతను బట్టి కొందరు శైవంలోకి మరికొందరు వైష్ణవ మతంలోనూ చేరిపోయారు. ఈ సంధికాలంలో వీరశైవులు జైనులపై దాడులు జరిపి హింసాకాండకు పాల్పడినారు. కానీ అదే మతంలోని వైదికులను మినహాయించారు. అట్లాగే వైష్ణవులు కూడా శైవులను వదలి జైనులనే అణచివేశారు. ఈ కాలంలో శైవ, వైష్ణవ మతాలు రెండూ జైనాన్నే ప్రధాన శతృవుగా భావించాయి. అయితే జైనంలో మాదిరిగా శైవ, వైష్ణవ మతాల్లో సైతం కులాలుండేవి. కానీ మూడు మతాలు కూడా కుల బేధాలను నామ మాత్రంగా కూడా పాటించేవి కావు. ఒక మతం నుండి మరో మతానికి, ఒక కులం నుండి మరో కులానికి మారే వెసులుబాటుండేది. దాదాపుగా కులాలన్నీ వారి వారి వృత్తులను బట్టి నిర్ణయించినవే కాని, ఈ నాటివలే పుట్టుకను బట్టి ఏర్పరచినవి కాకపోవడం వలన కుల మార్పు సాధ్యమయ్యేది. ఆనాటి సమాజంలో అన్ని

కులాల వారికి సమాన గౌరవం వుండేది. వీర శైవులకు నాయినార్లూ, ఆరాధ్యులు, దేవరలూ గురువులైతే, వీర వైష్ణవులకు ఆళ్వార్లు గురువులు. ఈ విధానమే పల్నాడులో కూడా ఆచరించబడింది. ఊరేగింపులు, ఉత్సవాలు, దైవ ప్రార్థనలు మొదలైనవన్నీ సమస్త జాతులన్నీ కలిసి సమిష్టిగా జరుపుకుంటాయి. సాంఘిక, సాంస్కృతిక రంగాలలో కూడా అన్ని కులాలకు సమాన ప్రాతినిధ్యముండేది. వృత్తులను బట్టి కులాలు ఏర్పడినా, అందరి ప్రధాన వృత్తి పశుపోషణ, వ్యవసాయంగా కొనసాగింది. పేరుకు మాత్రమే కులాలు. యోగ్యత, అర్హత, ప్రతిభలననుసరించి ప్రాధాన్యత లభించేది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం బ్రాహ్మణులకు అధిక ప్రాధాన్యం వుండేది. బ్రాహ్మణులకు రాజుల అండదండలుండేవి. వృత్తిని బట్టి నిర్ణయించుకున్న కులాలే కాకుండా ఆనాడు పల్నాడులో మరికొన్ని కొత్త కులాలు ఆవిర్భవించాయి. దక్షిణాదిన శైవమత వ్యాప్తి కోసం ప్రచారం చేస్తూ కులభేదాలను రూపుమాప పూనుకున్న జంగములు తామే ఒక ప్రత్యేక కులంగా ఏర్పడినారు. అట్లాగే వైష్ణవమత విస్తృతి కోసం ప్రచారం చేస్తూ ద్రవిడ దేశం నుండి వచ్చిన 'చిత్తాతావర్' (సాతాను) లు తామొక ప్రత్యేక కులంగా రూపొందారు. వైష్ణవంలో ఈ సాతానులే శ్రీ వైష్ణవులుగా వైష్ణవ పూజారులుగా, శైవంలో తంబళులు అనే శివ బ్రాహ్మణులు ఒక కులంగా మార్పు చెందారు.

**ఆచారాలు - సాంప్రదాయాలు :** బౌద్ధ జైన మతాలు పరిఢవిల్లిన ప్రాచీన యుగంలో పల్నాడులోని ఆచార సాంప్రదాయాలు ఏ విధంగా ఎన్నాయెూ స్పష్టత లేకపోయినప్పటికీ, మధ్యయుగ పల్నాటి గురించి శాసన, గ్రంథ సమాహారమైనాయి. పల్నాడులో గురజాలనేలిన నలగామరాజుకానీ, మాచెర్ల ప్రభువైన పెదమలిదేవరాజుకానీ పేరుకే రాజులు. పెత్తనమూ, పాలన మొత్తంగా వారి వారి మహామంత్రులైన నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడిదే నన్నది జగమెరిగిన వాస్తవం. రాజులతోపాటు మంత్రులు కూడా బ్రాహ్మణుల ఆనతినీ, వినతినీ ఆమోదిస్తూ పూజ్యభావంతో మెలగుతారు. మధ్యయుగాల్లో పల్నాడులో రాజుల్లో మాత్రమే బహు భార్యత్వం ఉండేది. అన్ని కులాల్లో బాల్య వివాహాలు జరిగేవి. సహగమనం రాజవంశాల్లోనూ, బ్రాహ్మణ వంశాల్లోనూ వుండేది. కానీ ఈ ఆచారం ఐచ్ఛికమే. రాజకీయ పోరాటాలు మిక్కుటం. వివాహ సమయంలో వరుడి కుటుంబం వధువుకు ఓలి(కన్యాశుల్కం) నిచ్చే సాంప్రదాయం నడిచింది. అదే విధంగా వధువు పుట్టింటివారు పసుపుకుంకుమలుగా కొంత సంపదనిచ్చి పంపే ఆచారం కలిగివుంది. దీనినే అరణం అనే వారు. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో పురోగతి స్వల్పమే. కళలు, సాహిత్యం, భాషాపోషణ విషయాల్లో పాలకులకు ఏ మాత్రం శ్రద్ధ వుండేది కాదు. చెఱువులు, కుంటలు, త్రవ్వకాలు చప్టాలు, అడ్డుకట్టల నిర్మాణాలు, సాగునీటి, త్రాగునీటి కోసం కొంతమేర చేపట్టేవారు. దూప చెఱువు, మహాదేవి తటాకం ఈ కోవలో ఏర్పాటైనవే. చిన్న చిన్న దేవాలయ నిర్మాణాలు జరిగి వాటి నిర్వహణకు యినాములు, మాన్యాలు కల్పించేవారు. నాయకురాలి పక్షాన వీరగంధాలు, బ్రహ్మనాయుడి వైపున వీర విద్యావంతులు దళితులైనప్పటికీ దేవాలయాల ప్రవేశముండేది. చెన్నకేశవస్వామి ఆలయాల్లో మాలదాసరులు, గోసంగులూ పూజారులుగా వుండేవారు. వీరగంధాలు శివాలయాల్లో స్వయంగా శివలింగాన్నితాకి అర్చన చేసుకునేవారు. ఇరువురూ మాల కులంలోని ఇరు శాఖలకు చెందినవారు. ప్రజల్లో రాజభక్తి, విశ్వాసం మిక్కుటం. దానితోపాటు సైనికతత్వం, వీరావేశం మెండు. క్షుద్రవిద్యలు, జాతరలు, జంతుబలులూ విరివిగా జరిగేవి. మంత్రాలు, అద్భుతాలు, మాయలు మొదలైన అంధవిశ్వాసాలు ప్రజల్లో గాఢంగా వుండేవి. అభూత కల్పనలను, మూఢవిశ్వాసాలను బలంగా నమ్మేవారు.

**జాతీయోద్యమము- పుల్లరి పోరాటము :** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పల్నాడు కదం తొక్కింది. బాపూజీ అడుగు జాడల్లో అంకితభావంతో నడిచింది. జాతీయోద్యమ స్ఫూర్తి నింపడానికి గాంధీజీని చేవతేలిన పోతుగడ్డ రెంటచింతల గ్రామం పల్నాడుకు ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఆ గ్రామంలో జాతిపిత ఒక విద్యాలయానికి



పౌరుషాల పోరు

శంఖుస్థాపన చేశారు. మహాత్ముని ఉద్వేగపూరిత ప్రసంగానికి పల్నాడు వేదిక అయ్యింది. గాంధీజీ ప్రసంగంతో పల్నాడు తన పోరాటాన్ని ద్విగుణీకృతం చేసుకుంది. ఈ క్రమంలోనే బాపూజీ సహాయ నిరాకరణోద్యమ పిలుపందుకుని పల్నాడు తిరుగుబాటు ఉప్పెననే సృష్టించింది. ఆత్మత్యాగి కన్నెగంటి హనుమంతు నాయకత్వాన పల్నాడులో బ్రిటీష్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరశిస్తూ పుల్లరి పోరాటం పెద్ద ఎత్తునసాగింది. ఈ పూర్వరంగంలో పల్నాడు ప్రాంతంలో పోలీసు ఠాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. బందెల దొడ్ల గడీలు బద్దలయ్యాయి. బ్రిటీష్ పాలకులు సాంఘిక బహిష్కరణకు గురయ్యారు. రక్షక దళాలపై ప్రజలు తిరగబడి తరిమికొట్టారు. బ్రిటీష్ ప్రత్యేక అధికారి రూథర్‌ఫర్డ్ నేతృత్వాన 22వ తేది ఫిబ్రవరి 1922న కన్నెగంటి హనుమంతు ప్రాణాలను బలితీసుకుని పుల్లరి ఉద్యమాన్ని అణిచివేసింది బ్రిటీష్ ప్రభుత్వం. అయితే పల్నాటి గగన వీధుల్లో కన్నెగంటి అమరత్వం స్వాతంత్ర్య కేతనమై రెపరెపలాడింది.


**పల్నాడులో దేవాలయాలు :** బహుళ ప్రసిద్ధి చెందిన దేవాలయాలు పల్నాడులో విరాజిల్లాయి. పురాతనమైన ఆలయాలు నేటికీ విలసిల్లుతున్నాయి. అత్యంత ప్రాశిస్త్యం సంతరించుకున్న దేవాలయాలతో పల్నాడు పవిత్రమైంది. శ్రీ పర్వతం దిగువన విజయపురిలో క్రీ.శ.3వ శతాబ్దిలో నిర్మితమైన అష్టభుజస్వామి దేవాలయం అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది. నాగార్జున కొండ పశ్చిమ పాదతలాన క్రీ.శ.257-281 మధ్య కాలంలో నిర్మించిన నోదగిరీశ్వరాలయం ప్రసిద్ధిగాంచినది. అక్కడే కృష్ణాతీర స్నానఘట్టము చెంత శ్రీపుష్పభద్ర, కార్తికేయ ఆలయాలు నిర్మాణమైనాయి. విజయపురిలో ఇక్ష్వాకుల కాలానికే 9 వైదిక మత దేవాలయాలు నిలిచాయి. ఒక పుణ్యతీర్థక్షేత్రంగా వర్థిల్లుతున్న ఎత్తిపోతల కేంద్రంలో శ్రీదత్తాత్రేయ, శ్రీరంగనాయక స్వామి దేవాలయాలున్నాయి. ఇది గొప్ప పర్యాటక కేంద్రంగా భాసిల్లుతుంది. విభాగ పల్నాటి రాజధాని మాచెర్లలో 12వ శతాబ్దిన చెన్నకేశవస్వామి, ఇష్టకామేశ్వర, వీరభద్రాలయాలు, నిర్మాణమయ్యాయి. చెన్నకేశవస్వామి దేవాలయం క్రితంలో ఆదిత్యేశ్వరాలయంగా పూజలందుకుంది. దుర్గి మండలం తేరాల గ్రామంలో అత్యంత పురాతనమైన శ్రీ సిద్దేశ్వరాలయం వుంది. ఈ ఆలయంలో స్వయంభూ మరియూ పరశురామప్రభువుచే ప్రతిష్ట జరిగిన లింగం అర్చనలందుకుంటున్నాయి. కారంపూడి మండలం ఒప్పిచెర్ల గ్రామానికి దక్షిణాన 4కి.మీ దూరంలో కొండల్లో ధనమల్లయ్య స్వయంభూ శివక్షేత్రం గలదు. నీటి దొనలున్న కొండ గనుక ఈ కొండను దొనకొండ అని పిలుస్తారు. కారంపూడి పల్నాటి యుద్దానికి రణభూమి. ఇక్కడ పలనాటి వీరచరిత్ర కావ్యం రూపుదిద్దుకోవడానికి శ్రీనాథ మహాకవి ఆశ్రయం చేసుకున్న చెన్నకేశవస్వామి, సూరేశ్వర ఆలయాలు, పల్నాటి వీరుల ఆరాధ్య దేవత అంకాళమ్మ దేవాలయంతో పాటు పల్నాటి యుద్ధంలో అశువులు బాసిన 66 మంది వీరనాయకుల స్మృత్యర్థం వీరుల గుడి వున్నాయి. గుత్తికొండ గ్రామ సమీపంలో సహజసిద్ధంగా ఏర్పడిన బిలం, లోపల చీకటి మల్లయ్య శివలింగం ప్రసిద్ధికెక్కాయి. పెదకొదమగుండ్ల గ్రామంలోని శ్రీ ఉత్తరేశ్వరాలయం ఆధ్యాత్మిక శిఖరం. ఐక్య పల్నాడు రాజధాని గురజాల పట్టణంలో నాటి పల్నాటి చరిత్ర స్ఫురించే విధంగా ఇష్టకామేశ్వర, ముక్కంటేశ్వర, గంగ (పాతపాటేశ్వరి), వీరభద్ర దేవాలయాలు నేటికీ అలరారుతున్నాయి. దైద అమరలింగేశ్వర స్వామి, గోగులపాడు గ్రామంలో నీలకంఠేశ్వరుడు, సత్రశాల శ్రీ గంగాభ్రమరాంబికా సమేత మల్లిఖార్జున స్వామి దేవాలయాలు ప్రఖ్యాతి వహించాయి. 9వ శతాబ్దిలోచాళుక్య మొదటి భీముని కాలంలో నిర్మాణమైన జలపేశ్వరాలయం అత్యంత వైభవోపేతం. పీఠం నుండి విమాన గోపురం వరకూ పూర్తి శిలా నిర్మితము. ఈ ఆలయాన్ని కేంద్రపురాతత్వ శాఖ పురాతన ఖండంగా గుర్తించి ఉన్నతీకరణకు స్వీకరించింది. ఈ ఆలయాన్నే బొబ్బనాగ అనే మరోనామంతో పిలుస్తారు. ఆలయం వెనుక నుండి నాగులేరు పరవళ్ళు తొక్కుతుంది. గురజాలకు సమీపంలోని జిట్ట గామాలపాడులో పల్నాడు మహామంత్రిణి నాయకురాలు నాగమ్మ అర్చించుకున్న చెన్న మల్లిఖార్జున స్వామి దేవాలయం కలదు. ఈ దేవాలయం కుడ్యములపై గల శిల్ప కళ అత్యంత రమణీయంగా దర్శనమిస్తుంది. ఈ దేవాలయం కూడా పురాతత్వశాఖ వారి స్వాధీనమై అభివృద్ధిలో అడుగులు పడుతున్నాయి.




వై.హెచ్.కె. మోహనరావు

గుంటూరు

ఫోన్ : 944 015 4114



పందిరి మల్లికార్జున రావు

## తెలుగు పత్రికా రంగంలో *ఏరిన ముత్యం*

# పందిరి మల్లికార్జున రావు

*– ఎ.బి. సాయి ప్రసాద్*

మైలాపూర్ ఆర్ట్స్ అకాడెమీవారు నిర్వహించిన తెలుగు డిబేటుకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులు డిబేట్‌ను గురించీ అందులో పాల్గొన్న విద్యార్థుల ఉత్సాహాన్ని గురించి మాట్లాడుకుంటూ వస్తున్నారు. మాట్లాడుతూ మాట్లాడుతూ తెల్లని జుబ్బా, తెల్లని పైజమా తొడుక్కున్న 'నల్ల' కలువలాంటి వ్యక్తి కళ్ళకు ఒక పాత పుస్తకాల కొట్టు కనిపించింది. అంతే, మాట్లాడుతున్న టాపికన్‌ను ఆపి తనతో కూడా నడుస్తున్న వ్యక్తితో ఒక్క పది నిమిషాలు నాతోపాటు రండి. ఇక్కడున్న పాత పుస్తకాలను చూద్దాం అన్నాడు. ఇద్దరు పుస్తకాలు తిరగేశారు. తెల్ల జుబ్బా తెల్ల పైజమాతోపాటు తెల్లని నవ్వును ధరించిన వ్యక్తి తనకు నచ్చిన పుస్తకాన్ని కొట్టువాడు అడిగినంత ధరను మారు మాటాడకుండా ఇచ్చి తృప్తితో బయటపడ్డాడు. ఇద్దరిలో కొంత వయసు ఎక్కువున్న వ్యక్తి మరెవ్వరో కాదు. అతడే పత్రికా కిన్నెరేశుడు మల్లికార్జునరావు. ఆ రెండవ వ్యక్తి నేటి సాటి లేని మేటి కుటుంబ పత్రిక విస్‌డమ్ – ఇంగ్లీషు, తెలుగు – సంపాదకులు డా. కె.వి. గోవిందరావు. వివిధ పత్రికలలో అచ్చు అయిన మంచి మంచి విషయాలను సంగ్రహించి కిన్నెరలో అచ్చువేద్దామనుకుని కొన్ని శీర్షికలను శ్రీ పందిరి మల్లికార్జునరావు గోవిందరావుకు చూపించాడు. తన ముందున్న ఒక డజన్ పేర్ల నుండీ 'ఏరిన ముత్యాలు'న్న పేరును విస్‌డమ్ గోవిందరావు ఎన్నుకోవడం 'Wise' మల్లికార్జునరావు దాన్ని ఖరారు చేయటం అంతా వెంటవెంటనే జరిగింది.

అందరిలా కాకుండా కొంత భిన్నమైన నిర్మాణాత్మకమైన పనిని చేయాలన్న కోరిక మల్లికార్జునరావుకు చిన్నప్పటినుండే ఉండేది. అందుకే రాజమండ్రిలో ఉంటూ కలప వ్యాపారం చేయకుండా చెన్నపట్నం వచ్చి అతడు కిన్నెరేశుడుగా మారాడు. అప్పయ్య దీక్షితులు చెప్పినట్టు ఆంధ్రత్వాన్ని పుణికిపుచ్చుకుని అంతటితో ఆగత తండ్రి వీరన్నగారి అనుమతితో అల్హాబాదు వెళ్ళి ఆనందభవన్‌లో అడుగుపెట్టి శ్రీ మోతీలాల్ నెహ్రూ ఆశీస్సులతో అతడికి ఆత్మీయుడయి తన ఆశలను ఆశయాలను నెరవేర్చుకున్నాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాకను అందరితోపాటు ఎదిరించి, అరెస్టు అయ్యాడు. శ్రీమతి కె. రామలక్ష్మి గారి మాటలలో చెప్పాలంటే ఉత్తరాదిన ఇటువంటి సత్యాగ్రహంలో జైలుకెక్కిన తొలి తెలుగువాడు ఈయనే (పందిరి మల్లికార్జునరావు పుట. 19). రాజమండ్రి రైల్వే స్టేషనులో ఇతడిని ఆహ్వానించడానికి వచ్చిన వారిలో ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం కూడా ఉన్నాడంటే ఉత్తరాదిలో ఇతడు ఎగురవేసిన తెలుగు పతాకం ఔన్నత్యం మనకు తెలిసి వస్తుంది.

రాజకీయాలలో – తొలుత కాంగ్రెస్ కార్యకర్తగా ఆ తరువాత కమ్యూనిస్ట్ కార్యకర్తగా ప్రముఖ పాత్ర వహిస్తూ ఒక పక్క హిందీను ప్రచారం చేస్తూ దుర్గాబాయి లాంటి వారికి హిందీ నేర్పుతూ, సహపంక్తి భోజనంలాంటి సాంఘిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నా తన సాహిత్యాభినివేశాన్ని క్రమం తప్పకుండా పెంపొందించుకుంటూ వచ్చాడు. 'ప్రతాప్' 'ఆజ్'లాంటి హిందీ పత్రికలకు విలేఖరుడిగా ఉంటూ అటు హిందీ వార్తలను తెలుగులోకి తెలుగు వార్తలను హిందీలోకి అనువాదం చేస్తూ వచ్చాడు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'ప్రబుద్ధ ఆంధ్ర'లాంటి పత్రికను సాహిత్య పఠనం మన వ్యక్తిగత స్వేచ్ఛకు పునాది (పందిరి మల్లికార్జునరావు, పుట. 25) అని తెలియజేసే తీసుకురావాలనుకున్నాడు. అందుకే, ఆ పత్రిక ఆగిపోయిన తరువాత 1927లో 'సుభాషి' అన్న పత్రికను ప్రారంభించాడు. తమ తొలి సంచికలోనే ఆనాటి ఆర్థిక, సాంఘిక, మత పరిస్థితులను పేర్కొంటూ అందులోని

లోటుపాట్లను ఎత్తిచూపుతూ 'సుభాషి' ఉద్దేశాన్ని మల్లికార్జునరావు ఇలా తెలియజేశాడు : ఈ ధర్మ సంరంభంలో ఈ నవయుగంలో సారస్వతము, కళ, చరిత్ర ఈ మూడిటి రూపంగా తెలుగు హృదయాన్ని వ్యక్తీకరించడమే మా ఆశయం (పందిరి మల్లికార్జునరావు పుట. 32).

ఆనాటి పరిస్థితులు, అధికార వర్గం 'చలువ' కారణంగా ఏడునెలలకే 'సుభాషి' మూగదైంది.

కట్టెలు అమ్మి అయినా సరే, మల్లీ పూలు అమ్మాలి అన్న మనోబలం కారణంగానే రాజకీయాలను, కళాసేవను కొన్ని సంవత్సరాలు పక్కకు నెట్టి, డబ్బు సంపాదనవైపు దృష్టిని సారించి 'వీటో' నొప్పులు మందును కనుగొన్నాడు. ఇది దెబ్బతినడంతో 1938వ సంవత్సరంలో మద్రాసుకు మకాం మార్చి రీటా హేర్ ఆయిల్ తయారుచేసి అమ్మసాగాడు. ఆర్థికంగా నిలదొక్కుకున్న తరువాత 'కిన్నెర'ను 1948వ సంవత్సరంలో ప్రారంభించాడు.

తెలుగుభాష, తెలుగుజాతి, తెలుగు సంస్కృతికి యథోచిత సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకుని తన కిన్నెరను ప్రారంభించాడు. 'కిన్నెర' ప్రత్యేకతను తెలియజేస్తూ "ఆంధ్రాభ్యుదయానికి కంకణం కట్టుకున్న పత్రిక కిన్నె. ఆంధ్ర జనానీకం పత్రిక 'కిన్నెర' ఆంధ్ర సేవకై పుట్టిన పత్రిక కిన్నెర. మన సంఘం మన ఆర్థిక జీవనం ఈ విషమ పరిస్థితులలో ఏ విధంగా పునర్నిర్మాణం కావలసిందీ, మన జీవిత సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించవలసిందీ వర్ణించే హృదయంగములైన కథలతోనూ వ్యాఆలతోనూ వినోదాన్ని, విజ్ఞానాన్ని చేకూరుస్తుంది 'కిన్నెర". కిన్నెర తొలి సంచికలో లోపలి అట్టపై ప్రచురించాడు. ఆ తరువాత కూడా ఆ స్థానంలో ఈ ప్రకటనను ముద్రిస్తూ వచ్చాడు. పాఠకులు అందిస్తున్న సహకార సద్భావాలను గౌరవిస్తూ ఏప్రిల్ 25 'కిన్నెర' 'స్వవిషయం'లో ఇలా రాశాడు. కిన్నెర సంవత్సరం చందా ఆరురూపాయల నుంచి నాలుగు రూపాయలకు తగ్గించగలిగాము. విడి పత్రిక ధర ధరను ఎనిమిది అణాల నుంచి ఆరు అణాలకు తగ్గించాడు. కాని, కిన్నెర పత్రిక పుటలు తగ్గించలేదు. సాధారణంగా కొన్ని సంవత్సరాల తరువాత వెలను పెంచడం జరుగుతుంది కాని, తగ్గించడం జరగదు. 'కిన్నెర' ద్వారా వ్యాపారం చేసి డబ్బులు ఆర్జించాలన్న భావన ఆయనకు ఉండేది కాదని ఈ చర్య మనకు చెప్పక చెప్తుంది.

'ప్రబుద్ధ ఆంధ్ర' పత్రిక (శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి) 1934లో పునరుద్ధరించబడింది. ఈ పత్రిక ఆదర్శాలు, సిద్ధాంతాలు మల్లికార్జునరావుపై తమ చెరగని ముద్ర వేశాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వద్దనుండీ మల్లికార్జునరావు రెండు విషయాలను స్వీకరించాడు. అందులో మొదటిది పద్యాలు గేయాలు ప్రకటించకూడదన్న నిర్ణయం కాగా రెండవది కొంతవరకూ హిందీ ఆధిక్యాన్ని స్వీకరించకుండా దాన్ని ఎదిరించడం అన్నదవుతుంది. తమ పత్రికలోని గమనికలో నాల్గవ గమనిక గేయాలు ప్రకటింపబడవు అని అచ్చు వేస్తూ వచ్చారు. నవంబరు 53 వ సంచికలో రెండుసార్లు. మొదటిసారి మనవి అని, రెండవసారి గమనిక అని ప్రచరించడం జరిగింది 'ప్రజాహృదయం' పేరుతో సంపాదకుని పేర లేఖలను రెండు లేఖలను ఇక్కడ ఉదహరించవచ్చును.

అయ్యా! పద్యాలను, గేయాలను నిషేధించిన కిన్నెర కవులను - రమణారెడ్డి, నారాయణరెడ్డి - విమర్శఖ వ్యాసకర్తలుగా మార్చడానికి పూనుకోలేదుకదా అని కాస్తంత వ్యంగ్యంగా ఆగస్టు 53 సంచికలో ఏలూరు నుండి పాఠకుడు కృష్ణారావు రాశాడు. సరిగ్గా ఇటువంటి భావాలనే కాకినాడ నుంచే చేబ్రోలు సూర్యారావు డిసెంబరు 53 సంచికలలో వ్యక్తం చేస్తాడు :

కిన్నెరలో ఎట్టి గేయములనుగాని, మీరు ప్రచురించటంలేదు. కారణం కానకున్నది. కాని, మీరు ప్రజల కమితోపకారియైన గేయసాహిత్యము కూడా కిన్నెరలో ప్రచురించవలెనని నా కోరిక. "గేయాలపట్ల ఈ అకారణ ద్వేషం ఎందుకు కలిగిందో చెప్పలేము. ఇంతకు 'సుభాషి' తొలి సంచికలో గేయాలను మల్లికార్జునరావు ప్రచురించాడు. 53 ప్రాంతంలో కవుల విమర్శపరమైన వ్యాసాలు ప్రచురించినప్పుడు (ఊర్వశి - రవీంద్రుని సౌందర్యగల్పిక రచయిత బెజవాడ గోపాలరెడ్డి, జూన్ 53, ప్రజాకవి దాశరథి, రచన పి.పి. రత్నం, డిసెంబరు 53) కాస్త నియమాన్ని సడలించుకోవడం జరిగింది. కిన్నెర 7వ జన్మదినం సందర్భంగా వెలువడిన జనవరి 55వ సంచికలో చాలా గేయాలను ప్రచురించడం జరిగింది. అంతెందుకు 79లో రెండు కవితలను ఇతడు రాశాడు. 14-10-79 కవితలో తన అంతరంగ వేదనను తిరువత్తియూరు - నా కలలు 'కవిత'లో చక్కగా వర్ణించాడు : నా తీయని కలలన్నీ గాలిలోన

ఎగిరిపోయాయి. నా బిడ్డలు చెల్లాచెదురై – నేను నేడు ఏకాకిని, ఈ జరావస్థలో ఎండిన మొరడువలె, ఆహా! ఏమి ఈ విపర్యము! 'దేవుడు' (3–5–1981) కవిత్వంలో 'నీ తుది కాలంలో నా నిజం కనుగొనేది' అని ఇతరులను ప్రశ్నిస్తున్నట్టు తన్ను తాను మల్లికార్జునరావు ప్రశ్నించుకున్నాడు. వయసుతోపాటు భావాలు మారడం మానవ నైజం. గాంధీయిజం దగ్గర రాజకీయ ప్రయాణం మొదలుపెట్టి కమ్యూనిజం మార్గంలో ప్రయాణం కొనసాగించి చివర్లో గాంధీ అహింసావాదం మార్గంపై తిరిగి వచ్చిన గాంధేయుడు మల్లికార్జునరావు. బళ్ళారి విషయంగా జులై 53 సంచికలో సంపాదకీయం రాస్తూ : కానైతే దౌర్జన్య చర్యలకు తావీయక అహింసాయుతమై ఉద్యమాన్ని కొనసాగించడం విజయానికి ఎంతేని అవసరం. గాంధీయిజం అవలంబించిన అహింసా సత్యమార్గాలు దీనికి శ్రీరామ రక్ష. గాంధీ మార్గాన్ని ఖండించి లెనిన్‌ను మార్గదర్శికుడుగా ఎన్నుకున్న మల్లికార్జునరావు – గాంధీ విషయముగా అలా సంపాదకీయంలో రాశాడంటే నిజంగా ఆశ్చర్యం వేస్తుంది. ఇతడిని గురించి హిందీలో చెప్పాలంటే సుబహ్ కా భూలా అంటే ఉదయం దారి తప్పినా సాయంకాలం తిరిగివచ్చిన వ్యక్తి. హిందీని నేర్చుకుని, హిందీని నేర్పించి, హిందీ ప్రచారక్‌గా పనిచేసిన మల్లికార్జునరావు నాగరి లిపిని కాదని రోమన్ లిపిని ప్రచారం చేయడాన్ని మనం చాలావరకు జీర్ణించుకోలేము. జులై 52 సంపాదకీయంలో రాజభాష హిందీని గురించి రాస్తూ హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించాడు. ఇంతకు ముందు జనవరి (52), ఫిబ్రవరి (52) సంచికలో ఈ విషయంగా 'వ్యాఖ్యాలు'లో చర్చించాడు. ఆ విషయంగా విశాఖపట్నం నుండి కె. సత్యనారాయణ ప్రజాహృదయంలో లేఖ రాస్తూ :

తెలుగు ప్రధాన భాషగాగల హైదరాబాదు సంస్థానంలో హిందీ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడం ఏమంత భావ్యం అని వ్రాశారు. అంటే ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని తెలుగు యూనివర్శిటీగా మార్చాలనా మీ అభిప్రాయం. అట్లా అయితే మహారాష్ట్రుల కన్నడిగుల గతి ఏమవుతుంది? ఏ ఒక్క ప్రాంతీయ భాషను ఆ ప్రాంతపు భాషా విశ్వవిద్యాలయంగా చేసేకంటే హిందీ విశ్వవిద్యాలయంగా మార్చడం సబబు కాదా అని ఎడిటరును నిలదీయడం అయింది. బహుశా ఇదే కారణం అయి ఉండవచ్చు. హిందీని వదలి నాగరి లిపిపై విరుచకపడడం ప్రారంభించాడు. ఐరోపా ఖండంలోని దేశాలవారు రోమన్ లిపిని వాడి బాగుపడ్డారు కదా మనం మాత్రం ఎందుకు ఆ లిపిని స్వీకరించకూడదు అన్న వాదనను ఇతడు లేవదీశాడు. తన అభిప్రాయంలో ఏకీభవించే మానికొండ సత్యనారాయణశాస్త్రి అభిప్రాయాలను ఆయన ఒకే 'లిపి' అనే వ్యాసం నుండి (ఆంధ్రరాష్ట్ర అవతరణ సంచిక వెంకటరామ అండ్ ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్) తీసుకొని యథాతథంగా నవంబరు 53 ఏరిన ముత్యాలలో జోడించాడు. పత్రిక మూత పడిన తరువాత ఏమైనా తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడేమో మనకు తెలియదు. మరి వారి స్వదేశాభిమానం ఈ విషయంలో ఎందుకు దారితప్పిందో తెలియదు.

వ్యావహారిక భాష పట్ల మల్లికార్జునరావుకు ఖచ్చితమైన అభిప్రాయం ఉండేది. మద్రాసు విశ్వవిద్యాలయం వారు గ్రాంథిక భాషను ప్రోత్సహించడం ఇతడికి రుచించలేదు. తన సంపాదకీయ వ్యాఖ్యలో ఖండించడం కూడా జరిగింది. తెలుగు భాషా సమితి సంస్కృతి శాఖ కార్యదర్శిగా స్వాగతం పలుకుతూ విద్యాశాఖా మంత్రి డాక్టర్ ఎం.వి. కృష్ణారావుగారి సమక్షంలో మల్లికార్జునరావు తన అభిప్రాయాలను వెల్లడి చేశాడు. మంత్రిగారు తమ ఉపన్యాసంలో "వ్యావహారిక భాషను గురించి శ్రీ పందిరి మల్లికార్జునరావుగారు చెప్పిన దానితో నేను సంపూర్ణంగా ఏకీభవిస్తున్నాను" అన్నారు. ఇదే సభలో (జనవరి 1, 1953) శకట రేఫలను గురించి, అరసున్నాలను గురించి చెబుతూ శకట రేఫల శషభిషలూ, అరసున్నాల గజిబిజి చిట్టి పాపల బాలుర చిరుత బుద్ధికి అందనివి, అనవసరమా? కావున ముఖ్యంగా సెకండరీ విద్యా విధానంలోనైనా వెంటనే వ్యావహారిక భాషను ప్రవేశపెట్టవలసినదిగా కోరుతున్నాను" అని అన్నాడు. ఈ రోజు వరకూ లేదా 1997 వరకు బతికుంటే మాత్రం ఇతడికి గుండెలు బాదుకోవలసిన పరిస్థితి వచ్చేది. ఈ రోజు తమిళనాడులోని తెలుగు పాఠ్యపుస్తకాలలో ముఖ్యంగా 10th, 12th పుస్తకాలలో అరసున్నాలు ఉన్నాయంటే మీలో చాలామంది నమ్మరు.

కొన్నికొన్ని విషయాలలో మల్లికార్జునరావు చాలా దృఢంగా ఉండేవాడు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ విషయంలో కేంద్ర నాయకులు – నెహ్రూ, మౌలానా ఆజాద్ లాంటి

అవలంబించిన నీతిని, రాజగోపాలచారి విముఖతను చాలా ఘాటుగానే విమర్శించాడు. కేంద్ర మంత్రి వర్గంలో తెలుగువారికి స్థానం కల్పించకపోయినందుకు నెహ్రూను తీవ్రంగా విమర్శించాడు. ఆరుమంది కవుల ప్రత్యేక తపాలా బిళ్ళలను విడుదల చేసినప్పుడు దాక్షిణాత్యులలో గొప్ప కవులు లేరా అన్ని ప్రశ్నించాడు. చెన్నపట్నంలోని పేటల పేర్లను వణ్ణార్‌పేటై, ఎళుంబూరు, చింతాద్రిపేటైలుగా మార్చినప్పుడు అది తగదని చెప్పాడు. ఆంధ్ర ఫైలు, రాయలసీమ ఫైలు అని రెండు ఫైళ్ళుగా విడదీసినప్పుడు రాజాజీను దుయ్యబట్టాడు. బళ్ళారిని, బరంపూరును, చెన్నపట్టణాన్ని పోగొట్టుకున్నప్పుడు, రేపు ప్రొద్దున్న హైదరాబాదు మహారాష్ట్రలకు పోవచ్చును కదా అని కూడా బాధపడ్డాడు.

'కిన్నెర'లో మల్లికార్జునరావు కొన్ని గమ్మత్తులను కూడా చేశాడు. సామాన్యంగా పాఠకులకు విన్నపం అని ప్రత్యేకంగా రాయడం జరుగుతుంది. ఫిబ్రవరి 53 సంచికలో ప్రజాహృదయం శీర్షికను వ్యావహారిక భాషా పద పట్టికలు అనే అంశంపై తానే తనకు లేఖ రాసుకున్నాడు. ఆగస్టు 53 సంచిక ముఖచిత్రం కాశీలోని ప్రధాన దేవాలయంను గురించి రాస్తూ; మొగలాయి చక్రవర్తి ఔరంగజేబు 1707 వ సంవత్సరంలో కాశీలోని ప్రధాన దేవాలయమైన విశ్వనాథాలయాన్ని నాశనం చేసి అక్కడ ఈ మసీదును నిర్మించాడు. నేటికిని లక్షలాది హిందువులు భక్తిపూర్వకంగా ఏటా దీనిని సందర్శిస్తారు. సంవత్సరం తారీఖు లేకుండా ఈ రోజు దీన్ని ప్రచురిస్తే మొత్తం దేశం అట్టుడికిపోయి మల్లికార్జునరావు మతోన్మాది, భజరంగ్ దళ్ సభ్యుడు, ప్రగతి నిరోధకుడు విశ్వ హిందూ పరిషత్ కార్యకర్త అని అతడిని పేరుపెట్టేవారు. ఇతడు సమీక్షలు కూడా రాసేవాడు. పాటలి అనీ (జూన్ 53) పేరు లేకుండా ఆగస్టు 53 సంచికలో వ్రాశాడు. సందృఢమైనట్టిన్నీ, సంస్థిరమైనట్టిన్నీ దీర్ఘగలట్టిన్నీ లాంటి ప్రయోగాల ద్వారా ఈ విషయాన్ని మనం అర్థం చేసుకోవచ్చును.

కిన్నెర 17 సంచికలను చూడగా సుమారు 30 పత్రికల (తెలుగు పత్రికల) పేర్లను మనం చూడగలం. ఇందులో కృష్ణా పత్రిక, ఆంధ్రప్రభ తప్ప వేరే ఏ పత్రిక ఈ రోజు వెలువడడంలేదు. ప్రస్తుతం ఇవి కూడా మూతపడ్డాయి.

జయ్‌హింద్ వాచ్ కంపెనీ ప్రకటన కన్నడ భాషలోనే (బ్లాకు కాబట్టి) ప్రకటించబడింది.

పుస్తక సమీక్షలలో హిందీ, ఇంగ్లీషు భాషా పుస్తకాల సమీక్షలను మనం చూడగలం. గ్రంథ స్వీకారంలో గుజరాతీ, బెంగాలీ లాంటి ఇతర భాషా పుస్తకాలను చూడగలం. అక్టోబరు 50 సంచికలో రవిగ్లిసరిన్ 'శోపు' అని అచ్చువేశాడు.

బియస్‌సీను విడివిడిగా రాయడం, పిహెచ్‌డిను విడివిడిగా రాయడం చాలావరకు కొత్త ప్రయోగంగా భావించి కిన్నెరలో అచ్చువేయడం జరిగింది. అనువాదాలకు ప్రాముఖ్యత ఇవ్వబడదు అని నవంబరు 50 సంచికలలో స్పష్టంగా అచ్చువేయడం జరిగింది. అయినా స్వేచ్ఛానువాదాన్ని, విదేశీ ఇతివృత్తానికి తెలుగు పేర్లను వాడడం ప్రోత్సహించాడు. అనువాద సాహిత్యం అన్న ప్రకటనను తెలుగు భాషాసమితి (సంస్కృతి) కార్యదర్శిగా 14-1-51న ఒక ప్రకటనను కిన్నెరలో అచ్చువేయడం జరిగింది. అందులో - సంస్కృతం, హిందీ, బెంగాలి, మహారాష్ట్రం, కన్నడం, ఉర్దూ, ఇంగ్లీషు మొదలైన భాషలలో నుండి అనేక రచనలను ఉద్గ్రంథాలను అనువదించి విభిన్న దేశ ప్రజల విజ్ఞానాన్ని సంస్కృతిని తెలుగుదేశానికి అందజేశాడు. తద్వారా తెలుగు సరస్వతి నూత్నాలంకారాలను చేకూర్చుకున్నది, అని రాయడం జరిగింది. పందిరి మల్లికార్జునరావు లోతైన మనిషి. అతడు అంత సులభంగా ఎవరికి అర్థం కాడు. అర్థం అయినట్టే అయి అర్థం కాకుండా ఉండిపోతాడు. మూఢనమ్మకాలను గర్హించాడు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల ప్రభావం కావచ్చు. అతడే దేవుడిని కూడా విశ్వసించేవాడు కాదని విశ్వసనీయ వర్గం ద్వారా తెలిసింది. అయినా 'దేవుడు' అనే పేరుతో 3-5-1981న కవిత్వం రాస్తూ : ఈ గొడవంతా (దేవుడి విషయంగా ఏది నిజం, ఏది కల్ల) మనకెందుకు చచ్చేటప్పుడు సంధ్య మంత్రం అన్నట్టు

*నీ తుది కాలంలోనే నిజం కనుగొనేది.*

*కాదు - నేడే మేలుకో / నేడే కళ్ళు తెరువు*

*తేజస్సుని చూడు / పురోగమించు - మానవత్వం దిశగ*

*మానవతా దిశకు*

తన అభిప్రాయాలను మార్చుకున్న మల్లికార్జునరావు కొన్ని సందర్భాలలో ప్రశ్నార్థకంగానూ, ఆశ్చర్యార్థకంగానూ నిలబడిపోతాడు. ఏది ఏమైనా పందిరి మల్లికార్జునరావు నిజంగానే తెలుగు పత్రికా రంగపు 'ఏరిన ముత్యం'.

డా. ఎ.బి. సాయి ప్రసాద్
బెంగుళూరు. ఫోన్ : 0 998 056 7541



# ఆనందం ఎండమావా?

– సిద్ధయ్య నాయుడు

ఆనందం అంటే ఏమిటి? ప్రతి ఒక్కరూ దాని కొరకే పరుగులు పెడుతున్నారు. దాని కొరకే అర్రులు చాచి ఆహ్వానిస్తున్నారు. కానీ ఏ ఒక్కరూ దాని గురించి, దాని అర్థం గురించి కుదురుగా కూర్చుని ఆలోచిస్తున్నారా? తర్కిస్తున్నారా? విచారణ చేస్తున్నారా? లేదే, ఏమీ చేయకుండానే దాని వెంట పరుగులెత్తుతున్నారు.

మానవుని జీవితంలోకి చూస్తే ప్రతి ఒక్కరిలో తీవ్రమైన అసంతృప్తి గూడ కట్టుకొని ఉంది. ఏదో ఒక విషయంలో ప్రతి ఒక్కరిలో ఒక వెలితి తొంగి చూస్తున్నది. శాంతి, తృప్తి, ఆనందంలాంటివి ఎండమావుల్లా వెక్కిరిస్తున్నాయి. చిక్కినట్లే ఉంది. కానీ చిక్కలేదు. దక్కినట్లే ఉంది కాని దక్కలేదు. అసలు ఏ మానవుడినైనా నీవు ఎందుకు బ్రతుకుతున్నావని ప్రశ్నించండి. జవాబు సదా ఆనందంగా ఉండడానికంటాడు. వాడి జీవితంలోని ప్రతి పనీ దానికొరకే. జీవితమే దానికొరకు.

మానవుడికంటే పశుపక్ష్యాదులు ఆనందమయ జీవితాన్ని గడుపుతున్నాయి. ఏ పశువుకానీ, పక్షికానీ దుఃఖమయ జీవితాన్ని గడపడంలేదు. లేనిదానికై అర్రులు చాచడంలేదు. దొరికింది తిని, హాయిగా నిద్రిస్తున్నాయి. మానవుడు అందుకు భిన్నంగా లేని దాని కొరకు పరుగులు తీస్తూ నిత్య అసంతృప్తితో కొనితెచ్చుకున్న బాధలతో, ఏదో కావాలనే ఆరాటంతో అలమటిస్తున్నాడు. ఏం కావాలో స్పష్టంగా తెలియదు.

సంపద అనే బట్టను కప్పుకున్న మనిషి అంతరంగంలో దరిద్రం తాండవిస్తున్నది. హృదయం విషాదభరితమై ఉంది. ఈ దరిద్రాన్ని దాచుకోవడానికి, మర్చిపోవడానికి, మనిషి సంపద కోసం, అధికారం కోసం, కీర్తి కోసం పరుగులు పెడుతున్నాడు.

దరిద్రం అంటే సంపద లేకపోవడం కాదు. తన దగ్గర సంపద లేదనుకోవడమే అసలైన దరిద్రం. పోనీ ఉన్నవాడైనా ఆనందంగా ఉన్నాడా?

అసలు మీ మనసు ఎందుకు అసంతృప్తితో ఉందో మీరెప్పుడైనా ఆలోచించారా? మీకు కావలసిందేమిటి? అది లభిస్తే ఆనందంగా ఉంటారా? ఎంతకాలం అలా ఉండగలరు? కోరినది లభించినవారందరూ ఆనందంగా ఉండగలగాలి. ఉన్నారా? అంటే వారు కోరింది అది కాదు? మరేది? అసలు మీకు ఏం కావాలి? బాగా ఆలోచించండి.

భౌతిక సంపదలో అందరూ తృప్తిని పొందాలని ప్రయత్నిస్తున్నారు. ఆ సంపద ఒనకూడేకొద్దీ అదే ప్రమాణంలో అసంతృప్తి పెరుగుతుంది. ధనంలో ఆనందం ఉందనుకుంటే, ఈనాటి కోటీశ్వరులలో అది ఎంత ఉందో వారికే ఎరుక. అలాగైతే ఎంత సంపాదిస్తే అది దొరుకుతుందో వారికి తెలుసా? ఎన్ని జన్మలెత్తినా ఆ కోరిక తీరదు. ఎందుకంటే వారు కోరేది అందులో లేదు.

అదే ప్రశ్న మీరు నన్ను అడిగితే "దేన్ని పొందితే, ఇక పొందడానికి, సాధించడానికి, సంపాదించడానికి ఏమీ మిగిలి ఉండదో, దాన్ని పొందాలని" కోరుకుంటాను.

ప్రతి ఒక్కరూ సౌకర్యవంతమైన జీవితాన్ని అభిలషిస్తున్నారు. సౌకర్యం అంటే కష్టం లేకుండా సుఖవంతమైన జీవితం. గడ్డిమోపును ఎర్రటి ఎండలో మోస్తూ, ఒక చెట్టు నీడ కనిపించగానే దాని క్రింద దించి, సేద తీరటంలాంటిది. ముందు నెత్తిమీద గడ్డిమోపు లేదు. మధ్యలో నీవు ఎత్తుకున్నదే. ఎత్తుకున్నదే దించినందులకు హాయిగా ఉంది. సంతోషం ఆనందానికి పర్యాయపదం కాదు. సంతోషం వేరు, ఆనందం వేరు. తాత్కాలికమైనది సంతోషం. నీవు కోరుకున్నది లభిస్తే సంతోషం.

ప్రతి మానవుడికి కావలసింది ఆనందం. సంపూర్ణ శాశ్వత ఆనందం. అన్ని కోరికలు, వాంఛలు, ఇక్కడే అంతమవుతాయి. ఏ కోరికా మిగిలి ఉండదు. ఎక్కడైతే కోరిక ఉంటుందో అక్కడ దుఃఖం, అశాంతి ఉంది. ఎందుకంటే

అక్కడ వెలితి, కొరత ఉంది. వెలితి ఉంటే కోరిక పుడుతుంది. కోరిక ఉంటే పూర్ణముకాదు. పూర్ణములో అది అసాధ్యం.

ఆనందం ఎక్కడో లేదు. బయటి వస్తువుల్లో లేదు. ఆనందం నీ సహజ స్వరూపం. అది నీ నైజం. అదే నీవై యున్నావు. అదే నీ అంతరంగం. బయటలేదు. బయట వెతికి లాభంలేదు. నీవు వెదికేది బయట. అది ఉండేది లోపల. లేనిది ఎలా కనిపిస్తుంది. ఎన్ని జన్మలెత్తినా, ఎన్ని ఏండ్లు వెతికినా దొరకదు. బయట ఎంత సాధించినా ఇంకా అంత మిగిలి ఉంటుంది. ఎన్ని కోట్లు సంపాదించినా ఇంకా అన్ని కోట్ల డబ్బులు మిగిలే ఉంటుంది. ఎంత కీర్తి, ఎంత అధికారం సంపాదించినా ఇంకా అంత మిగిలి ఉంటుంది.

బయటి వస్తు సంపద ఎంత ఉన్నా, ఇంకా ఏదో కావాలనే కోరిక మిగిలే ఉంటుంది. కోరిక ఎప్పుడూ తీరనిదే. ఇది అగ్నిలాంటిది. ఎన్ని ఆహుదులు వేసినా ఇంకా కావాలంటుంది. రావణకాష్టంలాంటిది. ఎప్పటికీ తీరే ప్రశ్న లేదు. ఎంత సాధించినా ఇంకా సాధించవలసింది అంత మిగిలి ఉంటుంది. గాయకుడు ఇంకా బాగా పాడాలని అభిలషిస్తాడు. చిత్రకారుడు ఇంకా గొప్పగా తన కళను ప్రదర్శించాలనుకుంటాడు. ఎవరూ తమ తమ కళలతో తృప్తిపొందటం లేదు. అందులకే రాజాధి రాజులైనా (వీరాధి వీరులైనా), భికారులైనా, ఇద్దరిలో లోటు, కొరత సమానంగానే ఉన్నది. ఇద్దరూ ఒకటే సంపాదించవలసిన విషయంలో తేడా లేదు. వచ్చినది ఏదో ఒకరోజు పోక తప్పదు. అందుకే పద సంపద రక్షణ ఇవ్వదు. సంపదలో రక్షణ కోసం ప్రయత్నిస్తూన్నాం. అది రక్షణ ఇవ్వకపోగా, దానికే మనం రక్షణ ఇవ్వవలసిన వస్తున్నది. చివరికి మనమే రక్షించవలసిన స్థితిలో ఇరుక్కుపోయాం.

కాబట్టి బాగా అర్థంచేసుకోవలసిన విషయం ఏమిటంటే బయటి సంపద, సౌకర్యాలు, అధికారం, శక్తి వీటితో మన లోపలి అసంతృప్తి పోదు. అభద్రతా పోదు. భయం పోదు. అవి ఇచ్చే భద్రత, ధైర్యం అన్నీ భ్రమే. అవి తాత్కాలికంగా మనిషిని మురిపించి, మాయ చేస్తున్నాయి. అందుకే ధనాన్ని మదం అన్నారు. దాని మత్తులో జీవిత వాస్తవికతను చూడలేం. మీరు కోరుకున్నవన్నీ దొరికినా అసంతృప్తి మాయం కావటంలేదు. నిజమైన సంపదకు, సంపద ఉన్న భ్రమకు చాలా తేడా ఉంది. ఈనాటి సంపన్నులంతా ఈ భ్రమలో ఉన్నారు. బయటి సంపద, శక్తి, భద్రత ఇవన్నీ లోపలి నిజసంపద ఛాయలు. వాస్తవమైనవి కావు. నీలోని కొరత, లోటుకు మూలకారణం బయటి సంపద కాదు. మన దృష్టి బయట ఉండటం. అందుకే బాహ్యంగా ఎంత సంపాదించినా తీరని అసంతృప్తి దృష్టిని లోపలికి మళ్ళించడమే సరియైన పరిష్కారం.

సాధారణంగా మనమందరం అనుకొనే సంతోషం ఆనందం కాదు. ఎందుకంటే ఆనందం దొరికితే అన్ని ప్రయత్నాలు, వెతుకులాటలు ఆగిపోతాయి. ఏది దొరికితే ఇంకా ఇంకా కావాలనే ఆరాటం తీవ్రవైనదో, ఏది సంపాదించాక, అది పోతుందని భయపడుతున్నామో అవన్నీ ఆనందం యొక్క భ్రమలు. ఏ నీరు త్రాగితే దాహం తీవ్రమవుతుందో, అవి నీరే కాదు.

మనం సుఖాన్ని ఆనందంగా భ్రమిస్తున్నాము. సుఖం వేరు, ఆనందం వేరు. సౌకర్యం నుండి సుఖం వస్తుంది. దాన్నే చాలామంది ఆనందమంటున్నారు. తమ జీవితాన్ని ఆ భ్రమలో వ్యర్థం చేసుకుంటున్నారు. చివరకు తీవ్ర అసంతృప్తి, అశాంతి, దుఃఖం తప్ప ఏమీ మిగలటంలేదు. కొలనులో చంద్రుడిని చూచి కొలనులో చంద్రుడిని వెతకడానికి ప్రయత్నిస్తే ఏం సాధిస్తారు. చంద్రుని కోసం కొలనులో ఎంత లోతుకు వెళితే, చంద్రునికి అంత దూరమౌతాడు. అలాగ మనిషి సుఖం కోసం వెంపర్లాడుతూ ఆనందానికి దూరమౌతున్నాడు. సుఖాన్ని అన్వేషిస్తూ దుఃఖాన్ని కొనితెచ్చుకుంటున్నాడు. సుఖం కోసం వెతికితే సుఖాన్ని పొందాలి కానీ దుఃఖాన్ని పొందుతున్నాడు.

జీవితంలో మనం పొందే ప్రతి సుఖాన్నీ ఆనందం అనే భ్రమ కలిగిస్తున్నది. అలా ఆకర్షణకు గురిచేస్తున్నది. ఎందుకంటే, అది ఆనందం యొక్క ప్రతిబింబం. ప్రతిబింబం వెంట వెళితే ఓటమి, నిరాశ, నిస్పృహ తప్ప ఒరిగేది ఏమీ ఉండదు. నీడను చేతితో పట్టుకుంటే, చేతిలో మిగిలేది ఏముంటుంది?


ప్రతిబింబం ఎప్పుడూ వ్యతిరేక దిశలో ఏర్పడుతుంది. అద్దం ముందు నిలబడితే, వ్యతిరేక దిశలో అంతే దూరంలో ఉంటాము. ఆనందం కూడా అలాంటిదే. ఆనందం లోపల ఉంది. సుఖం బయట ఆనంద రూపంలో ఉన్నట్టు కనిపిస్తున్నది. అందుకే నిజానికి సుఖమనేది దుఃఖమే. ఎక్కడైతే దుఃఖం తప్ప మరొకటి లేదో అదే దారిలో మనం ప్రయాణిస్తున్నాము. ఎందుకు? బహుశా ఆ మార్గం తప్ప

మరొకటి మనకు తెలియదు. ఆ మార్గాన్ని చూపేవాడే సద్గురువు. ఆ మార్గంలో పయనిస్తే మనల్ని మనం చూచుకుంటాం. అప్పుడు మనం మనలోని ఆనందంవైపు అడుగులేస్తాం. సుఖం ప్రపంచంవైపు బైట ఉన్నది. ఆనందం సంసారంలోకాక నీలో ఉంది. అందుకే రమణ మహర్షులవారు నిన్ను నీవెవరో తెలుసుకోమంటున్నారు.

ధనంతో దరిద్రం పోతుందా? ఆలోచనలతో అజ్ఞానం పోతుందా? ధనం లేకపోవడం దరిద్రం కాదు. రమణ మహర్షులవారు జ్ఞాని అయినా తర్వాత ఏనాడూ ధనాన్ని తాకి ఎరుగడు. తనను తాను తెలుసుకోలేకపోవడమే దరిద్రం. తనలోని సత్యాన్ని తెలుసుకోనివారందరూ దరిద్రులనే మన ఋషుల భావన.

ఆలోచనలను ప్రోగుచేసుకుంటే జ్ఞానం రాదు. ఏదైతే ఆలోచనలకు సాక్షిగ, ఆలోచన లేకపోవడానికి కూడా సాక్షిగా ఉంటుందో, దాన్ని గుర్తించడమే జ్ఞానం. ఆలోచనలను ప్రోగుచేయడం జ్ఞానం కాదు. అది జ్ఞాపక శక్తి. జ్ఞాపకం గతం. గతంపైనే జ్ఞాపకాలు ఆధారపడి ఉంటాయి. అవి జరిగిపోయిన అనుభవాల మృతప్రాయమైన విశేషాల గుంపు అది. సమస్యలకు, సమాధానాలకు సఖ్యత ఉండదు. శరీరం ముసలిది కాక ముందే మనుషులు మానసికంగా ముసలివారుగా మారిపోతున్నారు. చనిపోక ముందే మరణిస్తున్నారు.

గతంతో మనసు బంధీ కాకూడదు. ఆలోచనల నుండి విముక్తిడివి కావు. నీ బాహ్యదృష్టిని అంతర్గతంగా మరలించడమే పరిష్కారం. సంస్కృతంలో ఆనందానికి, మోక్షానికి వ్యతిరేక పదాలు లేవు. సుఖదుఃఖాలు అర్థంలేనివి. అవి ఆత్మానందాన్ని రెండుగా విభజించడంవల్ల ఏర్పడ్డాయి. నీకు అనుకూలంగా, అంగీకారంగా ఉండే భాగాన్ని సుఖం అని, నీకు అనుకూలంగా లేని నీవు నిరాకరించేదాన్ని దుఃఖం అని చెప్పబడుచున్నవి. మనకు అనుకూలంగా ఉండేదాన్ని ఆనందం అని భ్రమపడుతున్నాము. ఆనందం శాశ్వతమైనది. అది కొంత కాలం ఉండి కనుమరుగయ్యేది కాదు. నిరంతరం ఉండేది. అదే సత్యం. అదే పూర్ణం.




ఎ. సిద్ధయ్య నాయుడు
కడప జిల్లా.
ఫోన్ : 944 094 1462

---

## మేకప్ అన్నయ్య

మేకప్ అనయ్యగా ప్రసిద్ధికెక్కిన పూర్ణచంద్రరావు 1928, మార్చి 10న గుంటూరుజిల్లా, రేపల్లె సమీపంలోని రావి అనంతవరం గ్రామంలో కర్రి బ్రహ్మయ్య, కామాక్షమ్మ దంపతులకు జన్మించాడు. తండ్రి కాంగ్రెస్‌వాది అయినా, తాను కమ్యూనిస్టులతో కలసి, ఆ ఉద్యమ ఆశయాల ప్రచారం కోసం వేసే నాటకాల్లో చిన్నచిన్న పాత్రలు వేసి, ఆ క్రమంలోనే అవసరార్థం మేకప్ కళను అభ్యసించి, అనంతర కాలంలో వృత్తి కళాకారునిగా మారి నాటక రంగానికి రూపశిల్పిగా తన సేవలు అందించాడు. మేకప్ కళలో రాణించేందుకు అవసరమైన మెళకువలను భద్రయ్య (పొన్నూరు), భక్తవత్సలం (తెనాలి), పీతాంబరం వంటి ప్రముఖ రూప శిల్పుల వద్ద శిష్యరికం చేసి నేర్చుకున్నాడు. ఈ అనుభవంతో, సంపాదించిన నైపుణ్యమే పెట్టుబడిగా నాలుగు దశాబ్దాల పాటు రేపల్లె పరిసర ప్రాంతాల్లో రూపశిల్ప కళకు పెద్దదిక్కుగా నిలిచాడు. స్థానికంగా పలు ఔత్సాహిక సమాజాలతోపాటు, నవోదయ నాట్యమండలి, ప్రజా నాట్యమండలి వంటి పెద్ద సంస్థలకు కూడా మేకప్ కళాకారుడిగా వ్యవహరించాడు. ప్రసిద్ధ నటుడు వల్లూరి వెంకట్రామయ్య సమాజంలో కూడా దాదాపు రెండు దశాబ్దాలపాటు మేకప్ కళాకారుడిగా కొనసాగాడు. రూపశిల్పంలో ఎన్నో ప్రయోగాలు చేసి ఔత్సాహిక సమాజాల ఆదరాభిమానాలు చూరగొన్న మేకప్ అన్నయ్య 1992, జనవరి 22న పరమపదించారు.



పూర్ణచంద్రరావు

# వడ్లు - రెడ్లు

- ముత్తేవి రవీంద్రనాథ్

'వడ్లలో ఎన్నిరకాలున్నాయో రెడ్లలో అన్ని రకాలున్నాయి' అన్న నానుడి సుప్రసిద్ధం. ప్రాచీన కవులు ఎవరూ తమ సాహిత్యంలో వడ్లలో ఎన్ని రకాలున్నాయో వివరించే ప్రయత్నం నాకు తెలిసి ఎక్కడా చేసినట్లు లేదు. 'హంస వింశతి', 'సింహాసన ద్వాత్రింశిక' కావ్యాలలో మాత్రం అలనాటి కొన్ని ధాన్యం రకాలను ఆ కవులు ప్రస్తావించారు. అయితే వరి ధాన్యపు రకాలలో 'రాజనాలు' అని కూడా పిలువబడే 'ప్రాసంగులు' అనే ధాన్యపు రకం సర్వ శ్రేష్టమైనదని పలువురు కవులు తమ కావ్యాలలో అక్కడక్కడా పేర్కొన్నారు. 'ప్రాసగు (ప్రాసంగు) విత్తువంటి నెర పారు కొలంబున బుట్టి' (ప్రాసంగుల వంటి శ్రేష్టమైన బ్రాహ్మణ కులంలో పుట్టి) అంటూ తెనాలి రామకృష్ణ కవి తన 'పాండురంగ మాహాత్మ్యము' కావ్యం(3-3)లో వరి ధాన్యపు రకాలలో ప్రాసంగుల (రాజనాల) సర్వశ్రేష్టతను సూచనప్రాయంగా తెలపడం జరిగింది. వరి ధాన్యాలలో రాజనాలు ఎఱ్ఱని శ్రేష్టమైన రకమని అదేకవి తన 'ఉదటోరాధ్య చరిత్రము' కావ్యంలోని (3-178) పద్యంలో రాజనాలు పండే పొలాలగురించి వివరిస్తూ చెప్పారు. ప్రకాశం జిల్లాలో 'ప్రాసంగులపాడు' అనే గ్రామం ఉంది. నెల్లూరు జిల్లాలో 'రాజనాల' అనే గ్రామం కూడా ఉన్నదట. ఈ రెండు గ్రామనామాలూ శ్రేష్టమైన ఆ వరి ధాన్యపు రకం పేరిట ఏర్పడడం విశేషం. 'క్రీడాభిరామము' అనే కావ్యంలో 'కప్పుర భోగులు' (కర్పూర భోగులు) అనే రకం ధాన్యం ప్రస్తావన ఆ కావ్యకర్త వినుకొండ వల్లభామాత్యుడు చేశాడు.

ఇక ఆ సంగతి అలా ఉంచి, ఆధునిక కవులలో గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామానికి చెందిన అచల తత్త్వవేత్త, రైతుకవి శ్రీమాన్ ఇనగంటి పున్నయ్య చౌదరి గారు (1890-1954) తాను రాసిన 'రైతు కన్నీరు' అనే లఘు కావ్యంలోని ఒక చక్కటి సీస పద్యంలో పలు వరి ధాన్యపు రకాలను పేర్కొన్నారు. ఆ పద్యం ఏమిటో ఇప్పుడు చూద్దాం.

*సీ. వంకసన్నంబులు - కుంకుమపువ్వులు*
*గుండ్రసంబవ మొల - కొలుకు కుసుమ*
*సన్న కొనామణి - చిన్నపిషాణీలు*
*పెదకాకిరెక్కలు - పిన్నకుసుమ*
*పాలాట్రగడ్డలు - బంగారుతీగెలు*
*సన్నంపుముత్యాలు - జున్నుబాలు*
*వంకెలు పగడాలు - వరడిల్లి భోగాలు*
*రామసాగరములు - రాజనాలు*

*ముద్దులలరంగ బండించి - మూటగట్టి*
*దండుగల కింద సర్వంబు - ధారపోసి*
*పొట్టకన్నములేక వా - పోవుటాయె*
*రమ్ము లేలెమ్ము మేల్కొమ్ము - రైతుబిడ్డ*

ప్రాసంగులు (రాజనాలు), కర్పూర భోగులు కాక మనకు ఈ పద్యం ద్వారా వంక సన్నాలు, కుంకుమ పూలు, గుండ్ర సాంబవలు, మొలకొలుకులు, కుసుమలు, సన్న కొనామణులు, చిన్న పిషాణీలు, పెద కాకిరెక్కలు, పిన్న కుసుమలు, పాలాట్రగడ్డలు, బంగారు తీగలు, సన్న ముత్యాలు,

జున్నుబాలు, వంకెలు, పగడాలు, ఢిల్లీ భోగాలు, రామసాగరాలు వంటి పలు ఇతర జాతులు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ఇవికాక మనం రోజువారీ వినే సాంబవ (సాంబ) మషూరీ, జీలకఱ్ఱ సన్నాలు, కృష్ణ కాటుకలు, సన్న కృష్ణ కాటుకలు, అక్కుళ్ళు, నెంబర్లు, ముదుగులు, బుడమలు, కోడి బుడమలు, జిలమలు, ఎరడాములు, కిచిడీలు, ఆట్రగడ్డలు, సన్నాట్రగడ్డలు, జయపూరు సన్నాలు, వంక సన్నాలు, కర్నూలు

సోనా మషూరీ, చిట్టిముత్యాలు, కాకి రెక్కలు, ఈత గొల్లలు,గొర్తివడ్లు, స్వర్ణ, హంస, జయ, కేసరి, చెన్నంగి, రాజభోగాలు, బాస్మతి వంటి వరి వంగడాలు ఇంకా ఎన్నో ఎన్నెన్నో! Oryza sativa అనే శాస్త్రీయనామం కలిగిన ఈ వరి ధాన్యంలో కొన్ని వేల రకాలు ఉన్నాయి.



ఇక ఇప్పుడు రెడ్లలో శాఖల గురించి తెలుసుకోబోయే ముందు అసలు 'రెడ్డి' శబ్దం యొక్క ఆవిర్భావాన్ని గురించి కొంత ఆలోచిద్దాం. రెడ్డి అనే పదానికి గ్రామపాలకుడు (Village Headman) అని అర్థం. 'రేపటికి రాజెవరో రెడ్డెవరో' అనే వాడుక ఉంది. రాజు రాజ్యం మొత్తానికీ అధిపతి. రెడ్డి కేవలం గ్రామాధిపతి. పరిస్థితులు తారుమారు అయితే రాజు కూడా గ్రామపాలకుడు కావచ్చునని దాని అర్థం. గ్రామ సమావేశాలలో గ్రామాధికారి తీర్పులు చెప్పేటప్పుడు కాళ్ళు మడుచుకుని పై పంచె బిగించి, 'రెడ్డిగం' అనే ఒక భంగిమలో కూర్చొనడం పరిపాటి. 'గ్రామాధికారి తీర్పు చెప్పడంకోసం రెడ్డిగం వేసుకు కూర్చున్నాడ' ని సాధారణంగా గ్రామీణులు అంటూ ఉంటారు. రెడ్డి అనే శబ్దం రేడు (రాజు) అనే శబ్దం నుంచి ఏర్పడిందని డా. సి. నారాయణ రెడ్డి గారి అభిప్రాయం. కాని ఇది సరికాదు. అదే నిజమైతే 'రేపటికి రాజెవరో రెడ్డెవరో' అనే వాడుక ఏర్పడేది కాదు. ఆ రెండు శబ్దాలకూ భేదం ఉంది. రాజు రాజ్యం మొత్తానికీ అధిపతి కాగా రెడ్డి గ్రామాధిపతి. ఇక రెడ్డి అనే శబ్దం ఏర్పడిన తీరు పరిశీలిస్తే రాష్ట్రకూట శబ్దమే క్రమంగా రెడ్డి శబ్దంగా మారిందని మనం గ్రహించవచ్చు. రాష్ట్రకూట – రట్టకుడి– రట్టోడి (రాథోడ్) – రట్టడ్డి– రడ్డి – రెడ్డిగా రూపాంతరం చెందింది.రాష్ట్రకూటుల పాలనాకాలంలో వారిచే నియమించబడిన గ్రామపాలకులకు ఈ శబ్దం ముందుగా వాడబడింది. 'పాండురంగ మాహాత్మ్యము' కావ్యంలో రామకృష్ణ కవి 'రడ్డి', 'రెడ్డి' , 'కాపు', 'పంటవారు' మొదలైన పదాలన్నీ రెడ్డి కులస్థులను సూచించడానికి వాడిన కారణంగా కవికాలం నాటికి (క్రీ.శ. 16 వ శతాబ్దం నాటికి) రెడ్డి కులస్థులను ఈ నాలుగు శబ్దాలతోనూ వ్యవహరించేవారని గ్రహించవచ్చు. రెడ్డి అనే పదం గ్రామాధికారి అనే పదాన్ని సూచించేది కనుక తొలినాళ్ళలో గ్రామాధికారులుగా పని చేసిన వారిని – వారు ఏ కులానికి చెందినవారైనా– రెడ్డి అనడం పరిపాటి అయింది.

అందుకే రెడ్డియేతర గ్రామీణ కులాలు కొన్నింటిలో కూడా పేర్లు, ఇంటి పేర్లలో నేటికీ రెడ్డి శబ్దం కనిపిస్తుంది. అయితే ఆ తరువాత రెడ్డి శబ్దం క్రమంగా కేవలం ఒక కులాన్ని సూచించే పదంగా మారిపోయింది. తెలుగు నేలమీద రెడ్డి కులస్థులు మిగిలిన వ్యవసాయ కులాలకంటే ముందుగా ఒక కులంగా సంఘటితం అయ్యారు.

పైన తెలిపిన ప్రసిద్ధమైన నానుడిలో పేర్కొన్నట్లు వడ్లలో ఉన్నట్లు రెడ్లలో వేలాది శాఖలు మాత్రం లేవు. ముఖ్యమైన శాఖలు పధ్నాలుగు మాత్రమే కాగా, వాటినుంచి పుట్టుకొచ్చిన శాఖలు మరికొన్ని. వీరి శాఖల గురించి తెలిపే ఒక చక్కటి పద్యాన్ని 16వ శతాబ్దిలో ఆరవీడును పాలించిన ఆరవీటి బుక్కరాజు (పిన్న శౌరి కుమారుడు) ఆస్థానంలో దేవరాజు అనే ఒక భట్టురాజు చెప్పాడని విఖ్యాత చరిత్రకారులు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు తాము రచించిన 'కాకతీయాంధ్ర రాజయుగ చరిత్రము' అన్న గ్రంథంలో పేర్కొన్నారు. (ఈ బుక్కరాజు శ్రీకృష్ణ దేవరాయలు అల్లుడు 'అళియ' రామరాయలుకి ముత్తాత). ఇప్పుడా పద్యం ఏమిటో చూద్దాం.

*"పంటాన్వయమునను పదునాలు శాఖల*
*చక్కగా వివరింతు సత్యమరసి*
*మోటాటి వెల్నాటి మొరసు నేరడయోధ్య*
*పంట పొంగలినాటి పాకనాటి*
*భూమంచి కుంచేటి మున్నూటి గోటేటి*
*యొనర గండికోట యోరుగంటి*
*యన బరగుచునుండు నాంధ్రావనీస్థలి*
*గౌరవాధిష్ఠిత కాపు కులము*

*పంట పదునాల్గు కులములంచంట జగతి*
*తరతరంబుల నుండియు వరలెడి నుడి*
*వీనికుపజాతులున్నవి వివిధములుగ*
*భుజబలాటోప పిన్నమ బుక్క భూప."*

రెడ్లలో పంట రెడ్లను శ్రేష'ులుగా భావించి వారి పేరిట రెడ్డి కులాన్ని 'పంటాన్వయము' అన్నాడు కవి. అన్వయము అంటే కులము. ఈ పద్యంలో రెడ్డి కులస్థులను కవి 'కాపులు' అని సంబోధించాడు. రెడ్లను ఇప్పటికీ చాలా జిల్లాలలో కాపులనే అంటారు.

ఈ పద్యాన్నిబట్టి క్రీ.శ. 16వ శతాబ్ది నాటికి రెడ్డి కులంలో 14 శాఖలు ఉండేవని గ్రహించవచ్చు. ఆ శాఖలు ఇవి – మోటాటి, వెలనాటి, మొరసు, నేరడి, అయోధ్య, గండికోట, ఓరుగంటి, పంట, పొంగలినాటి, పాకనాటి, భూమంచి, కుంచేటి, మున్నూటి, గోటేటి.

వీరిలో పంట రెడ్లు చాలా ప్రముఖులు. మొదట అద్దంకి రాజధానిగా, ఆ తరువాత కొండవీడు రాజధానిగా పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి (1326–50), అన పోతారెడ్డి (1350–70), అన వేమారెడ్డి (1370 – 85), కుమారగిరి రెడ్డి (1385– 1407), ఒరిస్సాలోని కటకము వరకు దిగ్విజయ యాత్ర చేసిన మహావీరుడు, కుమారగిరిరెడ్డి బావ అయినట్టి కాటయ వేమారెడ్డి (1385– 1414), పెద కోమటి వేమారెడ్డి (1402–1420) వగైరా ప్రముఖ రెడ్డి రాజులంతా పంట రెడ్డి శాఖకు చెందినవారే.

పలనాటి యుద్ధంలో శైవులకు నేతృత్వం వహించి, నలగామరాజు వగైరాలకు అండగా నిలిచి పోరాడిన నాయకురాలు నాగమ్మ పంటరెడ్డి వారి ఆడపడుచే. శ్రీనాథ మహాకవి తన 'పలనాటి వీర చరిత్ర' ద్విపద కావ్యంలో ఇలా రాశాడు.

*"పంట రెడ్డి వారి పడతియు మరియు*
*వీర జగ్గారెడ్డి వేడుక పుత్రి*
*మేకపోతులరెడ్డి మేనకోడలును*
*ఆరవెల్లి వారింటి అనుగు కోడలును*
*నాగమ్మయను నొక నారీ లలామ."*

*('పలనాటి వీర చరిత్ర' 912– 916 పంక్తులు.)*

పంట రెడ్లలో దేచటి, దేసటి, దేప్టి వారు కూడా ఉన్నారు. శ్రీనాథ మహాకవి రచించిన 'కాశీ ఖండము' అనే కావ్యాన్ని ఆయన వీరభద్రారెడ్డి అనే రాజుకి అంకితం ఇచ్చాడు. వీరభద్రారెడ్డి, ఆయన అన్న వేమారెడ్డి పంటరెడ్లు. రెడ్లలో ఆ తరువాత చాలా శాఖా భేదాలు ఏర్పడ్డాయి. కడప జిల్లా పెడకల్లు ప్రాంతం నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు విస్తరించిన ఒక శాఖను పెడకంటి రెడ్లు అంటారు. వీరు అయోధ్య శాఖనుంచి చీలారు. వీరిలో స్త్రీలు మంగళసూత్రం ధరించరు. వివాహ సమయంలో వరుడు వధువు మెడలో కేవలం నూలు తాడు మాత్రమే కడతాడు. ఆ తరువాత వారు బంగారు నానుతాడు మాత్రమే మెడలో వేసుకుంటారు. మంగళసూత్రాలు ఉండవు. ప్రసిద్ధి చెందిన కాకతీయ సేనాని గోన గన్నారెడ్డి వంశస్థులమని చెప్పుకునే ఓరుగంటి శాఖ రెడ్లు తెనాలి తాలూకా పెదరావూరు, దుండి పాలెం గ్రామాలలోనూ, బాపట్ల తాలూకా కర్లపాలెం పరిసర గ్రామాలలోనూ పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరి ఆర్థిక, సామాజిక వెనకబాటుతనం కారణంగా ఈ ప్రాంతంలో అధిక సంఖ్యాకులైన మోటాటి రెడ్లు వీరితో వివాహ సంబంధాలు పెట్టుకొనడానికి ఇటీవలి వరకు ఇష్టపడేవారు కాదు. ఇప్పుడిప్పుడే ఓరుగంటి రెడ్లు కూడా ఆర్థికంగానూ, విద్యాపరంగానూ, సామాజికంగానూ పుంజుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలలోని 'రెడ్డిక' కులస్థులతో కూడా మిగిలిన రెడ్డి శాఖలవారు ఇదే వెనుకబాటుతనం కారణంగా బాంధవ్యాలు ఏర్పరచుకోరు. ఈ కారణంగా 'రెడ్డిక' కులస్థులు వెనుకబడిన కులంగానే పరిగణించబడుతున్నారు.

తూర్పు గోదావరి జిల్లా అనపర్తి ప్రాంతంలో భూమంచి రెడ్లు, ఊలపల్లి గ్రామంలో మోటాటి రెడ్లు ఉన్నారు. పెడకంటి, పాకనాటి, మోటాటి శాఖలవారు కడప జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్నారని విన్నాం. పాకనాటి శాఖవారిలో ఇటీవలి వరకు కుడిపైట ఆచారంగా ఉండేది. ఇంకా రాయలం, చిన్న కొడిద, పెద్ద కొడిద మొదలైన ఉపశాఖలు ఎన్నో ఉన్నాయి.

కీ. శే. వై.యస్. రాజశేఖర రెడ్డి చిన్న కొడిద శాఖకు చెందినవారు. రెడ్లలో శాఖలను గూర్చిన మరిన్ని ఆసక్తికరమైన విషయాలు నేను 2007 లో రచించిన 'తెనాలి రామకృష్ణ కవి – శాస్త్రీయ పరిశీలన' గ్రంథంలో వివరించాను.

(ఇదండీ వడ్లు, రెడ్ల కథ.)

ముత్తేవి రవీంద్రనాథ్
హైదరాబాద్.
ఫోన్ : 984 913 1029

# పురుష పాత్రలు లేని నాటకాలు

– స్వర్ణరాజు హనుమంతరావు

రసానుభూతిని పొందటం ప్రేక్షకులుగా స్త్రీ పురుషులకు సమానమే అయినా, ప్రయోగ దృష్టితో ఆలోచించినప్పుడు స్త్రీలకు ప్రత్యేక రూపక సాహిత్య అవసరము ఎంతో ఉంది. కానీ 140 సంవత్సరాలుగా జరుగుతున్న ఆధునిక నాటక సాహిత్య సృష్టిలో ఒక పాతిక రచనలైనా ప్రత్యేకంగా స్త్రీల కోసం రాలేదు. వినోదాన్ని కలిగిస్తూ రసానందాన్ని అందిస్తూ స్త్రీలు ప్రదర్శించటానికి యోగ్యంగా నాటకీయతతో విరాజిల్లే నాటకాల అవసరం స్త్రీ సమాజం కోసం ఎంతైనా ఉంది. ప్రయోగ సౌలభ్యం కోసం స్త్రీలు – పురుష పాత్రలు లేని నాటక సాహిత్యం కోసం వెతుకుతారు. అసంఖ్యాకంగా స్త్రీ పాత్రలు లేని నాటక సాహిత్యం వచ్చింది. ఈ వ్యాసకర్త పరిశీలనకు అందినంత వరకు పురుష పాత్రలు లేని నాటికా – నాటక రచనలన్నీ కలిసి కొన్నే చేరాయి. ఆ నాటికా నాటక రచయితలు సర్వశ్రీ నార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య ఆత్రేయ, బుచ్చిబాబు, సోమంచి యజ్ఞన్న శాస్త్రి, సీతంరాజు, సంధ్యాల, అత్తిలి కృష్ణారావు, అంగర సూర్యారావు, ఎస్వీ రావు, డి. సుజాతాదేవి, సోమంచి రామం, మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్, పి.వి. రమణ, పి. సిద్ధారెడ్డి, ఎస్సేరావు, గంజి రామారావు, నిడమర్తి నిర్మలాదేవి, ఓగేటి ఇందిరాదేవి, పూర్వతరం వారిలో సర్వా వెంకట శేషయ్య మున్నగువారు.

అచ్చంగా స్త్రీ పాత్రలతో నడిచే రూపకంలో ఇతివృత్తం ఎలాంటిదై ఉంటుంది? పురుషులు ఒకరికొకరు తారసపడే ప్రదేశాలు చాలా ఉంటాయి. లేడీస్ క్లబ్బులు లేదా అలాంటివి అయిన మహిళా మండలులు, మహిళా కళాశాలలు, పాఠశాలలు, స్త్రీల వెయిటింగ్ రూములు, కొన్ని ఆఫీసులు – ఇవి స్త్రీలు ఒకచోట చేరుకునే కొన్ని కూడలి స్థలాలు. తెలుగులో వెలువడిన చాల నాటికల 'స్థలము' మహిళామండలి కార్యాలయమే. "కార్యదర్శి కళ్యాణి" "సత్యానికి సరిహద్దులు", "మండోదరి మహిళామండలి", "దగాపడిన చెల్లెలు", "స్త్రీలకు ప్రత్యేకం" – ఇవన్నీ మహిళామండలి కేంద్రంగా నడిచిన నాటికలే. ఈ నాటికల వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని, ప్రయోగ సౌలభ్యాన్ని గురించి ఈ వ్యాసంలో చూద్దాం.

**ఆడబ్రతుకు :** పాశ్చాత్య రూపక తత్త్వాన్ని బాగా ఆకళింపు చేసుకొన్న శ్రీ నార్ల శిల్ప విషయికంగా అనేక పాశ్చాత్య నాటక రచయితల రచనా శిల్పాన్ని తెలుగులో ప్రవేశపెట్టినా, తెలుగు గ్రామీణ జీవితాన్ని తమ ఏకాంకికల్లో హృద్యంగా, జీవకళ ఉట్టిపడేటట్లు చిత్రీకరించారు. అట్టివానిలో "ఆడబ్రతుకు" ఒకటి. ఇందులో నాలుగే పాత్రలు. తల్లి, కుమార్తె, ఆడబడుచు, అత్తగారు; తల్లిదండ్రులకు ఆడపిల్ల అన్ని కాలాల్లోను గుండెల మీద కుంపటే. ఇంకా సంప్రదాయపు కట్టుబాట్లు బాగా సడలని క్రిందటి తరాలలో, మేనరికం చేసుకుంటారేమోనన్న ఆశతో కుమార్తె చుట్టూ ఆశాసౌధాలు నిర్మించుకుంటున్న తరుణంలో, ఆ ఇంటి ఆడబడుచు తన అన్నగారికున్న పేదరికం కారణంగా వారితో వియ్యమందటానికి ఇష్టపడక పోవడం 'ఆడబ్రతుకు' నాటికలోని ఇతివృత్తం. స్త్రీ తన జీవితంలో అటు అత్తగారి 'ఆరడి' పడి జీవించి, ఇటు మధ్య వయసులో – పేదరికం కారణంగా అమాయకురాలైన కుమార్తె జీవితం గురించి బంగారు కలలు మాత్రమే కంటూ అవి నిజజీవితంలో ఎండమావులు కావటం గమనిస్తున్న ఒక గృహిణి జీవిత వాస్తవ చిత్రణ 'ఆడబ్రతుకు'.

**కార్యదర్శి కల్యాణి :** పాత్రల మనస్తత్త్వాన్ని చిత్రీకరించటంలో సిద్ధహస్తులైన శ్రీ బుచ్చిబాబు గారి కలం నుండి వెలువడిన 'కార్యదర్శి కల్యాణి' నాటికలో ఉజ్జ్వలంగా వెలుగొందే పాత్ర కార్యదర్శి కల్యాణి. ఆమెది ఆదర్శవంతమైన తిన్ననైన వ్యక్తిత్వం. ప్రగతి పథంలో పయనించే కల్యాణివంటి స్త్రీలు సామాన్యులకు (ఈ నాటికలోని మిగతా స్త్రీలకు) కొరకరాని కొయ్యలు. మహిళా సమాజాల వంటి ప్రజాహిత సంస్థలకు ఆయువుపట్టుగా ఉండే కార్యదర్శి వంటి పదవుల్లో కల్యాణి వంటి ఆదర్శమూర్తులైన వ్యక్తులుండి తీరాలి. ఆమె మంచి చొరవ గల మనిషేకాక ఉత్తమ క్రియాశీల. చెప్పింది చేస్తుంది, చేయదలచుకుంది చెబుతుంది. మాటలు తప్ప చేతలు చేతకాని వాళ్లు ఆమెని ఆడిపోసుకుంటారు. కాని

ఆమె ఔన్నత్యాన్ని వాళ్ళు అందుకోలేరు. ముసుగులో గ్రుద్దులాట ఆమె పద్ధతి కాదు. తన సొంత జీవితంలోని ప్రేమ వ్యవహారాన్ని గూడా బయటకు చెప్పి మిగతా సభ్యుల నోళ్ళు మూయించింది. ఆమె శీల సంపదకు తగినట్లుగా ప్రేమించిన వాణ్ణి చేసుకోవటం, చేసిన సేవలకు తగినట్లుగా విదేశాలకు వెళ్ళే సదవకాశం లభించటం జరుగుతాయన్న సూచనతో నాటిక ముగుస్తుంది. తాను వహిస్తున్న కార్యదర్శి పదవికి హుందాతనాన్ని చేకూర్చి అన్నివిధాల రాణించిన పాత్ర కల్యాణి. బుచ్చిబాబు సృష్టించిన ఒక అనర్ఘమణి కల్యాణి.

**చావకూడదు :** తెలుగు నాటక రంగానికి వెలుగుబాట వేయటానికి పూనుకున్నవారిలో ఆచార్య ఆత్రేయ ఒకరు. ఆత్రేయ నాటిక 'చావకూడదు' ఒక ఆసుపత్రిలో జరిగిన సంఘటన. స్త్రీ ప్రవృత్తిలో సహజంగా ఉండే ఈర్ష్యాసూయలు, ఐశ్వర్య అభిజాత్య గర్వం, హోదా, అధికారం, పలుకుబడి – ఇవన్నీగల స్త్రీ లోకం, తోడి స్త్రీలకు – ముఖ్యంగా ఆర్థికంగా, సాంఘికంగా అధోగతిననుభవిస్తున్న స్త్రీలకు – నైతికంగా పతనమయ్యే పరిస్థితులను ఏ విధంగా కల్పిస్తుందో ఈ నాటిక చిత్రిస్తుంది. ఇందులోని ప్రధాన పాత్ర కమల. ఆమె మన సానుభూతిని చూరగొంటుంది. ఎవరి వలన కమల జీవితము భ్రష్టమైందో, వారంతా ఆమె అవసాన కాలంలో ఒక చోటుకు చేరుకోవటం నాటకీయమైన కల్పన. వాస్తవిక లోకంలో అలా జరగటం అరుదు. రూపక రచనలో ఇలాంటివి కొంతవరకు తప్పనిసరి. ఆసుపత్రి వాతావరణాన్ని సూచన మాత్రంగానైనా చూపగలిగితే ఈ నాటిక రక్తి కడుతుంది. ఆ శక్తి రచనలో ఉంది.

**స్త్రీలకు ప్రత్యేకం :** శ్రీ అంగర సూర్యారావుగారి నాటిక పేరే 'స్త్రీలకు ప్రత్యేకం!' ఇందులో రంగము రెండు మూడు చోట్లకు మారవలసి ఉంది. ఇందులో స్త్రీ వంచింపబడటం తగు విధంగా చూపబడి, కొన్ని సమస్యలు స్త్రీలే ఏ విధంగా పరిష్కరించుకోవచ్చో సూచించబడింది. చక్కని రచనా సంవిధానం.

**సత్యానికి సరిహద్దులు :** శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రి గారి "సత్యానికి సరిహద్దులు" కూడా మహిళా సమాజంలో నడిచే నాటికే అయినా, ఇతివృత్తం కొంచెం భిన్నమైంది. బొంబాయి, కలకత్తా వంటి ప్రదేశాలలో ఉన్న ప్రవాసలు జీవిత వాతావరనం కొంత కనిపిస్తుంది. పరమ సత్యమంటూ ఒకటుందో లేదో గాని, ప్రాణికి బాధాకరమైన సత్యం సత్యం కాదని, దానిని అన్వేషింప పని లేదని, ఈ నాటికలోని అభిప్రాయం. వైవిధ్యంగల పది పాత్రలున్న నాటిక ఇది. ఈ నాటికలో మల్లిక పాత్ర అధికార హోదాలోనున్నవారికి ప్రాతినిధ్యం వహించగా 'శైలజ' పాత్ర అమాయికతకు, ఋజువర్తనానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. 'గల్లంతు' సార్థక నామధేయం. ఏ ఒక్కరికీ ఎక్కువ ప్రాధాన్యమీయకుండా ఈ నాటిక అన్ని పాత్రలకు సమాన ప్రాధాన్యమిస్తుంది. మానసిక రోగ నిపుణులు 'నిదానము'లో 'అబ్సెషన్' అనే వ్యాధి వలన కలిగిన సంఘటన ఇందులో ఇతివృత్తం. ఇతివృత్తం కంటె దానిని నడిపిన తీరులోనే గమ్మత్తు ఉంది. నిజానికి ఎల్లలు ఉన్నాయి. దానిని దాటగూడదు. "సత్యానికి సరిహద్దులున్నాయి" అని ముక్తాయింపు ఇస్తుందీ నాటకం.

**అంతా ఆడవాళ్ళే :** అంతా ఆడవాళ్ళే అనే పేరుతో వ్రాసిన శ్రీ సీతంరాజు నాటిక మరొక దృక్పథంతో సాగిన రచన. కన్న కూతరయినా సరే, స్త్రీ అంటే మరొక స్త్రీకి గిట్టదు. ఇక అటువంటప్పుడు, పరాయివాళ్ళ విషయంలో ఇది యథార్థమైనప్పుడు బాధపడటం మానవ సహజం. ఆడబ్రతుకు అరిటాకు వంటిది. అది తేలికగా ఛిన్నాభిన్నమైపోతుంది. కేవలం మరొక స్త్రీ వలన అలా జరగటం మరింత బాధాకరం. ఇలాంటి పరిస్థితి నుండి తప్పించటానికి, శాంత, సరళల వంటి వ్యక్తులు, మహిళా సమాజాలు, భారతివంటి సమాజ కార్యదర్శినులు సేవలు అనివార్యమని వెర్రిగంగమ్మలకు, పనిలేని మంగమ్మలకు స్త్రీ లోకమే తగు విధంగా బుద్ధి చెప్పకపోతే, జీవితాలను అంధకారమయం జేసుకొని బాధపడవలసి వస్తుందని ప్రబోధించే నాటిక 'అంతా ఆడవాళ్ళే' అనే పేరు స్త్రీ పాత్రల నాటిక అని సూచిస్తున్నా "అంతా ఆడవాళ్ళమే..." అనే పేరు మరింత భావస్ఫోరకంగా ఉండదేమో అనిపిస్తుంది.

**మరబొమ్మలు :** శ్రీమతి పొన్నలూరి పద్మావతి రచించిన 'మరబొమ్మలు' ఒక విశిష్ట రచన. ఒక యథార్థ సమస్యతో ఇతివృత్తాన్ని జోడించి, కథాస్థలాన్ని మహిళామండలి నుండి గృహాంగణానికి మార్చి మూడు తరాలకు ప్రాతినిధ్యం వహించే కేవలం ఐదు పాత్రలతో, నాటకీయతకు పరిపుష్టి చేకూర్చుతూ నాటికను మలచిన తీరు ప్రశంసనీయం. ఇది వారి తొలి ప్రయత్నమైనా, స్త్రీల సమస్యలపట్ల రచయిత్రికున్న అవగాహన. ఒక స్త్రీ సమాజంలో ఏ విధంగా స్పందించాలో, ఆత్మీయులవలననే ఎలాంటి ఆంక్షలకు లోనవుతుందో, వాటిని

దాటటానికి స్త్రీకి ఎంత ధైర్యస్థైర్యాలు కావాలో, మానసిక శారీరక ధైర్యం ఎంత అవసరమో అట్టి పాత్రలను రూపొందించటం జరిగింది. పతాక సన్నివేశం దృశ్యమానం కాలేదు. అది నేపథ్యంలో జరిగినట్లు చెప్పటం జరిగింది. "ఆడది మర తిప్పి ఇష్టం వచ్చినట్లు ఆడించే బొమ్మ కాదు" అని చెప్పగల గుండె దిటవుగల పాత్రల కోసం జరిగిన రచన. నాగరికత ఎంత ముదిరినా, క్రొత్తదనం కోసం ఎంత ప్రాకులాడినా నేటి వనితా లోకం శీలపవిత్రతను నిర్లక్ష్యం చేయటంలేదు. సంప్రదాయం, సంస్కృతి వెన్నుతట్టి ఆడవాళ్ళను హెచ్చరిస్తూనే ఉన్నాయి. అందుకే స్త్రీ జాతి తమ విలువను నిలుపుకుంటున్నారు అని ధ్వనింపజేస్తున్నే అభినందనీయమైన రచన.

**మండోదరి మహిళామండలి :** జంధ్యాలవారిని మహిళామండలి హాస్యరస స్ఫోరకమైన రచన. తాముంటున్న నాలుగిళ్ళ చావడిలో ఏర్పరచుకొన్న మహిళామండలి కథ ఉంది ఇందులో! కాని రచయిత స్త్రీలపట్ల చిన్నచూపు చూచినట్లు అనిపిస్తుంది. పురుషుడు లేనిదే స్త్రీకి ఆలబంన లేదు అని సారాంశం. ఆడవాళ్ళ, అభ్యుదయ భావాల బాధపడలేక, వారి ఇండ్ల మగవాళ్ళంతా సన్యాసాశ్రమానికి సిద్ధమౌతున్నారన్న నెపంతో సభ్యురాండ్ర రాజీనామా పత్రాలు దాఖలు చేయటంతో "రసాభాస"గా నాటిక ముగుస్తుంది. హాస్యం పుష్కలంగా ఉన్నా ఇతివృత్తం నడచిన తీరు స్త్రీలు ఆడటానికి ప్రోత్సహించేది కాదనిపిస్తుంది. స్త్రీ పురుషుల మధ్య భేదభావాలున్నా సహజీవనం కూడా ఉండేదే! స్త్రీకొక్కదానికేనా పురుషుని సాహచర్యం కావలసింది. స్త్రీ 'ఆసరా' లేని పురుష జీవితం మాత్రం ఏ విధంగా పరిపూర్ణమవుతుంది? ఈ సత్యాన్ని ఈ నాటికేతివృత్తం విస్మరించింది.

**దగాపడిన చెల్లెలు :** శ్రీ అత్తిలి కృష్ణారావుగారి 'దగాపడిన చెల్లెలు' కూడా మహిళామండలికి సంబంధించిన కథే. స్త్రీకి స్త్రీయే ప్రథమ శత్రువు – మరెవ్వరో కాదన్న సత్యాన్ని సున్నితంగా అందిస్తుంది. మానవత్వపు విలువల్ని మరచి నాగరికత ముసుగులో కర్తవ్యాన్ని విస్మరించటం స్త్రీల మనఃప్రవృత్తి విషయంలో చిత్రితమైంది. 'విశాలాక్షి' పాత్ర పరిపూర్ణంగా చిత్రితమైతే ఈ నాటిక మరింత ప్రయోజనం సాధించేదనిపిస్తుంది.

**ఇంటర్వ్యూ :** శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్‌గారి "ఇంటర్వ్యూ" నాటిక స్త్రీల కోసం చేసిన రచనగా ప్రత్యేకత కలది. "కామెడీ ఆఫ్ ఎర్రర్స్" వలె, ఇందులో ఒకర్ని ఒకరుగా అనుకోవటం వలన నడచిన కథ. మానసికంగా వికాసం లేని కుమార్తెను పెళ్ళి చూపులకు సిద్ధం చేసి చూపటంలో జరిగిన రసాభాస కనిపిస్తుంది. ఇందులో ఎక్కువసార్లు స్థల భేదం చూపవలసి రావటం ప్రదర్శనకు అసౌకర్యం. ఇతివృత్తంలో నవ్యత ఉన్నా, మానసికంగా ఎదగని కుమార్తె, తల్లి చెప్పిన సంభాషణలను తిరిగి యథాతథంగా ఒప్పజెప్పగలగటం అసహజమనిపిస్తుంది.

**మళ్ళీ మాకు మానవజన్మ :** నాటక రచనలో ఎన్నో ప్రయోగాలు చేసిన పి.వి. రమణ గారి రచన ఇది. సమాజంలోని వింత ప్రవృత్తులుగల స్త్రీలు ఇతివృత్తంగా సాగిన రచన. ఇందులోని విలక్షణమైన పాత్రల ప్రవృత్తి హాస్యధోరణిలో సాగినట్లు కనిపించినా, వెనుక దాగి ఉన్న వాస్తవికత ప్రేక్షకుణ్ణి ఆకట్టుకుంటుంది. మహిళ మండలుల పరిధి దాటి ఇతివృత్తంలో నవ్యత ప్రవేశపెట్టబడింది. అభినందనీయమైన ప్రయత్నం.

**పరమార్థము – తనదాకా వస్తే :** అనే రెండు నాటికలు వ్రాశారు శ్రీమతి డి. సుజాతాదేవి. "పరమార్థం"లో చదువు కేవలం ఉద్యోగం చేయటంవల్లనే సార్థకం కాదని, ఇంటిని చక్కదిద్దుకొని, ఇంటిలోనివారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దటంతో కూడా తన జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చునన్న సందేశంగల నాటిక "పరమార్థం" ఇది నాలుగు పాత్రల నాటిక.

పెద్దవారిలో ఉన్న లోపాలు చిన్నవారిపై తమ ప్రభావాన్ని ఎలా చూపుతాయో చెప్పే నాటిక "తనదాకా వస్తే" ఇందులో ఐదు పాత్రలున్నాయి.

**కమల – విమల :** కేవలం బాలికలకు ఉద్దిష్టమైన ఈ నాటిక రచయిత శ్రీ సోమంచి రామం.

**ఇంట్లో పోరు – వీధిలో హోరు :** ఎస్వే రావుగారి ఈ నాటిక ఇటీవలి కాలంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించే నాటిక. ఒక నిజమైన సమస్యను చిత్రిస్తూ, దానికి ఒక పరిష్కారాన్ని కూడా చూపుతున్న సామాజిక స్పృహగల రచన. పూర్వం అత్తల వలన ఆరళ్ళు మాత్రమే ఉండేవి. ఇప్పుడు వరకట్నం కోసం బాధలు తోడైనాయి. విడ్డూరమేమంటే సంఘ సేవ చేసే మహిళామణులమని బయట గొప్పలు చెప్పుకుంటూ, సన్మానాలందుకుంటున్నవారే ఇలాంటి దారుణాలకు ఒడిగట్టడం! అదిగో ఆ ఇతివృత్తాన్ని

చక్కగా చిత్రిస్తూ – కోడలు కష్టం కూడా కూతురి కష్టం వంటిదేనని ఎలుగెత్తి చెప్పే నాటిక! మంచి వైవిధ్యం గల పాత్రలతో సాహిత్యపు విలువలను సంతరించుకొన్న నాటిక!

**మనీ విలాసం :** "యత్ర నార్యస్తు పూజ్యంతే... అనే ఎస్సేరావు స్త్రీల నాటికల సంపుటిలో రెండవ నాటిక 'మనీ విలాసం' ఇందులో ఆరు స్త్రీ పాత్రలున్నాయి. ఇందులో ప్రధాన పాత్రలు డాక్టరు వసుంధర, ఝూన్సీ. వసుంధర, రాజ్యలక్ష్మి అనే పేరుగల గృహిణికి మంచి స్నేహితురాలు. రాజ్యలక్ష్మికి ఇద్దరు కొడుకులు – కోడళ్ళు. పెద్ద కోడలు గిరిజ, రెండవ కోడలు నీలిమ – ఇందులో పాత్రలు. వాళ్ళిద్దరికీ ధనవ్యామోహమెక్కువ. వీళ్ళ ఆడబడుచు స్వప్నకు పెళ్ళి చేసే బాధ్యత ఒప్పజెప్పటం కోసం రాజ్యలక్ష్మి కొడుకు కోడళ్ళను పిలిపిస్తే, కోడళ్ళ వరకు మాత్రమే కథలో రంగస్థల ప్రవేశం చేశారు. ధనవ్యామోహంలో కోడళ్ళిద్దరూ ఒకళ్ళకొకళ్ళు తీసిపోరు.

అత్తగారు రాజ్యలక్ష్మి ప్రాణం ప్రమాద పరిస్థితిలో ఉన్నట్లు డాక్టరు వసుంధర, రాజ్యలక్ష్మి చేత నటింపజేసి, తరువాత కథ ఇంకా మరి కొంత ముందుకు నడిచిన తరువాత ఏకంగా ప్రాణం పోయినట్లు నటింపజేస్తుంది. కోడళ్ళు అది నిజమేననుకొని ఆ అత్తగారి ఒంటి మీదనున్న నగల్ని దోచేసుకొని దాచేసుకుంటారు. అదేవిధంగా ఇంట్లోని విలువైన వస్తువుల్ని కూడ!

ఇలా జరుగుతూ ఉండగా నాటికలో మరొక కీలకపాత్ర ఝూన్సీ ప్రవేశిస్తుంది. ఝూన్సీ మరెవరో కాదు – రాజ్యలక్ష్మి భర్త కృష్ణమూర్తికి రాజ్యలక్ష్మికన్నా ముందు ఒక భార్య ఉందని, ఆమె బిడ్డయే ఝూన్సీ అని, ఆ ఇంటి మీద ఆస్తి మీద, సర్వ హక్కులూ ప్రథమ భార్య సంతానం కావటంతో ఝూన్సీవేనని నాటకమాడి రాజ్యలక్ష్మికిగాని, ఆమె కొడుకులకుగాని ఆ ఇంటి మీద, ఆ ఆస్తి మీద ఏ విధమైన హక్కులు లేవని తేల్చటంతో ఆ కోడళ్ళ ఆట కడుతుంది. ప్రేమాభిమానాలకన్నా డబ్బే ముఖ్యమనుకునే రాజ్యలక్ష్మి కోడళ్ళ దుష్టబుద్ధిని బయటపెట్టటంలో ఝూన్సీ నిర్వర్తించిన పాత్ర రాజ్యలక్ష్మికి మానసిక శాంతిని కలుగజేస్తుంది. మనిషి జీవించటానికి డబ్బు అవసరం కావచ్చునేమోగాని, డబ్బే జీవిత సర్వస్వం కాదని, మనిషిని మనిషిని దగ్గర చేసే మమతానురాగాలకు ఏ డబ్బూ వెలకట్టలేదని, మనిషి మట్టిలో కలసిపోయినా నిలిచేవి మంచీ – మానవత్వమేగాని సిరిసంపదలు కావని, ఆ ఇంటి కోడళ్ళకే కాదు – అందరికీ కనువిప్పు కలిగించే సందేశాన్నందిస్తుంది ఝూన్సీ పాత్ర ద్వారా – నాటిక.

ఈ ఝూన్సీ అనే అమ్మాయికి నిజానికి ఆ ఇంటితో ఏ సంబంధం లేదు. రాజ్యలక్ష్మి కూతురు స్వప్నకు, ఝూన్సీ క్లాస్‌మేట్ మాత్రమే. కొడుకులు కోడళ్ళను తన కూతురు స్వప్న పెళ్ళి చేయించటానికి ఒప్పించాలని తాపత్రయ పడుతున్న రాజ్యలక్ష్మి, తాను సహాయంగా నిలుస్తానన్న డాక్టర్ వసుంధర, రాజ్యలక్ష్మిని రోగంతో చావుకు దగ్గరైనట్లు నటింపజేసి ఈ సమస్యకొక పరిష్కారము తెలుస్తుందనుకుంటే, ఝూన్సీని ఒక కొత్త పాత్రగా – అంటే రాజ్యలక్ష్మికి కూడా తెలియకుండా ఇంతకు ముందే ఉన్న సవతి కూతురుగా సృష్టించి ఈ నాటికలో మరొక అంతర్నాటకం కూడా నడివి, అటు రాజ్యలక్ష్మిని ఆమె కోడళ్ళనే గాకుండా ప్రేక్షకులను కూడా ఆశ్చర్యపరుస్తుంది డా. వసుంధర!

మనీ (డబ్బు) కుండే విలాసం అంటే డబ్బు నడిచే తీరు లేదా అది జనాన్ని నడిపించే తీరు ఎంత విచిత్రంగా, తీవ్రంగా ఉంటుందో దర్శింపచేసే నాటిక – 'మనీ' విలాసం!

డబ్బుకు లోకం దాసోహం అనే నానుడి పోయి, 'మనీ'కి మెనీ మెనీ విలాసాలు ఉంటాయి సుమా – అని చెబుతుందీ నాటిక.

**మై నేమ్ ఈజ్ సీతాలు :** ఎస్.ఎ. రావు గారి మరొక నాటిక 'మై నేమ్ ఈజ్ సీతాలు.'

ఒక రచయిత ఒక నాటక రచన చేసేటప్పుడు ప్రధానంగా ఆలోచించేవి రెండు విషయాలు. ఒకటి చక్కని సందేశాత్మకమైన ఇతివృత్తాన్ని ఎంచుకోవటం. రెండవది యోగ్యం, రసవంతం, ఆహ్లాదకరంగా ప్రదర్శన జరగటం. ఈ రెండు ప్రధానాంశాలకు తోడ్పడేవి వానిలో సృష్టింపబడే పాత్రలు. అవి చేసే సంభాషణలు.

'మై నేమ్ ఈజ్ సీతాలు'లో ఈ అంశాలన్నిటికి ఉన్న ప్రాముఖ్యం కనిపిస్తుంది. జనాభా అంతా అక్షరాస్యులు కావాలని ప్రభుత్వం వయోజన విద్యావ్యాప్తికి ప్రణాళికను రూపొందించి దాన్ని పాఠశాలలు, కళాశాలల వంటి వాటికి ఒప్పజెప్పి ఆ విషయంలో అభివృద్ధి సాధించాలని సూచించింది.

ఈ నాటికలోని ఆదర్శ మహిళా కళాశాల అందులో పాలుపంచుకునేందుకు సిద్ధమైంది. ఆ విషయాన్నే చెప్పి ఆ

కళాశాల ప్రిన్సిపాల్ ఒక మీటింగ్‌లో విద్యార్థులను ఏ విధంగా ఉత్ప్రేరితులను చేసిందో చూద్దాం.

“అక్షరజ్ఞానం లేక ఎంతోమంది తమ బ్రతుకు బాటను దిద్దుకోలేకపోతున్నారు. అజ్ఞానం అనే అంధకారంలో అన్యాయానికి, అవమానానికి గురవుతున్నారు. మీరు నేర్చుకొన్న చదువు ఏ కొద్ది జీవితాలకైనా వెలుగునివ్వగలిగితే మీకు విద్య నేర్పిన గురువుగా నాకెంతో గర్వకారణంగా ఉంటుంది” అనే మాటల్లో విద్య తాము నేర్చుకోవటమేకాదు, విద్యను అందరికీ అందించాలన్న ఉపదేశాత్మక భావప్రచారం, వయోజనులనుద్ధరించాలన్న సూచన మాత్రమే కాదు అది తమ ధర్మంగా పాటించండనే ప్రిన్సిపాల్ ప్రబోధముంటుంది. ఆ గురూపదేశాన్ని పాటించిన విద్యార్థినులు ముగ్గురు – వయోజన విద్యావ్యాప్తికి పల్లెటూళ్ళకు పయనమై, మారుమూల ప్రాంతాలలో ఉన్న గ్రామశివార్లలో పూరిగుడిసెలలో ఎండలకు, వానలకు బాధపడుతూ జీవితాలను గడుపుతున్న వారికి విద్యనందించింది, ఆ వెలుగు రేఖలతో గ్రామీణ వయోజన జీవితాలను కాంతిమంతం చేశారు. అలా జరిగినందువలన ఒక విజ్ఞానవంతమైన రూపాన్ని సంతరించుకొన్న వ్యక్తే ఒక పల్లెటూరి సీతాలు. కూలి నాలి పనులు చేసుకుంటూ బ్రతుకును వెళ్ళదీసుకుంటున్న సీతాలు – ‘మై నేమ్ ఈజ్ సీతాలు’ అని చెప్పగలిగిన స్థితికి ఎదగటానికి గుర్తు ఆమె చెప్పే సంభాషణాత్మక సమాధానం – మై నేమ్ ఈజ్ సీతాలు!

ఈ విధంగా ఆ నాటిక పేరు కూడా మై నేమ్ ఈజ్ సీతాలు! అన్న మాటలే ఉన్న ఎస్.ఎ. రావుగారి ఈ నాటిక వయోజన విద్యావ్యాప్తికి స్ఫూర్తినిచ్చే ఒక ప్రబోధాత్మక నాటికగా మనం గమనించవచ్చు. విద్యావికాసానికి మార్గాన్ని చూపే వెలుగు దివిటీ ఈ రచన.

**విషాద భారతంలో మరో ఆడబడుచు :** ఈ నాటిక రచయిత శ్రీ గంజి రామారావు. ఈ నాటక ప్రారంభంలోనే ఒక మహిళా సమాఖ్య సభ్యురాండ్రందరూ ఒకచోట సమావేశమై, తమ సమాఖ్య పక్షాన సమాజంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను, అత్యాచారాలను ఎదుర్కొనేందుకు దేశంలోని మహిళలనందరినీ ఏకం చేసి స్త్రీకి ఏ రకమైన అన్యాయం జరిగినా, హాని జరిగినా, ఆమెకు అండగా నిలబడి విముక్తి కలిగించటమే తమ సంఘ ఆశయమని ప్రకటించడం జరుగుతుంది.

ఆ సమాఖ్యకు జిల్లా నాయకురాలిగా శాంతాదేవి ఉంది. ఆమె మాట్లాడబోయే సమయానికే ఒక దినపత్రికలో సీత అనే అమ్మాయి చనిపోయినట్లు వచ్చిన వార్తను చూస్తుంది. ఆమె ఆత్మహత్య చేసుకున్నదని ఆ పత్రికలో వచ్చింది. కాని ఆమె హత్య చేయబడిందని శాంతాదేవి గొంతెత్తి అరచి చెబుతుంది. నాటికలో ఇక్కణ్ణుంచి జరిగిన అసలు కథను చూపటం (ఫ్లాష్ బ్యాక్ స్టోరీ ప్రెజెంటేషన్) జరుగుతుంది.

ముఖ్యపాత్రలలో డాక్టరు ప్రసూనాదేవి ఒకరు. ఈమె వృత్తిరీత్యా డాక్టరు. ఈమెకు కుమారుడు రామ్‌ప్రసాద్ నాటికలో కనిపించడుగాని నాటికేతివృత్తంలో అతని కీలకమైన పాత్ర ఉంది. ఈమె కుమార్తె జానకి. అత్తవారింటి నుండి వైవాహిక జీవితాన్ని వదులుకుని పుట్టింటికి చేరిన ఆడబడుచు. ఆమెకొక బిడ్డ ఉంది. పేరు బిందు. వయస్సులో చిన్నదైనా మమత, మానవత ఉన్న పిల్ల. ఇక కథానాయికగా ‘సీత’ను చెప్పుకోవాలి. ఎందుకంటే కథంతా ఆమె చుట్టూనే తిరుగుతుంది. ఒక బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న రామ్‌ప్రసాద్ అనే ఉద్యోగి (డా. ప్రసూనా దేవి కొడుకు) తన సహోద్యోగిని అయిన సీతను కావాలనే పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకు మంచి జీతం వస్తుంది. కాని ఆమె తల్లిదండ్రులు ఏమీ కట్నమీయలేదు. నవ నాగరిక సమాజంలో ఒక డాక్టరుగా జీవిస్తున్న ప్రసూనకు కట్నం తీసుకుని రాని కోడలంటే ఇష్టం లేకుండా పోయింది. దీన్ని డాక్టరు ప్రసూన కూతురు జానకి సమర్థిస్తూ ఉంటుంది. ఇక రామ్‌ప్రసాద్ ఇంటి కోడలిపై వ్యతిరేక భావాన్ని పెంచుకున్న తల్లిని ఎదిరించలేకపోయాడు. ఇంటి ఆడబడుచు జానకి తల్లి దుష్టత్వాన్ని ఖండించకపోగా తల్లికి తాళం కొడుతూ నిలబడింది. వయసులో చిన్నదైన బిందు మాత్రం అమ్మ, అమ్మమ్మల చేష్టలను ఖండించినా ప్రయోజనం లేకపోయింది.

ఈ ఇంటిలో జరుగుతున్న దుష్టత్వానికి పరాకాష్ట ఏమంటే, అదే పేటలో వీధి చివర ఉన్న ఇంట్లో కూడా ఒకరు కోడల్ని హింసబెట్టి చంపబోతే, ఆ ఇంటి కోడలు తప్పించుకుని తల దాచుకోవటానికి డాక్టరు ప్రసూన ఇంటికే వచ్చి ఎవరికీ తెలియకుండా తనను కాపాడమని బతిమాలుకుంటుంది. కథానాయిక సీత ఆ అమ్మాయిని లోపల దాచి రక్షింపటానికి ప్రయత్నిస్తుంటే డా. ప్రసూన, కూతురు జానకి ఆ అమ్మాయిని బయటకు గెంటేస్తారు. అదే సన్నివేశంలో ఆ ఇంటి కోడలు ఈ నాటికలో ప్రధాన పాత్ర అయిన సీతను, కింద పడవేసి

మెడమీద కాలువేసి తొక్కి ఊపిరాడకుండా చేసి చంపేస్తారు. ఆ తరువాత ఆ అమ్మాయే ఉరివేసికొని చచ్చిపోయినట్లు తాడుతో వేలాడదీసి చూపుతారు.

ఆ క్రిందటి రోజు సీతను చూసి ఆమె పరిస్థితిని అర్థం చేసుకొని పనిమీద ఎక్కడికో వెళ్ళవలసి వెళ్ళి మళ్ళీ ఈ రోజు సీత ఎలా ఉందో చూడటానికి తిరిగి వచ్చిన శాంతాదేవి, సీత దారుణంగా అత్తా ఆడబడుచులచేత హత్యగావింపబడటం గమనిస్తుంది. మహిళా సమాఖ్య మీటింగులో ఉపన్యసింపబోతూ ఈ విషయమే పత్రికలో తప్పుగా ప్రచురించబడటం చూసి తీవ్ర ఆవేదనకు గురై ఆ సంగతినే వేదిక నుంచే అరుస్తూ తెలియజేయటం జరిగింది. ఆ జరిగిన అసలు కథే, ఈ నాటికలో చూపబడిన ఫ్లాష్‌బ్యాక్ ప్రదర్శన. ఈ ఫ్లాష్‌బ్యాక్‌లో జరిగిన అన్యాయ ఘట్టం ప్రదర్శనకు ముందే మహిళా సమాఖ్య పక్షాన అన్యాయాలను ఎదురించటం జరుగుతుందని చెప్పటం మాత్రం జరిగింది కాని, అప్పటికే ఉన్న మహిళా సమాఖ్య నాగరికుల సమాజంలోనే దారుణంగా బలైపోయిన ఒక ఆడబడుచు బ్రతుకును కాపాడలేకపోయింది. ప్రాణం నిలపలేకపోయింది. సీత చావుకంటే ముందే మరొక అబల డా. ప్రసూన ఇంటికి ప్రాణ రక్షణకు రావటం ఫ్లాష్‌బ్యాక్‌లో చూపిన ప్రదర్శనలో మనం చూస్తాము. మరి ఈ నాటికలోని మహిళా సమాఖ్య ఏం చేస్తున్నట్లు? విషాద భారతంలో బలైపోయిన మరో ఆడబడుచును చూపించి నిస్సహాయలుగా మిగతా పాత్రలను నిలిపి చూపటంతో నాటిక రచన ప్రయోజనవంతం కాకుండా పోయింది. కథానాయికను రక్షించి నాటికను మరోవిధంగా ముగించి ఆ పాత్రకు మాత్రమే కాదు సామాజిక న్యాయం కూడా కలిగించి ఉండవలసిందనిపిస్తుంది. దుష్టపాత్రలకు శిక్షపడాలి. కాని అది మరణ శిక్షే కానక్కరలేదు. కాని శిష్టమైన పాత్రలకు సలక్షణ పాత్రలకు ఏ చిన్న శిక్షో బాధో కాకుండా ఏకంగా దారుణంగా హత్యచేయబడి ప్రాణహాని కలగటం ప్రదర్శింపతగ్గ ముగింపుకాదు. ఇది న్యాయాన్ని ధర్మాన్ని హత్యచేయటమే - దుర్మార్గుల దారుణాలకు మనం తల ఒగ్గవలసిందే అని చెప్పినట్లవుతుంది. నాటిక ముగింపు ఆ విధంగా పొందకూడదు. అలాంటి నాటికలు ప్రదర్శింపబడ కూడదు. ఇది గమనించదగ్గ విషయం.

**త్రివేణి :** శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు (1950వ సంవత్సరమునకు సరియైన) విరోధినామ సంవత్సర మాఘ బహుళ చతుర్దశీ బుధవారమునాడు శివసాయుజ్యము చెందారు. శ్రీ సర్వా వేంకటశేషయ్య గారు ఆ సంఘటనకు బాధాతప్త హృదయులై శోకిస్తూ కరుణరస ప్రధానంగా ఈ నాటికను గద్య పద్యాత్మకంగా రూపొందించారు.

సుమారొక అర్ధశతాబ్ది కాలం ఆంధ్ర కవితా సామ్రాజ్యము నేలిన విద్వత్కవి పుంగవులు, ప్రథమాంధ్రాస్థాన కవీంద్రులును, అష్టావధాన, శతావధాన విధాన నూతన మార్గదర్శకులును గీర్వాణాంధ్ర భాషా గాంభీర్య, మాధుర్య, లాలిత్య సౌకుమార్యముల వెల్లివిరియించిన వారును, అసంఖ్యాక అంతేవాసులనుద్ధరించిన వారునైన శ్రీ వేంకటశాస్త్రిగారు, తురీయాశ్రమములో కృష్ణాతీరస్థ విజయవాడలో విశ్రమిస్తూ నిరుపమతపము సల్పి, కనక దుర్గాక్షేత్రమున శివరాత్రి పుణ్యదినాన శివ సాయుజ్యము చెందారు. వారి భౌతిక దేహమును వీడి వారి తేజోరూపము ఊర్ధ్వలోకాలలో పయనం సాగిస్తూ ఆదిత్య స్వర్లోకములను, సత్యవైకుంఠ లోకములను, శివలోకమును దర్శించి యచటి వేల్పులను దర్శించి, చివరకు మణిద్వీపాధివాసినియు, వారి కిలువేల్పునైన కామేశ్వరీదేవి పదపద్మములయందు విలీనమైన ఊర్ధ్వలోక యాత్రా వృత్తాంతాన్ని వివరించటం జరిగింది. తెలుగు తల్లికి అపరాకృతులైన కృష్ణాగౌతమీనదుల గుండెలు కరుణ రస ప్రవాహములుకాగా సరస్వతి తన తోబుట్టువులైన యాకరుణ రసభరిత తరింగిణులనోదార్చుటకు వచ్చి వారి ప్రార్థన పైనించుక సేపు కృష్ణా గౌతమీ నదీమాతలకు దివ్యదృష్టినిచ్చి ఊర్ధ్వలోకాలలో యాత్రచేస్తున్న వారి మృత పుత్ర తేజోదర్శనము కలుగునట్లు చేసి, ఆ విధంగా వారిని స్వస్థత పరచటం ఇందులోని కథ. ఈ నాటికలో నదీమాతల గుండెల నుండి పొంగి పొరలి వెల్లువై పారినది కరుణరసము. ఆ కరుణ రస ప్రవాహమును ప్రవహింపచేసిన నదీమతల్లులు ముగ్గురు కృష్ణాగౌతమీ సరస్వతులుకాగా, ఆ త్రివేణి సంగమ ప్రవాహములో నిండియున్న కరుణ రస ప్రవాహములో, తల మునకలుగా శోకించినవారే ఆంధ్రులందరు. దానికి సర్వా వేంకటశాస్త్రి గారి ఈ పద్య నాటిక ఒక ప్రత్యక్ష (ర) దర్పణం ప్రతి పద్యము కరుణ రస సంభరితమై ధారాళముగా సాగి శ్రీ వేంకటశాస్త్రి గారి శిష్య ప్రశిష్యుల హృదయ వేదనను మాత్రమే కాదు, చెళ్ళపిళ్ళ వారి గురువులైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి వంటి వారి హృదయము కూడా శిష్యుని మరణమునకు శోకతప్తము కాగా వారి వేదనా నిర్వేదనను

త్రివేణులచేత శ్రీ వేంకటశేషయ్య గారు ప్రత్యక్షీకరించిన తీరు కరుణ రస సంభరితంగా ఉంది.

ఇందులో సందర్భాన్నిబట్టి తెర వెనక శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి వారి సంభాషణలు ఔచితీమంతంగానే ఉన్నాయి. అయితే ఇది ప్రయోగోచితమైన నాటి అని కచ్చితంగా చెప్పలేము. కాని చెళ్ళపిళ్ళ వారి వర్ధంతి వంటి సందర్భాలలో ఇది ప్రయోక్తము కావచ్చును. తెలుగు నాటక రంగ చరిత్రలో పద్య నాటకాలకు ఒరవడి పెట్టి, భారత కథను ఐదు నాటకాలుగా రూపొందించిన తిరుపతి వెంకట కవులలో ఒకరైన శ్రీ వేంకటశాస్త్రి గారి నిర్యాణేతివృత్త నాటికను గద్యంగా మాత్రమే కాకుండా గద్య పద్యాత్మకంగా కూడా రూపొందించడానికీగల కారణము శ్రీ తిరుపతి వేంకట కవుల పద్యనాటక రచనా ప్రభావమని చెప్పవచ్చు.

సాధారణంగా నాటికలలో పద్యరచనా ప్రయోగము లేదు. ఆ విధంగా ఈ ద్యపద్యాత్మక నాటిక ఒక విలక్షణ రచన. విషాదభరితమైన ఒక సన్నివేశాన్ని సహృదయుల గుండె లోతులకు తీసుకొని వెళ్ళి కరుణ రసభరితంగా నింపి, తెలుగు సహృదయ ప్రజానీకానికంతటికీ చెళ్ళపిళ్ళ వారి ఉన్నత వ్యక్తిత్వాన్ని చూపి తెలుగు జనావళి యొక్క కరుణ రస హృదయ స్పందనను, గుండె లోతుల నుండి తడిమి తీసి చూసి కృష్ణా గౌతమీ పాత్రల హృదయాల ద్వారా చూపిస్తూ, సాహిత్యాధిదేవత సరస్వతి ద్వారా ఆ బాధాతప్త హృదయాలకు కొంత ఉపశమనం కలిగినట్లుగా, కరుణ రసానికొక పరాకాష్ఠను, త్రివేణుల మనస్తాపాన్ని తగ్గించటం ద్వారా చూపిస్తూ, పాఠక హృదయాలను శాంత పరచి స్వస్థత చేకూర్చటం ఈ నాటిక విశిష్టత.

**ఆదర్శ మహిళామండలి – నాటిక :** రచయిత సి. సిద్ధారెడ్డి ప్రగతికి బాటలు వేసికొనవలసిన ఈ నాటి సమాజం కూడా అభ్యుదయ మార్గంలో పయనించకుండా పాతకాలపు అలవాట్లనే అనుసరిస్తూ పూర్వాచారాలనే పాటిస్తున్న ఈ తరుణంలో, సమాజాన్ని మహిళా సంఘాలు ఉత్తేజపరచి ఉద్ధరించాలనే సదుద్దేశంతో మహిళలకు వినూత్న భావస్ఫోరకంగా సాగిన రచన, సి. సిద్ధారెడ్డి గారి ఆదర్శ మహిళా మండలి నాటిక. ఇందులో ఎనిమిది పాత్రలున్నాయి. అందులో ఐదుగురు పెద్దపెద్ద ఆఫీసర్ల భార్యలు – స్వయంగా మాత్రం అధికారంలో ఉన్నవారు కారు. ఒకరు మాత్రం కాలేజీ లెక్చరరు. మరొకరు వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షురాలు. ఇంకొకరు మాత్రం కలెక్టరు గారింటి పనిమనిషి. ఇందులో తాసీల్దారు భార్య అన్నపూర్ణ. డెప్యూటీ కలెక్టరు భార్య లలిత – వీరిద్దరూ పూర్వమే స్నేహితులు. అందరూ "ఆదర్శ మహిళామండలి" అనే సంస్థ సభ్యులు. ఆ సంస్థ ఒక కార్యక్రమానికి వారి ప్రవేశముతో ఆ పాత్రల పరిచయమవుతుంది. వారు చర్చించి తీర్మానించిన సమస్యలపై తగు చర్యలు తీసికొనవలసిందిగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలనే నిర్ణయంతో సభ ప్రారంభమౌతుంది. ఆ సభలో సందర్భానుసారంగా వారు చర్చించిన విషయాలేవేంటే :

అధిక ధరలు తగ్గాలి.
పొగత్రాగటం జరగకుండా చేయాలి.
మద్యపాన నిషేధం అమలు జరగాలి.
పేకాట వంటివి జరగకుండా చూడాలి.
కోళ్ళపందేలు వంటి వాటిని జరుగనియ్యకూడదు.
జంతు బలులు జరగనివ్వకూడదు.
మూఢనమ్మకాలు తొలగించుకోవాలి.
మంత్రాల మీద నమ్మకం పెట్టుకోకూడదు.
వరకట్న సమస్య పరిష్కరించబడాలి.

ఇలాంటి విషయాలను వారు చర్చించుకోవటం ఈ నాటికలో జరుగుతుంది. వరకట్నం సమస్యలకు పరిష్కారంగా సూచించబడినదేమంటే ఉద్యోగావకాశాలు స్త్రీలకు ఎక్కువగా కల్పించాలని, అందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని రావాలనే భావాలను తీర్మానాలుగా రూపొందించుకొన్నట్లుగా వివరిస్తూ ఆదర్శ మహిళా మండలి కార్యక్రమం ముగుస్తుంది. సభా ప్రారంభానికి ముందే యువతరం ఉప్పెనలాగ పొంగి సమాజాన్ని చైతన్యవంతం చేసి బాగుచేయాలనే భావం వ్యక్తపరచటం జరుగుతుంది. స్త్రీ సమాజంతోపాటు పురుష సమాజాభివృద్ధికి కూడా కృషి చేస్తే దేశంలో నిజంగానే తమది ఆదర్శ మహిళా మండలవుతుందనే ఆశాభావంతో సభాకార్యక్రమం ముగింపుతో ఈ నాటిక ప్రదర్శన కూడా పూర్తవుతుంది.

ఒక చిన్న నాటికలో తక్కువ పాత్రలతో ఒక మంచి ప్రయత్నమే జరిగినట్లు కనిపించినా – అన్నీ జరగాలి, జరుగుతున్నాయన్న ఆశల పల్లకిలో, ఊహాలోకంలో ఊరేగటంతప్ప ఇవి ఈ విధంగా నిజమైనాయన్న ఫల రూప దర్శనం గాని, సత్ఫలితాన్నందుకోవటానికి సరైన

మార్గమిదేనన్న నిర్దుష్టా మార్గ దర్శనం గాని జరగలేదు. ఉన్నత హోదాలో ఉన్న అధికారుల భార్యలు తమ వారి గొప్పతనం ప్రకటించుకున్నారే కాని వారి వలన కలిగిన ప్రయోజనమేమీ లేదు.

ఇక రచన విషయంలో జరిగిన ఒక చిన్న లోపమేమిటంటే, ఆధునిక సాంఘిక నాటికలో సంభాషణలు కొంతవరకు గ్రాంథిక శైలిలో జరగటం. అయితే ఆ లోపాన్ని ప్రదర్శిస్తున్న నటీమతల్లుల సమాజాలు సరిదిద్దుకోవచ్చును. అయితే రచయిత ఒక చిన్న నాటిక ద్వారా చేసిన ప్రయత్నం మాత్రం నిజంగా అభినందనీయము.

**భారత భారతి :** రచయిత్రి డాక్టరు నిడమర్తి నిర్మలాదేవి రచయిత్రి దీన్ని సంగీత సాహిత్య రూపకమన్నారు. ఈ రూపకేతివృత్తాన్ని గురించి రచయిత్రి అన్న మాటలు విందాం. "జాతీయ సమైక్య సాధనలో భారత కవయిత్రీ మణుల రచనలు ఏ విధంగా తోడ్పడుతున్నాయో తేటతెల్లం గావించటానికిగాను ఈ 'భారత భారతి' సాహిత్య రూపకం కూర్చడమైంది. విభిన్న భాషలకు, ప్రాంతాలకు, కాలాలకు చెందిన కవయిత్రులు కొందరు సత్యలోకంలో కొలువు తీరిన నలువ రాణి 'వాణి' సభలో సమావేశమై తమ కావ్యగానాలతో సరస చమత్కార సంభాషణా చాతుర్యంతోనూ, సాహిత్య సమస్యాపూరణా నైపుణ్యంతోనూ వాగ్దేవి నలరించి ఆమె అభినందనాశీస్సుల నందడమూ, కవిలోక కుటుంబిని యైన భారతీదేవి తన సందేశాన్ని వినిపించ కవుల కర్తవ్యాన్ని నిర్దేశించటము దీనిలోని ఇతివృత్తము. భువన విజయ సాహితీ రూపక ప్రభావంతో, కేవలం పురుష కవుల పాత్రలతోనే వస్తున్న సాహితీ రూపకాలకు ప్రత్నామ్యాయంగా, మరొక ప్రయోగాత్మక వైవిధ్యభరిత రూపకంగా కవయిత్రులనే అని పాత్రలుగా పెట్టి కూర్చిన సాహిత్య రూపకమే భారత భారతి. ఇక సభాధ్యక్ష నిర్వాహకులు గూడా స్త్రీలే కావటంతో అన్నీ స్త్రీ పాత్రలే ఉన్న రూపకమిది. ఇందులో 13 పాత్రలున్నాయి. పాత్రల గురించి తెలుసుకొందాం.

**సరస్వతి :** సంగీత సాహిత్యాది సర్వ కళా లోకానికి జగజ్జననియైన యావత్ప్రపంచ భారతియే ఈ మహాసభాధ్యక్ష సరస్వతి.

**కలభాషిణి :** నిజానికి కలభాషిణి పాత్రకు మూలరూపము. పింగళి సూరన కళాపూర్ణోదయంలో ఉంది. ఇందులో పాత్రల ప్రవేశ రచన, పరిచయాదులనందిస్తూ అనుసంధాన కర్తగా నిలచి నిర్వహణ బాధ్యత వహించిన ముఖ్యపాత్ర కలభాషిణి అంటే అవ్యక్త మధురముగా భాషించునది అని అర్థము.

**మధురవాణి :** తంజావూరు రఘునాథ నాయకుని ఇందిరా మందిర ఆస్థాన కవియిత్రి. రఘునాథ రామాయణాన్ని సంస్కృతంలోకి అనువదించిన తెలుగు సంస్కృత ద్విభాషా కవయిత్రి.

**లల్ల :** ఈమెకు అవ్వ లల్ల అనే పేరు కూడా ప్రసిద్ధి. కాశ్మీర వాఙ్మయ స్రష్ట ఈమె.

**గోదాదేవి :** కావేరి ఒడ్డున ఉన్న శ్రీరంగంలో తమిళనాట జన్మించి శ్రీరంగనాథుని భక్తితో సేవించి ఆయననే చేపట్టగలిగినదై లేదా ఆయన చేతినందుకోగలిగినదై చూడి కుడుత్తునాచ్చియార్‌గా ప్రసిద్ధి చెందిన ఆళ్వారు ఆండాళు.

**మీరాబాయి :** గుజారత్‌లో జన్మించి చైతన్య మహాప్రభువుల బోధనల స్ఫూర్తితో వాగ్గేయకారిణియై ఆసేతు హిమాచలం తన వాగ్గేయాలతో స్ఫూర్తినిచ్చి, అందరిచేత భజనలు చేయించిన కృష్ణభక్తి తత్పరురాలు.

**అక్క మహాదేవి:** కన్నడ భూమిలో జన్మించి, అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని సముపార్జించి శ్రీశైల మల్లికార్జునుని భక్తితో సేవించి యోగాంగ త్రివిధి, సృష్టి యవచన అక్కగళ పితికె మొదలైన గ్రంథాలు మల్లికార్జున వచనాలతో కన్నడ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవయిత్రి.

**మొల్ల :** మరొక తెలుగు కవయిత్రి ఈమె. తన పేరు మీదనే మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ రామాయణ కవయిత్రి.

**కుంతల కుమారి :** ఉత్కళ కోకిల అని ప్రసిద్ధికెక్కిన ఒరియా దేశపు కవయిత్రి.

**మహాదేవి వర్మ :** హిందీ సంస్కృతం – రెండు భాషల్లోనూ పాండిత్యం సంపాదించి రెండు భాషల్లోను పద్య గద్య రచనా ప్రౌఢిమతో, మధుర భక్తి భావనా విలసిత రచనలతో లోకాన్ని అలరించి జ్ఞానపీఠ పురస్కారాన్ని కూడా అందుకొన్న ఉత్తర భారత కవయిత్రి.

**సరోజినీ నాయుడు :** వంగ దేశపు వారి ఆడబడుచైనా ఆంధ్రుల ఇంట మెట్టి నిలచి ప్రాచీన భారతీయ కళాసాహిత్య రాజకీయ రంగాలలో తనదైన ప్రతిభా పాటవాలను చూపిన అసమాన ప్రజ్ఞానిధి భారత కోకిల సరోజినీదేవి! ఇందులో పాల్గొన్న మరొక ఆధునిక కాలపు మహాకవయిత్రి.

**మనోరమాతంపురాట్టి :** ఈమె అభ్యుదయ ప్రపూర్ణమైన రచనలు వెలువరించిన ఆధునిక కాల మలయాళ కవయిత్రి.

వీరందరూ ఒకే కాలానికి ఒక భాషకు చెందిన కవయిత్రులు కాకపోవచ్చు. కాని వీరందరూ భారత జాతీయతను, ప్రాచీన ధర్మాన్ని తమ మనస్సుల్లో నింపుకుని సరస్వతీ దేవి కొలువుకు చేరి తమ కవితా పాండితీ ప్రౌఢిమలతో వీణాపాణినే కాదు, విశ్వవాణిని తమ కవిత్వంలో ధ్వనింపచేసి విశ్వవీణను మధుర శ్రుతిలయలతో వినిపించి అసలు సిసలైన భారతీయ కవయిత్రీమణులని చాటిన నాటిక.

**శారదా విజయం :** ఓగేటి ఇందిరాదేవి గారి శారదా విజయం కూడా భువన విజయాది సాహితీ రూపకాల ప్రభావం చేత మహిళలు కూడా అలాంటివి ప్రదర్శించగలగటానికి వీలు కలుగ చేస్తూ వచ్చిన సాహితీ రూపంగా అనిపిస్తుంది. ఇది 1995లో ప్రచురితమైంది. సంప్రదాయ నాటకాలలో నాందీ, ప్రస్తావన అనే రెండు ప్రాథమికాంశాలుంటాయి. కాని ఈ రూపకం మాత్రం ప్రస్తావనతో ప్రారంభమౌతుంది. తుంబురుడు రంగప్రవేశం చేసి కలభాషిణిని పిలుస్తాడు. ఆమె వచ్చాక ఆనాడు అక్కడున్న కోలాహలానికి కారణమేమిటని అడుగుతాడు. అప్పుడు కలభాషిణి సత్యలోకంలో జరుగబోతున్న శారదాసేవకు భూలోకంలోని కవయిత్రులు కొందరు సిద్ధమౌతున్నారని చెబుతుంది. వారి సంభాషణల్లో ఈ సదస్సు నిర్వాహకురాలు కలభాషిణియేనని ఆ జరుగబోయే శారదా సదస్సు సరస్వతీ విజయమై సాహితీ రూపకంగా ప్రదర్శించబడుతుందని చెప్పబడింది. పై 'ప్రస్తావన'లోనే ఈ రూపక రచయిత్రిని గురించిన పరిచయం జరుగుతుంది. అప్పుడు రంగము నుండి తుంబుర కలభాషిణులు నిష్క్రమిస్తారు. ఇక ఈ రూపకంలో తుంబుర ప్రవేశ మళ్ళీ లేదు.

ఇక సభా నిర్వాహకురాలు, అనుసంధానకర్త అయిన కలభాషిణి శారదాదేవిని సభాస్థలికి తోడ్కొని వచ్చి ఉచితాసనము మీద కూర్చునబెట్టి ఆమె ఆజ్ఞ తీసుకుని ఒక్కొక్క కవయిత్రినీ గురించిన ప్రస్తావన చేస్తూ వారిని ప్రవేశపెట్టటంతో రూపకం ప్రారంభమై ముందుకు సాగుతుంది. అధ్యక్ష అనుసందానకులిద్దరూ కాక ఇంకా ఇందులో 24 పాత్రలున్నవి. అందులో 21 మంది కవయిత్రులు, ముగ్గురు నర్తకీమణులు. వీరందరూ ఈ మానవలోకంలో జన్మించి సాహితీ లోకాన్ని తమ కీర్తి చంద్రికలతో వెలుగు నింపినవారు. నర్తకీ మణులు కూడా ఉన్నత స్థానమలంకరించినవారే. కవయిత్రిలందరూ ఒకే కాలానికి చెందినవారు కాకపోయినా ఒకే సమయంలో ఎలా కలిశారనే సందేహం రాకుండా, కాలం విషయంలో అనౌచిత్యం లేకుండా ఈ సదస్సు సత్యలోకంలో జరగటంతో అనౌచిత్యం లేదు. ఇక భాషావిషయానికి వస్తే కవయిత్రులందరూ ఒక ప్రాంతం కాదు ఒక భాష వారు కూడా కాదు. వారి వారి భాషల్లో వారందరూ మహా కవయిత్రులుగా ప్రసిద్ధి చెందినవారు. అనుసంధాన కర్త కలభాషిణి సూచన మేరకు సందర్భోచితంగా వారంతా వారివారి భాషల్లో వారి కవిత్వాలను అందిస్తారు. వాటిని పాఠకులుగానో, ప్రేక్షకులగానో మనం ఆస్వాదింపవలసి ఉంటుంది. నాంది లేనప్పుడు ప్రస్తావన లేకపోతే మాత్రం నాటక సంప్రదాయానికేమీ భంగం కాదు కదా.

మరొక ముఖ్యవిషయం. ఇంతకు ముందు పేర్కొనబడిన రూపకాలలోని నిడమర్తి నిర్మలాదేవి గారి భారత భారతికి, ఇందిరాదేవిగారి రచన శారదా విజయానికి చాలా విషయ సామ్యముంది. రెండింటిలోను వాణియే సభాధ్యక్షురాలు. కలభాషిణియే సభావిషయ అనుసంధానకురాలు. ఇక మధురవాణి, మొల్ల, గోదాదేవి, మీరాబాయి, కన్నడ కవయిత్రి అక్కమహాదేవి, హిందీ సంస్కృత కవయిత్రి మహాదేవి వర్మ, మలయాళ కవయిత్రి తంబురాట్టి కాశ్మీరవాఙ్మయ స్రష్ట లల్ల – ఈ ఎనిమిది మంది కవయిత్రులు రెండు రూపకాలలోనూ ఉన్నారు. ఇక భారత భారతిలో మిగిలిన కవయిత్రులు సరోజినీ నాయుడు కుంతల కుమారితో మొత్తం పదిమంది కవయిత్రులయితే శారదా విజయంలో మిగిలినవారు గంగాదేవి, తిమ్మక్క, తరిగొండ వెంగమాంబ రామభద్రాంబ, కృష్ణాజలమ్మ, రంగాజమ్మ, మోహనాంగి, ముద్దుపళని, త్రివేణి, సుభద్రాకుమారి, చౌహాను, నాగరత్నం, ఇరావతీ కార్వే ఈ పదమూడుమందిని కలిపితే ఇరవైఒక్క మంది కవయిత్రులు. ఇలా సాగాయి ఈ రెండు రూపకాలు.

**నవలా దర్పణం :** కాకతీయ వైభవమనే రూపక సంపుటిలోని "నవలా దర్పణం" అనే నాటకం. ఓగేటి ఇందిరాదేవి గారితే మరొక సాహితీ రూపకం ఈ నవలా దర్పణం. దీనిలో పన్నెండు పాత్రలున్నాయి. ఈ పాత్రలకున్న ప్రత్యేకత ఏమిటంటే ఈ పాత్రలను ఇంతకు ముందే వేరువేరు రచయితలు తమ కథలోనో, నవలలోనో నాటకంలోనో




సృష్టించిన విశిష్ట పాత్రలవి. అలాంటి విశిష్ట పాత్రలను పన్నెండింటిని ఒకే రోజున – అంటే గురజాడ అప్పారావుగారి జన్మదినాన ఒకచోట చేర్చి ఆ పాత్రలను సృష్టి చేయడంలో ఆయా రచయితల భావోన్నతికి ఏ మాత్రం తీసిపోని విధంగా ఆయా పాత్రల వ్యక్తిత్వానికి ఏ విధమైన భంగం కలుగనీయకుండా వాటిని ఇందులో ప్రవేశపెట్టటం జరిగింది. ఆయా పూర్వ రచయితల సృష్టిలో రూపందుకుని వారి మానస పుత్రికలుగా నిలిచిన ఈ పన్నెండు మందిని ఓరుగంటి ఇందిరాదేవి దత్తత తీసుకున్నారు అనవచ్చు. అయితే ఈ నాటకంలో సన్నివేశం ఏకకాలంలో జరగటంతో ఆయా పాత్రానుగుణమైన సంభాషణలు చెప్పటం తప్ప ఇంకే విధంగా ఆ పాత్రలు వ్యవహరించడం జరుగలేదు. ఆ పాత్రలేమిటో చూద్దాం.

**మధురవాణి :** పసితనమింకా పూర్తి కాకుండానే పడుచుతనం రాకుండానే – అతి చిన్నవయస్సు ఆడపిల్లల్ని – స్వయంగా కన్నబిడ్డల్ని అమ్ముకునే లుబ్ధావధాన్లవంటి వారి దుష్టత్వాన్నుండి ఆ బిడ్డను కాపాడిన మానవతామూర్తిగా సృష్టింపబడిన మధురవాణి, గిరీశంతో సమానమైన ప్రాముఖ్యమున్న కన్యాశుల్కంలోని పాత్ర.

**రుక్మిణి :** కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్రలోని రుక్మిణి. పరిస్థితులకు లొంగిపోయి బెంబేలు పడకుండా ధైర్యంగా వాటిని ఎదుర్కొని స్త్రీ శక్తిని నిరూపించిన పాత్ర రుక్మిణి.

**అరుంధతి :** విశ్వనాథ సత్యనారాయణగారి వేయి పడగలు నవలలోని అరుంధతి ఈమె. భారతీయుల సంప్రదాయంలో దాంపత్య ధర్మానికున్నంత ప్రాముఖ్యం మరి దేనికీ లేదు. అది చాలా పవిత్రమైన బంధం. పతివ్రతయైన స్త్రీయే పరమ పూజ్యురాలు. అందుకే ఆమెను పుణ్యవతి అని అనటం జరిగింది. అందుకు ప్రతీకయైన పాత్ర అరుంధతి.

**కిన్నెరసాని :** కిన్నెరసాని కూడా పాతివ్రత్యాన్ని పరిరక్షించుకుంటున్న ప్రముఖమైన పాత్రే. కాకపోతే రూపం మాత్రం మానవ రూపం కాదంతే.

**జ్యోతి :** ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి నవలలోని ఆరంజోతి పాత్ర. తన తల్లిదండ్రులతోపాటు శిక్ష వేయబడి ఉండవల్లి సెటిల్‌మెంట్ (అంటే ఒకరకమైన జైలు)కు తరలించబడి 'పౌలు' అనే అధికారి అధీనంలో ఉంది. ఆ అధికారి ఆమెపై కన్నువేశాడు. నిమ్నకులంలో పుట్టినా శీలౌన్నత్యానికేమీ భంగం లేని వంశమిది. అధికారి అయినా వానికి లొంగిపోయే వ్యక్తిత్వం కాదు జ్యోతిది. అందుకే ఆమె ఆత్మత్యాగం చేస్తుంది. ఆమె శవాన్ని ఆమె మేనత్త కొడుకు, ప్రియుడు అయిన అప్పాదాసు భుజాన వేసుకొని తీసుకొని పోయి, ఆమె శవంతో సహా నీళ్ళలో మునిగిపోయి చనిపోతాడు.

**కాంతం :** తెలుగు వారి సాంసారిక జీవితంలోని ఆత్మయతా, ఆప్యాయతా, మాధుర్యం ఒడిదుడుకులు ప్రతిఫలించే విధంగా మునిమాణిక్యం నరసింహారావుగారి రచనలలో కనిపించే కాంతం, అసలు సిసలైన గృహిణికి ప్రతీకపాత్ర.

**ఎంకి :** నండూరి సుబ్బారావు గారి ఎంకి ముగ్ధనాయిక. నాయుడు బావ ఆమె భర్త. నాగరిక సమాజంలోని మనిషి కాదు ఎంకి. గ్రామ్య భాషలో సహజమైన యాసలో ఎంకి తన మనసులోని భావాలు చెబుతుంటే ఆమె ఎంత అమాయకురాలో మనకు తెలుస్తుంది. నాయుడు కూడా అంతే.

**పార్వతి :** ప్రముఖ బెంగాలీ నవలా రచయిత శరత్‌బాబు ప్రముఖ నవల దేవదాసులోని భగ్నప్రేమికురాలైన పార్వతి పాత్ర. ఈ నవల ఆధారంగా వచ్చిందే తెలుగు సినిమా దేవదాసు.

**శారద – రుద్రమదేవి :** అడవి బాపిరాజు గారి నారాయణ రావు నవలలోని శారదపాత్ర. ఇంకా బాపిరాజుగారిదే అయిన మరో నవల గోన గన్నారెడ్డి నవలలో తాను కూడా ఒక పాత్రయై నిలచి కాకతీయ రాజవంశ చరిత్ర కలికితురాయియైన వీర నారీమణి కాకతి రుద్రమదేవి. నిజంగానే ఒక స్త్రీమూర్తిగా మానవలోకంలో అవతరించి జన్మను సాఫల్యం చేసికొన్న చరితార్థ ఈ పాత్ర. ఈ పాత్రలనుపయోగించి ఈ రచన చేయటం జరిగింది.

*(తెలుగు నాటక సాహిత్యం - వివిధ రీతులు - పరిణామాలు)*



విక్టోరియా రాణి - శిరోమాణిక్యం

# కోహినూర్ వజ్రం : పయనించిన దారి

– వేలూరి కృష్ణమూర్తి

ఒకానొకప్పుడు మన దేశంలోని పలుచోట్ల భూమాత ఒడిలో నుండి అమూల్యమైన వజ్రసంపద లభించేదని మన గత చరిత్ర తెలుపుతుంది. రాయలసీమ ప్రాంతం మరియు గుంటూరు జిల్లాలోని కల్లూరు వజ్రపు గనులు మొదటినుంచి ప్రఖ్యాతి గాంచి ఉన్నవి. గ్రేట్‌మొఘల్ వజ్రం, నిజాం వజ్రం, హోప్ వజ్రం, షా వజ్రం, డ్రెస్‌డెన్ పచ్చ వజ్రం మొదలైన ప్రఖ్యాతి చెందిన వజ్రాలు ఈ గనులలో నుండి లభించినవే. 14 మరియు 16 వ శతాబ్దం మధ్య మొట్టమొదట వజ్రపు గనులు ఈ ప్రదేశాలలో తప్ప ప్రపంచంలోని వేరెక్కడా ఉండలేదని చరిత్ర కథనం. ఆ కాలంలో మన దేశాన్ని సందర్శించిన ఎంతోమంది దేశదేశాల యాత్రికులు ఈ విషయాలను గురించి తమ యాత్రాగాథలలో విపులంగానే వివరించి ఉన్నారు. అందులోనూ ముఖ్యంగా అప్పటి విజయనగర సామ్రాజ్యంలో వారు గమనించిన భవ్యసంస్కృతీ సాంప్రదాయాలు, రతనాలను రాసులుగా పోసి వీధులలో అమ్మేవారని, మొదలైన విషయాలను వారు చరిత్ర పుటలలో భద్రపరిచారు. ప్రఖ్యాత చరిత్రకారుడు Robert Sewell గారు 'The Forgotten Empire' అన్న గ్రంథంలో ఈ విషయాలన్నిటినీ చాలా విపులంగానే తెలిపి ఉన్నారు. ఆంధ్ర దేశంలోని రాయలసీమ ప్రాంతం ముఖ్యంగా కర్నూలు వద్ద కృష్ణానది ఉత్తరం వైపు దడ తీరం, అనంతపురం జిల్లాలోని వజ్రకరూరు ప్రాంతం, గుంటూరు జిల్లాలోని కల్లూరు గని ప్రదేశం మొదలైన చోట్ల గొప్పగొప్ప వజ్రాలు లభించేవట. ఆ కారణం వల్లనే ఎంతోమంది వజ్ర వ్యాపారస్థులు, వజ్ర నిపుణులు వర్షాకాలం గడచిన వెంటనే ఈ ప్రదేశాలను వజ్రాలకై సంచరించేవారట. బుచ్చిబాబుగారి ప్రఖ్యాత నవల 'చివరికి మిగిలేది'లో వజ్రకరూరు గనుల గురించి వివరంగా చర్చించినది సాహిత్య సక్తులకు బాగా తెలిసిన విషయమే.

ఇక 'కోహినూర్' వజ్రం విషయానికి వస్తే, ఈ అత్యంత అమూల్యమైన వజ్రం ఆంధ్రదేశంలోని గుంటూరు జిల్లాలో అమరావతికి సమీపాన కృష్ణానది ఒడ్డున ఉన్న కొలూరు గనులలో సుమారుగా 700 సంవత్సరాల క్రితం లభించినదని చరిత్రకారులు స్పష్టం చేసిన విషయం. అది 14వ శతాబ్దం ప్రారంభంలో కాకతీయ వంశం వాడైన ప్రతాపరుద్ర చక్రవర్తి ఓరుగల్లు పట్టణాన్ని రాజధానిగా చేసుకుని అప్పటి ఆంధ్ర దేశాన్ని పరిపాలిస్తున్న సమయం. ఇలా కొల్లూరు గనులలో లభించిన ఈ గొప్ప వజ్రం కాకతీయ రాజుల పాలనా ప్రదేశంలో లభించినందున ఆ వ్రజాన్ని ప్రతాపరుద్రుడికి సమర్పించారు. కొంతకాలం ఆ వజ్రాన్ని తనవద్ద ఉంచుకొన్న ప్రతాపరుద్రుడు, దానిని తన పరిపాలనా పరిధిలో ఉన్న ఒక దేవీ ఆలయానికి కానుకగా సమర్పించాడు.

ఇది జరిగిన కొంతకాలానికి అల్లావుద్దీన్ ఖిల్జీ సంతతిని హతమార్చి ఢిల్లీ సింహాసనాన్ని అధిరోహించిన ఘియాజిద్దీన్ తుఘలక్ తన ఖజానాను పటిష్టం చేయాలన్న ఉద్దేశంతో 1323లో తన సైన్యాధికారి ఉలూఫ్ ఖాన్‌కు తోడుగా ఒక పెద్ద సైన్య బలాన్ని పంపి దక్షిణ భారత దేశంపై దాడికి పంపాడు. ఓరుగల్లు కోటను చుట్టుముట్టిన సైనికులు అప్రమత్తులై ఉన్న కాకతీయసైన్యం చేతులలో చిత్తుగా ఓడిపోయారు. అపజయం పాలై వెనుదిరిగిన ఉలూఫ్‌ఖాన్ సైన్యం మరింత సైన్యబలాన్ని కూడదీసుకొని ఎలాంటి సూచనా ఇవ్వక ఓరుగల్లు కోటను ముట్టడించారు. విజయగర్వంతో ఉదాసీనంగా ఉన్న కాకతీయ సైన్యం ఇలాంటి దాడిని నిరీక్షించచనివారై ఉన్నకున్నట్టే మరుదాడి చేసిన ఉలూఫ్‌ఖాన్ సైన్యంతో పోరాడలేక చివరకు లొంగిపోయి అపజయం పాలయ్యారు. ప్రతాపరుద్రుడిని బంధించి, ఖాదిర్‌ఖాన్ మరియు ఖ్వాజా హాజీ అన్న ఇద్దరు సర్దార్ల వెంట ఢిల్లీ కారాగృహవాసానికి తీసుకొని పోతుండగా మార్గ మధ్యంలో నర్మదానదీ తీరాన ప్రతీప రుద్రుడు ఆత్మహత్య చేసుకొన్నాడట. ఈ విధంగా ప్రతాపరుద్రుని ఓటమి, ఓరుగల్లు పతనం

ఆంధ్రజాతి చరిత్రలో ఒక మరువలేని దురదృష్టకరమైన ఘట్టమై పోయినది. ఈ ఘనవిజయంతో లభించిన ఉత్సాహంతో ఉలూఫ్‌ఖాన్ సైన్యం తమ విజయ యాత్రను కొనసాగిస్తూ ఆంధ్రదేశం తూరుపు తీరం మార్గంగా వెడుతూ దారిలో ఉన్న గ్రామాలను, నగరాలను, పట్టణాలను ధ్వంసం చేసి అగుపడ్డ దేవాలయాలను నేలమట్టం చేసి వాటలో లభించిన ఆభరణాలు, ధనం మరియు ఇతర సంపదను దోచుకున్నారు. ఈ విధంగా అపారమైన ధన కనక సంపదను ఒంటెలు, ఏనుగులు, గుఱ్ఱాలపై వేసి రాజధాని ఢిల్లీకి కొనిపోయారట. ఈ గొప్ప సంపదతో వెళ్ళినదే ప్రతాపరుద్ర చక్రవర్తి ఒక దేవీ ఆలయానికి కానుకగా సమర్పించిన ఆ ఘన వజ్రరాజం! హిందువుల నమ్మకం ప్రకారం మరియు అప్పటి ఉల్లేఖనల ప్రకారం ఈ గొప్ప వజ్రాన్ని 'వజ్రాల రాజ'ని (King of Diamonds), శ్రీకృష్ణుని కథలో వచ్చే 'శ్యమంతకమణి' అని నమ్మి, దానిని అలానే పిలిచేవారట.

ఇలా ప్రారంభమైన ఈ వజ్రం యొక్క పయనం తరువాతి కాలంలో నాదిర్‌షా చేత 'కోహినూర్' అని పిలువబడి ఆ పేరుతోనే తరువాతి కాలంలో అది చిరస్థాయియైనది. ఈ వజ్రం లభించిన ప్రారంభ దశలో కొద్దికాలం కాకతీయ రాజుల వద్ద ఉండి అనంతరకాలంలో తుఘలక్ రాజ వంశం కైవశమైనది. ఈ ఘన వజ్రం గురించి హుమయూన్ తన ఆత్మకథ 'హుమయూన్ నామా'లో ప్రస్తావిస్తూ, తోమర్ రాజవంశం వద్ద ఉండిన ఈ వజ్రం ఆ వంశంలో చివరివాడైన మాన్‌సింగ్ తోమర్ ఢిల్లీ సుల్తాన్ సికిందర్ లోడీతో అపజయం ఉంది అతనికి అధీనుడై, ఈ ఘనవజ్రం లోడీ రాజవంశం పాలైన విషయం వివరించి ఉన్నారు. తదనంతరం 1526లో పానిపట్ యుద్ధంలో సికిందర్ లోడీపై ఘనవిజయం సాధించిన బాబర్ ఢిల్లీని వశపరచుకొని మొఘల్ సామ్రాజ్య స్థాపకుడయ్యాడు. ఆ విధంగా ఈ ఘనవజ్రం లోడీ రాజవంశం నుండి బాబర్ ఖజానాలోకి వెళ్ళినది. తరువాత బాబర్ కుమారుడు హుమయూన్ వద్ద ఈ వజ్రమున్నప్పుడు అతడు చాలా కష్టాలను అనుభవించాడట. తదనంతరం హుమయూన్ కుమారుడు అక్బర్ మాత్రం ఈ వజ్రం జోలికే పోలేదని అప్పటి చరిత్ర కారుల కథనం. అక్బర్ తరువాత అతని మనవడు షాజహాన్ ఈ వజ్రాన్ని ఖజానా నుండి బయటికి తీపించి తన మయూర సింహాసనానికి అలంకరింప చేసుకున్నాడు. షాజహాన్ తన అధికార అవధిలో తన ప్రియతమ భార్య ముమతాజ్ జ్ఞాపకార్థం ఆగ్రా పట్టణంలో 'తాజ్‌మహల్' స్మారకాన్ని నిర్మించి గొప్ప కీర్తిని, ప్రఖ్యాతిని గడించాడు. తాను నిర్మించిన 'తాజ్‌మహల్' ఇప్పటికీ ప్రపంచంలోని యాత్రికులను ఆకట్టుకొంటూ గొప్ప ప్రఖ్యాతి గాంచినది. కాని, అనంతర కాలంలో రోగగ్రస్తుడైన షాజహాన్‌ను అధికార గద్దె నుండి దింపివేసిన అతని కుమారుడు ఔరంగజేబ్ ఆగ్రాకు సమీపంలో తన తండ్రిని కారాగృహంలో బంధించి ఉంచాడు. ఆ సమయంలోనూ షాజహాన్ ఈ ఘన వజ్రాన్ని తనవద్దనే ఉంచుకొన్నాడు. చాలా సమయం కారాగృహంలో గడిపిన షాజహాన్ తాను నిర్మించిన తాజ్‌మహల్ చిత్రాన్ని ఈ వజ్రాన్ని ప్రిజమ్ లాగా ఉపయోగించి, ఆ దృశ్యాన్ని చూచి ఆనందించేవాడట. అనంతర కాలంలో ఔరంగజేబ్ ఈ వజ్రాన్ని చేజిక్కించుకుని, తన రాజధాని లాహోరుకు తీసుకువెళ్ళి తనవద్దనే ఉంచుకున్నాడట.

1608లో మన దేశాన్ని సందర్శించిన ఒక విదేశీ యాత్రికుడు మౌంట్ ఫోర్ట్, తన యాత్రాగ్రంథం 'సర్వే ఆఫ్ ఆల్ ది ఈస్ట్ ఇండీస్'లో తెలిపినట్టు 198 మ్యాంగలిన్ తూకం ఉన్న ఒక చాలా పెద్ద వజ్రాన్ని తాను, జహంగీరు వద్ద ఉన్నది చూశానని తన గ్రంథంలో తెలిపాడు. ఆ వజ్రాన్ని తన భుజ ఆభరణంగా ధరించడానికి ఒక ముత్యమంత రంధ్రాన్ని కూడ చేపించాడని తెలిపి ఉన్నాడు. అదే సమయంలో భారతదేశాన్ని సందర్శించిన ఒక ఫ్రెంచ్ దేశీయుడు మరియు వజ్రాల వ్యాపారియైన జీన్ బాప్టిస్ టావర్నియర్ 1665లో ప్రచురించిన తన యాత్రాకథనం - 'Tavernier's Travels in India' అన్న గ్రంథంలో ఈ వజ్రం 756 ఇంగ్లీషు కారట్ల బరువు ఉండినదని, షాజహాను ఈ వజ్రాన్ని సరిగా కత్తరించడానికి హోర్టినియో బోర్గియో అనునతనికి ఇచ్చాడని, అపుడు దాని బరువు కొంతగా తగ్గినదని తెలిపాడు. షాజహాన్ తన అధికారావధిలో ఈ వజ్రాన్ని తన మయూర సింహాసనానికి అలంకరింప చేసుకోగా, ఔరంగజేబు అధికారం చేజిక్కించుకున్న సమయానికి అనేక రూపాంతరాలను చెందినదట. చివరికి అది ఔరంగజేబు వద్దకు చేరే సమయానికి ఆ వజ్రం బరువు 268 1/2 కారట్ల బరువు ఉండినదని టావర్నియర్ తన కథనంలో తెలిపాడు. ఇది జరిగిన కొద్ది కాలానికి ఔరంగజేబు అధికారం కోల్పోవడం, తరువాత మొఘల్ సామ్రాట్టు మహమ్మద్ షా ఢిల్లీని పరిపాలిస్తున్న సమయంలో పర్షియన్ దేశపు నాదిర్‌షా 1739లో ఢిల్లీ పట్టణాన్ని

ఆక్రమించుకొన్నాడు. ఆ సమయంలో ఢిల్లీ ఖజానాలో ఉన్న అమూల్యమైన ఆభరణాలు, ధనం మరియు ఇతర సంపదతతోపాటు ఈ మయూర సింహాసనం కూడ నాదిర్ షా వశమై అతను దానిని తన వెంట కాబూలుకు తీసుకువెళ్ళాడు. అలా మయూర సింహాసనంలో అలంకరింపబడిన ఈ అమోఘ వజ్రం నాదిర్ షా పాలైనది. ఇలా ఇన్నేళ్ళుగా, దగ్గర దగ్గర 400 సంవత్సరాల పాటు ఎలాంటి పేరులేక ఎన్నో చేతులు మారుతూ పయనించిన ఈ అపూర్వ వజ్ర రాజం అప్పటి యజమాని నాదిర్ షా చేత మొట్టమొదటిసారిగా 'కోహినూర్' అని పిలువబడినది. వారి భాషలో దాని అర్థం 'వెలుగు పర్వతం'. ఆనాటి నుంచి ఈ వజ్రానికి 'కోహినూర్' అన్న నామం స్థిరపడి చరిత్రలో తనదే అయిన ఒక ప్రఖ్యాతిని గడించి ఇప్పటికీ దాని యాజమాన్యం గురించి తర్జన భర్జనలు, న్యాయస్థానాలను సంప్రదించడంలాంటి విషయాలను మనం ఇప్పటికీ గమనిస్తున్న విషయం.

ఇది జరిగిన కొద్దికాలానికి 1947లో నాదిర్ షా హత్య చేయబడటంతో, కోహినూర్ వజ్రం నాదిర్ షా సైన్యాధిపతి ఆఫ్ఘన్ దేశపు అహమద్ షా దురానీ కైవశమైనది. అనంతరకాలంలో అది నాదిర్ షా మనవడు శాహ్‌రూక్ కు చేరినది. ఈ విధంగా అదే వంశంలోని శాహ్‌రూక్ కుమారుడు తైమూర్‌కు, ఆ తరువాత 1795లో మనవడు శహ్ ఐమన్‌కు ఈ కోహినూర్ వజ్రం లభించినది. కాని ఇతని తమ్ముడు మహమద్, శహ్ ఐమన్ కండ్లు పీకించి, అతడిని అధికారం నుంచి దింపివేసి కారాగృహంలో బంధించి ఉంచాడు. అధికారం కోల్పోయిన శహ్ ఐమన్ కారాగృహంలో ఉన్నప్పటికీ కోహినూర్ వజ్రాన్ని తనవద్దనే దాచుకున్నాడు. ఇలా కోహినూర్ వజ్రం ఎన్నో చేతులు మారినప్పటికీ దానిని ఉంచుకొన్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆపదకు, కష్టాని గురి అవుతూ వచ్చారు. తదనంతరం కోహినూర్ వజ్రాన్ని మహమద్ తమ్ముడు షాశూజా చేజిక్కించుకున్నాడు. 1809లో షాశూజా ఆఫ్ఘన్ రాజుగా ఉన్న సమయంలో, పెషావర్‌ను దర్శించిన విదేశీ యాత్రికుడు ఎల్ఫిన్‌స్టన్, కోహినూర్ వజ్రాన్ని షాశూజా చేతి కడియంలో ఉండడం చూచానని తెలిపి ఉన్నాడు. ఇది జరిగిన కొంత కాలానికి, 1812లో షాశూజా శత్రువుల చేతిలో అపజయం పొంది, అధికారం పోగొట్టుకోవడంతో, కోహినూర్ వజ్రాన్ని తనతో తీసుకుని లాహోర్‌కు పారిపోయాడు. లాహోర్‌ను రాజధానిగా చేసుకుని పంజాబ్ రాజ్యాన్ని పరిపాలిస్తున్న రణజిత్ సింగ్‌ను కలిసి అతని సహాయం కోరుతాడు. రణజిత్ సింగ్ తన అధికారం మరియు పలుకబడిని ఉపయోగించి ఆఫ్ఘన్ దేశపు ఆధిపత్యాన్ని మరలా షాశూజాకు ఇప్పించగలుగుతాడు. రణజిత్ సింగ్ తనకు చేసిన ఈ సహాయానికి కృతజ్ఞతను తెలుపుతూ తనవద్ద ఉన్న కోహినూర్ వజ్రాన్ని అతనికి బహుమతిగా ఇస్తాడు. అలా ఇన్ని రోజులుగా ముస్లిముల చేతులలోకి మారుతూ వారి అధీనంలో ఉన్న కోహినూర్ వజ్రం 500 సంవత్సరాల అనంతరం శిఖ్ రాజ్య సంస్థాపకుడైన రణజిత్ సింగ్ కైవశమైనది. 1839లో రణజిత్ సింగ్ మరణశయ్యమీద ఉన్నప్పుడు, తనవద్ద ఉన్న కోహినూర్ వజ్రం పూరిలోని జగన్నాథ దేవాలయానికి సమర్పించాలన్న కోరికను వెలిబుచ్చి అలాగే వీలునామా వ్రాయించాడు. కాని అతని మరణానంతరం వీలునామాలో వెలిబుచ్చిన అతని కోరికను వారసుదారులు త్రోసిపుచ్చారు. రణజిత్ మరణానంతరం, అతనికంటె వయసులో చాలా చిన్నదైన అతని ఐదవ భార్య జిందాన్ కౌర్ కుమారుడు దులీప్‌సింగ్ రాజ్యానికి ఉత్తరాధికారి అవుతాడు. కాని, దులీప్‌సింగ్ మైనర్ కావడంతో జిందాన్‌కౌర్ కుమారుడి 'రీజెండ్'గా నాలుగేళ్ళు రాజ్య పరిపాలనా పగ్గాలనుపట్టి చాలా చతురతతో కార్యం నిర్వర్తించినది. ఈ సమయంలో దులీవ్‌సింగ్ వైస్రాయ్ దల్‌హౌసీ ప్రణాళిక ప్రకారం, సర్ జాన్ లాగిన్ మరియు అతని భార్య లీనాలాగిన్‌ల పోషణలో పెరుగుతూ క్రిస్టియన్‌గా మతమార్పిడి పొందటానికి కావలసిన అన్ని అర్హతలను పొందేలాగా తయారవుతాడు. అనంతరం జరిగిన ఆంగ్లో–శిఖ్ యుద్ధంలో బ్రిటీషువారు 1849 మార్చి నెల 29న లాహోర్ కోటపై తమ ధ్వజాన్ని ఎగురవేయడంతో పంజాబ్ రాజ్య ప్రాంతం కూడ భారతదేశంలాగా ఆంగ్ల సామ్రాజ్యపు ఒక భాగమైపోయినదని ఘోషణ చేశారు. దీని పరిణామంగా, లాహోర్ ఒప్పందం (Labore Treaty) జరిగి దాని ప్రకారం శిఖ్ఖు సామ్రాజ్యం యొక్క సమస్త సంపదా యుద్ధ పరిహార రూపంలో ఆంగ్లేయులపరమైనది. కోహినూర్ వజ్రాన్ని మొదలుగా లాహోర్‌లో ఉన్న ఈస్ట్ ఇండియా కంపెనీ ఖజానాకు తరలించారు. తరువాత దానిని వైస్రాయి ద్వారా బ్రిటన్‌కు పంపారు. లార్డ్ డల్ హౌసీ తన యజమానుల మరియు రాణి విక్టోరియా మెప్పు పొందాలన్న ఉద్దేశంతో దులీప్‌సింగ్‌ను తనవెంట లండన్‌కు తీసుకువెళ్ళి మతమార్పిడి చేపించి, తన వద్ద ఉన్న కోహినూర్ వజ్రాన్ని దులీప్‌సింగ్ ద్వారా రాణి

విక్టోరియాకు 1850 జులై నెలలో కానుకగా ఇప్పిస్తాడు. ఈ విధంగా భారత భూమిలో ఆవిర్భవించిన ఆ ఘన వజ్రం 500 సంవత్సరాల అనంతరం, ఈ మధ్యకాలంలో ఎన్నో చేతుల మారి, 'కోహినూర్' అన్న నామం ధరించి ప్రఖ్యాతి పొంది చివరగా బ్రిటీష్ రాణికి కానుకగా సమర్పించబడినది.

ఇది జరిగిన కొంతకాలానికి 1851లో కోహినూర్ వజ్రాన్ని లండన్‌లోని క్రిస్టల్ పాలెస్ (Crystal Palace)లో ప్రజల వీక్షణార్థం ప్రదర్శనకు పెట్టారు. అయితే ఈ వజ్రం దాని గాత్రానికి తగ్గట్టు కత్తిరించబడినా ఆ కాలంలో ఉన్న ఇతర గొప్ప వజ్రాలవలె ప్రకాశించుచుండలేదట. అందువల్ల దాని ఆకారాన్ని 1852లో రాణి విక్టోరియా మరియు ఆమె భర్త ప్రిన్స్ ఆల్బర్ట్ సూచనల ప్రకారం క్యాంటర్ అన్న ఒక డచ్ దేశపు వజ్రాల నిపుణిడిచేత కోహినూర్ వజ్రాన్ని కత్తిరింపించడంతో దానికి ఒక క్రొత్త రూపం ఏర్పడి అత్యంత ప్రకాశవంతంగా తయారై మిరుమిట్లుగొల్ప సాగినది. ఈ విధంగా మార్పుచెందిన కోహినూర్ వజ్రాన్ని చూచి ఆనందపడిన రాణి విక్టోరియా దానిని తన అరుదైన ఆభరణంగా ఎంచి కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో మాత్రమే ఆమె దానిని ధరించేదట. అనంతరం ఒక శతాబ్దం తరువాత 1953లో రాణి ఎలిజబెత్-2 (ఇప్పటి బ్రిటీష్ రాణి) పట్టాభిషేకం జరిగిన సందర్భంలో కోహినూర్ వజ్రాన్ని రాణిగారి కిరీటానికి పొదిగి అలంకరింపబడినది.

చరిత్ర కథనం ప్రకారం చాలాకాలం నుండి ఈ వజ్రం గురించి కొన్ని అపోహలు, మూఢనమ్మకాలు ఏర్పడిపోయాయి. వాటి ప్రకారం ఈ వజ్రాన్ని ధరించిన ఏ పురుషుడైనా కష్టకార్పణ్యాలకు లోనౌతాడన్న మూఢనమ్మకం బలమైపోయినది. చరిత్రలో జరిగిన ఘటనలు ఈ నమ్మకానికి వత్తాసు పలికినట్టయినది. ఆ కారణంతో ఈ వజ్రాన్ని స్త్రీలు మాత్రమే ఆభరణంగా ధరించాలని లేక దేవతల అలంకార ఆభరణంగా మాత్రమే ఉపయోగించాలన్న నమ్మకం గట్టిపడినది. పై విషయాల గురించి తెలిసివున్న రాణి విక్టోరియా ఈ వజ్రం తన అధీనంలోనికి వచ్చిన వెంటనే దీనిని రాణి మాత్రమే ధరించాలని, వేరెవరూ దీనిని ధరించరాదని ఉత్తర్వులు జారీ చేసి అలాగే తన వీలునామాలో ఈ విషయం స్పష్టం చేసినది. ఈ కారణంతో కోహినూర్ వజ్రం రాణిగారి ఆభరణాలలో ఒక ముఖ్యభాగమైనది. దులీప్‌సింగ్ మైనర్‌గా ఉన్న సమయంలో అతని పోషణ మరియు విద్యాభ్యాసం భారాన్ని తీసుకున్న లాగిన్ దంపతులలో ఒకరైన లేడీ లాగిన్ 1890లో ప్రచురించిన 'రిఫ్లెక్షన్స్' (Reflections) అన్న తన రచనలోని 'సర్ జాన్ లాగిన్ మరియు మహారాజ దులీప్ సింగ్' అన్న అధ్యాయంలో కోహినూర్ వజ్రానికి సంబంధించిన కొన్ని విషయాలు మనకు గోచరమవుతవి. చిన్నప్పటినుండి బాలుడు దులీప్‌సింగ్ పాశ్చాత్య సంస్కృతి మరియు వారి అలవాట్లకు ఆకర్షితుడయ్యాడు. ఇంగ్లీషు భాషతోపాటు బైబిలు చదవడం, చర్చికి వెళ్ళడం, చివరకు క్రిస్టియన్ మతానికి మార్పు చెందడంలాంటి విషయాలవల్ల, దులీప్‌సింగ్ రాణి విక్టోరియాకు చాలా దగ్గరివాడయ్యాడు. దీనికి తోడుగా, కర్ణాటకలో కూర్గు సంస్థానానికి చెందిన చివరి రాజు చిక్కవీర రాజేంద్ర బ్రిటీషువారికి అధీనుడై తన కుమార్తె గౌరమ్మను వైస్రాయి డల్‌హౌసీ నిఘూడ ప్రణాళిక ప్రకారం, పాశ్చాత్య పద్ధతిలో పెరిగించి మతమార్పిడి చేపించి ఉన్నందున, దులీప్‌సింగ్‌తో విక్టోరియా గౌరమ్మ వివాహం జరిపితే ఒకేమారు రెండు రాజవంశాలవారు క్రిస్టియన్ మతానికి మార్పు చెందిన వీరు ఒకటయితే, ఇతర రాజవంశాలు కూడ, మతమార్పిడికి విరోధం చూపరన్న అంచనా వైస్రాయికి ఉండేవి. దీనిని బ్రిటీషు రాజవంశం వారు కూడ ప్రోత్సహించి మద్దతు ఇచ్చేవారు. ఆ సమయంలో లండన్‌లో నివసిస్తున్న మహారాజా దులీప్‌సింగ్ తనకు రావలసిన ఆర్థిక వనరులు మరియు ఇతర సదుపాయాలకై లండన్‌లోని India Office అధికారులతో పోరాడి విఫలుడౌతాడు. అలాంటి ఒక సందర్భంలో దులీప్‌సింగ్ తన కోపాన్ని చూపడానికి రాణి విక్టోరియాను 'దొంగిలించిన ఆభరణాలను దాచిపెట్టుకున్నటు వంటి'దని నిందించినా, రాణి గొప్ప మనసుతో అతనిపై ఎలాంటి కఠిన చర్య తీసుకోలేదని లేడీ లాగిన్ 'రిఫ్లెక్షన్స్' అన్న గ్రంథంలో తెలిపినది. అలాగే మరొక సందర్భంలో దిగజారుతున్న తన ఆర్థిక పరిస్థితికి రోసిపోయిన దులీప్‌సింగ్ రాణి విక్టోరియాతో 'తన జీవిత నిర్వహణకు కోహినూర్ వజ్రం విలువకు డబ్బు రూపంలో ఇవ్వమని' అడిగాడట. అయినా రాణి విక్టోరియా దులీప్‌సింగ్‌పై ఎలాంటి కఠిన చర్య తీసుకోలేదని లేడీ లాగిన్ తన గ్రంథంలో తెలిపారు. వర్తమాన పరిస్థితికి వస్తే, కోహినూర్ వజ్రం యాజమాన్యం గురించి మన దేశమే కాక, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, మరికొన్ని దేశాలు ఆ వజ్రం తమకే చెందాలని చాటుతూ న్యాయస్థానం తలుపులు తట్టుతున్నారు. క్రిందటి నవంబర్‌లో కొందరు భారతీయ కళాకారుల బృందం లండన్ హైకోర్టులో ఈ విషయంగా

⇨

## వేదిక

### తెలుగు పద్యాల్ని పిల్లలతో చదివించగలమా?

తెలుగు భాష ఒక్కదానిలోనే పద్యాన్ని రాగయుక్తంగా చదువుతారు. మిగిలిన ఏ భాషలోనైనా పద్యాన్ని గద్యంలానే చదువుతారు. చరిత్రపరంగా చూసుకుంటే పూర్వం రాజాశ్రమంలో పద్యాలు చదివి వినిపించడానికి గమకి అనే పేరుతో ఉద్యోగి ఉండేవాడు. పద్యాన్ని గమకంతో చదవటం వలన అతన్ని గమకి అన్నారు. అతని ఉచ్ఛారణలో రాగచ్ఛాయే తప్ప రాగ కల్పన ఉండదని తెలుస్తుంది. ఆనాడు గమకి పద్యాన్ని ఎలా చదివాడో మనకు యిథమిత్థంగా తెలియదు.

తెలుగు భాషలో పద్యానికి యతిప్రాసలే ముఖ్యం. పద్యంలో pronunciation గుర్తులుండవు. పద్యాన్ని ఎలా చదావాలో ఎప్పుడు, ఎక్కడ ఎంత కాల వ్యవధి ఉండాలో, ఎక్కడ కొంచెంసేపు ఆపాలో, ఎక్కడ ఆపకూడదో మున్నగు విషయాలపై నిర్ణయాత్మకమైన సూత్రాలు లేవు. దానితో ఎవరికి తోచినట్లు వారు పద్యం చదవటం చేయటంతో అనేక బాణీలు ఏర్పడ్డాయి.



ఘంటసాల

పద్యపఠనాన్ని సులభతరం చేసి, పద్యాన్ని అందరికీ అర్థమయ్యేలా ప్రజారంజకం చేసేవారు పల్లెటూర్లలో, దేవాలయాలలో పురాణం పఠనం చేసిన పండితులు. ఆ తరువాత పద్యనాటికలు, నటులు పదాలను విరిచి రాగయుక్తంగా సందర్భానుసారంగా పద్యాన్ని ఆలపించటంతో ప్రజాభిమానాన్ని గైకొన్నారు.

పండిత పామరులు ఏకమై ఆ విధానానికి అలవాటుపడ్డారు.

ఆ తరువాత కాలంలో సుమధుర గాత్రం మానవరూపం దాల్చి ఘంటసాలగా అవతరించింది. నర్తనశాలలోని తిక్కన పద్యాలు, పోతన వ్రాసిన రుక్మిణీ కళ్యాణ ఘట్టాలను మధుర కావ్యంగా సుగంధ సంగీతంతో ఘంటసాల ఆలపించారు. పద్యం ఏమాత్రం కష్టపడకుండా, ఇంత సులువుగా అర్థమవుతుందేమిటని ప్రజలు ఆశ్చర్యపోయారు.

ఘంటసాల అక్కడితో ఆగకుండా సంస్కృత భూయిష్టమైన రావణాసురిని శివ స్తోత్రం గానం చేశారు. భక్తి, వీర రసాలను శివస్తోత్రంలో ఆయన ఒక రక్తిలో పాడటం నభూతో నభవిష్యతి..... 'అంతములేని ఈ భువన మంతయు' అన్న ప్రేమ్‌నగర్ చిత్రంలోని పాటను విన్నవారంతా మరచిపోయిన దువ్వూరి రామిరెడ్డి పానశాలను గుర్తుకు తెచ్చుకుని పరవశించారు.... ఒక కాగితంపై అచ్చయిన పద్యం, మనం చూసి చదివినపుడు ఎందుకు అర్థం కాకుండా పోతుంది? అదే పద్యాన్ని ఘంటసాల పాడితే చిన్న పిల్లవానికి సయితం ఎందుకు అర్థమవుతుంది? దీనికి కారణం ఏమిటి? అని ఆలోచించక తప్పదు.


మనం పద్యాన్ని పుస్తకాలలో అచ్చువేసినపుడు, ఎప్పుడో పాతకాలంలో స్థిరపడిపోయిన విధానంలో యథావిధంగా అచ్చువేస్తున్నాము. ఇంగ్లీషు వాక్య నిర్మాణంలోనున్న pronunciationకు అలవాటుపడ్డ మనకు తెలుగు పద్యం కొరుకుడు పడటంలేదు. ఘంటసాల పాడినపుడు పద్యం విశ్లేషించబడటంవల్ల అర్థం అవుతుంది..... తెలుగు భాష ఆత్మ పద్యంలో ఉందన్నది నిర్వివాదాంశం. పద్యం బ్రతికినంతకాలం భాష బ్రతుకుతుంది. పద్యాన్ని సులభ సాధ్యంగా అర్థంచేసుకోవడానికి మనం కొత్త సాంకేతిక చిహ్నాలను తయారు చేసుకోవాలి. వాటి ద్వారా పద్యాన్ని ఎలా చదవాలో ఎవరూ అర్థం విడమర్చకుండా మనంత మనమే అర్థం చేసుకునేలా మార్పు చేయవలసిన అవసరం ఉంది. పత్రికలలో ఎన్ని వ్యాసాలు వ్రాసినా కలగని ప్రయోజనం ఈ నూతన ప్రక్రియ వలన కలుగుతుంది. విద్యార్థులకు పద్యం అంటే భయం పోతుంది. ప్రేమ ఏర్పడుతుంది. మాతృభాషను పూర్తిగా ఆస్వాదించినపుడే భాషను ప్రేమించగలుగుతాం.

- ఎన్నార్కె (మిసిమి జూన్ - 2016 ఓలేటి పార్వతీశం 'వాగ్దేవికి స్వర నైవేద్యం' చదివిన తరువాత)

---

ఒక పిటీషన్ సమర్పించినది. మన దేశంలో కూడ All India Human Rights & Social Justice front అన్న సంస్థ ఒక PIL ను సుప్రీమ్ కోర్టుకు సమర్పించింది, కోహినూర్ వజ్రం బ్రిటీష్ ప్రభుత్వం నుండి వెనుతిరుగించుకోవాలని కోరినది. సుప్రీమ్ కోర్టు విచారణ జరిపినా ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదు. మనవారిలాగే కొందరు పాకిస్తాన్ ప్రజలు లాహోర్ హైకోర్టులో ఈ విశిష్టమైన ఒక అర్జీ చెల్లించారు. వారి వాదన ప్రకారం కోహినూర్ వజ్రం పాకిస్తాన్‌లోని పంజాబు ప్రాంతపు సాంస్కృతిక పరంపరకు చెందినదని, అందువల్ల అక్కడి ప్రజలే దానికి నిజమైన వారసుదారులని అంటున్నారు.

ప్రస్తుతం కోహినూర్ వజ్రాన్ని తమవద్ద ఉంచుకొన్న బ్రిటీష్ ప్రభుత్వానికి, దాని నిజమైన యజమానులు తమదని కోరుతున్న దేశాలకు ఇవొక సంక్లిష్ట పరిస్థితిగా మారినది. చివరికి కోహినూరు వజ్రం తదుపరి పయనం ఎటువైపుంటుందో కాలమే నిర్ణయిస్తుంది.



వేలూరి కృష్ణమూర్తి 'అనన్య'
శ్రీరాంపురం, మైసూరు.
ఫోన్ : 0 944 897 7877

# ఎవరు ముందు?

**మొ**న్నీమధ్య నా మిత్రుని ఇంటికి వెళ్ళాను.
ముందుగా చెప్పే వెళ్ళానుగాని ఆయన మద్రాసు వెళ్తున్నాను, మీరు వచ్చేరోజుకు వస్తానని చిన్న అబద్ధం చెప్పాడు... లేకపోతే నేను రానని భయంతోనే–
సరే, ఆ రోజు సాయంత్రం హైదరాబాద్ నుంచి ఆరు గంటల ప్రయాణం తర్వాత, బస్‌లో రెండు తప్పని సినిమాల చిత్రహింస తర్వాత – చిన్నపాటి ఆటో 'రైడ్' తర్వాత, ఆ ఇల్లు చేరాను – నా మిత్రుడు – ఆయన భార్య – ఇద్దరు డెబ్భయ్యో పడిలో పడి, పడిలేస్తూ కాలం గడుపుతున్నవారే. నేను అనుమానించినట్లే మిత్రుడు ఇంకా తిరిగి రాలేదు. నా సోదరి, మణి 'రా నాయనా' అని ఆహ్వానించి, ఆమెకు ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉన్నా అన్ని మర్యాదలూ చేసింది. సన్నగా వర్షం పడుతున్నా చిరాకుగా ఉంది. చన్నీళ్ళ స్నానం బెజవాడకు సరిపోతుంది – అదీ అయిన తర్వాత, ఇద్దరం భోజనం చేసి పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కూర్చున్నాం.

✧ ✧ ✧

ఎప్పుడు కూర్చున్నా మణి ఎన్నో కబుర్లు చెప్తుతుంది. ఆమె చిన్ననాటివి, ఆమె సంతానం మంచీ చెడు – మద్రాసు జీవితం – మరి నలభై ఏండ్లు అరవల మధ్య గడిపిన అనుభవం – అన్నీ చిరునవ్వుతో ఏకరువు పెడుతుంది. ఈ కబుర్లలో ఎంతో సాంఘికచరిత్ర, ఎందరో జీవితాల్లోని సంఘటనలు, వారి వ్యక్తిత్వాలు అలాఅలా నడిచిపోతాయి – వివాహాలు – విషాదాలు కూడా.
సరే, "బావగారు, వచ్చే సంవత్సరం – మీ 'వివాహ షష్టిపూర్తి' పండగ చేయాలని అంటున్నారు" అని అందించాను.
"ఆఁ ఏమి సాధించామని? పడిన కష్టాలన్నీ పడీపడీ – పండగ చేసుకోవాలా?" అని ఆమె కష్టాలన్నీ తలుచుకుంటూ అంది. "ఒక్క విషయం – ఇది మీతోనే అంటున్నా – నేనుండగానే – ఆయన వెళ్ళిపోవాలని కోరుకుంటున్నాను. పిచ్చి మానవుడు – కాఫీ పెట్టుకోవటం కూడా చేతకాదయ్యా" అంటూ కన్నీరు కుక్కుకుంది – ఆ తల్లి మనసు ఎంత తల్లడిల్లిందో – నాకప్పుడే తెలిసింది.

✧ ✧ ✧

ఆ రాత్రి 3.30 గంటలకే నా మిత్రుడు మద్రాసు నుంచి వచ్చాడు. అప్పటికే ఆయన వస్తాడని తెలిసి, నిద్ర లేచే ఉన్నాను. "రండి – రండి – ఇది మీ ఇల్లే అనుకోండి' అంటూ చతుర్లాడి తలుపు తీశాను.



"అయ్యా, దీని ఓనరు గారు ఆమేనండి" అంటూ నవ్వుతూ లోపలికొచ్చారు. ఆయన ఎప్పుడూ ఏదో హాస్యమాడుతుంటాడు. కాస్త ఫ్రెష్ అయిన తర్వాత మా ఇద్దరికీ చెరో గ్లాసు కాఫీ నేనే కలిపాను. పాపం ఈయన 'కాఫీ కూడా పెట్టుకోలేని పిచ్చి మానవుడు' కదా. ఆయన మద్రాసు నుంచి వచ్చారు కదా – ఒక గంట – ఆ నాస్టాల్జియా దిగదు. అది మెల్లగా నేను ఇంకించుకోవాలి. రాజకీయాల దగ్గర్నుంచి రజనీకాంత్ వరకూ కబుర్లన్నీ అయిన తర్వాత–
ఆయన సతీమణి – మణి గారు – నిద్రపోతున్న గదివంక చూసి – నాతో –
"ఆమెను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నాను. కాలు నొప్పి – పదేళ్ళ నుంచి బాధపడుతోంది – నాకూ మోకాలు నొప్పి – తగ్గటం లేదు. ఇద్దరం దేవుని పిలుపు కోసం ఎదురుచూస్తున్నాం. కాని – నా కోరిక, ఇలా కోరుకోవచ్చో లేదో, నా కళ్ళముందే ఆమె తరలిపోవాలని... అమాయకురాలు – నా తర్వాత ఆమె రోజుల్ని ఊహించలేను" అంటూ కాస్త విషాదం నిండిన స్వరంతో స్వగతంలా నాతో చెప్తుతుంటే నేను తెల్లవారుతుండగా తెల్లముఖమేసి చూస్తుండిపోయాను.

## "అసలు మంచి కథకులకు కొలమానం ఏది?"

శ్రీ పన్నాల సుబ్రహ్మణ్యం భట్టుగారు 'కథ'లపై సంధించిన ప్రశ్నలు శరపరంపర బాగానే ఉంది (జులై – 2016 సంచిక). వీటన్నింటికీ తెలుగు రాష్ట్రాలలోని 'కథ విమర్శక మేధావులు' నుండి వంద రకాల సమాధానాలూ రావచ్చు. 'వంద రకాలు' అనడం ఎందుకంటే 'ఈ విమర్శకుల 'ఆలోచనారీతి' వంద విధాలు కనుక. మార్క్సిస్టు మేధ ఒకరిది; గ్రామీణ శైలి మేధ మరొకరిది; యాస బాస ఆసక్త మేధ; ప్రాంతీయాభిమాన మేధ; తన పర వైయక్తికాశ్రయ మేధ; సాంప్రదాయంపై మక్కువ మేధ; శృంగారాభిలాష మేధ; హాస్యాభిలాష మేధ; భక్తి మేధ; దేశభక్తి మేధ; కరవు దృశ్య మేధ; కాలేజీ దృశ్య మేధ; నీతి మేధ; బూతు మేధ; మత దురభిమాన మేధ; శాస్త్ర మేధ; సాంకేతిక మేధ; మంత్ర మేధ; యంత్ర మేధ; తంత్ర మేధ; మహిళా ప్రాజాపత్య మేధ; పేదలు, దళితులు, అల్పజీవులపై అనురక్త మేధ; విదేశీయ సంస్కృతీ సాంప్రదాయ ప్రదర్శనాభిలాష మేధ; ముద్దులపై ఇష్ట మేధ; గుద్దులపై ఇష్ట మేధ. ఇలా ఎన్నెన్నో రకాల 'మేధ'లున్న మేధావులు – వీరివిరీ 'మేధకు తగిన' ఇతివృత్తాన్నే ప్రధానంగా గ్రహించి, 'కథకుల, కథానికులకు' లక్షణాలు నిర్వచిస్తూ ఉంటే– అసలు 'మంచి కథ' అని దేనిననాలి?

నిజానికి కథలను ప్రోత్సహించే పత్రికలెన్ని ఉన్నాయి మన భాషలో! తెలుగు కథను బాగా ప్రోత్సహించి, మంచి వలువలకు ప్రథమ స్థానమిచ్చి అద్భుతమైన కథలను ప్రచురిస్తూ వచ్చిన 'భారతి, ఆంధ్రపత్రిక (వార), ఆంధ్రప్రభ (వార), యువ (మాస), జ్యోతి (మాస) మూతపడిపోయాయి. 'మయూరి, ఆంధ్రమహిళ, వనిత, సృజనప్రియ, జయశ్రీ, విజయ'వంటి పత్రికలలో గొప్ప కథలు వచ్చాయి అనే వీలు లేకుండేది. అయినా అవీ కథారచనను ప్రోత్సహిస్తూ వచ్చేవి. అవీ అదృశ్యమైపోయాయి. ఇక మిగిలినవి 'విపుల, నవ్య, ఆంధ్రభూమి, స్వాతి, ఈనాడు (ఈనాడు), సాక్షి (ఆదివారం) ప్రచురణలు. 'స్వప్న' (చెన్నై), 'నది' ఎప్పుడు వస్తాయో, ఏం ప్రచురిస్తాయో అర్థంకాని పరిస్థితి.

ఇక వీటన్నింటిలో ప్రచురితమయ్యే 'కథల తీరుతెన్నుల – ప్రమాణాల్ని' గురించి ఎవరు చెప్పాలి? 'మేధావులు' విమర్శగా చెప్పాలి. అప్పుడప్పుడు 'పోటీలు' కథకుల రచనాశక్తిని పరీక్షించేందుకు కొన్ని పత్రికలు నిర్వహిస్తుంటాయి. ఒకరు 'సరస కథల' పోటీ అంటారు. వారికి ఎలాంటి సరసం కాదో రచయితలకు అర్థమే కాదు.

ఎందుచేతనంటే 'న్యాయనిర్ణేతల – సర్వసత్యలోచననిబట్టి' బహుమతుల నిర్ణయం ఉంటుంది. అంటే 'లాటరీ బాపతే'నన్న మాట ఇది. అలానే కొందరు 'హాస్య కథల పోటీ' అంటారు. వీరికెలాంటి హాస్యం కావాలో రచయిత బుర్రకు అందదు. ఎందుకంటే 'న్యాయనిర్ణేతకు' మోటు హాస్యంమీదో 'అపహాస్యం'మీదో ఆసక్తి ఉంటే 'అలాంటి కథలకే' బెస్ట్ బహుమతి.

ఇక కొన్ని 'పత్రికలకి' ఆస్థాన కథారచయితలు, రచయిత్రులు ఉంటారు. సాధారణ రచనలకయినా, పోటీ రచనలకయినా 'వారి రచనలే' తప్ప అవెంత ఛండాలంగానైనా ఉంటేనే – వాటికే పెద్దపీట.

అందుకే ఒకప్పటి 'గొప్ప కథా రచయితలు' ఇప్పటికీ 'జీవించే ఉన్నవారు' పదకేళీ రచనలకో, వేదాంత పద రచనకో పరిమితమైపోయారు. నేటి ప్రపంచంలో 'పోటీలకని' గురజాడ వ్రాసినా, చాసో వ్రాసినా, కారా వ్రాసినా అది 'చెత్త కథ' క్రింద 'మీ రచనని ప్రచురణకు స్వీకరించలేదని తెలుపుటకు చింతిస్తున్నాము' అనే కాప్షన్‌తో 'టెక్స్వాలిఫై' చేసి కబురంపినా ఆశ్చర్యపోనక్కరలేదు. 'మూలాలు మరచిపోతున్న యువతకి వాటిని కథాపరంగా అందిస్తామనే ఆలోచనలకీ, అవమానం భరించలేక ప్రవాసం పోయి మహాపండితులై తిరిగి వచ్చిన వారి గాథల్ని కథగా అందిద్దామనే ఊహలకే, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఎందుకు ఛిన్నాభిన్నమైపోతోందో తెలుపుదామనుకునే కథకులకీ – కథ ప్రపంచంలో తావు దొరకని ఈ దినాలలో 'ఏ కథ ఎలా గొప్పదని కొలమానం విధించాలి?' ఒకవేళ అలాంటివెవరైనా వ్రాసినా 'ఆ స్థానికులు తప్ప' ఇతరుల రచనకి 'స్వాగతం' పలకవు పత్రికలు. అందునా మన భాష దుర్గతియేమంటే 'కథారచయితలు' అంటేనో 'నవలా రచనలు' అంటేనో, 'వీటి విమర్శకులు అంటేనో – 'ఇదిగో వీళ్ళు మాత్రమే' అనిన ఒక బలమైన ముద్రవేసి ప్రచారం చేసే 'ఒక బృందం ఉంటుంది' (ఉంది కూడా). విమర్శ వ్రాసిన, విశేషాలు తెలిపిన, ప్రసంగాలిచ్చిన, చర్చల్లో పాల్గొన్నవాళ్ళే; వాళ్ళు తెల్పి ఈనాటి సాహిత్య సమాజానికి ఇతరులు కనిపించరు. ఇది ఎందరికో గొంతులో దిగని పాషాణ నిజం. ఈ విషయంలో ఇటీవల 'తెలుగు భాష పునర్వైభవానికి నడుం బిగించిన 'తెలుగు వెలుగు', 'బాలభారతం' పత్రికలు నూటికి నూరుపాళ్ళు, వేయి రెట్లు నయం! మరి ఇలాంటి మన 'నవ్య వచన సాహిత్య వీథుల్లో తిరిగే కథకి మంచిని సూచించే కొలమానం ఏదని? ఎవరందిస్తారని – నిష్పాక్షికంగా?'

– జి. సుబ్రహ్మణ్య శాస్త్రి, నంద్యాల



హైదరాబాదీ శంకర్

# విషాద గీతంలా నిష్క్రమించిన సంగీత సామ్రాట్

# శంకర్

– కాంద్రేగుల నాగేశ్వరరావు



అహ్మదాబాదీ జైకిషన్ (విగ్రహం)

లతా మంగేష్కర్ మృధు మధురంగా ఆలపించిన 'రసిక బలుమా' అన్న **చోరీ–చోరీ** చిత్రంలోని పాటతో అంతవరకు హిందీ చిత్రసీమలో సంగీత దర్శకులో అగ్రపీఠంలోనున్న నౌషాద్‌ను ఆ పీఠం నుంచి తొలగించి, శంకర్ జై కిషన్‌లు దానిని ఆక్రమించారు. 'రసిక బలుమా' అన్న పాటను తాము శాస్త్రీయంగా శృతి చేసి, తాళం వేగాన్ని పెంచి భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని కూడా జనరంజకంగా మార్చవచ్చని నిరూపించారు.

ఏ స్థానము ఎవరికీ శాశ్వతం కాదు 1945లో విడుదలైన చిత్రం రతన్ నుంచి **బైజు బావరా** మొదలుకుని **మదర్ ఇండియా** వరకూ ఆస్థానం నౌషాద్ ది 1955లో వచ్చిన **చోరీ చోరీ** నుంచి 1965 వరకూ, ఆస్థానం శంకర్ జై కిషన్‌లది. తరువాత కొంతకాలం ఓ.పి.నయ్యర్, ఆ తరువాత 1960 దశకంలో లక్ష్మీకాంత్ ప్యారేలాల్ ఇలా ఆ సంగీత సామ్రాజ్ఞి అనేక మందిని సింహాసనాసీనులను చేసింది.

S.J. ఇద్దరి మిత్రులు ఆత్మీయ అనుబంధానికి ఏకీకృతమైన ద్వంద పదం. ఇందులో వయసు రీత్యా, ప్రతిభ రీత్యా మొదట చెప్ప దగ్గవాడు శంకర్. అతని అసలు పేరు శంకర్ సింగ్. శంకర్ 15 అక్టోబరు 1922లో జన్మించాడు. ఏడు సంవత్సరాల వయస్సులో తండ్రి రామ్‌సింగ్‌తో కలసి ఉదర పోషణార్థం హైదరాబాదు చేరుకున్నాడు. ఇక్కడి బేగం బజార్‌లో నివసించేవాడు. ప్రతి రోజు కింగ్‌కోఠీ తాళింఖానాకు వెళ్ళి బస్కీలు తీసి, కండలు పెంచేవాడు. పెద్దగా చదువుకోలేదు. ఎలా అబ్బిందో తెలియదు గాని డోలక్‌ను హృద్యంగా వాయించగలిగేవాడు.

హిందూస్థానీ సంగీతంలో బాబా నాసిర్ ఖాన్ సాహెబ్ వద్ద తబలా నేర్చుకుని ప్రావీణ్యం పొందాడు. ఆయన ఆర్కెస్ట్రాలో పాల్గొనేవాడు. సత్యన్నారాయణ్ అండ్ హేమావతి అనే నట బృందంపు నాటక ప్రదర్శనలో వాయిద్య సహాయ సహకారాలు అందించేవాడు. వారితో ఒకసారి బొంబాయి వచ్చి అక్కడ రాజకపూర్ తండ్రయిన పృథ్విరాజ్ కపూర్ నడుపుతున్న పృథ్వీ థియేటర్‌లో సంగీత విభాగంలో నియమించబడ్డాడు. అదే సమయంలో హస్స్ లాల్ భగత్‌రామ్ అనే ఒక జంట సినీ సంగీత దర్శకుల వద్ద అసోసియేట్‌గా పనిచేశాడు.

జై కిషన్ పూర్తి పేరు జై కిషన్ దయాబాయ్ పంచల్ 4 నవంబరు 1929లో జన్మించాడు. గుజరాత్‌లోని వన్సడా నివాసి. హార్మోనియం వాయించటంలో సిద్ధహస్తుడు. మొదట్లో సంగీత విశారద వాడిలాల్ జీ వద్ద, తరువాత ప్రేమ్ శంకర్ నాయక్ వద్ద, బొంబాయి వచ్చిన తరువాత వినాయక్ తాంబే వద్ద సంగీతం నేర్చుకున్నారు. సినిమాలకు సంగీత దర్శకత్వం వహించాలనే తలంపుతో శంకర్ చంద్రవదన్ భట్ అనే గుజరాతీ సంగీత దర్శకుని తరుచు కలుస్తూ ఉండేవాడు. ఆ రాకపోకల మధ్య తనలానే ఆయనను కలవడానికి వచ్చే జై కిషన్‌తో స్నేహం కుదిరింది. జై కిషన్ హార్మోనియం ప్లేయర్ అని తెలుసుకున్న శంకర్ అతనిని పృథ్వీ థీయేటర్‌లో హార్మోనియం వాద్యగానిగా ఉద్యోగం ఇప్పిస్తానని తన కూడా తీసుకువచ్చాడు. అంత వరకూ జై కిషన్ ఒక సామిల్‌లో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. శంకర్ తాను జై కిషన్‌కు మాటిచ్చిన విషయాన్ని పాపాజీ పృథ్విరాజ్ కపూర్‌కు చెప్పాడు. ఆయనకు శంకర్ పట్ల ఎంతో అభిమానం. అతని మీద గౌరవంతో మరో ప్రశ్న వేయకుండా జై కిషన్‌కు తన థియేటర్‌లో స్థానం కల్పించాడు. అప్పటి నుంచీ వారొక విడదీయరాని జంటగా ఇంటా బయట జంటకవులులా తిరిగేవారు. పృథ్వీ స్టాఫ్ వీరిని రామ్ లక్ష్మణ్‌లుగా పిలిచేవారు. వీరిద్దరూ పృథ్వి థీయేటర్‌లో సంగీతం సమకూర్చటంతో

బాటుగా అప్పుడప్పుడూ నాటకాలలో చిన్న చిన్న పాత్రలను పోషించేవారు.

ఆ కాలంలోనే పృథ్వీరాజ్ కుమారుడైన రాజ్‌కపూర్‌తో వీరికి పరిచయం కలిగింది. 1948లో రాజ్ కపూర్ **ఆహ్** చిత్రం నిర్మించాడు. అది అంతంత మాత్రంగానే ఆడింది. రెండవ చిత్రం **బర్సాత్** మొదలు పెట్టాడు. దర్శకత్వపు బాధ్యతతో పాటు ప్రతి విషయాన్ని దగ్గర నుండి చూసుకునే వాడు. ఆ చిత్రానికిగాను సంగీత దర్శకత్వం వహించడానికి నియమించబడ్డ రామ్ గంగూలీతో తేడాలు వచ్చాయి. దానితో అతన్ని తప్పించాడు రాజ్‌కపూర్. రాజ్ కపూర్ తనకు నచ్చిన ధోరణిలో సంగీతం కుదర్చమని శంకర్‌ను కోరాడు. శంకర్ తనకు తోడుగా జై కిషన్ కావాలని – అడగటంతో ఆ జంట ఆ రోజు నుంచి S.J జంటగా స్థిరపడింది. వీరిద్దరితో పాటు సినిమాలో పాటలు రాయడానికి శైలేంద్రను, హసరత్ జైపురి (ఒకప్పటి బస్ కండక్టర్)ను నియమించుకున్నాడు. తనతోబాటుగా ఒకే గురువు వద్ద ఓకల్ సంగీతం నేర్చుకున్న ముఖేష్‌ను గాయకునిగా నియమించుకోవటంతో రాజకపూర్ సినీ సంగీత పంచతంత్రం పూర్తయింది. వీరంతా అప్పట్లో 25 సం॥ల వయసులో వున్నారు. అప్పుడప్పుడే పైకి వస్తున్న లతా మంగేష్కర్‌ను కూడ తీసుకున్నారు. బర్సాత్ విజయంతో అందరూ అందనంత ఎత్తుకు చేరారు. సినిమా టైటిల్ పేరుతో ఒక పాటను వినిపించటం అనేది **బర్సాత్ మే** అనే టైటిల్ సాంగ్‌తో మొదలైంది. ప్రతి చిత్రంలోనూ టైటిల్ సాంగ్ ఉండి తీరాలనే ఫార్ములా వచ్చింది. ఈ తరహాలో ఎక్కువ పాటలకు సంగీతం కూర్చింది శంకరే. అప్పట్లో అవన్నీ హిట్లే. అలానే దానితో పాటుగా ఒక కేబ్రే నృత్యం 'పతిల్ కమర్ హై'తో తొలిసారిగా ఒక కొత్త ఫార్ములాను ప్రవేశపెట్టింది ఈ చిత్రం. **కిస్మత్** అన్న అశోక్‌కుమార్ చిత్రం అంతవరకూ ఉన్న బాక్సాఫీస్ రికార్డ్‌ను బద్దలు చేసి కోటి రూపాయలు వసూలు చేసింది. బర్సాత్ చిత్రం కలెక్షన్స్‌లో దాన్ని మించిపోయి కొత్త రికార్డు స్థాపించింది. S.J.లు సంగీత పరిజ్ఞానంలో తమ కంటే మేటయిన ఎస్.డి. బర్మన్, మదన్ మోహన్, రోషన్, ఓ.పి. నయ్యర్‌ల కంటే మిన్నగా నిలబడ్డారు. ప్రజల గుండెస్పందనలను ఎరిగి, భైరవి అనే ఒకే రాగాన్ని అనేక విధాలుగా ఉపయోగించి, సంగీతంలో వీరవిహారం చేశారు. ఇందీవర్, గుల్షన్ బావరా, నీరజ్, వర్మామాలిక్, మజ్రో సుల్తాన్ పూరి, రాజేంద్ర కిషన్, విఠల భాయ్ పటేల్ లాంటి ఎందరో ప్రముఖ గేయ రచయితలతో కూడ పనిచేశారు. ఒకే చిత్రంలోని పాటలన్నీ హిట్ కావటం S.J.ల ప్రత్యేకత.



రాగాలనంతాలు
<u>ఆత్మీయ రాగం ఒక్కటే</u>

1966వ సంవత్సరంలో శంకర్ జైకిషన్ల మధ్య భేదాభిప్రాయాలు పొడసూపాయని పత్రికల్లో వార్తలొచ్చాయి. వీరు సంగీత దర్శకులుగా తమ ప్రస్థానం ప్రారంభించినప్పుడు ఒక అవగాహన కొచ్చారు. ఎవరు ఏ పాటకు సంగీతం కూర్చారో పాట రాసిన గేయ రచయితలకు తప్ప మరెవ్వరికీ తెలియకుండా రహస్యాన్ని కాపాడుకోవాలని నిర్ణయించుకున్నారు. అయినప్పటికీ శైలేంద్ర రాసిన గేయాలకు శంకర్ హస్రత్ జయ్‌పురి రాసిన వాటికి జైకిషన్ సంగీతం కుదుర్చుతారని (అన్ని వేళలా కాదు) ప్రచారం ఒకటి సినీ సంగీతాభిమానుల్లో ఉండేది. రాజ్‌కపూర్ తీసిన సంగం చిత్రం ఘన విజయం సాధించినా ఆ చిత్రంలోని రెండు పాటల మధ్య ఏది ఉత్తమమైనదనే ప్రశ్న ఉదయించింది. కొందరు ముఖేష్ పాడిన శైలేంద్ర రాసిన **దోస్త్ దోస్త్ న రహా** అని మరికొందరు హస్రత్ జైపురి రాసిన **ఏ మేరా ప్రేమ పత్ర్ పఢ్‌కర్** పాటని వాదనలు చేసేవారు. జై కిషన్ ఒక పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ 'ఏ మేరా ప్రేమ్ పత్ర్ పఢ్‌కర్' అన్న పాట నిజానికి తాను తన భార్యయైన పల్లవికి కాలేజిలో చదువుతుండగా రాసిన ప్రేమలేఖ అని చెప్పటంతో తమ రహస్యం బట్టబయలయిందని శంకర్ చికాకు పడ్డాడు. అయితే ఇది చిన్న తగవే తప్ప పెద్ద గొడవ కాదని రాజ్ కపూర్ అంతరంగికుడైన బన్నీరూబెన్ అంటారు. తమంత తాముగా తమ ఇద్దరి మధ్యా భేదాభిప్రాయాలుననట్టు ఎవరూ బయటకు చెప్పలేదు. అయితే అదే సమయంలో శంకర్ సూరజ్ అనేపేరుతో కొన్ని చిత్రాలకు స్వతంత్రంగా సంగీత దర్శకత్వం వహించాడు. సంగం చిత్రంలో రాజ్ కపూర్ శంకర్‌లు కలసి తనతో బలవంతంగా బుడ్డా మిల్‌గయా పాట పాడించారని దానిని విన్న కొందరు ఆప్తుల దృష్టిలో తాను కించ పరచ బడ్డానని లతా మంగేష్కర్ అలిగి రాజ్

కపూర్ చిత్రంలో గాని, శంకర్ సంగీత దర్శకత్వంలోగాని పాడనని నిరాకరించింది. రాజ్ కపూర్ సంగం తరువాత చిత్రమైన మేరా నామ్ జోకర్‌లో ఆశాభోంస్లేతో పాడించాడు.

లత అలిగి వెళ్ళిపోయినా శంకర్ ఏమాత్రం ఖంగు తినలేదు. సుమన్ కళ్యాణ్‌పూర్‌తో పాటలు పాడించి హిట్ చేశాడు. ముఖేష్ నటునిగా మారినప్పుడు రాజ్‌కపూర్‌కు శ్రీ420, చోరీచోరీ చిత్రాలలో మన్నాడేతో పాడించి ఘనవిజయం సాధించాడు.

శంకర్ జై కిషన్ అనే రెండు పేర్లకు మరో రెండు పేర్లు జతపరచాలి. ఒకరు ఎన్. దత్తారామ్. సంగీత స్వర ప్రస్థానంలో శంకర్‌కు కుడి భుజం. కొన్ని బి గ్రేడ్ చిత్రాలకు సొంతంగా సంగీత దర్శకత్వం వహించినా శంకర్ అంతిమ శ్వాస వరకూ అతని వద్దే అసిస్టెంట్‌గా కొనసాగాడు. అలానే చివరి వరకూ కొనసాగిన మరో సహాయకారి అలెగ్జాండర్. సినిమా పాటల మధ్యలో వచ్చే విరామ కాలంలో అతను జై కిషన్‌తో కలిసి వాయిద్య సంగీతాన్ని సమకూర్చటమేకాక మొత్తం బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌కు నోటేషన్ వ్రాసేవాడు. 1971వ సంవత్సరంలో జై కిషన్ మరణించినా శంకర్, జై కిషన్ పేరును కలుపుకుంటూ సంగీతం అందిస్తూ వచ్చాడు. రెండు సంవత్సరాల అనంతరం తాను ఒంటిరిగా సంగీత దర్శకత్వం వహించిన సన్యాసి చిత్రానికిగాను ఫిలింఫేర్ ఉత్తమ సంగీత దర్శకునిగా బహుమతి అందుకున్నాడు. రాజ్‌కపూర్‌తో కలిసి వున్నపుడు రాజ్ కపూర్ జై కిషన్‌తో కలిసి కూర్చుని కొన్ని సంగీత బిట్లును తయారు చేశారు. రాజ్‌కపూర్ వాటిని తన వద్ద మ్యూజిక్ బ్యాంక్‌గా టేపురికార్డ్ చేసి దాచుకొని, ఆ తరువాత కాలంలో వాటిని తన చిత్రాల్లో వాడుకున్నా శంకర్‌కు క్రెడిట్ ఇవ్వలేదు. ఆప్తుడైన పాటల రచయిత శైలేంద్ర మరణంతో శంకర్ పూర్తిగా ఒంటరివాడయినాడు. సినీ పోటీ ప్రపంచంలో కొత్త నీరు వచ్చి చేరుతుంది. ప్రేక్షకుల అభిరుచిలో మార్పు వచ్చింది. కాల గమనంలో పక్కకు తొలగిపోవటం తప్పలేదు. శంకర్ సంగీతం – 1987వ సంవత్సరంలో ఈ స్వరరంజితం మూగబోయింది. ఆప్తులు మినహా ఎవరూ అంతిమ యాత్రలో పాల్గొనలేదు. అతని అంతిమ సంస్కారం పూర్తైన తరువాతనే రాజ్‌కపూర్‌కు కబురందిందని చెప్తారు.


భారతదేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా భారతీయ సినీ సంగీతాన్ని అత్యున్నత స్థాయికి తీసుకొని వెళ్ళి కోట్లాది అభిమానులను సాధించుకొని కూడా ఈనాడు శంకర్ ఒక అనామకునిగా మిగలటం విషాదకరం. జై కిషన్ గుజరాతీయుడు. అహ్మద్ నగర్‌లోని ఒక కూడలి వద్ద అతని శిల్పాన్ని ప్రతిష్టించారు గుజరాతీయులు. హైదరాబాది అయిన శంకర్‌కు మనవేమీ చెయ్యలేకపోయాము. శంకర్ పదహారణాల తెలుగువాడు కాకపోవచ్చు కానీ, పధ్నాలుగణాల తెలుగువానిగానైనా అంగీకరించక తప్పదు. హైదరాబాదు నేలమీద నడయాడాడు. ఇక్కడ గాలి పీల్చాడు. ఇక్కడి గజల్ విన్నాడు, ఖవాలీ సంగీతాన్ని ఆఘ్రాణించాడు. తెలుగు జానపద బాణీని పట్టుకొన్నాడు. బొంబాయి వెళ్లినా అందరితోనూ తాను హైదరాబాదీనని సగర్వంగా చాటుకున్నాడు. రెండు తెలుగు చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించాడు. శారద అనే తెలుగమ్మాయిని లతా మంగేష్కర్‌కు పోటీగా హిందీలో నిలిపాడు. హిందీ పాటల మధ్య 'రమయ్యా వస్తావయ్యా...' 'బతుకమ్మ బతుకమ్మ...' 'వెంకన్న వెంకన్న ఎక్కడికి పోతావురా..' అనే తెలుగు వాక్యాలను కలిపాడు. హైదరాబాదులో శంకర్ జై కిషన్‌ల పేరున మూడు అభిమాన సంఘాలున్నాయి. సంగీత ప్రియులైన కాంతారావుగారు (ఈయన ప్రఖ్యాత సినీ దర్శకులైన బి. నరసింహారావుగారికి అన్న.) మూడు సంఘాలను కలిపి రవీంద్ర భారతిలో క్రిందటి సంవత్సరం S.J విభావరి నిర్వహించారు. శంకర్ కుటుంబానికి ఆప్తమిత్రులైన వాసుదేవరావు (హెచ్.ఎమ్‌టి రిటైర్డ్ ఇంజనీర్, అకార్డియన్ ప్లేయర్.) రాజ్‌దూత్ అనే పేరుగల స్వామిలాంటి వీరాభిమానులు శంకర్‌కు తమదైన రీతిలో నివాళులర్పిస్తున్నారు. ఏ నాటికైనా శంకర్ లోహ విగ్రహాన్ని స్థాపించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో మనమందరం భాగస్థులౌదాం.

శంకర్ పాటలకు – నేపథ్య స్వరాలకు ఉపయోగించే ఆర్కెస్ట్రా ఎంతో విస్తృతమైనది – వంద వయొలిన్లు ఏకస్వరంలో వినిపించేది. లలిత సినీ సంగీతాన్ని కర్ణపేయంగా శిఖరాలకు చేర్చిన ఘనత వీరిదే. ఇప్పటి ఇళయరాజాలు – రెహమాన్లు – ఆర్కెస్ట్రాలు వాడేది ప్లాస్టిక్ పూలలాంటి సింథసైజర్లు – కీబోర్డులు – ఆత్మ నాదం తెలియని డ్రమ్ములు.

కాండ్రేగుల నాగేశ్వరరావు
హైదరాబాద్
ఫోన్ : 984 808 3387.

# తెలుగువారి ప్రయాణాలు

**ఎం.** ఆదినారాయణ 'చలైవేతి, చరైవేతి' అనుకుంటూ టేపు పుచ్చుకుని ప్రయాణించి ప్రపంచాన్ని కొలిచాడు. దాదాపు ఆయన రాసిన పుస్తకాలు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు. జెన్ యోగిలా విశ్వయానం చేసే మనోలోకం ఇంకో కోణంలో ఉందని చెప్పే మంచి ప్రయత్నం ఒకటి చేశారు ఆదినారాయణ. ఆ ప్రయత్నమే పుస్తక రూపంలో మన ముందుకొచ్చిన 'తెలుగువారి ప్రయాణాలు'. కదిలే ఇన్‌ఫర్మేషన్ బ్యూరోల్లా నా యాత్రాస్థలాలు, యాత్రానుభవాలూ అంటూ వట్టి సాదాసీదా మినీ టూరిస్టులు కొందరు కొద్దిగా తిరిగి, తక్కువ విని, ఎక్కువగా 'నెట్' చూసి ఆవు వ్యాసం వలె రాసి పడేసే వ్యాసాలు కోకొల్లలు మనకి ఎదురవుతూనే ఉంటాయి. కానీ ఇంటికి అంటుకుపోయి ఇటుకల్లా బతికేసే రచయితలకు, చదువరులకు మహోపకారం అన్నివిధాలా చేసిపెట్టే యాత్రాసాహిత్యం తక్కువే మనకు. యథార్థమైన జనజీవన స్థితిగతులు, ప్రాంతీయ సంస్కృతి, ప్రకృతి, కంటికి చూపునిచ్చే విశేషాలూ మన ముందుకు తెచ్చిపెట్టే మహనీయుల యాత్రలు, సకల తిప్పలు పడి మనకు విజ్ఞాన వికాసాలు ఇచ్చేవారి రచనల తీరూ వేరు. ఈ గుట్టు బాగా తెలిసిన ఆదినారాయణ మన తెలుగు మహామహుల ఆత్మకథలు తెరిచి తరచి వెదికి యాత్రానుభవాల జ్ఞానం ఒకచోట కుప్పగా తెచ్చిపెట్టారు.




పుస్తక ప్రేమికులకు ఈ పుస్తకం రెండు గొప్ప అవకాశాలు కల్పించింది. ఒకటి – అప్పుడెప్పుడో చదివి వాటిని కొంత మరిచిపోయినవారికి ఆయా ఆత్మకథలన్నీ మొత్తం తిరగతోడి జ్ఞాపకం వచ్చేట్టే చేయటం. రెండు – యాత్రాస్మృతిని ఆనందించే కొత్త పాఠకులకు పెద్దల ఆత్మకథలు, యాత్రా విజ్ఞాన విశేషాలూ ఆది నుంచీ వరసపెట్టి చదివించేట్టు చేయడమూను. కనుమరుగయిన చారిత్రక మార్గాలు, పురాస్మృతి వంటి ముచ్చటలు ఎన్నెన్నో ఉన్న ఈ యాత్రానుభవాలు చదువుతుంటే మనలోని మనిషిదనానికి చిన్నపాటి మెరుగులు పెట్టుకున్నట్టవుతుంది. యాత్రలకు సంబంధించి ఒకనాటి వ్యవస్థ, ఏర్పాట్లు, నాటి ప్రయాణికుల అమాయకత్వం నిజంగా నిజమేనా అనుకుంటూ బకింగ్‌హామ్ కెనాల్ మీద పడవలో కొంచెం ప్రయాణించి, కొంచెం మబ్బుల్లో నడిచినట్టు అనిపించక మానదు మనకు. వీరాస్వామిగారు, ప్రకాశంగారు, ఆదిభట్లవారూ పడిన ఎనిమిది కష్టాలు, చూసిన వింతలూ వెరసి సౌందర్యం మేళవించిన సంభ్రమమొక్కటి మనసులో తిష్టవేస్తుంది సుమా! ఎందరివో ఆత్మకథలు చదివినా వెన్నెలకంటి, జర్మన్‌శర్మ, కురుమెళ్ళ, బాపిరాజు వంటి పెద్దల రచనలు అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు కనుక ఈ సంకలనం ఒక గొప్ప ఒరవడి. ఈ పుస్తకం ఓ పట్టాన సంతృప్తినివ్వదు... ఇంకా ఇంకా ఆనాటి పద్యాలు రాసినా మనం విస్మరించిన యాత్రల భోగట్టా ఆదినారాయణ మరిన్ని అందిస్తే బాగుండుననిపిస్తుంది.



ఎం. ఆదినారాయణ

అన్నట్టు ఆదినారాయణవంటివారు తలుచుకుంటే మన తెలుగు పెద్దల నవలా సాహిత్యం నుంచి కూడా యాత్రావిశేషాలు, వాటి అనుభూతులను కూర్చి పుస్తకం తేవచ్చు (వింటున్నావా ఆదినారాయణా!). ఇక ఈ పుస్తకంలో ఎటువంటి లోపాలు వెదకటం అయినా అవసరమనే అనిపిస్తుంది. ప్రయాణ విశేషాలు, విజ్ఞానానుభవాలు వగైరా తగ్గి అందరికీ తెలిసే నగర చరిత్రలు పెంచిన మేరకు ఆయా రచయితల రచనల్లోని భాగాలు అందరికన్నా నవయువతరంలోని కొత్త పాఠకులకు అవసరమే. ఆదినారాయణకు అనేకానేక షేక్‌హ్యాండులు 'లైకు'లూ లభించుగాక!

మరొక్కమాట !

ముఖచిత్రాలు కార్టూన్‌లు, కేరికేచర్‌లవలె గమ్మత్తునిచ్చాయి. ఫోటోల లేమి కూడా కావచ్చునేమో!

– శివాజీ


# చదవండి...

– ఎన్నార్కె




✧ **చిన్ననాటి ఆటలు జ్ఞాపకాల మూటలు :** రాయల్ సైజులో వచ్చిన ఈ పుస్తకం చేతికందింది. ఇది చూసి, చదివిన తర్వాత "నాకున్నదంతా నీకిస్తాను, నా బాల్యాన్ని నాకు తిరిగివ్వు" అంటూ ముఖేష్ పాడిన పాట గుర్తుకు వచ్చింది. బాల్యం గుర్తుకు వచ్చినప్పుడు అప్రయత్నంగా మనం కూడా పిల్లలమవుతాం. ఆనాటి వాతావరణం మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. ఏ దేశ భవిష్యత్తైనా బాలలపైనే ఆధారపడి ఉంటుంది. అందుకని, వారిని మానసికంగా, శారీరకంగా, దృఢంగా ఉంచగలగటం అందరి బాధ్యత. ఎండాకాలం సెలవు రోజుల్లో ప్రొద్దుట, సాయంత్రం ఆడుకొనే ఆటల లక్ష్యం అదే. కొన్ని ఆటలు మందితో కలిసిగాని ఆడలేం. అందుకోసమే ఇరుగుపొరుగునున్న సాటి ఈడు పిల్లలతో స్నేహంగా ఉండటమనే గుణం అబ్బుతుంది. జీవితంలో అనుకోని సందర్భాలలో జరిగే ప్రమాదాల నుంచి తృటిలో తప్పించుకొనే నేర్పు ఈ ఆటల వల్ల పరోక్షంగా కలుగుతుంది. ఇంత గొప్ప పుస్తకాన్ని అందించిన జాస్తి శివరామకృష్ణ, కందుకూరి రాము లకు, ఎంతో అందంగా ప్రతీ పేజీలో పిల్లల అమాయకత్వాన్ని ప్రతిబింబించేలా రంగుల బొమ్మలు వేసిన దుంద్రపెల్లి బాబు ఎంతైనా అభినందనీయులు.

*పేజీలు : 220, వెల : ₹ 200/- ప్రతులకు – మంచి పుస్తకం, ఫోన్ : 949 074 6615.*





✧ **SINCERELY YOURS** : విశ్వపతి అని పిలువబడే T.V.R.K. మూర్తి Indian Express న్యూస్‌పేపర్‌లో పనిచేస్తున్నప్పుడు వేసిన కార్టూన్ల సంపుటి. ఇంగ్లీషు సరళంగా ఉంది. చాలా కార్టూన్లు ఈ రోజుకూ వర్తిస్తాయి.

*పేజీలు : 164, వెల : పేర్కొనబడలేదు. కావలసినవారు 984 944 3752 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.*





✧ **కాంచన కుటీరం** : నవల. రచన సి.ఎస్. రావు. 1978వ సంవత్సరంలో *యువ* మాసపత్రికలో 16 నెలలపాటు ధారావాహికంగా వచ్చి, పాఠకాదరణ పొందిన దానికి పుస్తక రూపమిది. ప్రతి చిన్న సంఘటనను విపులంగా, వివరంగా చెప్పటం అప్పటి శైలి. పాత్ర పోషణలో నిండుతనం కనిపిస్తుంది. అన్ని ముఖ్య పుస్తక షాపులలో లభిస్తుంది. చాలా కాలం తరువాత సి.ఎస్. రావు కలం నుంచి వచ్చిన రచన.

*పేజీలు : 192, వెల : ₹ 150/- ప్రతులకు : నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, ఫోన్ : 24224453/54 మరియు విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, నవ తెలంగాణ బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్.*




✧ **విశాఖ కథాతరంగాలు** : విశాఖ రచయితల సంఘం ప్రచురించిన కథాసంపుటి. సంకలన కర్త అడపా రామకృష్ణ. ఇందులో మొత్తం 21 కథలున్నాయి. ఇందులో కొన్ని ఈనాడు, స్వాతి పత్రికలలో ఇంతకు ముందు ప్రచురితమైనవి. తక్కువ నిడివిలో ఎక్కువ సాంద్రత కలిగిన కథలని చెప్పవచ్చు.

*పేజీలు : 136, వెల : ₹ 100/- ప్రతులకు : ఆల్ లీడింగ్ బుక్‌స్టాల్స్, ఫోన్ : 950 526 9091.*



✧ **మాతృశ్రీ కడింపాటి గురుగోవిందమాంబగారి జీవిత చరిత్ర** : రచయిత డాక్టర్ కపిలవాయి లింగమూర్తి. అనుమనిగిరిలోని శ్రీ శివరామబ్రహ్మంగారి కూతురు శ్రీమతి గోవిందాంబ. చేయితిరిగిన రచయిత కావటంతో రచన సులభ గ్రాహ్యంగా ఉంది.


*పేజీలు : 106, వెల : ₹ 100/- ప్రతులకు : కపిలవాయి ఆనందవర్ధన, నాగర్‌కర్నూల్. ఫోన్ : 08540 – 226437, 8790 727 772.*





✧ **సంగీత శాస్త్రమంజరి; కర్ణాటక సంగీతం – డిప్లమో కోర్సు రెండవ సంవత్సరం – పాఠ్యగ్రంథం, సిద్ధాంతం – (రెండవ పేపరు) : పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రచురణ.** రచయిత్రి డాక్టరు లలిత అన్నప్పారావుకు వృత్తి, ప్రవృత్తి సంగీతాత్మకాలే. పాఠ్యపుస్తకాన్ని విద్యార్థులు సులువుగా చదువుకొని, పరీక్షలు రాయడానికి వీలుగా అధ్యాయాలుగా విభజించటమేకాక విషయాలను స్పష్టంగా విశదీకరించారు. సంగీత ప్రియులకిది చిటారుకొమ్మన మిఠాయి పొట్లం కాదు, చేతిలో వెన్నముద్ద.
*పేజీలు : 224, వెల : ₹ 60/- ప్రతులకు : డైరెక్టర్, ప్రచురణల విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, లలితకళాక్షేత్రం, పబ్లిక్‌గార్డెన్స్, హైదరాబాద్–500004.*




✧ **చెమట ప్రవాహమై పారినా - కవిత్వం :** మహ్మద్ ఖాజామైనద్దీన్, మాయమైన మధ్యతరగతి మందహాసంపై వేదనతో, ఆర్తితో కూడిన గేయాలు, మనసును పట్టివేస్తాయి.
*పేజీలు : 80, వెల : ₹ 100/- ప్రతులకు : నవ తెలంగాణ బుక్ హౌస్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ మరియు తెలంగాణ సాహితి 1-10-85/18, షాషాబ్‌గుట్ట, మహబూబ్‌నగర్–509001. ఫోన్ : 939 662 6276.*




✧ **కత్తి పద్మారావు సాహితీ సాక్షాత్కారం :** కత్తి పద్మారావు 30 ఏళ్ళ జీవితాన్ని, ఆరు అధ్యాయాలుగా విభజించి, సాహిత్యాన్ని, సామాజిక ఉద్యమాలను, కార్యక్రమాలను సింహావలోకనం చేస్తూ ఈ గ్రంథంలో సమీక్షించారు డాక్టరు మొయిలి శ్రీరాములు. ఇది 2004లో ఉత్తమ సిద్ధాంత గ్రంథంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ నుండి పి.హెచ్‌డి.కి అర్హమైనదిగా నిర్ణయించారు. కవిగా, దళిత సాహిత్యవాదిగా, హేతువాదిగా, ఉద్యమకారునిగా ఆయనలోని విశిష్టతను మనముందుంచారు. కత్తి పద్మారావు అభిమానులకిదొక వెలలేని కానుక. *పేజీలు : 270, వెల : ₹ 150/- ప్రతులకు : 08942 – 226643 లేదా 994 923 4253 కి ఫోన్ చేయండి.*



✧ **తెలుగు వారి ప్రయాణాలు :** తెలుగు యాత్రా సాహితీ సంపదని పదిమందికీ పంచాలి అనే ఆలోచన ఈ సంకలనానికి మూలం. భ్రమణకాంక్ష కలిగిన ప్రొఫెసర్ ఆదినారాయణ ప్రతి రచన వినూత్నమైనదే. యాత్రా సాహిత్యాన్ని పటిష్టం చేయడానికి ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం. 520 పేజీలు గల ఈ పుస్తకం వెల కేవలం రూ. 200/–లే! అందరి ఇంట్లో ఉండవలసిన పుస్తకం. *ఎమెస్కో బుక్స్ వారి ప్రచురణ.*




✧ **చింతనాగ్ని కొడిగట్టిన వేళ :** తెలుగు ప్రాంతంలో మేధోవాతావరణాన్ని కల్పించి, అభివృద్ధి పరచటంలో కొంత భాగం **మిసిమి** పత్రికకు చెందుతుంది. అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారికి ఆ పత్రికతో ప్రారంభ సంచిక నుండి సాహచర్యం ఉంది. కొన్నాళ్ళు **మిసిమి** ఆయన సంపాదకత్వంలో వెలువడింది. ఈ వ్యాసాలలో ఎక్కువ భాగం **మిసిమి**లో వచ్చినవే. మరికొన్ని వివిధ సందర్భాలలో వ్రాసినవి. ఎంతో విలువైన వ్యాస పరంపర ఇది. పల్లవి పబ్లికేషన్స్ వారు అభినందనీయులు.
*ప్రతులకు : పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ. ఫోన్ : 986 611 5655. పేజీలు : 277, వెల : రూ. 150/-*




✧ **విద్వన్మణి :** పంచ సహస్రావధాని జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి సాహిత్యానుశీలం, పరిశీలనం. ఆంధ్రదేశంలో అధిక సంఖ్యలో కవులు అవధానులుగానే ఖ్యాతిగాంచారు. శాస్త్రిగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. వారి రచనలన్నింటినీ సేకరించి, పరిశీలనగావించి పితృ ఋణం తీర్చుకున్న వారి పుత్రిక శ్రీమతి జంధ్యాల కుసుమకుమారి. పద్యపఠనంపై మక్కువగలవారికి ఈ పుస్తకం మరింత ప్రీతిపాత్రమవుతుంది.
*పేజీలు : 300, వెల : 150. ప్రతులకు : ఫోన్ : 738 200 6600 మరియు అన్ని ప్రముఖ పుస్తక షాపులలో లభిస్తాయి.*

# మిసిమి

మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹ 360/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింది గడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో**
**మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధుని సూత్రసముచ్చయం, 4. మానవీయ బుద్ధ, 5. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 6. అంతర్వీక్షణం, 7. దూరతీరాలలో, 8. అగాధం, 9. ఓ ఖైదీ వీరగాథ, 10. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 11. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).


**పేరు :** ....................................................................
**ఇం.నెం**......................................**వీధి**..............................
**ఊరు**........................................**పిన్** ...............................
**సెల్** ....................................................................
**సంతకం :** ........................................................

మీ చిరునామా ఇక్కడ రాసి, వాట్సాప్ (994 951 6567)గానీ, ఇ-మెయిల్ (misimi_monthly@yahoo.in) ద్వారాగానీ పంపండి.

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | **STATE BANK OF INDIA** |
| Account | : | **MISIMI** |
| A/c. No. | : | **10261569316** |
| Branch | : | **Saifabad, Hyderabad, INDIA** |
| IFS Code | : | **SBIN0007315** |

(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 50/- బ్యాంకు ఛార్జీలు కలపండి.)




**రెండు సంవత్సరాల చందాదారులకు (₹ 720+50/-) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి**



**నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ 1440+50/-) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి**





**మూడు సంవత్సరాల చందాదారులకు (₹ 1080+50/-) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి**



**అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ 1800+50/-) మిసిమి 2013/2014 సంచికల బౌండ్ పుస్తకం బహుమతి**

మిసిమి
మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**



సుల్తాన్.. సాకీలు

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.07.2016



గుడిమెట్లు .. ముచ్చట్లు – మధుర